సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 156

సోమవారం 26-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



25వ గ్రాండ్‌స్లామ్ వేటలో...

యూఎస్ ఓపెన్‌కు జొకోవిచ్ సిద్ధం. నేటి నుంచి గ్రాండ్‌స్లామ్ టోర్నీ -14లో



పెట్టుబడులకు 'రుణ' పడదాం

అత్యవసరాల్లో గట్టెక్కే మార్గం.. స్టాక్స్, ఫండ్స్‌పై సులభతర రుణాలు -15లో



కర్ణాటకలో 'ఆపరేషన్ కమలం'

సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమలం'చేపట్టిందని మాండ్య ఎమ్మెల్యే రవికుమార్ ఆరోపించారు.

వివరాలు 6లో ▶



దర్శన్‌కు వీఐపీ ట్రీట్మెంట్?

నటుడు దర్శన్ అగ్రహార సెంట్రల్ జైలులో కుర్చీలో కూర్చుని డ్రింక్, సిగరెట్ తాగుతున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

వివరాలు 6లో ▶



పాక్ ప్రమాదాల్లో 40 మంది మృతి

పాకిస్తాన్‌లో రెండు వేర్వేరు బస్సు ప్రమాదాల్లో 40 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 11 మంది యాత్రికులు.

వివరాలు 6లో ▶



ముగిసిన లై డిటెక్షన్ పరీక్ష

కోల్‌కతాలో వైద్యురాలి హత్యోదంతంలో నిందితుడు సంజయ్‌కు లై డిటెక్షన్ పరీక్ష నిర్వహించినట్టు అధికారులు వెల్లడించారు.

వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే టార్గెట్‌గా 'హైడ్రా'



ప్రజల సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకే ప్రభుత్వం 'హైడ్రా' పేరుతో డ్రామా నడుపుతోందని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే టార్గెట్‌గా కుట్రలకు తెరలేపిందని హరీశ్‌రావు అన్నారు.

- వివరాలు 2లో▶

కనిపెట్టారు... పనిపట్టారు



అమాయకులకు కమీషన్ల ఆశజూపి వారి పేరిట తెరిచిన బ్యాంకు ఖాతాలను సైబర్ నేరాలకు వినియోగిస్తున్న ఓ ముఠా గుట్టును టీజీసీఎస్‌బీ అధికారులు రట్టు చేశారు. ఈ ఖాతాల్లో రూ.175 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

- వివరాలు 16లో▶

మూడు నదులపై మూడు వంతెనలు



ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగంలో మూడు నదులపై వంతెనలను ఖరారు చేశారు. దక్షిణ భాగం రోడ్డును సొంతంగానే ప్రభుత్వం చేపట్టే యోచనలో ఉండటంతో ఉత్తర భాగాన్ని పట్టాలెక్కించే పనిలో ఎన్‌హెచ్‌ఏఐ తలమునకలై ఉంది.

- వివరాలు 5లో▶

వేధించే ఎన్‌ఆర్‌ఐ భర్తలపై కొరడా



ఎన్‌ఆర్‌ఐ భర్తల చేతిలో దాడులు, గృహహింసకు గురవుతున్న అతివలకు రాష్ట్ర మహిళా భద్రత విభాగంలోని ఎన్‌ఆర్‌ఐ సెల్ అండగా నిలుస్తోంది.

- వివరాలు 2లో▶

ఇదంజగత్



ఇది కురుక్షేత్ర యుద్ధమే

చెరువుల్లో ఆక్రమణల తొలగింపుపై సీఎం రేవంత్‌రెడ్డి

- నాడు ధర్మాన్ని గెలిపించేందుకు యుద్ధం
- నేడు అదే తరహాలో చెరువుల్లో ఆక్రమణల తొలగింపు
- రాబోయే రోజుల్లో హైడ్రా దూకుడు మరింత పెంచుతుంది
- ఆక్రమణదారుల్లో కాంగ్రెస్ సహా ఏ పార్టీ వారున్నా తగ్గేదే లేదు

మణికొండ (హైదరాబాద్): 'ఆనాడు శ్రీకృష్ణుడు ధర్మాన్ని గెలిపించేందుకు అర్జునుడి వెంట ఉండి కురుక్షేత్ర యుద్ధం చేయించాడు. నేడు మేము ఆయన మార్గంలోనే భవిష్యత్తు తరాలకు ప్రకృతి సంపదను, చెరువులను అందించాలనే ఉద్దేశంతోనే చెరువుల్లో అక్రమ నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నాం. ఇది కురుక్షేత్ర యుద్ధంతో సమానమే.. ఇందులో మా వారితో పాటు మంది కూడా ఉన్నారు. ఇది ఏమాత్రం రాజకీయ కక్ష కానేకాదు.. భవిష్యత్ తరాలు బాగుండాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా తలవంచకుండా చెరువుల్లోని అక్రమ నిర్మాణాలన్నీ తొలగిస్తాం. వెనక్కి తగ్గేదే లేదు..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఆదివారం హైదరాబాద్ నగర శివారు నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో హరేకృష్ణ మూవ్‌మెంట్ వారు నిర్మిస్తున్న హెరిటేజ్ టవర్‌లో అనంత శేష స్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

చెన్నై, వయనాడ్‌లా కాకూడదు

'హైదరాబాద్‌కు హెరిటేజ్ సిటీ, లేక్ సిటీగా పేరుంది. ఆ ప్రత్యేకతను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. లేదంటే చెన్నై, వయనాడ్‌లా ప్రకృతి మనపై ప్రతాపం చూపిస్తుంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువుల చుట్టూ సంపన్నులు ఫాంహౌస్‌లు కట్టుకుని వాటి డ్రైనేజీని

మిగతా 2వ పేజీలో ▶



అనంత శేష స్థాపనం చేసి అభిషేకం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

18 ప్రాంతాలు.. 43.94 ఎకరాలు!

2లో

- 158 అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా
- వీఐపీలతోపాటు బడా రియల్టర్లకు చెందినవీ కూల్చివేత
- చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే లక్ష్యంగా చర్యలు
- అదనపు సిబ్బంది, ప్రత్యేక ఠాణా వస్తే మరిన్ని ఫలితాలు

క్రీడలకు కేరాఫ్‌గా తెలంగాణ

- దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వచ్చే ఒలింపిక్స్ నాటికి మన క్రీడాకారులను సన్నద్ధం చేస్తాం

3లో

బ్రహ్మకుమారీస్ బాటలోనే ప్రభుత్వం

- బ్రహ్మ కుమారీస్ శాంతి సరోవర్ ద్విదశాబ్ది ఉత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

వాల్మీకి స్కాంలో ఉన్న కాంగ్రెస్ నేతలెవరు?

- కర్ణాటక నుంచి అక్రమంగా తెలంగాణలోని అకౌంట్లకు డబ్బులు వచ్చాయి
- సీఎం రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు ఆ వార్తలు బయటకు రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు?
- సిద్ధరామయ్యను తొలగిస్తే తెలంగాణ ప్రభుత్వం కూలుతుందని కర్ణాటక మంత్రి ఎందుకన్నారు?
- సొంత పార్టీ అవినీతిపై రాహుల్ సమాధానం చెప్పాలి: కేటీఆర్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో వాల్మీకి స్కాం తీగ లాగితే డొంకంతా తెలంగాణ కాంగ్రెస్ నేతల వైపు కదులుతోందని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీ రామారావు (కేటీఆర్) ఆరోపించారు. తెలంగాణలోని కీలకమైన కాంగ్రెస్ నేతల హస్తం ఈ వ్యవహారంలో ఉన్నట్లు ఆధారాలు లభిస్తున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. వాల్మీకి స్కామ్‌లో భారీగా అవినీతి జరిగిందని స్వయంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యనే అసెంబ్లీలో అంగీకరించిన నేపథ్యంలో ఈ స్కామ్‌లో ఉన్న వారందరి పేర్లు బయటకు రావాల్సి ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ యూట్యూబ్ చానల్ ద్వారా ఆదివారం కేటీఆర్ మాట్లాడుతూ వాల్మీకి స్కాంకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించారు.

రూ. 180 కోట్లు దారిమళ్లాయి..

ఎన్నికలకు ముందు దాదాపు రూ.180 కోట్ల ప్రభుత్వ సొమ్ము, ప్రభుత్వ అకౌంట్ల నుంచి ఏ కారణం లేకుండా అక్రమంగా దారి మళ్లిందని ఆయన ఆరోపించారు. ఈ సొమ్ము ఎవరి ఖాతాలోకి బదిలీ అయిందో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, అందులో రూ.45 కోట్లు హైదరాబాద్‌లోని 9 బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారని, ఆ బ్యాంక్ ఖాతాలు ఎవరివో తేల్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం బయటకు రాగానే వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ ఆత్మహత్య చేసుకోవటం మరింత అనుమానాలకు తావిస్తోందన్నారు. వీ6 పేరుతో ఉన్న బిజినెస్ సంస్థకు రూ.4.5 కోట్లు బదిలీ చేసినట్లు వార్తలు వస్తున్నాయని, అసలు ఆ సంస్థ యాజమాని ఎవరో ప్రజల ముందుంచాలని అన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఆ డబ్బే వాడారా?

మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ డబ్బే వాడినట్లుందని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. వాల్మీకి స్కాం వ్యవహారంలో హైదరాబాద్‌లో సిట్, సీఐడీ, ఈడీ దాడులు నిర్వహించినప్పటికీ సీఎం రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు మీడియాలో ఆ వార్తలు బయటకు రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. పార్లమెంట్

మిగతా 2వ పేజీలో ▶

ఆ వదంతులు నమ్మొద్దు

'ఎన్ కన్వెన్షన్'పై అక్కినేని నాగార్జున



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్ కన్వెన్షన్‌పై వస్తున్న ఊహాగానాలు, వదంతులు నమ్మొద్దని సినీ నటుడు అక్కినేని నాగార్జున కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎన్ కన్వెన్షన్‌పై వస్తున్న వార్తల్లో వాస్తవాల కంటే ఊహాగానాలే అధికం. కన్వెన్షన్ పూర్తిగా పట్టా భూమిలోనే నిర్మించాం. అన్ని డాక్యుమెంట్లూ ఉన్నాయి. మేం ఒక్క సెంటు భూమి కూడా ఆక్రమించలేదు. తమ్మిడికుంట చెరువు ఆక్రమణకు గురికాలేదని ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్ స్పెషల్ కోర్టు 24/02/2014న ఆర్డర్ (ఎస్‌ఆర్ 3943/2011) ద్వారా జడ్జిమెంట్ ఇచ్చింది. ప్రస్తుత నిర్మాణం, చట్టబద్ధతపై నిర్ణయాధికారం కోసం హైకోర్టును ఆశ్రయించాం. న్యాయస్థానం తీర్పుకి కట్టుబడి ఉంటా' అని ఆయన తెలిపారు.

ముగిసిన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

- మిగిలింది ఇక స్పాట్ అడ్మిషన్లే
- యాజమాన్య సీట్లకు త్వరలో ర్యాటిఫికేషన్
- చిన్న కాలేజీల్లోనే మిగిలిపోయిన సీట్లు
- నెలాఖరు నుంచి ఇంజనీరింగ్ క్లాసులు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు ప్రక్రియ దాదాపు పూర్తయింది. స్లైడింగ్‌లో బ్రాంచీలు మారిన విద్యార్థులు రిపోర్టు చేసే గడువు ఆదివారంతో ముగిసింది. ఈ దశలోనూ మిగిలిన 11,836 సీట్లకు ప్రతి కాలేజీ స్పాట్ అడ్మిషన్లు చేపడతాయి. యాజమాన్య కోటా కింద 30 శాతం సీట్లను కాలేజీలు నింపేశాయి. వాటిల్లో వాస్తవాలను పరిశీలించిన తర్వాత అధికారులు ర్యాటిఫై చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకూ సన్నాహాలు మొదలయ్యాయి. ప్రతిరోజూ కొన్ని కాలేజీలు ర్యాటిఫై కోసం ఉన్నత విద్యా మండలికి వస్తాయి. మొత్తం మీద

మిగతా 12వ పేజీలో ▶

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక నివేదికను విడుదల చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో మంత్రి పొంగులేటి

- ఖజానాకు నష్టం వాటిల్లొద్దు
- అవినీతి వద్దు.. పారదర్శకంగా పనిచేయండి
- బాగా పనిచేసిన వారికి పదోన్నతులు, బదిలీల్లో ప్రాధాన్యం
- వార్షిక నివేదిక విడుదల

సాక్షి, హైదరాబాద్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతికి తావివ్వొద్దని, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజల నుంచి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా సేవలందించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లకుండా పనిచేయాలని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

త్వరలోనే బకాయిల విడుదల

ఇటీవల బదిలీలు జరిగిన విషయం గుర్తుచేస్తూ.. సబ్ రిజిస్ట్రార్ల నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారులందరూ వీలైనంత త్వరగా కొత్త స్థానాల్లో సర్దుబాటు కావాలని పొంగులేటి చెప్పారు. బాగా పని చేసిన వారికి పదోన్నతులు కల్పిస్తామని, బదిలీల్లో ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్యోగులు నిజాయితీ, అంకిత భావంతో పనిచేయాలని కోరారు. వచ్చే ఐదేళ్లలోగా

మిగతా 12వ పేజీలో ▶

సిటీ స్టీరింగ్ లాక్!



భారీగా పెరిగిన వాహనాలతో హైదరాబాద్ నగరం దిగ్బంధం

- పీక్ అవర్స్‌లో అంగుళం కూడా ఖాళీ లేనట్టుగా కార్లు, బైకులు, ఇతర వాహనాలు
- ప్రజా రవాణా సరిగా లేకపోవడంతో వ్యక్తిగత వాహనాలపై ఆధారపడుతున్న జనం
- విస్తరణకు నోచుకోని మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సర్వీసులు
- పదేళ్లలో సగానికి తగ్గిన సిటీ బస్సులు.. సుమారు 5 లక్షల మందితో మెట్రో కిటకిట
- కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఎంఎంటీఎస్‌లు.. ప్రజా రవాణాను మెరుగుపర్చడమే పరిష్కారమంటున్న నిపుణులు

16లో

80 లక్షలు గ్రేటర్ పరిధిలో వాహనాలు..

కొత్తగా ఏటా మరో నాలుగైదు లక్షలు రోడ్డెక్కుతున్న తీరు


మహిళలపై నేరం.. క్షమించరాని పాపం



మహిళలపై నేరాలకు పాల్పడే దుర్మార్గులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు. ఆడబిడ్డలపై నేరాలకు పాల్పడడం క్షమించరాని పాపమని అన్నారు. నేరగాళ్లను వదిలిపెట్టొద్దని, కఠినంగా శిక్షించాలని స్పష్టంచేశారు. మహిళల భద్రత కోసం చట్టాలను మరింత పటిష్టం చేస్తామని ప్రకటించారు.

- వివరాలు 6లో

రైతుకు 'భరోసా' కరువు!



పెట్టుబడి సాయం కోసం రైతన్నల ఎదురుచూపు • మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుతోనే సరిపుచ్చిన ప్రభుత్వం

అసెంబ్లీలో చర్చ లేదు..మార్గదర్శకాల ముచ్చటే లేదు • నెల రోజుల్లో ముగియనున్న వానాకాలం సీజన్

- ➤ జూలై 2వ తేదీన రైతు భరోసాపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైంది. అందులో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబులను సభ్యులుగా నియమించారు.
- ➤ అప్పటినుంచి 15 రోజుల్లోగా మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఇవ్వాలి. ఆ నివేదికపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి రైతు భరోసాపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అసెంబ్లీ ఆమోదం తర్వాత మార్గదర్శకాలు జారీచేసి రైతులకు పెట్టుబడి సాయం చేస్తామని సర్కారు ప్రకటించింది.
- ➤ జూలై 15వ తేదీన కేబినెట్ సబ్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతు భరోసాపై అభిప్రాయాలు తీసుకున్నారు. అలాగే ఆదిలాబాద్ సహా కొన్ని జిల్లాల్లోనూ అభిప్రాయాలు తీసుకున్నారు.
- ➤ జూలై 23వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కానీ అసెంబ్లీ సమావేశాల్లో రైతుభరోసా ఊసే ఎత్తలేదు. దీంతో మార్గదర్శకాలు ఖరారు కాలేదు.

సాక్షి, హైదరాబాద్: వానాకాలం పంటల సీజన్ మరో నెల రోజుల్లో ముగియనున్నా రైతుభరోసా కింద ఇంతవరకు ఆర్థిక సాయం అందలేదు. మరోవైపు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో లక్షలాది మంది రైతులకు బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వడం లేదు. దీంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పంటల సాగుకు పెట్టుబడి కరువై రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో అసలు రైతుభరోసా కింద ఆర్థిక సాయం అందుతుందా లేదా అన్న విషయాన్ని వ్యవసాయశాఖ అధికారులు కూడా స్పష్టంగా చెప్పలేకపోతుండటంతో అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

పునఃసమీక్ష ప్రకటనతో సరి!

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రైతు భరోసా (గతంలో రైతుబంధు) మొత్తాన్ని సీజన్‌కు ఎకరానికి రూ.7,500కు పెంచి ఇస్తామని

మిగతా 5వ పేజీలో ▶

వేధించే ఎన్‌ఆర్‌ఐ భర్తలపై కొరడా

బాధిత మహిళలకు అండగా రాష్ట్ర మహిళా భద్రత విభాగంలోని ఎన్‌ఆర్‌ఐ సెల్	2019 నుంచి ఈ ఏడాది జూలై వరకు 450 కేసులు నమోదు	68 మందిపై లుక్ అవుట్ నోటీసులు, 19 మంది పాస్‌పోర్టులు రద్దు	ఆరు జంటలను తిరిగి కలిపిన మహిళా భద్రత విభాగం

సాక్షి, హైదరాబాద్: అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కూతుళ్లు జీవితాంతం గొప్పగా బతకాలన్న కోరికతో కొందరు తల్లిదండ్రులు ఎన్‌ఆర్‌ఐలకు ఇచ్చి పెళ్లిళ్లు చేస్తుంటే.. దేశంకాని దేశంలో అడుగుపెట్టిన యువతుల్లో కొందరి పరిస్థితి దారుణంగా మారుతోంది. అదనపు కట్నం ఇవ్వట్లేదనో లేక ఇతర కారణాలను సాకుగా చూపించో భార్యలను కొందరు ఎన్‌ఆర్‌ఐ భర్తలు వేధిస్తున్నారు. అలా ఎన్‌ఆర్‌ఐ భర్తల చేతిలో దాడులు, గృహహింసకు గురవుతున్న అతివలకు రాష్ట్ర మహిళా భద్రత విభాగంలోని ఎన్‌ఆర్‌ఐ సెల్ అండగా నిలుస్తోంది. వ్యూహాత్మక చర్యలు చేపడుతూ వేధింపులకు పాల్పడే ఎన్‌ఆర్‌ఐ భర్తల మెడలు వంచుతోంది. నేరుగా ఫిర్యాదులను స్వీకరించడంతోపాటు ఈ–మెయిల్, జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులు, షీ–టీమ్స్ వాట్సాప్, ఎక్స్ (ట్విట్టర్) ద్వారా ఫిర్యాదులు తీసుకుంటూ బాధితులకు తగిన న్యాయం అందేలా చేస్తోంది. వీలైన కేసుల్లో యువతుల కాపురాలు తిరిగి నిలబెట్టేలా కృషి చేస్తోంది. అలాగే ఎన్‌ఆర్‌ఐ పెళ్లిళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటివరకు ఎన్‌ఆర్‌ఐ సెల్‌కు వచ్చిన కేసుల్లో ఆరు జంటలను కలిపినట్లు అధికారులు తెలిపారు.



అవసరమైతే పాస్‌పోర్టు సీజ్..

వేధింపులకు పాల్పడే ఎన్‌ఆర్‌ఐ భర్తలను దారికి తెచ్చేందుకు వీలైన అన్ని మార్గాలను ఎన్‌ఆర్‌ఐ సెల్ ఉపయోగిస్తోంది. అవసరం మేరకు లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ)లు జారీ చేయించడం, వారి పాస్‌పోర్టులు రద్దు చేయించడం కూడా చేస్తోంది.

తెలంగాణ విమెన్ సేఫ్టీ వింగ్ ఎన్‌ఆర్‌ఐ సెల్ అందించే సాయం ఇదీ..

- బాధిత మహిళలకు లీగల్ గైడెన్స్. గృహహింసకు సంబంధించి కేసుల నమోదు.
- భార్యలను వేధించే ఎన్‌ఆర్‌ఐ భర్తలను స్వదేశానికి రప్పించేలా ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం, కేంద్ర హోంశాఖ, విదేశాంగశాఖ, జాతీయ మహిళా కమిషన్, విదేశాల్లోని కాన్సులేట్ కార్యాలయాలకు లేఖలు రాయడం. వారు కేసుల విచారణను ఎదుర్కొనేలా చేయడం.
- ఒకవేళ బాధితురాలు విదేశాల్లోనే ఉంటే వారికి తగిన సాయం అందేలా అక్కడి ఎన్జీవోల సహకారం తీసుకోవడం.
- ఎన్‌ఆర్‌ఐ పెళ్లిళ్లకు సిద్ధపడే వారి కుటుంబాలకు పలు అంశాలపై పోస్టర్లు, బ్రోచర్లు, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించడం.
- నాన్ రెసిడెంట్ ఇండియన్స్ (ఎన్‌ఆర్‌ఐ) పెళ్లిళ్ల కేసుల దర్యాప్తులో అనుసరించాల్సిన పద్ధతులపై పోలీసులకు (స్టేషన్ హౌస్ ఆఫీసర్లు) శిక్షణ, కేసుల నిరంతర పర్యవేక్షణ.

2019 జూలై నుంచి ఈ ఏడాది జూలై 31 వరకు ఎన్‌ఆర్‌ఐ సెల్ పనితీరు ఇలా..

మొత్తం ఫిర్యాదులు: 1,801		నమోదు చేసిన కేసులు: 450
రాజీ కుదిరిన, దర్యాప్తు పూర్తయిన కేసులు: 150	ఎల్‌ఓసీల జారీకి ప్రతిపాదించిన కేసులు: 216	జారీ అయిన లుక్ అవుట్ సర్క్యులర్లు: 68
ఎన్‌ఆర్‌ఐ భర్తల పాస్‌పోర్టులు రద్దు ఉదంతాలు: 19	ఎన్‌ఆర్‌ఐ భర్తల పాస్‌పోర్టులు కోర్టు జప్తు చేసినవి: 23	స్వదేశానికి వచ్చి కోర్టుల్లో విచారణ ఎదుర్కొన్న నిందితులు: 47

క్లుప్తంగా...

బఫర్‌జోన్ అక్రమ నిర్మాణాలను తొలగించండి

సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: హుస్సేన్‌సాగర్ బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాలు, వ్యాపార సంస్థల తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. జలాశయాలు, చెరువులు, కుంటలు ఆక్రమించుకుని ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్‌జోన్‌లో కట్టిన నిర్మాణాల తొలగింపు కోసం హైడ్రా ఏర్పాటు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా, ఒత్తిళ్లకు లొంగకుండా హైడ్రా పనిచేయడంపై ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. గ్రేటర్ పరిధిలోని చెరువులు, కుంటలు, జలాశయాల ఎఫ్‌టీఎల్ హద్దులను మరోమారు గుర్తించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని సూచించారు.

'హైడ్రా'తో పేదల జోలికి వెళ్లొద్దు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



న్యూశాయంపేట: హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు అయిన 'హైడ్రా'మంచిదేనని అయితే పేద ప్రజల జోలికి వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. హనుమకొండలో పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్‌లో మూడు రోజుల పాటు జరిగిన పార్టీ నిర్మాణ సమావేశాల్లో దేశ, రాష్ట్ర తాజా పరిస్థితులను చర్చించామన్నారు. అదేవిధంగా ప్రజల్లో పాలక పక్షాలపై ఉన్న అసంతృప్తిని గుర్తించి కమ్యూనిస్టు పార్టీగా పోరాట పంథాను ఏవిధంగా తీసుకెళ్లాలనే విషయమై ప్రణాళికలు రూపొందించుకున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో చాలా సమయం వృథా అయిందని ప్రజా సమస్యలు పక్కదారి పట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉండాలని అభిప్రాయపడ్డారు. రైతులకు రూ.రెండులక్షల రుణమాఫీపై సాకులు చెప్పకుండా ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని కోరారు. పార్టీ సమావేశాల్లో రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా వరంగల్‌కు చెందిన తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రంగారెడ్డి,మేడ్చల్ జిల్లాకు చెందిన బాలమల్లేశ్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

బండి సంజయ్ పీఎస్‌గా ఏపీకి చెందిన ఐఏఎస్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రైవేటు సెక్రటరీ (పీఎస్)గా ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి ఆంద్ర వంశీని నియమిస్తూ కేంద్ర సిబ్బంది శిక్షణ వ్యవహారాల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ సెక్రటరీ స్థాయిలో ఐదేళ్ల కాలపరిమితి లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగుతారని స్పష్టం చేసింది. ఆంద్ర వంశీ ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన 2011 ఐఏఎస్ అధికారి. ఏపీలోని ఒంగోలుకు చెందిన ఆంద్ర వంశీ కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేశారు. 2011 లో ఐఏఎస్‌కు ఎంపికైన తర్వాత యూపీలోని ఫిలిబిత్, షాజహాన్‌పూర్, మథుర, ప్రయాగ్‌రాజ్, మొరాదాబాద్, కుషినగర్, ఝాన్సీ ప్రాంతాల్లో పనిచేశారు. గతేడాది సెప్టెంబర్‌లో బస్తి జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు మ్యుటేషన్లు, రికార్డుల సవరణ, భూమి సరిహద్దులకు సంబంధించి రైతులు పడుతున్న సమస్యలను గుర్తించి మేలైన పరిష్కారం చూపినందుకు అన్ని వర్గాల ప్రశంసలు అందుకున్నారు. అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, అధికారులు, బార్ అసోసియేషన్లతో ఒక యంత్రాంగం ఏర్పాటు చేసి గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య సుమారు 50 వేల కేసులు ఆయన పరిష్కరించారు.

18 ప్రాంతాలు.. 43.94 ఎకరాలు!

సాక్షి, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో ఉన్న జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఇప్పటివరకు 18 ప్రాంతాల్లో మొత్తం 43.94 ఎకరాలు పరిరక్షించింది. వీటిలో ఎన్–కన్వెన్షన్ ఆక్రమించిన తమ్మిడికుంటతో పాటు ఇతర చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులు ఉన్నాయి. తొలుత జీహెచ్‌ఎంసీ అధీనంలోని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్స్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) ఈ కూల్చివేతలు ప్రారంభించింది. ఈ విభాగం డైరెక్టర్‌గా వచ్చిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ నేతృత్వంలోని బృందం ఈ ఏడాది జూన్ 27న ఫిల్మ్‌నగర్ కో–ఆపరేటివ్ సొసైటీలో తొలి ఆపరేషన్ చేపట్టింది. నార్నే గోకుల్ ఆక్రమించిన లోటస్ పాండ్‌లోని 0.16 ఎకరాలకు విముక్తి కల్పించడం తొలి ఆపరేషన్‌గా రికార్డుల్లోకి ఎక్కింది. ఆపై జూలై 1, 4, 5, 14 తేదీల్లో మన్సూరాబాద్, ఎమ్మెల్యేస్ కాలనీ, మిథిలానగర్, బీజేఆర్ నగర్‌లపై పంజా విసిరింది. ఆ నాలుగు చోట్ల ఉన్న ఏడు నిర్మాణాలను కూల్చివేసింది. అప్పటివరకు ఆ ఆపరేషన్లు జీహెచ్‌ఎంసీ వరకే పరిమితం అయ్యాయి. తర్వాత ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) వరకు పరిధిని విస్తరించడమే కాకుండా హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గత నెల 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మరుసటి రోజే హైడ్రా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రంగనాథ్.. దూకుడు పెంచారు.



మహదేవ్‌పురంలో తొలి ఆపరేషన్

గత నెల 21న మహదేవ్‌పురంలో పార్కు స్థలంలోని ఆక్రమణల తొలగింపుతో హైడ్రా ఆపరేషన్లు మొదలయ్యాయి. ఇలా శనివారం వరకు 18 చోట్ల ఉన్న 158 అక్రమ నిర్మాణాలను తొలగించింది. మొత్తం 43.94 ఎకరాల మేర ప్రభుత్వ భూములు, చెరువులు పరిరక్షించింది. వీటిలో పలువురు వీఐపీలతో పాటు బడా రియల్టర్లకు చెందినవీ ఉన్నాయి. హైడ్రా ఏర్పాటై నెల రోజులు దాటినా ఇప్పటివరకు దానికి అదనంగా ఒక్క పోస్టును కానీ సిబ్బందిని కానీ కేటాయించలేదు. దీంతో ఇప్పటివరకు కేవలం ఈవీడీఎం, జీహెచ్‌ఎంసీలోని టౌన్ ప్లానింగ్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసుల సహకారంతోనే కార్యకలాపాలు సాగిస్తోంది. దీనికోసం ప్రతిపాదించిన అదనపు సిబ్బందితో పాటు ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌ను కేటాయిస్తే మరిన్ని మంచి ఫలితాలు ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైడ్రా షాక్ తగిలిన వారిలో సినీ నటుడు అక్కినేని నాగార్జునతో పాటు ప్రో కబడ్డీ యజమాని అనుపమ, కావేరీ సీడ్స్ యజమాని భాస్కరరావు, మంథని బీజేపీ నేత సునీల్‌రెడ్డి, బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, ఎంఐఎం ఎమ్మెల్సీ మహ్మద్ మీర్జా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ (ఈయనపై కేసు నమోదైంది), చింతల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత రత్నాకరం సాయిరాజు, కాంగ్రెస్ నేత పళ్లంరాజు సంబంధీకులు ఉన్నారు.

158 అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా

- వీఐపీలతో పాటు బడా రియల్టర్లకు చెందినవీ కూల్చివేత
- చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే లక్ష్యంగా చర్యలు
- అదనపు సిబ్బంది, ప్రత్యేక ఠాణా వస్తే మరిన్ని ఫలితాలు!

హైడ్రా కూల్చివేతల్లో కీలకమైనవి..

- మహదేవ్‌పురంపార్క్ స్థలంలోని నిర్మాణం
- భూదేవిహిల్స్‌లో చెరువులను ఆక్రమించి చేపట్టిన ఐదు నిర్మాణాలు
- గాజులరామారంలోని చింతల్‌చెర్వులో ఉన్న 54 నిర్మాణాలు
- నందగిరి హిల్స్ పార్కులో 16 నిర్మాణాలు
- రాజేంద్రనగర్‌లోని బుమ్‌రాఖ్ దౌలా లేక్‌లోని 45 నిర్మాణాలు
- ఖానాపూర్, చిల్కూరుల్లోని గండిపేట చెరువులో ఉన్న 24 నిర్మాణాలు
- తమ్మిడికుంట చెరువులోని ఎన్–కన్వెన్షన్‌తో పాటు ఇతర నిర్మాణాలు
- ఫుట్‌పాత్‌లు, నాలాలపైన, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలు

ఇది కురుక్షేత్ర యుద్ధమే

▶ మొదటి పేజీ తరువాయి

చెరువుల్లో కలపటం ఎంతవరకు సబబు? అలాంటి వారిలో కొందరు మా పార్టీ వాళ్లు కూడా ఉండొచ్చు. తెలియక చేసిన తప్పులను సరిదిద్దుకునే సమయం వచ్చింది. వారు సైతం కూల్చివేతలకు సహకరించాలి. కృష్ణా, గోదావరి నదులు ఎండిపోయినా గండిపేట, హిమాయత్‌సాగర్ జలాలతో హైదరాబాద్ ప్రజలు దాహార్తి తీర్చుకున్న సందర్భాలు ఉన్నాయి. హైదరాబాద్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దుకుని భవిష్యత్‌తరాలకు అందించేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుని పనిచేస్తుంది. ఇప్పటికే హైడ్రా పలు చెరువుల్లో ఆక్రమణలను తొలగించింది. రాబోయే రోజుల్లో మరింత దూకుడుగా పనిచేస్తుంది..'అని సీఎం స్పష్టం చేశారు

కాంక్రీట్ జంగిల్‌కు ఆధ్యాత్మిక శోభ

'మన రాష్ట్ర ఆర్థిక రాజధాని అయిన ఫైనాన్షియల్ జిల్లా కాంక్రీట్ జంగిల్‌గా అభివృద్ధి చెందింది. అలాంటి చోట ఆరెకరాల విస్తీర్ణంలో 430 అడుగుల ఎత్తులో ఆధ్యాత్మికతను బోధించే హెరిటేజ్ టవర్ రావటం ఎంతో అభినందనీయం. ఇలాంటి దేవాలయ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనటంతో నా జన్మ ధన్యం అయ్యింది. 36 నుంచి 40 నెలల్లో పనులు పూర్తయ్యాక ప్రారంభోత్సవంలోనూ పాల్గొనాలని ఉంది. ఇది చరిత్రలో నిలిచిపోయే గొప్ప మందిరం అవుతుంది. ఐటీ, వైద్యం, విద్య తదితర రంగాల్లో దేశంలోనే తొలిస్థానంలో ఉన్న మన రాష్ట్రం, హెరిటేజ్ టవర్ నిర్మాణంతో ఆధ్యాత్మికతలోనూ అదే స్థాయికి వస్తుంది. ఒత్తిడిలో జీవిస్తున్న ప్రజలకు ఇలాంటి దేవాలయాలతో మనశ్శాంతి లభిస్తాయి.

అక్షయ పాత్ర ద్వారానే ఆస్పత్రుల్లో భోజనం

అక్షయపాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లోనూ భోజనం అందిస్తాం. ప్రభుత్వ పథకాల అమలుకు హరేకృష్ణ మూవ్‌మెంట్ సహకారం అందించాలి..'అని రేవంత్ కోరారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మత్స్యసహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, టీపీసీసీ అధికార ప్రతినిధి ఎం.జైపాల్‌రెడ్డి, హరేకృష్ణ మూవ్‌మెంట్ గ్లోబల్ అధ్యక్షుడు మధుపండిత దాస పాల్గొన్నారు.

ఇది కోతల ప్రభుత్వం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా హామీల అమలును పక్కనపెట్టి పూటకో మాట, రోజుకో ప్రకటనతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్ ప్రసంగాలు కోతల రాయుడిని తలపిస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో నడుస్తున్నది చేతల ప్రభుత్వం కాదని.. కోతల ప్రభుత్వమని ఆదివారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో అంతర్జాతీయ స్థాయి నగరాలతో అభివృద్ధిలో పోటీపడి దూసుకెళ్లిన హైదరాబాద్.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాభవాన్ని కోల్పోయిందని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరాభివృద్ధిపై ప్రభుత్వం కనీస ప్రణాళిక కూడా ప్రకటించలేదని.. కానీ సీఎం మాత్రం తెలంగాణను ఫ్యూచర్ స్టేట్, హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ ఏర్పాటు చేస్తామంటూ అంతర్జాతీయ వేదికలపై కోతలు కోస్తున్నారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, రుణమాఫీ, రైతు భరోసా తదితరాల అమలును ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు.

బ్రహ్మకుమారీస్ బాటలోనే ప్రభుత్వం

- బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ద్విదశాబ్ది ఉత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- యువత నైపుణ్యాభివృద్ధికి స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం



బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ద్విదశాబ్ది ఉత్సవాలను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: ఆధ్యాత్మిక చింతనతోపాటు సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలను తొలగించేందుకు 'బ్రహ్మకుమారీస్'సంస్థ చేస్తున్న కృషి అనుసరణీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బ్రహ్మకుమారీస్ బాటలోనే తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ ద్విదశాబ్ది ఉత్సవాలకు సీఎం రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతిసరోవర్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ ఫ్రీ సొసైటీ, రైతులకు లాభసాటి వ్యవసాయం, దివ్యాంగులకు చేయూత, యువతకు ఉపాధికి సంబంధించిన నాలుగు సామాజిక ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ శాంతి సరోవర్ హైదరాబాద్‌లో ఉండటం భాగ్యనగర కీర్తిని ఇనుమడింపజేస్తుందని పేర్కొన్నారు. నేటి యువతరాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారి సహా ఇతర చెడు అలవాట్లను తొలగించి వారిలో నూతనోత్తేజాన్ని నింపి దేశం కోసం ఉపయోగపడేలా బ్రహ్మకుమారీస్ సంస్థ కృషి చేస్తుండటం అభినందనీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతిస్థాపన కోసం సైతం ఈ సంస్థ కృషి చేస్తోందని కొనియాడారు.

డ్రగ్స్‌రహిత తెలంగాణ కోసం ప్రయత్నిస్తున్నాం

తెలంగాణలో డ్రగ్స్ అనే పదం వింటేనే భయపడేలా డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్ తెలిపారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా రూ. 2 లక్షల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. దేశంలోనే రూ. 31 వేల కోట్ల మేర రైతు రుణమాఫీ చేసి తమది రైతు ప్రభుత్వమని నిరూపించుకున్నామన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నట్లు సీఎం వివరించారు. ముచ్చెర్లలో అభివృద్ధి చేసే ఫ్యూచర్ సిటీలోనే ఈ వర్సిటీ ఉంటుందన్నారు.

శాంతి సరోవర్ లీజును పునరుద్ధరిస్తాం

తెలంగాణ ప్రభుత్వానికి బ్రహ్మకుమారీస్ మార్గదర్శులని.. హైదరాబాద్‌లోని శాంతి సరోవర్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని రేవంత్ చెప్పారు. శాంతి సరోవర్ లీజు గడువు ముగియనున్నందున పునరుద్ధరించి వారికి అన్నివిధాలా సహకరిస్తామని ప్రకటించారు. మౌంట్ అబూ తర్వాత తెలంగాణలో శాంతి సరోవర్ ఉండటం రాష్ట్రానికి ఎంతో గర్వకారణమన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలోని చెడును తొలగించడానికి బ్రహ్మకుమారీస్ ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆధ్యాత్మిక రాజధానిగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంలో బ్రహ్మకుమారీస్ సంస్థ తోడ్పడుతోందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మృత్యుంజయ (మౌంట్ అబూ), కుల్‌దీప్ దీదీ, సంతోష్ దీదీ, మంజు, జస్టిస్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే టార్గెట్‌గా 'హైడ్రా'

కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు: మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నా, రైతులు రుణమాఫీ కోసం ధర్నాలు చేస్తున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం.. డైవర్షన్ పాలిటిక్స్‌తో మైండ్‌గేమ్ ఆడుతోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ప్రభుత్వం 'హైడ్రా'పేరుతో డ్రామా నడుపుతోందని, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే టార్గెట్‌గా రాజకీయ కుట్రలకు తెరలేపిందని విమర్శించారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యాతో ప్రజలు చనిపోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఇబ్బంది పెట్టేలా రాజకీయం నడుపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కండువా కప్పుకోకపోతే ఇబ్బంది పెడతాం.. అన్నట్లుగా రేవంత్ తీరు ఉందని మండిపడ్డారు. పటాన్‌చెరు ఎమ్మెల్యేపై అక్రమ మైనింగ్ కేసులు పెట్టారని, రూ.300 కోట్ల ఫైన్ వేసి నానా ఇబ్బందులు పెట్టి కాంగ్రెస్ కండువా కప్పారని అన్నారు. కాంగ్రెస్ కండువా కప్పగానే మైనింగ్ కేసు అటకెక్కిందని, ఇప్పుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కూడా ఇబ్బందిపెట్టేలా అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పల్లాపై 6 కేసులు పెట్టారని, ఆయన భార్య, పిల్లలపై కూడా కేసులు పెట్టారని విమర్శించారు. అధికారం ఉందని రాత్రికి రాత్రే కూల్చడాలు సరికాదన్నారు. రాజకీయ కక్షలను విద్యాసంస్థలు, ఆసుపత్రులపై రుద్దవద్దని పేర్కొన్నారు. మంత్రులు రుణమాఫీపై కుంటిసాకులు చెపుతున్నారని, రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయమంటే స్పందించడం లేదని అన్నారు. రేవంత్ ప్రభుత్వం ఎనిమిది నెలల్లో రూ.65 వేల కోట్ల అప్పు చేసిందని, అంటే నెలకు రూ.8,125 కోట్ల చొప్పున వచ్చే ఐదేళ్లలో చేయబోయే అప్పు రూ.4.87 లక్షల కోట్లు అని లెక్కించారు. కాగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాలలో రూ.4,26,000 కోట్ల అప్పు మాత్రమే చేసిందన్నారు.

ప్రభుత్వ భవనాలనూ కూల్చేస్తారా?

నెక్లెస్‌రోడ్, జీహెచ్‌ఎంసీ కార్యాలయం పరిస్థితి ఏమిటి

- హైడ్రాకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: వివిధ చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన ప్రభుత్వ భవన సముదాయాలను కూడా కూల్చివేస్తారా? అని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హైడ్రా అధికారులను ప్రశ్నించారు. ఆదివారం ఆయన తమ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన ప్రైవేటు భవనాలను కూల్చి వేస్తున్న అధికారులు.. గవర్నమెంట్ ఆఫీసులను కూడా కూల్చివేస్తారా అని నిలదీశారు. హుస్సేన్‌సాగర్ వద్ద నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలను ఏం చేయబోతున్నారని, నెక్లెస్‌రోడ్డు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని.. మరి దాన్ని కూడా తవ్వేస్తారా? అని హైడ్రా అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. జీహెచ్‌ఎంసీ ఆఫీస్ కూడా నీటి కుంటలో నిర్మించిందేనని.. మరి ఆ కార్యాలయాన్ని కూడా కూల్చేస్తారా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో చాలా చోట్ల పలు ప్రభుత్వ కార్యాలయాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. గోల్కొండ వద్ద ఉన్న చెరువులో గోల్ఫ్ కోర్టు ఉందని.. ఆ కోర్టులో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు కూడా గోల్ఫ్ ఆడతారని గుర్తు చేశారు. ఒకసారి అక్కడికి వెళ్లి చూడాలని.. లేదంటే ఫొటోలు కావాలంటే తాను ఇస్తానని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ సమస్యపై హైదరాబాద్ నగర మేయర్‌ను కలసి చెప్పానని.. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూస్తానని ఆయన తెలిపారు.

కేంద్రంపై మండిపాటు..: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు వ్యతిరేకంగా బిల్లును ప్రవేశపెడుతోందని ఒవైసీ మండిపడ్డారు. ముస్లింలు లేకుండా చేయాలని ప్రధాని మోదీ సర్కార్ చూస్తోందని దుయ్యబట్టారు. మజీద్‌లు, దర్గాల లాగే వక్ఫ్ ఆస్తులు కూడా ప్రభుత్వ ఆస్తులు కావని.. ఎప్పటి నుంచో ఉన్న వక్ఫ్ ఆస్తులకు డీడ్ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మక్కా మసీద్‌కు డీడ్ కావాలంటే ఎక్కడ తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.

హైడ్రాను స్వాగతిస్తున్నాం

రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు: ఎంపీ రఘునందన్‌రావు



ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): చెరువుల ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'హైడ్రా'ను స్వాగతిస్తున్నామని, కానీ పరిపాలనపైనా కూడా దృష్టి సారించాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఆక్రమించిన నిర్మాణాలను కూల్చివేయడం సక్రమమేనన్నారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యులు, నర్సులు, ఫార్మస్యూటికల్ సిబ్బందిని నియమించాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యం పడకేసిందని విమర్శించారు. రాష్ట్రంలో విష జ్వరాలు పెరిగాయని, ఒకేరోజు ఐదుగురు డెంగీతో మరణించడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆస్పత్రులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి స్కాంలో ఉన్న కాంగ్రెస్ నేతలెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సమయంలో కొన్ని బార్లు, బంగారు దుకాణాల నుంచి భారీగా నగదు తీసుకొచ్చినట్టు సమాచారం ఉందని, ఆ బార్లు, బంగారం దుకాణాలను నడుపుతున్న వారితో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

సిద్దిరామయ్యను తొలగిస్తే తెలంగాణ సర్కార్ కూలుతుందా?

కర్ణాటక సీఎం సిద్దిరామయ్యను తొలగిస్తే తెలంగాణలో కూడా ప్రభుత్వం కూలిపోతుందని కర్ణాటక మంత్రి సతీష్ జారకిహోళి వ్యాఖ్యానించడం వెనుక ఆంతర్యం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ వాల్మీకి స్కాంతోనే కర్ణాటక, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య బంధం పెనువేసుకుందా అన్న అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలున్నట్లు ఆధారాలు కనబడుతున్నప్పటికీ ఈడీ ఎందుకు మౌనంగా ఉందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పార్లమెంటులో అవినీతిపై పెద్ద ఎత్తున మాట్లాడే రాహుల్ గాంధీ ఈ వాల్మీకి స్కాం విషయమై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. వెంటనే రాహుల్ ఈ విషయంపై స్పందించాలని, మొత్తం వ్యవహారంలో ఉన్న పెద్ద చేపల పేర్లను బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

నేడు ఢిల్లీకి కేటీఆర్

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సోమవారం సాయంత్రం ఐదు గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. ఈ నెల 27న కవిత బెయిల్ పిటిషన్ విచారణకు రానున్న నేపథ్యంలో కేటీఆర్ ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆయన కవిత ఆరోగ్య స్థితిని తెలుసుకోవడంతో పాటు న్యాయవాదులతోనూ సంప్రదింపులు జరుపుతారని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

క్రీడలకు కేరాఫ్‌గా తెలంగాణ

- దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- వచ్చే ఒలింపిక్స్ నాటికి మన క్రీడాకారులను సన్నద్ధం చేస్తాం
- 2036 ఒలింపిక్స్ కల్లా అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన
- ఎన్‌ఎండీసీ మారథాన్ విజేతలకు పతకాల ప్రదానం


హైదరాబాద్ మారథాన్ విజేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

చందానగర్ (హైదరాబాద్): దేశంలో క్రీడలను ప్రోత్సహించే రాష్ట్రం తెలంగాణనే అనే గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. 2036లో ఒలింపిక్స్‌ను ఇండియాలో నిర్వహించాలనే ప్రధాని నరేంద్రమోదీ సంకల్పం నేపథ్యంలో హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జాతీయ క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించేలా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఇటీవల కేంద్ర క్రీడల శాఖ మంత్రిని ఢిల్లీలో కలసి ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న స్టేడియాలను ఆధునీకరించి క్రీడాకారులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. 2028లో జరిగే ఒలింపిక్స్‌లో హైదరాబాద్ క్రీడాకారులు ఎక్కువ పతకాలు సాధించేందుకు ఇప్పటినుంచే చర్యలు చేపడతామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఎన్‌ఎండీసీ హైదరాబాద్ మారథాన్ విజేతలకు పతకాలను ప్రదానం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

త్వరలో స్పోర్ట్స్ పాలసీ

'వచ్చే విద్యాసంవత్సరం నుంచే హైదరాబాద్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభిస్తాం. దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా అక్కడి స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించడంతో పాటు మూడు బంగారు పతకాలను సాధించిన క్రీడాకారిణితో మాట్లాడాం. ఇక్కడ ఏర్పాటు చేసే స్పోర్ట్స్ యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు దక్షిణ కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీ సహకారం తీసుకుంటాం. అంతర్జాతీయ స్థాయి కోచ్‌లను రప్పించి క్రీడాకారులను తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తాం. ప్రాంతీయ క్రీడలకు ఎల్బీ స్టేడియం, జాతీయ క్రీడలకు ఉప్పల్ స్టేడియం, అంతర్జాతీయ క్రీడలకు గచ్చిబౌలి స్టేడియం వేదికలుగా నిలుస్తాయి. త్వరలో స్పోర్ట్స్ కోసం ఓ పాలసీని తీసుకొస్తాం..'అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

అక్టోబర్ 2న సీఎం కప్ క్రీడలు

'అక్టోబర్ 2న సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తాం. అక్టోబర్ 3వ వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో సీఎం కప్ క్రీడలు ప్రారంభం అవుతాయి. సీఎం కప్ క్రీడల విజేతలతో, వివిధ విభాగాల క్రీడాకారులతో డేటా బేస్ ఏర్పాటు చేస్తాం. దీనిపై త్వరలోనే స్పష్టమైన ప్రకటన ఉంటుంది. త్వరలోనే గచ్చిబౌలి స్టేడియంలో ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరుగుతుంది. 25 ఏళ్ల కిందట హైదరాబాద్‌లో ఆఫ్రో ఏషియన్ గేమ్స్, మిలిటరీ క్రీడలు నిర్వహించిన ఘనత మనకు ఉంది. అదే తరహాలో ఇప్పుడు కూడా స్టేడియాలకు పూర్వవైభవం తీసుకొచ్చేలా చేస్తాం. తెలంగాణలోని యువతను క్రీడలవైపు మళ్లించేలా తగిన చర్యలు తీసుకుంటాం..'అని సీఎం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, వి.హన్మంతరావు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రముఖ బాక్సర్ నిఖత్ జరీన్, ఎన్‌ఎండీసీ ఈడీ జైపాల్‌రెడ్డి, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ టీవీ నారాయణ, ఎన్‌ఎండీసీ హైదరాబాద్ మారథాన్ రేస్ డైరెక్టర్ రాజేష్ వెచ్చా తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానం అనేది ఉచితంగా రాదు. మనం శ్రద్ధ పెట్టాలి.
- రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి

సోమవారం, 26 ఆగస్టు 2024

కృత్రిమ సంక్షిప్తం

పుస్తకం మొత్తం చదవనక్కరలేకుండా కేవలం అట్టల వెనుక ఉన్నది చదివి కూడా 'సమీక్ష' రాయొచ్చునని... సాహిత్య ప్రపంచంలో ఒక జోక్. చదవడానికి బద్ధకించడం అనేది సర్వ మానవ సమస్య. మన సినిమా రూపొందుతున్నది దీని ఆధారంగానే కాబట్టి దీన్నొకసారి చదవమని 'ఎ కాక్ అండ్ బుల్ స్టోరీ'లో సినిమా నటుడి పాత్రధారికి దర్శకుడి పాత్రధారి ఒక పుస్తకం ఇస్తాడు. ఆ నూరు పేజీల భారీ పుస్తకాన్ని చదవలేక, అందులోని సారాంశం ఏమిటో తన భార్యను చెప్పమంటాడు నటుడు. అలాంటివాళ్ల కోసమే కాబోలు, పుస్తకాలు సంక్షిప్తంగా రావడం మొదలైంది.

కాలం తెచ్చిన మార్పుల్లో వేగం ఒకటి. దేనిమీదా ఎక్కువసేపు ఎవరూ నిలబడటం లేదనేది అందరూ అంగీకరిస్తున్న మాట. ప్రయాణ సాధనాలు పెరిగి జీవితం వేగవంతం కావడానికీ, పాఠకులు చదవడం తగ్గిపోవడానికీ సంబంధం ఉంది. ఆ పెరిగిన వేగానికి తగినట్టుగా పాఠకులను శ్రోతలుగా మార్చడానికి ఆడియో బుక్స్ మార్కెట్ ప్రయత్నించింది. గంటల తరబడి ఉండే నవలలు యథాతథంగా రికార్డు చేస్తే ఖర్చుతో పాటు అసలుకే మోసం రావొచ్చు. అలా పుట్టినవే అబ్రిడ్జ్‌డ్ ఆడియో బుక్స్. హెలెన్ కెల్లెర్, ఎడ్గార్ అలెన్ పో, డైలాన్ థామస్ లాంటివారి రచనలు అమెరికాలో తొలుదొలుత ఆడియో బుక్స్‌గా వచ్చాయి. అలాగే అచ్చు పుస్తకాలు ఎన్నో కుదించుకుని అందుబాటులోకి వచ్చాయి. అలా కుదించడం వల్ల కొత్త పాఠకులు సాహిత్యంలో అందుబాటులోకి వచ్చారు. ఉదాహరణకు ఇలా వచ్చిన 'ఏడు తరాలు', 'గాన్ విత్ ద విండ్' లాంటి నవలల అనువాదాలు తెలుగులో ఎంతో ఆదరణ పొందాయి. ఎన్నో మేలిమి రచనలను 'పీకాక్ క్లాసిక్స్' ప్రత్యేకించి సంక్షిప్తంగా తెలుగులోకి అనువదింపజేసి ప్రచురించింది. సచిత్ర బొమ్మల భారతం, సచిత్ర బొమ్మల రామాయణం లాంటి పుస్తకాలు మనకు తెలియనివి కాదు. పిల్లల కోసం, పిల్లలంత ఓపిక మాత్రమే ఉన్న పెద్దల కోసం ఎన్నో పుస్తకాలు ఇలా పొట్టిరూపాల్లో వచ్చాయి.

పుస్తకాలను సంక్షిప్తం చేయడం దానికదే ఒక ఎడిటింగ్ స్కిల్. సారం చెడకుండా, టోన్ మారకుండా, 'అనవసర' వివరాలు లేకుండా కుదించడం చిన్న విషయమేమీ కాదు. రచయిత ఒక పదం వాడటానికి ఎంతగా ఆలోచిస్తాడో, దాన్ని తొలగించడానికి సంక్షిప్తకుడు అంతే గింజుకుంటాడు. అలాంటి రంగంలోకి కృత్రిమ మేధ జొరబడటమే ఇప్పుడు సాహిత్య లోకంలో సంచలనమైంది. ఐఫోన్, ఐప్యాడ్ యూజర్ల కోసం జూలై నుంచి కొత్త ఏఐ యాప్ 'మాజిబుక్' అందుబాటులోకి వచ్చింది. ఆంగ్ల క్లాసిక్ రచనలను కుదించడం ఈ యాప్ ప్రత్యేకత. మాబీ డిక్, ఎ టేల్ ఆఫ్ టు సిటీస్, ద కౌంట్ ఆఫ్ మాంటి క్రిస్టో, క్రైమ్ అండ్ పనిష్మెంట్, డ్రాకులా, రాబిన్‌సన్ క్రూసో, ద త్రీ మస్కటీర్స్, ద పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే, ద గ్రేట్ గాట్సబీ లాంటి రచనలు ఇందులో ఉన్నాయి. ఇందులో అత్యధికం తెలుగులోకి అనువాదమైనవే. ఉదాహరణకు చార్లెస్ డికెన్స్ రాసిన 'ఎ టేల్ ఆఫ్ టు సిటీస్' ప్రారంభ వాక్యాలు ఉద్విగ్నభరితంగా ఉంటాయి. 'ఇట్ వాజ్ ద బెస్ట్ ఆఫ్ టైమ్స్, ఇట్ వాజ్ ద వరస్ట్ ఆఫ్ టైమ్స్.' ('అది ఒక వైభవోజ్వల మహాయుగం, వల్లకాటి అధ్వాన్న శకం'; రెండు మహానగరాలు– తెన్నేటి సూరి అనువాదం.) వీటిని, 'ఇట్ వాజ్ ఎ టైమ్ వెన్ థింగ్స్ వర్ వెరీ గుడ్ అండ్ వెరీ బ్యాడ్' ('అదొక చాలా మంచి చాలా చెడ్డల కాలం') అని ఏఐ కుదించిందని విమర్శకులు ఎత్తిపొడుస్తున్నారు.

సంక్లిష్టమైన వాక్య సంచయనానికి లోనుకావడం బౌద్ధిక వృద్ధికి కీలకం అంటారు యూనివర్సిటీ ఆఫ్ బఫెలోకు చెందిన లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్ కసాండ్రా జాకబ్స్. రచయితలు తమ పదాలను ఉద్దేశపూర్వకంగా ఎంచుకుంటారనీ, ఏఐ సరళీకృతం చేయడంలో అవి నష్టపోతామనీ ఆమె చెబుతారు. కథకు సంబంధించిన అసలైన అంతరార్థం పోయి, అది తప్పుడు భావనకు దారితీయవచ్చని హెచ్చరిస్తారు. మరో రకమైన విమర్శ భాషకు సంబంధించినది. పొలిటికల్ కరెక్ట్‌నెస్, తటస్థ మాటల వాడుక పెరుగుతున్న నేపథ్యంలో, అలాగే శిక్షణ పొందివుండే ఏఐ 'సహజంగానే' రచనలోని అసలు మాటల స్థానంలో బోలు మాటలు చేర్చవచ్చు. కొన్నింటిని వివాదాస్పదమైన అంశాలుగా అది చూడవచ్చు. దాంతో రచనలోని భావోద్వేగ తీవ్రతకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. అయితే, 'పుస్తకాలను, వాటి ఆలోచనలను ప్రజాస్వామీకరించడమే' తమ మిషన్ అని మాజిబుక్ సమర్థించుకుంటోంది. ఆంగ్లం నేర్చుకుంటున్నవారు, పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇంకా డిస్‌లెక్సియా, తీవ్ర ఏడీహెచ్‌డీ ఉన్నవారికి ఇవి ఉపకరిస్తాయని చెబుతోంది.

'రోబో' సినిమాలో 'చిట్టి రోబో' వందల పుస్తకాలను ఇట్టే స్కాన్ చేయగలుగుతాడు. పుస్తకాలు చదవాలి అనుకుంటూనే చదవలేకపోయే అందరి కల అది. తలగడగా పెట్టుకుంటే వాటికవే అక్షరాలు తలలోకి వెళ్లిపోతే బాగుంటుందని చిన్నతనంలో అనుకోనివాళ్లెవరు? అదంతా 'కృత్రిమ' ప్రపంచం. సహజ ప్రపంచంలో మనమే చదువుకోవాలి. సహజంగా చదవలేనప్పుడే కృత్రిమ సాయం అవసరం అవుతుంది. అయితే, రామాయణాన్ని ఆసాంతం చదవనూవచ్చు. కట్టె కొట్టె తెచ్చె అనేలా విషయమేమిటో తెలుసుకోనూవచ్చు. కానీ విషయం ఏమిటి అని తెలుసుకోవడంలో అసలు విషయం మొత్తం రాదనేది రసజ్ఞులందరికీ తెలుసు. విందు భోజనం విందు భోజనమే, రుచి చూడటం రుచి చూడటమే! ఏది కావాలి అనేది మన మేధో కడుపును బట్టి నిర్ణయించుకోవడమే. కానీ ఓసారంటూ రుచి చూడటం కూడా విందు భోజనానికి ఉపక్రమించేలా చేస్తుందేమో! కాకపోతే ఆ రుచి ఆ విందుకు దీటుగా ఉండాలి.

పొంతన లేని వింత కథ!

కామెంట్



కరణ్ థాపర్

ఇటీవల పాక్ అధికారులు తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ (ఇమ్రాన్ ఖాన్ పార్టీ) సమాచార కార్యదర్శి, అధికార ప్రతినిధి అయిన రవూఫ్ హసన్‌ను అరెస్ట్ చేశారు. అతడిని నిర్బంధించి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ–మెయిల్స్‌ను, వాట్సాప్ మెసేజ్‌లను పరిశీలించారు. అనంతరం – ''ఈ మెసేజ్‌లను బట్టి పాక్ వ్యతిరేక ప్రచారాన్ని రాజేసేందుకు పి.టి.ఐ. (పాకిస్తాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్) ప్రతినిధి ఒక భారతీయ జర్నలిస్టుతో చేతులు కలిపినట్లు తెలుస్తోంది'' అని పాక్ ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఇకనేం, రవూఫ్ ఆ భారతీయ జర్నలిస్టుతో నెరిపిన ఏమాత్రం హానికరం కాని సాధారణ సందేశ సంభాషణలు మార్మికమైన రీతిలో పాకిస్తాన్ సార్వభౌమాధికారతకు, సమగ్రతకు, భవిష్యత్తుకు ముప్పుగా పరివర్తనం చెందాయి!

కొన్నిసార్లిది తలకిందుల పిచ్చి మాలోకంగా అయిపోగలదు. 'మ్యాడ్' మేగజీన్‌లోని ఒక కార్టూన్ నిజరూపం లోనికి రూపాంతరం చెందినట్లే ఈ ప్రపంచం ఉంటుంది. ప్రస్తుతం పక్కింట్లో అదే జరిగిందని అనిపిస్తోంది. అయితే ఏ విధంగానూ అది అందరికీ జరిగినట్లు కాదు. కచ్చితంగా జరిగిందైతే అక్కడి ప్రభుత్వానికి, భయానకమైన 'ఐఎస్ఐ'కి. నేను చెప్పవలసి ఉన్నది అతి వింతైన కథ కనుక చాలామందికి అది కనీసం కల్పనగా కూడా నమ్మదగనిది. అయినప్పటికీ, నన్ను నమ్మండి... అది నిజంగా జరిగింది.

పాకిస్తాన్‌లోని యూట్యూబర్‌లు, అక్కడి 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' వంటి వార్తా పత్రికలు, ఆ దేశపు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, ఆఖరికి స్వయానా ఆ శాఖ మంత్రి కూడా నన్ను పాకిస్తాన్ వ్యతిరేకినినీ, మోదీ ప్రభుత్వానికి సన్నిహితుడినినీ, 'రా' (రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్)తో చేతులు కలిపాననీ ప్రకటించటం జరిగింది. ఇప్పుడిది, చివరిసారి నేను చేసిన ఇంటర్వ్యూ నుంచి మధ్యలోనే లేచి బయటికి వెళ్లిపోయిన ప్రస్తుత ప్రధాన మంత్రికీ, దశాబ్దాలుగా నన్ను పాకిస్తాన్ పక్షపాతిగా నిందిస్తూ వస్తున్న విమర్శకులకూ నిస్సందేహంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే సరిహద్దు వెంబడి గస్తీ సైనికులు, వారి పౌర ప్రభుత్వాలు, నిఘా అధికారులకు ఇది... అవునా! నిజమా... అనిపించేలా ఉంటుంది.

ఇదెలా జరిగిందో వివరించటానికి నన్ను ప్రయత్నించనివ్వండి. కొన్ని వారాల క్రితం పాక్ అధికారులు తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ (ఇమ్రాన్ ఖాన్ పార్టీ) సమాచార కార్యదర్శి, అధికార ప్రతినిధి అయిన రవూఫ్ హసన్‌ను అరెస్ట్ చేశారు. అతడిపై దేశద్రోహ నేరం మోపాలన్న కృతనిశ్చయంతో నిర్బంధించి అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈమెయిల్స్‌ను, వాట్సాప్ మెసేజ్‌లను పరిశీలించారు. అక్కడ వారికి రవూఫ్ నాతో పంచుకున్న – 2022 నవంబర్ వెనకటి – మెసేజ్‌లు కొన్ని కనిపించాయి. ఆహా! ఇకనేం, భారతదేశంలోని వ్యక్తులతో అతడు మాట్లాడుతున్నాడన్న నిర్ధారణకు వారు వచ్చేశారు. అది అతడిని దేశ వ్యతిరేకిని చేసేసింది. ఇంకా దారుణం, ఇమ్రాన్‌తో పాక్ ఎలా వ్యవహరిస్తోందో రవూఫ్ తన మెసేజ్‌లలో వ్యాఖ్యానించటం, పాకిస్తాన్ రాజకీయాలపై చర్చించటం, చివరికి ఆర్మీ చీఫ్ గురించి కూడా మాట్లాడటం! ఇవన్నీ కూడా నిస్సందేహంగా పాక్ దృష్టిలో దేశ వ్యతిరేకమైనవే.



పాకిస్తాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ అధికార ప్రతినిధి రవూఫ్ హసన్

ఇప్పుడిది రూఢీ అవ్వాలంటే పాక్‌ని తీవ్రంగా వ్యతిరేకించే వ్యక్తిగా నన్ను చిత్రీకరించాలి. ఆ దేశంలోని ఎంతోమంది నియంతలు, ప్రధానులు నాకు తెలుసనీ, వారిని నేను ఇంటర్వ్యూ చేశాననీ, తరచు నేను ఆ దేశాన్ని సందర్శిస్తుంటాననీ; ఇస్లామాబాద్‌లో, లాహోర్‌లో, కరాచీలో నా సన్నిహిత మిత్రుల జాబితా పెద్ద చాంతాడంత ఉంటుందనీ గుర్తించటం వంటివేవీ పాక్ చిత్రీకరణ ఉద్దేశాన్ని నెరవేర్చేవి కావు. బేనజీర్ భుట్టో నాకు ఆప్త నేస్తం అనీ, నవాజ్ షరీఫ్ ఆఖరుగా 2014లో ఇండియా వచ్చినప్పుడు నన్ను కలుసుకోవాలని కోరారనీ, షెహబాజ్ షరీఫ్ పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన, నేను కలిసి పాకిస్తాన్ హై కమిషనర్ కార్యాలయంలో కూర్చొని స్నేహపూర్వకంగా లేదా, పిచ్చాపాటీగా కబుర్లు చెప్పుకున్నామనీ అంగీకరించటం కూడా పాక్ అనుమానాలను బలపరిచేందుకు ఉపయోగపడదు. అలా అంగీకరించటం అన్నది రవూఫ్‌కు వ్యతిరేకంగా నిర్మిస్తున్న కేసును కుప్పకూల్చి ఉండేది.

కాబట్టి తన అధికారిక ప్రకటనలో పాకిస్తాన్ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ: ''భారతదేశ జర్నలిస్టు కరణ్ థాపర్‌కు రవూఫ్ హసన్ జాగ్రత్త లేకుండా పంపిన మెసేజ్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. నిజానికి ఈ మెసేజ్‌లు కరణ్ థాపర్‌కు మద్దతుగా ఉన్న 'రా' అధికారులకు అమూల్యమైన సంపద వంటి సమాచారం అని రక్షణశాఖ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ మెసేజ్‌లను బట్టి పాక్ వ్యతిరేక ప్రచారాన్ని రాజేసేందుకు పి.టి.ఐ. (పాకిస్తాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్) ప్రతినిధి దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఒక భారతీయుడికి చేరవేస్తున్నట్లు బహిర్గతం అయిందని వారు తెలిపారు'' అని పేర్కొంది. పాక్ సమాచార, ప్రసార శాఖ మంత్రి అతావుల్లా తరార్, 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్'తో మాట్లాడుతూ... ''పాక్ వ్యతిరేక భావాలకు పేరుమోసిన ఒక భారతీయ జర్నలిస్టుతో హసన్‌కు ఉన్న సంబంధాలు స్వదేశం పట్ల పి.టి.ఐ. అవిధేయతను మరింతగా తేటతెల్లం చేస్తున్నాయి'' అని వ్యాఖ్యానించారు.

పర్యవసానంగా, రవూఫ్ నాతో నెరిపిన సంక్షిప్తమైన, చాలా అరుదైన, ఏమాత్రం హానికరం కానివైన మెసేజ్‌లు – నేను ఆయన్ని ఇంటర్వ్యూ చేశానన్న వాస్తవం కూడా – మార్మికమైన రీతిలో పాకిస్తాన్ సార్వభౌమాధికారతకు, సమగ్రతకు, భవిష్యత్తుకు ముప్పుగా పరి వర్తనం చెందాయి. నిస్సందేహంగా ఇది ఆయనపై విచారణ జరిపించేందుకు ఉపయోపడుతుంది. వారి దృష్టిలో అదే న్యాయం.

మా మధ్య సాగిన ఉద్దేశపూర్వకం కాని వాట్సాప్ మెసేజ్‌లు, ఇంటర్వ్యూ లాంటి మాటామంతీ, ఇంకా చెప్పాలంటే ఓ రెండు సంభాషణలు... వీటన్నిటినీ దాటి అసలు నిజం ఏమిటంటే రవూఫ్ నాకు తెలియదు. అతడికీ నేను తెలియదు. మేము ఒకరికొకరం అపరిచితులం. కాబట్టి ఇదెప్పటికీ మారదు.

వాస్తవానికి, వారు రవూఫ్ బాస్ అయిన ఇమ్రాన్ ఖాన్ నాతో మంతనాలు జరిపారని ఆరోపించినట్లయితే వారి కేసుకు మరింత బలం చేకూరి ఉండేది. ఇమ్రాన్‌ను నేను అనేకసార్లు ఇంటర్వ్యూ చేశాను. బని గలా (ఇస్లామాబాద్) లేదా ఢిల్లీలో మాత్రమే కాదు... ఒక సందర్భంలో నేను లండన్ వెళ్లి మరీ, అక్కడి రిచ్‌మండ్‌లో ఇమ్రాన్ మాజీ అత్తమామలు ఉండే భవనం లోపలి తోటల్లో ఆయన్ని ఇంటర్వ్యూ చేశాను. పాకిస్తాన్ చార్జిషీట్‌లో అది నేరంగా కనిపించటం లేదా? అంతకుమించిన నేరం, తనెప్పటికైనా ప్రధాని అయితే ఆర్మీ చీఫ్ తనకు లోబడి పని చేయవలసి ఉంటుందని కూడా ఇమ్రాన్ అనటం. నవ్వుతూ ఏమీ ఆయన ఆ మాట అనలేదు.

పాకిస్తాన్‌లోని నా ప్రియ స్నేహితుడు ఒకరు ఈ అస్థిమితం నుంచి నన్ను శాంతింపజేయటానికి ఇలా అన్నారు: ''అలీస్ ఇన్ ది వండర్‌ల్యాండ్'తో నీకు పరిచయం ఉంది. ఇప్పుడిక, మాలిస్ (దుష్టబుద్ధి) ఇన్ ది ఫౌజీలాండ్ (సైనికదేశం)కు స్వాగతం.''

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కరుణ ముఖ్యం



మీరు ఎలాగైనా సరే, మీ జీవితాన్ని ఒక దయాపూరిత భాగస్వామితో పంచుకునేట్టుగా చూసుకోండి. కొన్ని రోజులు వస్తాయి, అప్పుడు ప్రేమ అనేది సరిపోదు. కానీ దయామయుడు ఏ స్థితిలోనైనా దయగానే వ్యవహరిస్తాడు.

– సామ్యా శర్మ, కంటెంట్ క్రియేటర్

అప్పుడే ఓదార్చొచ్చు!



ప్రకోపక కన్నీళ్ల కంటే, భావోద్వేగ కన్నీళ్లల్లో అధిక ప్రొటీన్ గాఢత ఉంటుంది. కాబట్టి అవి ముఖం మీద నెమ్మదిగా జారుతాయి. దానివల్ల ఇతరులు చూసే అవకాశం ఎక్కువ. మనం లోతైన సామాజిక జీవులం. (మనుమల్లో అత్యంత అద్భుతమైన జీవక్రియ ఏదని నాస్తికుడు రిచర్డ్ డాకిన్స్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా)

– రాబిన్ స్టువార్ట్, ఓ రాతియుగపు జీవి

మంచి పెంపకం



భయాన్ని ప్రేమ జయిస్తుందనీ, క్షమ అనేది సాధ్యమే ననీ, ప్రతి ఒక్కరూ నా సోదర సోదరీమణులేననీ, మనం ఈ ఖండిత ప్రపంచాన్ని బాగుచేయడానికి వచ్చామనీ నమ్మేట్టుగా నన్ను పెంచారు.

– మిన్ జిన్ లీ, రచయిత్రి

మంచిదే కదా?



మీ మీద దాడి జరుగుతున్నదంటే మీరు లక్ష్యం కావాల్సి నంత ప్రాధాన్యత గల మనిషి అని సంకేతం. మీ పట్ల కనబడుతున్న ఆ ధ్యాసనూ, మిమ్మల్ని మీరు నిరూపించుకునే అవకాశాన్నీ ఆనందించాలి.

– రాబర్ట్ గ్రీనీ, రచయిత

కోల్పోయిన విశ్వాసం



ఇండియాలో ఇంక ఎంతమాత్రమూ ఉండలేమని అనుకునే యువజనాలు పెరుగుతున్నారు. అమెరికాకు వెళ్లడానికి కావాల్సిన సలహాల కోసం నన్ను చాలామంది అడుగుతుంటారు. పోలీసులు, ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ తరచుగా విఫలం అవుతున్నందున యువత ఈ దేశంలో విశ్వాసం కోల్పోతోంది.

– దేబర్ష్య దాస్, ఆంట్రప్రెన్యూర్

ఇవి కదా విజయాలు?



మిథ్యా సంబంధిత విషయాలు తమవని చెప్పుకోవడానికే భారతీయులు ఎందుకు ఎక్కువగా ఇష్టపడతారు? నిజమైన శాస్త్రీయ విజయాల పట్ల ఎందుకు తెలియనట్టు ఉంటారు? బుధ, శుక్ర గ్రహాలు 'ఇన్నర్ ప్లానెట్స్' అని నిరూపించిన మొదటి ఖగోళ శాస్త్రవేత్త ఒక భారతీయుడు. ప్లూటో గ్రహాన్ని ముందు అంచనావేసింది ఒక భారతీయుడు. ఎందుకు ఇలాంటి అద్భుతమైన వాస్తవాలను ఉత్సవం జరుపుకోం?

– జోసెఫ్ టి. నూనీ, థింకర్

విశ్వాసం



ఆత్మవిశ్వాసం అనేది ఇతరుల కంటే మెరుగ్గా ఉండటం కాదు; ఇతరులతో ఎంత మాత్రమూ మనల్ని పోల్చుకోనక్కర్లేదని తెలుసుకోవడం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇన్ బాక్స్

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా...

హైందవ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ఆవిర్భవించిన విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నేటికి 60 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ ఆరు దశాబ్దాల కాలంలో హిందూ జీవన విధానాన్ని విశ్వవ్యాప్తం చేయడం కోసం లెక్కకు మించి పోరాటాలు, ఆందోళనలు నిర్వహించి విజయం సాధించింది. ప్రధానంగా 'అయోధ్య శ్రీ రామ జన్మభూమి ఉద్యమం' చరిత్రాత్మకం. అనేక రాజకీయ ఒత్తిళ్లు తట్టుకొని హిందువులను సంఘటితం చేస్తోంది. నీతి, నిజాయితీతో జీవించాలని 'ధర్మో రక్షతి రక్షితః' అంటూ ముందుకు సాగుతోంది. ప్రపంచంలోని ప్రతి హిందువుకు అండగా ఉండేందుకు కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. హిందువులు దైవంగా భావించి పూజించే గోమాత రక్షణ విషయంలో వెన్నుచూపని ధర్మ పోరాటం సాగిస్తోంది. కులాలు, ప్రాంతాలు, ఆర్థిక, సామాజిక స్థితిగతులు ఆసరాగా చేసుకుని హిందువులను మతం మారుస్తున్న వారిని అడ్డుకుంటోంది. అలాగే తెలిసీ తెలియక మతం మారిన వారిని తిరిగి స్వధర్మంలోకి తీసుకువచ్చేందుకు 'సంస్కృతీ దీక్షా యజ్ఞం' (ఘర్ వాపసి) నిర్విరామంగా కొనసాగిస్తోంది. 'హిందు వులందరూ సహోదరులే. హిందుత్వంలో అంటరానితనానికి ఆస్కారం లేదు. హిందూ రక్షణే మా దీక్ష. అంటరానితన నిర్మూలనే మా లక్ష్యం' అంటూ సామాజిక సమరసతకు విశ్వహిందూ పరిషత్ పెద్దపీట వేస్తోంది.

1964 శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ద్వితీయ సర్ సంఘ్ చాలక్ మాధవ సదాశివ గోల్వాల్కర్ (గురూజీ) ముంబై సమీపంలోని సాందీపని ఆశ్రమంలో విశ్వ హిందూ పరిషత్‌కు పురుడు పోశారు. భారత్‌తో పాటు దాదాపు 60 దేశాల్లో విస్తరించిన వీహెచ్‌పీ తన ఆవిర్భావ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకుంటోంది. రాజకీయ కుట్రల కారణంగా ప్రతినిత్యం హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది ఈ సంస్థ. వేలాదిమంది కార్యకర్తలు జీవితాన్ని త్యాగం చేసి ధర్మకార్యంలో పూర్తి సమయం వెచ్చించి పనిచేస్తుండటం ఆదర్శనీయం.

– పగుడాకుల బాలస్వామి,
ప్రచార ప్రసార ప్రముఖ్, వీహెచ్‌పీ, తెలంగాణ రాష్ట్రం
(విశ్వ హిందూ పరిషత్‌కు నేటితో 60 ఏళ్లు)

మనిషిలోని చీకటి కోణాల ఆవిష్కర్త!



జి. వెంకటకృష్ణ

కాశీభట్ల వేణుగోపాల్ అనే పేరు తెలుగు సాహిత్యంలో సుపరిచితమే. ఆ పేరుతో పాటు అతను 'ఏవో మనో చీకటి కోణాల్ని గురించి రాస్తాడట' అని కూడా పరిచయమే. కాశీభట్లను ఏమీ చదవనివాళ్లు కూడా ఈ మాత్రపు ప్రాథమిక అవగాహనతో అతడి పట్ల ఒక కొండ గుర్తును ఏర్పరుచుకుంటారు. ఒక ప్రశస్త కుదింపునకు గురైన రచయితలలో కాశీభట్ల ముందుంటాడు.

కాశీభట్ల మొదటి నవల 'నేనూ–చీకటి' వచ్చినప్పుడు దానిలోని చైతన్య స్రవంతి శైలి వల్ల అతడిని హత్తుకున్నవాళ్లు కొందరైతే, బండకేసి బాదిన వాళ్లు కొల్లలు. ఎక్కువ మంది భాషాపాటవానికి అచ్చెరువొందారు. కాశీభట్లకు కవితాత్మకంగా వచనం రాయడం ఇష్టం. అది శేషేంద్ర ప్రభావం. కథా కథనాన్ని సంక్లిష్టమైన చైతన్య స్రవంతిలో రాయడం ఇష్టం. ఇదేమో జేమ్స్ జాయిస్ ప్రభావం. రెండవ నవల 'తపన'కు చాలా గుర్తింపు వచ్చింది కానీ మూడో నవల 'దిగంత తాత్వికంగా ఉన్న నవల. సార్త్రే అస్తిత్వవాద ధోరణి ఈ నవలంతా పరుచుకొని ఉంది.

నవలల్లో నైనా, కథల్లోనైనా కాశీభట్ల ఒకే దృష్టికోణంతో కథాకథనం చేస్తాడు. అది ప్రధాన పాత్ర మానసిక కోణం నుంచి జరుగుతుంది. కాబట్టి రచయిత ఆలోచనల్ని పాత్ర ఆలోచనలకు రంగరించడం సులభమయ్యింది. ఈ సందర్భంగానే చెప్పుకోవాల్సిన విష య మేమంటే... కాశీభట్ల సాహిత్యంలో స్త్రీ పాత్ర గొంతుకతో కథాకథనం జరగలేదు. స్త్రీలుంటారు గానీ స్త్రీల మానసిక కోణం ఉండదు. ఆయా పాత్రల ఒంటరి ఆలోచనలు (వాటినే రచయిత చీకటి ఆలోచనలు అంటాడు) కథకు ఉత్ప్రేరకాలు. సర్వసాధారణంగా బాహ్య ప్రపంచానికి అభ్యంతరకరంగా ఉండే ప్రవర్తనల్ని సృష్టించుకొని వాటి పర్యవసానాల ఆధారంగా కథను నడపడం కాశీభట్ల శైలి. పాత్ర ఆలోచనలో ఒకానొక మైక్రో సెకెనులో తలెత్తే ఆలోచనా శకలం, సభ్య సమాజ ఆలోచనకు అభ్యంతరకరంగా ఉంటుందనీ, అలా అభ్యంతరంగా ఉన్నప్పటికీ నెగెటివ్ ఆలోచనా శకలాలు పుట్టడమే సహజమనీ, వాటిని చూపించి మానవుడిని నగ్నంగా ఎత్తి చూపడమే తన సాహిత్య లక్ష్య మనీ గట్టిగా నమ్మాడు కాశీభట్ల. తన మొదటి నవల నుంచి చివరి నవల 'అసంగతం' దాకా దీన్ని చెప్పడానికే రాశానంటాడు.

ఒకే ఒక్క సత్యం 'మానవుడి మొదటి ఆలోచన దిగంబరమైనది' అంటాడు. అదే కాశీభట్ల ఉద్దేశ్యంలో 'చీకటి'. తన నవలలూ, కథలూ నిండా చీకటిని ఎన్ని రూపాల్లో చెప్పాడో ఎవరైనా పరిశోధన చేయెచ్చు. చీకటి ఒక ప్రలోభం. చీకటి ఒక కోరిక. చీకటి ఒక క్రియ. చీకటి ఒక ప్రయాణం. ఒక్కోసారి కాశీభట్ల సాహిత్యంలో చీకటే వెలుగు. చీకటిని గౌరవంగా తమోనమః అంటాడు. ఇక నేను అనే వాడు అన్ని సందర్భాల్లోనూ తన ప్రధాన పాత్ర. ఈ పాత్ర మనసు లోపలి దుర్మార్గ ఆలోచనల్ని, అభ్యంతరకరమైన యోచనల్నీ, అవి చర్యలుగా మారి, పాత్ర చుట్టూ ఉన్న సమాజంలోని చెడు, ప్రలోభం, దుర్మార్గం లాంటి చీకటులకు దోహదపడటాన్ని చిత్రిస్తాడు.

నివాళి



కాశీభట్ల వేణుగోపాల్

విపరీతంగా ప్రపంచ సాహిత్యాన్ని చదివాడు. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం, కన్నడ భాషల్లో పట్టు ఉండటం వల్ల... కథన భాష మణిప్రవాళం కావడం, తను రాసే వస్తువు పట్లా, అంశం మీదా గట్టి విషయ సేకరణా, తర్ఫీదు ఉండటంతో తను అనుకున్న వస్తువుతో ఆటలాడినంత సులభంగా రాస్తాడు. తన కేంద్రంగా రాస్తాడు. పాఠక కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించడు. కథాకథనంలో వాడే ప్రతీకలనో, అన్వయాలనో ఎవరైనా ప్రశ్నిస్తే, 'మీరు సోమరి పాఠకులు. నన్ను చదవకున్నా ఫర్వాలేదు' అంటాడు. అయితే ఈ కఠిన శైలి 'కాలం కథల'లోనూ ఇటీవల రాసిన 'చీకటి గలు', 'అసత్యానికి ఆవల', 'అసంగతం' నవలల్లో కొంత సరళమవడం చూడొచ్చు.


కాశీభట్లను తాత్వికంగా చూసినప్పుడు నిరీశ్వర వాది. సొంత జీవితంలో తన బ్రాహ్మణత్వాన్ని తెంచి అవతలకి విసిరి వేసి డీ కాస్ట్ అయినవాడు. తొలి రోజుల్లో నక్సలైట్ భావాల పట్ల కూడా ఆసక్తి చూపినవాడు. ఇదంతా తన పాత్రల రూపంలో రికార్డు అయ్యే వుంది. ఒక ఇంటర్వ్యూలో కాశీభట్ల నిహిలిస్టును అన్నాడు. ప్రతి దాన్నీ అనుమానిస్తానన్నాడు. రేషనాలిటీ ఏదో మేరకు తన ఆలోచనల్లో భాగమైన రచయిత. తెలుగులో సీరియస్ సాహిత్యంతో మనసా కర్మణా నిజాయితీగా నిలబడ్డాడని చెప్పగలం. తనదైన సాహిత్య శైలి అపూర్వం అని అనవచ్చుగానీ అదే సమ యంలో త్రిపురనీ, వడ్డెర చండీదాస్‌నూ అతని ముందువారని గుర్తించకుండానూ ఉండలేం.

వ్యాసకర్త కవి, విమర్శకులు

(రచయిత కాశీభట్ల వేణుగోపాల్ ఆగస్టు 19న తుదిశ్వాస విడిచారు)

సామాన్యుల ముఖ్యమంత్రి!

సందర్భం




డా॥ యలమంచిలి శివాజీ

1988 మార్చిలో రాజ్యసభకు ఎన్నికయ్యాను. అప్పటికి ఒక మాసం ముందు త్రిపుర శాసన సభకు జరిగిన ఎన్నికలలో, అప్పటికి పదేళ్ళుగా అధికారంలో ఉన్న నృపేన్ చక్రవర్తిని ఓడించి, కాంగ్రెస్‌కు చెందిన సుధీర్ రంజన్ మజుందార్ ప్రభుత్వం కొలువు తీరింది. ప్రతిపక్షాలకు చెందిన కార్యకర్తలపై దాడులు, వారి ఆస్తులను ధ్వంసం చేయడం, ఇళ్ళను తగులబెట్టడం వంటి దుర్మార్గాలు చోటు చేసుకున్నాయి. పార్లమెంట్ నుండి ఒక అఖిలపక్షం ఆ రాష్ట్రంలో పర్యటించి, వారికి ధైర్యం చెప్పి, సాంత్వన కల్పించాలని మా సభలో మా సహచరులు దిపేన్ ఘోష్, సుకుమార్ సేన్, సురేన్ భట్టాచారి, గురుదాస్ దాస్ గుప్తా కోరారు. తెలుగు దేశం నుండి శివాజీ రావాలని కోరారు. సరేనన్నాను.

శుక్రవారం సాయంత్రం రాజ్యసభ సమావేశాలు ముగిసినాక, సాయంత్రం బయలుదేరి కలకత్తా చేరుకొన్నాం. విమానాశ్రయంలో బెంగాల్‌కు చెందిన మార్క్సిస్టు పార్టీ నాయకులు మాకు స్వాగతం పలికి, విమానాశ్రయంలోని విశ్రాంతి గదులలో ఏర్పాటు చేసిన బసలో మమ్మల్ని దించారు. అదే సమయంలో ఢిల్లీ వెళ్ళడానికి విమానాశ్రయానికి వచ్చిన బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసుకు మమ్ములను పరిచయం చేసి, కాసేపు ముచ్చటించే ఏర్పాటు చేశారు. మరురోజు ఉదయం అగర్తలాకు విమానంలో వెళ్లాము. మాతోపాటు బెంగాల్ మంత్రులు కూడా మూడు రోజులు పర్యటించారు. ఒక నివేదిక తయారు చేశాం. అదంతా రాజ్యసభలో ప్రస్తావించాం. ఆ కథ అంతటితో ముగిసింది.

తరువాత పుష్కర కాలం గడిచినాక 2000 నవంబరులో జ్యోతిబసు తరువాత బుద్ధదేవ్ ముఖ్యమంత్రిగా – పదకొండు సంవత్సరాలు ఆదర్శవంతమైన, విశుద్ధ పరిపాలన అందించారు. మాతో సామాన్య కార్యకర్త మాదిరి సిగరెట్లు కాలుస్తూ, చేతిలో ఆంగ్ల నవల పట్టుకొని సంచరించిన బుద్ధదేవ్, ముఖ్యమంత్రిగా అధికార నివాసానికి మారకుండా, తానుండే సాదా–సీదా రెండు పడక గదుల ఆపార్టుమెంటులోనే కొనసాగారు. సాయంత్రం 5 గంటల కల్లా రైటర్స్ భవన్ నుండి బయటకొచ్చి, తోవలో పార్టీ కార్యాలయంలో కాసేపుండేవారు. ఇంటికొచ్చి పచ్చి వక్కను కత్తిరించుకొని నములుతూ, ఇంగ్లిష్ నవలను ఆస్వాదిస్తూ, టుంగుటుయ్యాలలో కూర్చుని సేదదీరేవారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా కూడా వారి శ్రీమతి ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ట్రాం మీద ప్రయాణం చేసేవారు. ప్రతిరోజూ ఇంటివద్ద ఎవరినీ, సందర్శకులకు అనుమతించేది లేదు. ఎవరైనా ఆఫీసులో కలుసుకోవాల్సిందే.



బుద్ధదేవ్ భట్టాచార్య

ఆగస్టు 8న మరణించిన బుద్ధదేవ్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ, కొత్తగా రాజకీయాలలోకి అడుగు పెడుతున్న యువతరం వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.8.38 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** కృత్తిక రా.9.14 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** ఉ.9.54 నుండి 11.22 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.28 నుండి 1.16 వరకు తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** రా.7.10 నుండి 8.42 వరకు, శ్రీ కృష్ణాష్టమి; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.17.

క్లుప్తంగా...

నకిలీ జీవోపై జీఏడీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఇటీవల చిక్కిన రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం.వి.భూపాల్ రెడ్డి కేసును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జీవో 1109 పేరిట చక్కర్లు కొడుతున్న పత్రం నకిలీదని సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) స్పష్టం చేసింది. ఈ నకిలీ జీవోపై జీఏడీ అధికారులు సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయగా.. క్రైమ్ నంబర్ 324/24 నంబర్‌తో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. నకిలీ జీవో విడుదల చేసిన వారిని త్వరలోనే గుర్తించి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

అప్పుల బాధతో నేతకార్మికుడు ఆత్మహత్య

- గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతి


సదానందం(ఫైల్)

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్లలో అప్పుల బాధతో నేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కేసీఆర్‌నగర్‌కు చెందిన గోవింద్ సదానందం(38) సిరిసిల్లలో నేతకార్మికుడిగా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం తుంటి ఆపరేషన్ చేయించుకోగా రూ.3 లక్షల అప్పు అయ్యింది. సాంచాలు బంద్ కావడం, అప్పు తీర్చేందుకు సిరిసిల్ల మార్కెట్‌లో కూరగాయలు విక్రయించేవాడు. అయినా ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన సదానందం శనివారం గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ్నుంచి కరీంనగర్ తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య భాగ్యశ్రీ, కుమారుడు సాయి, కూతురు స్వాతి ఉన్నారు.

విద్యుత్ స్తంభం విరిగిపడి.. బాలుడి దుర్మరణం

- జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో ఘటన


మహేశ్ (ఫైల్)

జోగుళాంబ శక్తిపీఠం: ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం విరిగి ఐదేళ్ల బాలుడిపై పడటంతో దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాద సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. అలంపూర్ పట్టణంలోని ఒక ఇంట్లో శుభకార్యం ఉండగా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా, ఇంటికి అడ్డంగా ఉండటంతో గోపాల్ అనే వ్యక్తి చెట్టును తొలగించేందుకు విద్యుత్ శాఖకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ సిబ్బంది చెట్టును కొట్టేసిన సమయంలో ఓ కొమ్మ విద్యుత్ వైర్లపై పడింది. దీంతో అప్పటికే బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభం విరిగి నేలకూలింది. ఆ సమయంలో అక్కడే ఆడుకుంటున్న బాలుడు మహేశ్ (5)పై స్తంభం పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. చిన్నమద్దిలేటి, మానస దంపతులకు ఇద్దరు పిల్లలు కాగా కుమారుడు మహేశ్, కూతురు మహితి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. సమాచారం అందుకున్న ఏబీసీపీ రాష్ట్ర కార్యదర్శి సంపత్‌కుమార్ విద్యుత్ శాఖ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

అమెరికాలో సూర్యాపేట జిల్లావాసి మృతి

- స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి దుర్మరణం


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్): అమెరికాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన తప్సి ప్రవీణ్‌కుమార్ (39) ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతిచెందాడు. భారత కాలమాన ప్రకారం శనివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో ప్రవీణ్‌కుమార్ వారి ఇంటి సమీపంలోని స్విమ్మింగ్ పూల్ వద్ద కాలక్షేపం కోసం వెళ్లి అందులో పడి మృతి చెందినట్లు అతడి భార్య శాంతి ఆదివారం ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలిపారు. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన నాగయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. మృతుడు ప్రవీణ్ చిన్న కుమారుడు. ఎమ్మెస్సీ చేసిన ప్రవీణ్ హైదరాబాద్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తిలో మంచి నైపుణ్యం ఉన్న ప్రవీణ్ ఆస్ట్రేలియా ఇతర దేశాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఐదేళ్ల క్రితం మిత్రులతో కలిసి అమెరికాకు వెళ్లిన ప్రవీణ్‌కుమార్ అట్లాంటా ప్రాంతంలో పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రవీణ్‌కుమార్ మృతితో పాతర్లపహాడ్ గ్రామంలో విషాదం నెలకొంది.

3 నదులపై వంతెనలు

రీజనల్ రింగురోడ్డు ఉత్తర భాగంలో ఖరారు

- మూసీ నదిపై వలిగొండ సమీపంలోని పొద్దుటూరు వద్ద కి.మీ. నిడివితో నిర్మాణం
- మంజీరా నదిపై శివంపేట వద్ద.. హరిద్రా నదిపై తూప్రాన్ వద్ద నిర్మాణం
- ప్రస్తుతానికి నాలుగు లేన్లకు సరిపడా తొలి భాగం నిర్మాణం
- భవిష్యత్తులో వాటి పక్కనే రెండో భాగానికి ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో మూడు నదులపై వంతెనలను ఖరారు చేశారు. దక్షిణ భాగం రోడ్డును సొంతంగానే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే యోచనలో ఉండటంతో ఉత్తర భాగాన్ని పట్టాలెక్కించే పనిలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) తలమునకలై ఉంది. భూసేకరణ ప్రక్రియలో కీలక అంకమైన అవార్డులను పాస్ చేసే ప్రక్రియకు సిద్ధమవుతోంది. ఆ తర్వాత టెండర్ నోటిఫికేషన్ ఇవ్వబోతోంది. ఆపై మరో 5–6 నెలల్లో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో రోడ్డు డిజైన్ సహా ఇంటర్‌చేంజ్ వంతెలు, నదీ వంతెనలు, అండర్‌పాస్‌లు తదితర స్ట్రక్చర్ డిజైన్లు సిద్ధం చేసుకుంది. ఉత్తర భాగంలో మూడు చోట్ల రీజనల్ రింగురోడ్డు నదులను క్రాస్ చేస్తుంది. ఆ మూడు ప్రాంతాల్లో వంతెనలు నిర్మించనుంది. మూసీ నదిపై వలిగొండ మండలం పొద్దుటూరు గ్రామ సమీపంలో, మంజీరా నదిపై పుల్కల్ మండలం శివంపేట గ్రామ సమీపంలో, హరిద్రా నది (హల్దీ నది/హల్దీ వాగు) తూప్రాన్ దగ్గర ఈ వంతెనలను నిర్మించనున్నారు.

మూసీపై కిలోమీటర్ పొడవుతో..

మూడు నదులపై నిర్మించే వంతెనల్లో మూసీ నదిపై దాదాపు కిలోమీటరు పొడవుతో వంతెన నిర్మాణం కానుంది. నల్లగొండ–భువనగిరి రోడ్డులో భాగంగా ఇప్పటికే వలిగొండ వద్ద వంతెన ఉండగా ఇప్పుడు వలిగొండ మండలం పొద్దుటూరు గ్రామ శివారులో ఈ వాగును రీజనల్ రింగురోడ్డు క్రాస్ చేయనుంది. అక్కడ కిలోమీటరు పొడవుతో వంతెనకు ఎన్‌హెచ్ఏఐ సిద్ధమవుతోంది. దీనికి దాదాపు రూ. 100 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

నాందేడ్ జాతీయ రహదారికి సమాంతరంగా..

మెదక్–సంగారెడ్డి రోడ్డు 161వ నంబర్ నాందేడ్–హైదరాబాద్ జాతీయ రహదారిలో కలిసిన ప్రాంతంలో మంజీరా నదిపై వంతెన నిర్మించనున్నారు. పుల్కల్ మండలం శివంపేట గ్రామ సమీపంలో మంజీరా నదిని రీజనల్ రింగు రోడ్డు క్రాస్ చేయనుంది. దీంతో అక్కడ దాదాపు 600 మీటర్ల పొడవైన వంతెన నిర్మించనున్నారు. దీనికి దాదాపు రూ. 75 కోట్లు ఖర్చవుతుందని భావిస్తున్నారు.

తూప్రాన్ సమీపంలో..

గజ్వేల్ మీదుగా ప్రవహిస్తూ మంజీరా నదిలో కలిసే హరిద్రా నదిపై తూప్రాన్ వద్ద మూడో వంతెనకు ఎన్‌హెచ్ఏఐ సిద్ధమవుతోంది. 44వ నంబర్ జాతీయ రహదారిపై ఇప్పటికే అక్కడ ఓ వంతెన ఉంది. దానికి దాదాపు చేరువలో తూప్రాన్ వద్ద మరో వంతెన రానుంది.

తొలుత నాలుగు వరసలకే..

రీజనల్ రింగు రోడ్డును 8 వరుసలతో నిర్మించేలా ప్రణాళిక రచించినా తొలుత నాలుగు లేన్లకే పరిమితమవుతున్నారు. మిగతా నాలుగు లేన్లను భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తగు సమయంలో నిర్మించనున్నారు. అయితే ఆ నాలుగు వరుసలకు సరిపడా భూమిని సైతం సేకరించి చదును చేసి వదిలేయనున్నారు. మిగతా నాలుగు లేన్లను మాత్రం ఇప్పుడు నిర్మించనున్నారు. ఈ కారిడార్‌లో భాగంగానే వంతెనలు ఉంటున్నందున వాటిని కూడా ఎనిమిది వరుసలకు సరిపడేలా నిర్మించాల్సి ఉంటుంది. ఇప్పుడు ప్రధాన క్యారేజ్ వేను నాలుగు లేన్లకు పరిమితం చేసినందున వంతెనలను కూడా నాలుగు లేన్లకే సరిపడేలా నిర్మించనున్నారు. ఇప్పుడు నిర్మించే వంతెనల పక్కనే తదుపరి నాలుగు వరుసల వంతెనలు నిర్మించాల్సి ఉంటుంది. పక్కపక్కనే నిర్మించేప్పుడు పాత వంతెనల పిల్లర్లకు ఇబ్బంది ఏర్పడే ప్రమాదం పొంచి ఉంటుంది. అలాంటి ప్రమాదం లేకుండా ఫౌండేషన్‌లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిసింది. ఇందుకోసం వాటికి ప్రత్యేక డిజైన్‌ను అనుసరించనున్నారు.

విభేదాలే రాధ ప్రాణాలు తీశాయా!

- ఓ నేతపై అగ్ర నాయకత్వానికి రాసిన లేఖతో ఘర్షణ
- లొంగుబాటలో.. మావోయిస్టు ముఖ్యనేతలు



సాక్షి, హైదరాబాద్ : ఇన్‌ఫార్మర్ అన్న ముద్రతో హత్యకు గురైన పల్లెపాటి రాధ అలియాస్ నీల్సో ఉదంతం ఇప్పుడు మాజీలు..ప్రస్తుత మావోయిస్టుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. 2017 డిసెంబర్ నెలలో ఉద్యోగం వచ్చిందని రాధ తన తల్లిదండ్రులకు సమాచారమిచ్చి చైతన్య మహిళా సంఘం సభ్యులతో కలిసి విశాఖపట్నం వెళ్లింది. అక్కడ నుంచి ఏవోబీ బోర్డర్ మీదుగా దళంలో చేరింది. అక్కడే ఆమె పేరును నీల్సోగా మార్చారు. సాంకేతిక విద్యావంతురాలు కావడంతో ఆమెను తొలుత సిగ్నల్ ఆపరేటర్‌గా నియమించి ఒక సెల్‌ఫోన్ ఇచ్చారు. అడవి నుంచి జనావాస ప్రాంతాలకు వచ్చి.. నేతలు చెప్పిన వారికి సమాచారం (ఫొటోలు, వీడియోలు, టెక్స్) చేరవేసి, ఫోన్ స్విచాఫ్ చేసి, సిమ్‌కార్డు తీసేసి తిరిగి అడవిలోకి వెళ్లిపోయేది. అప్పటికే అడవిలో ఉన్న అగ్రనేతలకు అనేక అనారోగ్య సమస్యలు ఉన్నాయి. వారందరూ షుగర్, బీపీ, గుండె ఇతర వ్యాధులతో బాధపడుతున్నారు. వారికి కావాల్సిన మెడికల్ ఎక్విప్‌మెంట్, పరీక్షలు, మందులు, చికిత్స మొత్తం రాధ అలియాస్ నీల్సోనే చూసుకునేది. అలా నీల్సో అనతికాలంలో అగ్ర నాయకత్వానికి దగ్గర అయ్యింది. అందుకే ఆమె సెంట్రల్ కమిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండర్‌గా ఎదిగింది. ఆమెను లేడీ చేగువేరాగా పిలిచేవారు.

కరోనా సమయంలో వైద్యసేవలు

కరోనా ఫస్ట్ వేవ్‌లో మావోయిస్టులకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. కానీ..సెకండ్ వేవ్‌లో చాలామంది అగ్రనేతలు వరుసగా మరణించడం మొదలైంది. మందుల కోసం బయటకు వచ్చే కొరియర్లపై పోలీసు నిఘా తీవ్రమైంది. ఆ సమయంలో నీల్సోనే చాలా మంది దళ సభ్యులకు చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడింది. అయితే కరోనా తగ్గుముఖం పట్టాక.. ఓ అగ్రనేతతో నీల్సోకు విభేదాలు మొదలై.. తారస్థాయికి చేరుకున్నాయి. ఒక దశలో నీల్సో దళం వదిలి ఇంటికి వద్దామనుకుంది. కానీ, సదరు నేత తీరు, సిద్ధాంతాలు ఉల్లంఘిస్తున్న వైనాన్ని వివరిస్తూ.. మూడునెలల క్రితం అగ్ర నాయకత్వానికి లేఖ రాసింది. ఈ లేఖ పార్టీలో తీవ్ర అలజడి రేపగా, దీనిపై నిజనిర్ధారణ చేయాలంటూ ఓ కీలకనేతకు బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో దళానికి వరుస ఎదురుదెబ్బలు మొదలయ్యాయి. నీల్సోతో ఘర్షణ పడిన నేత నిజ నిర్ధారణకు వచ్చిన నేతకు రాధ ఇన్‌ఫార్మర్ అంటూ ఫిర్యాదు చేశాడు. అసలే పోలీసుల నుంచి వరుస ఎదురుదెబ్బలు తాకుతున్న క్రమంలో అతని మాటలను అగ్రనేత సైతం విశ్వసించాడు. చివరికి నీల్సోకు మరణశిక్ష విధించారు.

లొంగుబాటులో మావోలు

రాధ హత్య దళంలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాము రాధ వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందన్న భయంతో ప్రస్తుతం దళంలోని కొందరు సభ్యులు తెలంగాణ పోలీసులను సంప్రదించినట్టు సమాచారం. వీరిలో ఇద్దరు సెంట్రల్ కమిటీ మెంబర్లు కొద్ది రోజుల్లో సరెండర్ అవుతామంటూ సంకేతాలిచ్చినట్టు చెబుతున్నారు. కరోనాకు ముందు మావోయిస్టులు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానికల్ డిప్లొమా చదువుకున్న గిరిజన యువతను భారీగా రిక్రూట్ చేసుకున్నారు. ఐఈడీల తయారీ కోసమేనని అప్పుడే తెలంగాణ పోలీసులు అనుమానించారు. వెళ్లిన వారిలో చాలామంది అక్కడ ఉండలేకపోయారు. మెజారిటీ యువకులు అప్పటి కొత్తగూడెం ఎస్పీ ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే.

కాళేశ్వరం వద్ద పెరిగిన గోదావరి నీటిమట్టం


కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద పెరిగిన గోదావరి నీటిమట్టం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా గడ్చిరోలి జిల్లా మీదుగా తరలివస్తున్న ప్రాణహిత నది వరదతో మళ్లీ ప్రవాహం పెరిగింది. దీంతో కాళేశ్వరం వద్ద నీటిమట్టం ఆదివారం 7.570 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నది. ఈ వరద దిగువన మేడిగడ్డ బరాజ్‌కి చేరుతోంది. ఇన్‌ఫ్లో 2.21 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

యాదాద్రిలో కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ చైర్మన్ పూజలు


జస్టిస్ పినాకి చంద్రఘోష్‌కు స్వామి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జస్టిస్ పినాకి చంద్రఘోష్‌కు స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠాలంకార మూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న అనంతరం వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ భాస్కర్‌రావు శ్రీస్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

రైతుకు ‘భరోసా’ కరువు!

▶ మొదటి పేజీ తరువాయి

హామీ ఇచ్చింది. ఆ ప్రకారం రెండు సీజన్లకు కలిపి రూ.15 వేలు ఇస్తామని చెప్పింది. ఈ వానాకాలం సీజన్ నుంచే అమలు చేస్తామని పేర్కొంది. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు నిబంధనలు పునఃసమీక్ష తర్వాత అర్హులకు రైతుభరోసా ఇస్తామని ప్రకటించింది. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం కింద అసలు రైతుల కన్నా ధనికులు, అనర్హులే ఎక్కువ లబ్ధి పొందారనేది కొత్త సర్కారు ఉద్దేశం. గతంలో సాగులో లేని భూములకు కూడా రైతుబంధు వర్తింపచేసి 12 విడతల్లో దాదాపు రూ. 25,670 కోట్ల ప్రజాధనం వృథా చేశారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పునఃసమీక్ష అనంతరం ఈ వానాకాలం సీజన్ నుంచి కొత్త మార్గదర్శకాల ప్రకారం రైతు భరోసా పథకం అమల్లోకి తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటివరకు ఈ విషయంలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో రైతులు దిక్కులు చూస్తున్నారు.

ఐదెకరాలా? పదెకరాలా?

ప్రభుత్వం ముఖ్యంగా రైతుభరోసాకు సీలింగ్ విధించాలన్న ఆలోచనలో ఉందని అంటున్నారు. అందరికీ కాకుండా ఐదు లేదా పదెకరాలకు దీనిని పరిమితం చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా గత యాసంగి సీజన్‌లో మొత్తం 1.52 కోట్ల ఎకరాలకు చెందిన 68.99 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్లు అందజేశారు. అందులో ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 62.34 లక్షల మంది కాగా, వారి చేతిలో కోటి ఎకరాల భూమి ఉంది. అంటే మొత్తం రైతుబంధు అందుకున్నవారిలో ఐదెకరాలలోపు రైతులే 90.36 శాతం ఉండటం గమనార్హం. కాగా ఐదెకరాలకు పరిమితం చేస్తే 90 శాతం మందికి రైతుభరోసా ఇచ్చినట్లు అవుతుందనేది ప్రభుత్వ ఉద్దేశంగా చెబుతున్నారు. ఇక ఎకరాలోపున్న రైతులు 22.55 లక్షల మంది, ఎకరా నుంచి రెండెకరాల వరకున్న రైతులు 16.98 లక్షల మంది, రెండెకరాల నుంచి మూడెకరాల లోపున్న వారు 10.89 లక్షల మంది, మూడెకరాల నుంచి నాలుగెకరాల లోపున్న వారు 6.64 లక్షల మంది, నాలుగెకరాల నుంచి ఐదెకరాల లోపున్న రైతులు 5.26 లక్షల మంది ఉన్నారు. ఇక 5 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల సంఖ్య 5.72 లక్షల మంది ఉండగా వారి చేతిలో 31.04 లక్షల ఎకరాల భూమి ఉంది. పదెకరాల వరకు ఇస్తే, రైతు భరోసాకు వీరు కూడా తోడవుతారు.

బలవంతంగా సిజేరియన్.. శిశువు మృతి

- నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం
- కాన్పు కోసం వచ్చిన మహిళను పట్టించుకోని వైద్యులు
- దాంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లేందుకు యత్నించిన గర్భిణి
- అడ్డుకున్న వైద్యులు, సిబ్బంది.. బలవంతపు సిజేరియన్


చికిత్స పొందుతున్న శ్రీలత

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు రోజుల క్రితం కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణి కుర్చీలోనే ప్రసవించిన ఘటన మరువక ముందే శనివారం రాత్రి వైద్యుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శంగా మరో ఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి వర్గాలు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గ్యారకుంట్లపాలెం గ్రామానికి చెందిన చెరుకుపల్లి నాగరాజు భార్య శ్రీలత మూడో కాన్పు కోసం ఈ నెల 21న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. పరీక్షించిన వైద్యులు ప్రసవానికి సమయం పడుతుందని వేచిచూడాలని సలహా ఇచ్చారు. ఇటీవల ఆసుపత్రిలో కుర్చీలోనే ప్రసవించిన ఘటనపై స్పందించిన కలెక్టర్ బాధ్యులైన డాక్టర్‌తో పాటు అయిదుగురు నర్సింగ్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీన్ని నిరసిస్తూ శనివారం గైనిక్ వార్డులోని వైద్యులంతా మూకుమ్మడిగా సెలవులు పెడుతున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తికి నోటీసులు అందజేసి విధులు బహిష్కరించారు. దీంతో గైనిక్ వార్డులో వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

ముందు బాబు బాగున్నాడని చెప్పి..

శనివారం సాయంత్రం వరకు నర్సులు మినహా డాక్టర్లు లేకపోవడంతో విసిగి వేసారిన గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రులకు బయల్దేరారు. ఈక్రమంలోనే శ్రీలతను భర్త నాగరాజు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఆటోలో ఎక్కిస్తుండగా ఆసుపత్రి సెక్యూరిటీ, సిబ్బంది అడ్డుకుని బలవంతంగా కాన్పుల వార్డుకు తరలించారు. మీరు బయటకు వెళ్లిపోతే మా ఉద్యోగాలు పోతాయంటూ బతిమిలాడి లోపలకు తీసుకు పోయి సేవలందిస్తామని సూచించారు. రాత్రి 9.30 సమయంలో శ్రీలతకు వైద్యులు సిజేరియన్ ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. అయితే అప్పటికే పుట్టిన బాబు మృతి చెందినట్లు తెలిసింది. అయితే ముందుగా బాబు బాగున్నాడని వైద్యులు చెప్పారని, ఆ తరువాత చనిపోయినట్లు చెప్పారని బంధువులు పేర్కొన్నారు. డాక్టర్ల నిర్వాకంపై బంధువులు అర్ధరాత్రి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. బాబు శరీరంపై గాయాలు ఉన్నాయని, వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాబు మరణించాడని ఆరోపించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన విరమించి కేసు పెట్టాలని సూచించడంతో నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తిని వివరణ కోరగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారని, జిల్లా కలెక్టర్‌కు జరిగిన ఘటనపై వివరించామని తెలిపారు.

బీసీలు ఏకమై బహుజనుల రాజ్యం సాధించాలి

- హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట (హైదరాబాద్): అగ్రకుల ప్రభుత్వాలు ఉన్నంతవరకు బీసీలను ఎదగనివ్వరని, రాబోయే మూడు సంవత్సరాలు బీసీలంతా ఐక్యమై బహుజనుల రాజ్యం సాధించాలని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బహుజనుల రాజ్యం రావాలని, మనం ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఓబీసీ రిజర్వేషన్ ప్రదాత బీపీ మండల్ 106వ జయంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, తాను కూడా డిగ్రీ పూర్తయ్యాక న్యాయవాదిని అవుతాను అంటే తన గ్రామంలోని ఉన్నతవర్గానికి చెందిన వారు తనను చూసి నవ్వారని, జిల్లా న్యాయమూర్తి అయినప్పుడు, హైకోర్టు న్యాయమూర్తి అయినప్పుడు ఆర్డర్ కాపీ ఇచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా అడ్డుపడ్డారని గుర్తుచేసుకున్నారు. ప్రొఫెసర్ ఐ.తిరుమలి, డాక్టర్ పృథ్వీరాజ్, దేవళ్ల సమ్మయ్యలు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేందుకు ఎంతో మంది బీసీలం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్‌కు ఓటువేయించామని, కానీ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కనీసం జస్టిస్ చంద్రకుమార్ లాంటి వ్యక్తులను కూడా పిలిచి పదినిమిషాలు మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా చేసిన శ్రీనివాస్‌గౌడ్ లాంటివారు అధికారం పోయాక బీసీలగూర్చి మాట్లాడుతున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించినప్పుడు కేసీఆర్‌ను, కేటీఆర్‌ను ప్రశ్నించాలన్న ఆలోచన కూడా వారికి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రతినిధులు దుర్గం రవీందర్, కొట్టె సతీశ్, భద్రయ్య, దానకర్ణచారి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసలై అమ్మలనే చంపేశారు

- రాడ్డుతో తలపై బాది.. ఆపై గొంతుకోసి ఒకరు
- కూరగాయల కత్తితో గొంతుకోసి మరొకరు
- మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో ఘటనలు


వెంకటమ్మ (ఫైల్)


రోదిస్తున్న పద్మ

గండేడ్/ మహమ్మదాబాద్/త్రిపురారం: మద్యానికి బానిసలై కన్న తల్లులనే కడతేర్చారు ఆ కుమారులు. మద్యానికి డబ్బులు ఇవ్వడం లేదన్న కోపంతో ఒకరు, తనకు విడాకులిచ్చిన యువతి మళ్లీ పెళ్లి చేసుకుంటే కుటుంబ సభ్యులు ఆ వేడుకకు వెళ్లారన్న కక్షతో మరో వ్యక్తి మద్యం మత్తులో విచక్షణ మరచి.. జన్మనిచ్చిన అమ్మలనే చంపుకున్నారు.

రాడ్డుతో తలపై కొట్టి, కత్తితో గొంతుకోసి..

మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం సల్కర్‌పేట్‌కు చెందిన వెంకటమ్మ(55), కోయిల్‌కొండ మండలం కొత్లాబాద్‌కు చెందిన టంకర రాములు పెళ్లయిన తర్వాత ముంబైకి వలస వెళ్లారు. ఈ క్రమంలో కొంతకాలం తర్వాత రాములు మృతిచెందాడు. దీంతో ఆమె కుమారుడు కృష్ణయ్యతో కలసి అక్కడే ఉంటూ మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగించేది. రెండేళ్ల క్రితం అక్కడ ఇంటిని అమ్ముకుని పుట్టినిల్లయిన సల్కర్‌పేట్‌కు చేరుకుంది. అయితే ఆమె కుమారుడు కృష్ణయ్య మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బుల కోసం తల్లిని వేధించడంతోపాటు ఇల్లు అమ్మిన డబ్బులు ఎక్కడ పెట్టావని నిత్యం వేధించేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో కోపంతో కృష్ణయ్య ఇనుపరాడ్డుతో వెంకటమ్మ తలపై కొట్టాడు. అంతటితో ఆగక కత్తి తీసుకొని గొంతుకోయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తర్వాత మృతదేహాన్ని తీసుకెళ్లి ఇంటి కొద్దిదూరంలో పడేశాడు. ఆదివారం తెల్లవారుజామున తన మేనమామ రాములుకు ఫోన్ చేసి అమ్మ చనిపోయిందని, ఎవరో చంపేశారని చెప్పాడు. దీంతో రాములు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహం పడేసిన ప్రదేశం నుంచి కొద్ది దూరం వరకు గడ్డిపై రక్తం పడి ఉండడంతో, అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూశారు. ఇల్లు కడిగి ఉండడంతో అనుమానం వచ్చి కృష్ణయ్యను గట్టిగా నిలదీయగా డబ్బుల కోసం తానే తల్లిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.

తల్లిని గొంతుకోసి చంపి, కొడుకు ఆత్మహత్య

నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రానికి చెందిన రావిరాల చినవీరయ్య, సాయమ్మ భార్యాభర్తలు. వీరికి శ్రీను, శివకుమార్ అనే కుమారులు, పద్మ అనే కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు శివకుమార్ తల్లిదండ్రుల వద్దే ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా, శివకుమార్‌కు అక్క పద్మ కుమార్తె మేఘనతో వివాహం జరిగింది. మద్యానికి బానిసైన శివకుమార్ తరచూ భార్యతో గొడవ పడుతుండడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఇటీవల వీరు విడాకులు తీసుకున్నారు. కాగా, మేఘనకు శనివారం హైదరాబాద్‌లో రెండో వివాహం జరిపించారు. ఈ పెళ్లికి తండ్రి, అన్న హాజరుకావడంతో ఆగ్రహానికి గురైన శివకుమార్ రాత్రి బాగా మద్యం సేవించి ఇంటికి వెళ్లి తల్లితో గొడవ పడ్డాడు. తర్వాత తల్లి నిద్రిస్తుండగా.. కూరగాయలు కోసే కత్తితో ఆమె గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం భయపడి శివకుమార్ కూడా కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం చినవీరయ్య ఇంటికి తిరిగివచ్చేసరికి భార్య, కుమారుడు రక్తపుమడుగులో పడి ఉండటం గమనించాడు. వీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మన హక్కులను పోరాడి సాధించుకోవాలి

- ఓబీసీ అడ్వొకేట్స్ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



గోల్కొండ (హైదరాబాద్): కులగణనపై పార్లమెంటులో కచ్చితంగా బిల్లు వస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబీసీ అడ్వొకేట్స్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ, మీ ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఏర్పాటులో ఓబీసీ అడ్వొకేట్స్ పాత్ర మరువలేనిదని చెప్పారు. తాను డిగ్రీ స్టూడెంట్‌గా క్రాంతి సంగ్రామ పరిషత్ ద్వారా ఎన్నో పోరాటాలలో పాల్గొన్నానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్రంలో కులగణనను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మన పోరాట ఫలితాలు భవిష్యత్తు తరాల వారికి అందాలని ఆయన ఆకాంక్షించారు. బలహీన వర్గాలకు, దళిత, గిరిజనులకు న్యాయవాదులు న్యాయ సహాయం అందించాలని కోరారు. చట్ట సభల్లో ఓబీసీ ప్రతినిధులు ఉంటే మన వాటా హక్కులు సాధించుకోవచ్చునని పొన్నం పేర్కొన్నారు.

వీడియోకాల్ చేసి.. స్క్రీన్‌షాట్ తీసి..

- బాలికను మోసగించిన మైనర్

ఆసిఫాబాద్ అర్బన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ బాలిక (13)ను ప్రేమ పేరుతో మరో మైనర్ (16) మాయమాటలు చెప్పి మోసం చేశాడు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తెలిపిన వివరాలివి. జిల్లా కేంద్రానికి చెందిన ఒక బాలుడు మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. జిల్లా కేంద్రానికి చెందిన బాలికతో స్కూల్ నాటి పరిచయంతో స్నేహం పెంచుకున్నాడు. ఈ క్రమంలో నిత్యం ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ న్యూడ్ వీడియో కాల్ చేయమని బలవంతం చేశాడు. మొదట బాలిక ఒప్పుకోకపోయినా.. ఆ తర్వాత అంగీకరించింది. న్యూడ్ వీడియో కాల్ మాట్లాడుతుండగా స్క్రీన్‌షాట్ తీసి బాలికను బ్లాక్‌మెయిల్ చేసి లొంగదీసుకున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి ఈ నెల 23న ఫిర్యాదు చేశారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఆదివారం బాలుడిని జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచి పిల్లల సంరక్షణ గృహానికి తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఉత్తర నక్షత్రం గుట్టు వీడింది

సూర్యుడి కంటే 5 రెట్లు పెద్దదైన పోలారిస్

వాషింగ్టన్: పోలారిస్ అని పిలిచే ఉత్తర నక్షత్రం గురించి కీలకమైన సమాచారాన్ని అంతరిక్ష పరిశోధకులు సేకరించారు. ఇందుకోసం అమెరికాలోని జార్జియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన హై ఆంగ్యులర్ రిసాల్యూషన్ ఆస్ట్రానమీ(చారా) టెలిస్కోప్‌ను ఉపయోగించుకున్నారు. ఈ అధ్యయనం వివరాలను అస్ట్రోఫిజికల్ జర్నల్‌లో ప్రచురించారు. ఉత్తర నక్షత్రం పరిమాణం, రూపురేఖలు, లక్షణాలు చాలావరకు తెలిశాయని పరిశోధకులు అంటున్నారు. పోలారిస్ నక్షత్రం అత్యంత కాంతివంతమైన నక్షత్రం. సముద్రాల్లో నావికుల ప్రయాణాలకు ఇదొక మార్గదర్శిగా ఉపయోగపడుతోంది. ఈ నక్షత్రం ఆధారంగా దిశను, వెళ్లాల్సిన మార్గాన్ని తెలుసుకుంటారు. పోలారిస్‌పై అధ్యయనానికి సెంటర్ ఫర్ అస్ట్రోఫిజిక్స్‌కు చెందిన సైంటిస్టు నాన్సీ ఇవాన్స్ నేతృత్వం వహించారు. 330 మీటర్ల పొడవైన టెలిస్కోప్‌తో పోలారిస్‌ను, దాని ఉపరితలాన్ని నిశితంగా పరిశీలించారు. స్పష్టమైన ఫొటోలను చిత్రీకరించారు. అధ్యయనంలో ఆశ్చర్యకరమైన అంశాలు బయటపడ్డాయి. ఈ నక్షత్రం సూర్యుడి కంటే ఐదు రెట్లు పెద్దదని తేలింది. సూర్యుడి వ్యాసం కంటే 46 రెట్లు అధిక వ్యాసం కలిగి ఉన్నట్లు వెల్లడయ్యింది. ఉత్తర నక్షత్రం ఉపరితలంపై కాంతివంతమైన, చీకటిమయమైన మచ్చలు ఉన్నట్లు గుర్తించారు. అంతరిక్షంలో నక్షత్రాల మధ్య దూరాన్ని గుర్తించడానికి పోలారిస్‌ను ఒక ప్రామాణికమైన కొవ్వొత్తిగా భావించవచ్చని సైంటిస్టులు చెప్పారు.



వచ్చే నెలలో సాల్సాకు స్పాట్


గడువు ముగిసిన ఉపగ్రహాన్ని పేల్చివేయబోతున్న ఈఎస్ఏ

లండన్: యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ) చేపట్టిన క్లస్టర్ మిషన్‌లో భాగంగా 24 ఏళ్లపాటు విలువైన సేవలందించిన నాలుగు ఉపగ్రహాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. 2000లో చేపట్టిన క్లస్టర్ మిషన్‌లో భాగంగా సాల్సా, రుంబా, సాంబా, టాంగో అనే శాటిలైట్లను నింగిలోకి పంపించారు. అంతరిక్షం నుంచి వెలువడే ప్రమాదకరమైన సోలార్ రేడియేషన్ నుంచి భూమికి రక్షణ కల్పించే మ్యాగ్నెటోస్ఫియర్‌పై అధ్యయనం చేశాయి. క్లస్టర్ మిషన్ ముగియడంతో భూవాతావరణంలోకి రప్పించి, సురక్షితంగా పేల్చివేయడానికి ఈఎస్ఏ చర్యలు చేపట్టింది. తొలుత సాల్సా శాటిలైట్‌ను సెప్టెంబర్ 8న భూతావరణంలోకి ప్రవేశించేలా జనవరిలోనే ప్రోగ్రామింగ్ చేశారు. పసిఫిక్ మహా సముద్ర ఉపరితలానికి 110 నుంచి 80 కిలోమీటర్ల ఎత్తు వరకు వచ్చిన తర్వాత సాల్సా ఉపగ్రహాన్ని పేల్చివేస్తారు. జనవాసాలున్న ప్రాంతాల్లో ఉపగ్రహాలను పేల్చివేస్తే వాటి శకలాల వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది కాబట్టి పసిఫిక్ మహాసముద్రాన్ని ఎన్నుకున్నారు. సాల్సాను పేల్చేసే ప్రక్రియను హెలికాప్టర్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించాలని ఈఎస్ఏ సైంటిస్టులు నిర్ణయించారు. మిగతా శాటిలైట్లు రుంబా, సాంబా, టాంగోలను రాబోయే సంవత్సరాల్లో భూ వాతావరణంలోకి రప్పించి, పేల్చేయనున్నారు.



‘యూ’ అంటే మోదీ ‘యూటర్న్’

యూపీఎస్‌పై కాంగ్రెస్ విసుర్లు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన యూపీఎస్ (సమీకృత పింఛను విధానం) లో ‘యూ’ను మోదీ ప్రభుత్వం యూటర్న్‌గా కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. యూపీఎస్‌ను దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలపై దాడిగా పేర్కొంది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆదివారం ‘ఎక్స్’లో ఈ మేరకు వ్యాఖ్యానించారు. ‘యూపీఎస్‌లోని ‘యూ’ అంటే మోదీ ప్రభుత్వ యూ టర్న్‌లు! లోక్‌సభ ఎన్నికల ఫలితాలు విడుదలైన జూన్ 4 తర్వాత ప్రధానమంత్రి అధికార దురహంకారంపై ప్రజల బలం సాధించిన విజయమిది. వక్ఫ్ బిల్లు, బ్రాడ్‌కాస్ట్ బిల్లు, లాటరల్ ఎంట్రీ..తదితర బిల్లులన్నీ వెనక్కి వెళ్లాయి. ఇప్పుడు యూపీఎస్ విధానం మళ్లీ వచ్చింది. ఈ నిరంకుశ ప్రభుత్వం 140 కోట్ల మంది భారతీయులకు జవాబుదారీగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయి’ అని ఖర్గే పేర్కొన్నారు.

జనగణనపై క్లారిటీకి మూడేళ్లు..!

దశాబ్దానికి ఒకసారి జరిగే జనాభా లెక్కలను సరైన సమయంలో నిర్వహిస్తామని, జనగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుంటే ప్రకటిస్తామని హోం మంత్రి అమిత్ షా శనివారం రాయ్‌పూర్‌లో చేసిన ప్రకటనపై కాంగ్రెస్ స్పందించింది. ఇప్పటికే మూడేళ్ల జాప్యమైన తర్వాత ఈ విధమైన స్పష్టత ఇవ్వడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

మహిళలపై నేరం..

క్షమించరాని పాపం

నేరగాళ్లకు కఠిన శిక్షలు

లఖ్‌పతి దీదీ సమ్మేళన్‌లో మోదీ



ఆదివారం జల్‌గావ్‌లో లఖ్‌పతి దీదీలతో మాట్లాడుతున్న మోదీ. చిత్రంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు ఫడ్నవీస్, అజిత్ పవార్ తదితరులు

జల్‌గావ్: మహిళలపై నేరాలకు పాల్పడే దుర్మార్గులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు. ఆడబిడ్డలపై నేరాలకు పాల్పడడం క్షమించరాని పాపమని అన్నారు. నేరగాళ్లను వదిలిపెట్టొద్దని, కఠినంగా శిక్షించాలని స్పష్టంచేశారు. మహిళల భద్రత కోసం చట్టాలను మరింత పటిష్టం చేస్తామని ప్రకటించారు. ఆడబిడ్డల జోలికి రావొద్దని మృగాళ్లను హెచ్చరించారు. పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో 31 ఏళ్ల డాక్టర్‌పై అత్యాచారం, హత్య, మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపుల నేపథ్యంలో మోదీ తీవ్రంగా స్పందించారు. మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో ఆదివారం ‘లఖ్‌పతి దీదీ సమ్మేళన్’లో ఆయన పాల్గొన్నారు. 4.3 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 48 లక్షల మంది మహిళల కోసం రూ.2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్ విడుదల చేశారు. మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలో మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. మోదీ ఇంకా ఏమన్నారంటే...

మహిళల భద్రత అందరి బాధ్యత

‘‘మన తల్లులు, అక్కచెల్లెమ్మలు, ఆడబిడ్డలను కాపాడుకోవాలి. వారి భద్రత దేశానికి ప్రాధాన్యతాంశం కావాలి. ఎర్రకోట నుంచి నేను ఈ విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నా. దేశంలో ఎక్కడికి వెళ్లినా మహిళల భద్రత గురించి మాట్లాడుతున్నా. నా సోదరీమణులు, తల్లులు పడుతున్న బాధలు, ఆవేదన నాకు తెలుసు. మహిళలపై నేరం నిజంగా క్షమించరాని పాపం. ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఇది తెలుసుకోవాలి. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దు. చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలి. మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడే దుర్మార్గులకు సాయం అందించేవారిని సైతం విడిచిపెట్టొద్దు. అది ఆసుపత్రి గానీ, పాఠశాల గానీ, ప్రభుత్వ ఆఫీసు గానీ, పోలీసు స్టేషన్ గానీ.. ఎక్కడైనా సరే మహిళల భద్రత పట్ల నిర్లక్ష్యం జరిగితే అందుకు అందరూ బాధ్యత వహించాల్సిందే. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ, మహిళల జీవితాలను, గౌరవాన్ని కాపాడడం మనపై ఉన్న అతిపెద్ద బాధ్యత. అది సమాజం, ప్రభుత్వాల బాధ్యత.

పదేళ్లలో రూ.9 లక్షల కోట్ల రుణాలు

గత పదేళ్ల పరిపాలనలో మహిళల సంక్షేమం కోసం ఎన్నో చర్యలు చేపట్టాం. పథకాలు అమలు చేశాం. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత 2014 వరకూ మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పటి ప్రభుత్వాలు ఇచ్చిన రుణాలు రూ.25,000 కోట్ల కంటే తక్కువే. కానీ, మేమొచ్చాక గత పదేళ్లలో రూ.9 లక్షల కోట్లు ఇచ్చాం. సఖి మండల్ కార్యక్రమంతో అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్నాం. లఖ్‌పతి దీదీ పథకంతో మహిళల ఆదాయం పెరగడంతోపాటు భవిష్యత్తు తరాల సాధికారత సాధ్యమవుతుంది. మన దేశం త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోంది. ఇందులో మహిళామణుల పాత్ర చాలా కీలకం. అన్ని రంగాల్లో వారి భాగస్వామ్యంతో దేశం ముందంజ వేస్తోంది. ప్రతి ఇంట్లో, ప్రతి కుటుంబంలో సౌభాగ్యానికి మహిళలే గ్యారంటీ. కానీ, మహిళలకు సాయపడడానికి గ్యారంటీ ఇచ్చేవాళ్లు లేరు. మహిళల పేరిట ఆస్తులేవీ లేకపోతే వారికి బ్యాంకుల నుంచి రుణాలు రావడం కష్టమే. చిన్న వ్యాపారం చేసుకుందామన్నా రుణం దొరకడం లేదు. ఒక సోదరుడిగా, బిడ్డగా మహిళల కష్టాలను అర్థం చేసుకున్నా. వారి కోసం ఎన్నో నిర్ణయాలు తీసుకుంటున్నా.

రెండు నెలల్లో 11 లక్షల మంది

లఖ్‌పతి దీదీలు

ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద 3 కోట్ల ఇళ్లు నిర్మించాం. మహిళల పేరిట జన్‌ధన్ ఖాతాలు తెరిపించాం. ముద్ర పథకం కింద ఎలాంటి గ్యారంటీ లేకుండానే రుణాలు అందుతున్నాయి. ఈ పథకంలో 70 శాతం మంది లబ్ధిదారులు మహిళలే. ఈ పథకం వద్దని, రుణాలు తిరిగిరావని కొందరు వాదించారు. అయినప్పటికీ మహిళల పట్ల, వారి నిజాయితీ పట్ల నాకు విశ్వాసం ఉంది. వారు రుణాలు సక్రమంగా తిరిగి చెల్లిస్తుండడం సంతోషం కలిగిస్తోంది. ముద్ర రుణాల పరిమితిని రూ.20 లక్షల వరకు పెంచాం. 3 కోట్ల మంది అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేస్తానని ఎన్నికల సమయంలో మాటిచ్చా. మహిళాస్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరి సంవత్సరానికి రూ.లక్షకు పైగా సంపాదిస్తున్నవారంతా లక్షాధికారులైనట్లే. గత పదేళ్లలో కోటి మంది లఖ్‌పతి దీదీలను తయారు చేశాం. కేవలం రెండు నెలల్లో కొత్తగా 11 లక్షల మంది లఖ్‌పతి దీదీలు అయ్యారు. వీరిలో లక్ష మంది మహారాష్ట్ర మహిళలే ఉన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశానికి మహారాష్ట్ర ఒక షైనింగ్ స్టార్’’ అని మోదీ కొనియాడారు.

ఓపీఎస్ హామీని నెరవేర్చలేదేం?

కాంగ్రెస్‌ను నిలదీసిన బీజేపీ



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రధాని మోదీ ప్రకటించిన సమీకృత పింఛను విధానం (యూపీఎస్)ను యూటర్న్‌గా పేర్కొంటున్న కాంగ్రెస్.. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో హామీ ఇచ్చిన పాత పింఛను విధానం (ఓపీఎస్)ను ఎందుకు అమలు చేయడం లేదని బీజేపీ ప్రశ్నించింది. బీజేపీ సీనియర్ నేత రవి శంకర్ ప్రసాద్ ఆదివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రెండేళ్లుగా ఓపీఎస్ అంశంపై రాజకీయం చేస్తోందన్నారు.

అందరికీ న్యాయం అందితేనే దేశాభివృద్ధి

రాజస్తాన్ హైకోర్టు ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధాని మోదీ

జైపూర్: దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే న్యాయం అందరికీ సులభంగా అందుబాటులోకి రావాలని ప్రధాని మోదీ చెప్పారు. న్యాయం దక్కుతుందన్న గ్యారంటీ ప్రజలకు లభించడం చాలా కీలకమన్నారు. ఆదివారం జైపూర్‌లో నిర్వహించిన రాజస్తాన్ హైకోర్టు ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. లౌకిక పొరస్మృతి కోసం మన న్యాయ వ్యవస్థ గత కొన్ని దశాబ్దాలుగా కృషి చేస్తోందని వెల్లడించారు. అభివృద్ధి చెందిన భారత్ అనే మన కల సాకారం కావాలంటే ప్రజలందరికీ న్యాయం అందాలన్నారు. ప్రజల ఆకాంక్షలు ఉన్నతంగా ఉంటున్నాయని తెలిపారు.

సెలవు కోసం.. తోటి బాలుడిని చంపేశారు!

న్యూఢిల్లీ: ఢిల్లీలో దారుణం జరిగింది. మదర్సాలో చదువుతున్న ఐదేళ్ల బాలుడిని తోటి బాలురే పొట్టనబెట్టుకున్నారు. మదర్సాకు సెలవిస్తే ఇంటికి వెళ్లొచ్చనే దురాచనతో, టీవీలో క్రైం షోలో చూపినట్లే చేశామని నిందితులు తెలపడంతో పోలీసులు విస్తుపోయారు. శుక్రవారం దయాళ్‌పూర్ ఏరియాలోని తలీముల్ ఖురాన్ మదర్సాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు 9, 11 ఏళ్ల ముగ్గురు బాలురను విచారించగా దారుణం వెలుగు చూసింది. మదర్సాకు సెలవిస్తారని తోటి బాలుడ్ని కొట్టి చంపినట్లు వాళ్లు ఒప్పుకున్నారు.



ఆదివారం కోల్‌కతాలో ఆందోళనలో పాల్గొన్న ఓ యువతి

‘కోల్‌కతా’ నిందితునికి ముగిసిన లై డిటెక్టర్ పరీక్ష

న్యూఢిల్లీ: కోల్‌కతాలో ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలి దారుణ హత్యోదంతంలో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు ఆదివారం లై డిటెక్షన్ పరీక్ష నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. కోల్‌కతాలో ప్రెసిడెన్సీ కారాగారంలోనే పరీక్ష పూర్తిచేసినట్లు తెలిపారు. ఇందుకోసం ఢిల్లీలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నుంచి పాలిగ్రఫీ నిపుణులు కోల్‌కతాకు వచ్చారు. మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌తో పాటు హతురాలితో పాటు పనిచేసే నలుగురు వైద్యులకు శనివారమే లై డిటెక్షన్ టెస్ట్ చేశారు. ఆ పరీక్షలో వాళ్లు ఏమేం చెప్పారనే వివరాలను పోలీసులు బయట పెట్టలేదు. సత్యశోధన పరీక్షలో వీళ్లు చెప్పిన అంశాలను సాక్ష్యాధారాలుగా కోర్టులో ప్రవేశపెట్టేందుకు చట్టపరంగా అనుమతి లేనప్పటికీ కేసు దర్యాప్తులో ఆ వివరాలు ఎంతో ఉపయోగపడతాయి.

ఘోష్ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు

కర్ వైద్య కళాశాలకు ప్రిన్సిపల్‌గా ఉండగా సందీప్ ఘోష్ అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన ఇళ్లు, కార్యాలయాల్లో సీబీఐ ఆదివారం ఆకస్మిక సోదాలు చేపట్టింది. ఉదయమే కేంద్ర బలగాలతో ఘోష్ ఇంటికి వెళ్లిన అధికారులు డోర్లు తెరవకపోవడంతో చాలాసేపు వేచి చూడాల్సి వచ్చింది. మాజీ మెడికల్ సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపల్ సంజయ్ వశిష్ట, మరో ప్రొఫెసర్, ఇంకో 12 మందికి చెందిన ఇళ్లు, కార్యాలయాల్లోనూ తనిఖీలు చేశారు. ఆస్పత్రికి ఔషధాలు, ఇతర ఉపకరణాలను సరఫరాచేసే వారి ఆఫీసుల్లో సోదాలు చేశారు.

కర్ణాటకలో ‘ఆపరేషన్ కమలం’

- 50 మంది ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.100 కోట్లు ఆఫర్
- కాంగ్రెస్ ఎమ్మెల్యే రవికుమార్ గౌడ ఆరోపణలు

మాండ్య: కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ప్రతిపక్ష బీజేపీ ‘ఆపరేషన్ కమలం’చేపట్టిందని అధికార కాంగ్రెస్‌కు చెందిన మాండ్య ఎమ్మెల్యే రవికుమార్ గౌడ ఆరోపించారు. కాంగ్రెస్‌లోని 50 మంది ఎమ్మెల్యేలకు పార్టీ మారినందుకుగాను మొన్నటివరకు ఒక్కొక్కరికి రూ. 50 కోట్లు ఇస్తామన్న బీజేపీ నాయకులు, ఆ ఆఫర్ మొత్తాన్ని ఇప్పుడు ఏకంగా రూ. 100 కోట్లకు పెంచేశారని తెలిపారు. రూ. 100 కోట్లు సిద్ధంగా ఉన్నాయంటూ బీజేపీ నేత ఒకరు తనకు ఫోన్ చేసి చెప్పారని అన్నారు. అయితే, ఆ రూ. 100 కోట్లు మీ దగ్గరే ఉంచుకోండి, ఈడీకి సమాచారం అందిస్తానని తాను చెప్పానన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలన్నీ తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవ్వరూ బీజేపీ వలలో పడబోరని, సిద్ధరామయ్య ప్రభుత్వం స్థిరంగా, బలంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్, కేంద్ర మంత్రులు శోభా కరంద్లాజె, ప్రహ్లాద్ జోషి, హెచ్‌డీ కుమారస్వామిలతో కూడిన గ్యాంగ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడమే పనిగా పెట్టుకుందని గౌడ వ్యాఖ్యానించారు. కాగా, రవికుమార్ గౌడ గతేడాది కూడా ఇలాంటి ఆరోపణలే చేశారు.

హారిస్ బృందం విరాళాలు...

540 మిలియన్ డాలర్లు

వాషింగ్టన్: ఎన్నికల ప్రచారం కోసం డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ 540 మిలియన్ డాలర్లు సేకరించారు. గతవారం చికాగోలో జరిగిన డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో కమలా హారిస్, ఉపాధ్యక్ష అభ్యర్థి మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ తమ నామినేషన్లను ఆమోదించిన విషయం తెలిసిందే. కాగా, కన్వెన్షన్‌లో హారిస్ అంగీకార ప్రసంగానికి ముందు, గురువారం రాత్రి 500 మిలియన్ డాలర్ల మార్కును దాటామని ప్రచార కమిటీ తెలిపింది. ఆమె ప్రసంగించిన వెంటనే ఫండింగ్ పెరిగిందని వెల్లడించింది. కన్వెన్షన్ జరిగిన వారంలో మూడింట ఒక వంతు విరాళాలు మొదటిసారి దాతల నుంచి వచ్చాయని డిల్లాన్ చెప్పారు. మొదటిసారి దాతలయిన వారిలో ఐదో వంతు యువ ఓటర్లు, మూడింట రెండొంతులు మహిళలు ఉన్నారంది.

ఆరో క్లాస్ పిల్లాడు...

స్కూల్‌కు పిస్టల్ తెచ్చాడు!

న్యూఢిల్లీ: ఆరో తరగతి చదువుతున్న పదేళ్ల పిల్లాడు తన పాఠశాల గదికి బుల్లెట్లు లేని పిస్టల్ తీసుకొచ్చి హడలెత్తించాడు. ఇంట్లో కనిపించింది బొమ్మ పిస్టల్ అనుకుని వెంట తీసుకురావడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు. శనివారం ఢిల్లీలోని దీపక్‌విహార్ ప్రాంత పాఠశాలలో ఘటన జరిగింది. విషయం తెల్సుకున్న నజాఫ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పోలీసులు హుటాహుటిన పాఠశాలకు వెళ్లి పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పిస్టల్‌ను పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసేందుకు బాలుడి తల్లి అల్మారా నుంచి బయటకుతీయగా పిల్లాడు తెలీక స్కూల్‌కు తీసుకొచ్చాడు. ఆ లైసెన్స్‌డ్ పిస్టల్ బాలుడి తండ్రిది అని, ఆయన చనిపోవడంతో పిస్టల్ పోలీసులకు అప్పగించేందుకు సిద్ధపడ్డానని తల్లి చెప్పిన వివరణతో పోలీసులు సంతృప్తిచెందారు. దీంతో ఎలాంటి కేసు నమోదుచేయలేదు.

ఆన్‌లైన్ గేమ్ ఆడనివ్వలేదని..

కీస్, నెయిల్ కట్టర్ మింగాడు

పట్నా: కోపంలో ఎక్కువగా తింటారని శాస్త్రీయంగా నిరూపితమైంది. అయితే కోపంలో చేతికందింది తింటారని మాత్రం బిహార్‌లోని మోతీహారికి చెందిన ఈ వ్యక్తిని చూశాకే తెలిసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడనివ్వనందుకు కుటుంబ సభ్యులతో గొడవపడిన ఓ యువకుడు..ఆగ్రహంతో చేతికి అందినది అందినట్టే మింగేశాడు. ఆ తరువాత పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులకు తెలియడంతో వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్కాన్ చేసి చూస్తే... ఇంకేముంది! పొట్టలో తాళంచెవుల గుత్తి, కత్తి, నెయిల్ కట్టర్ కనిపించాయి. గంటన్నరపాటు శ్రమించి ఆపరేషన్ చేసిన వైద్యులు ఆ వస్తువులన్నింటినీ బయటికి తీశారు. ప్రమాదం తప్పిందని, ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆపరేషన్ చేసిన వైద్యులు డాక్టర్ అమిత్ కుమార్ తెలిపారు.

అమెరికాలో

భారత సంతతి వ్యక్తి అరెస్టు

వర్జీనియా: భార్యను హత్య చేసి, మృతదేహాన్ని దాచిపెట్టాడనే అభియోగంపై భారత సంతతికి చెందిన నరేష్ భట్‌ను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. మానస్సాస్ పార్క్ నగరంలో నివాసముంటున్న నరేష్ భట్.. తన భార్య మమతా కాఫ్లే భట్ (28) జూలై 31 నుంచి కనిపించడం లేదని ఆగస్టు 5న పోలీసులకు ఫిర్యాదు చేశారు. మమత న్యూయార్క్‌లోనో, టెక్సాస్‌లోనో బంధువులను కలవడానికి వెళ్లిందని, బయలుదేరే ముందు ఆమె ఫోన్‌ను ధ్వంసం చేసిందని పోలీసులకు చెప్పారు. రెండు రాష్ట్రాల్లోనూ వారికి బంధువులెవరూ లేరని విచారణలో తేలింది. జూలై 29 నుంచి ఆగస్టు 1వరకు మమత ఫోన్ డేటా ఆన్‌లోనే ఉంది. అతడి ఇంట్లో రక్తపు మరకలు లభించాయి. దీంతో భట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి కుమార్తెను సామాజిక సేవా సంరక్షణలో ఉంచారు.

డ్రగ్స్ వ్యాపారం అంతర్జాతీయ సమస్య

హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు



రాయ్‌పూర్: అంతర్జాతీయ సమస్యగా మారిన మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారంపై దృఢ సంకల్పం, పక్కా వ్యూహంతో సాగే పోరాటంలో భారత్ పాలుపంచుకుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. డ్రగ్స్ వ్యాపారంతో పొందే డబ్బును ఉగ్రవాదం, నక్సలిజం వంటి జాతి వ్యతిరేక కార్యకలాపాలకు, దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచేందుకు మళ్లిస్తున్నారని ఆయన వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని నయారాయ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. మనం అభివృద్ధి దిశగా సాగాలంటే మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడం ఎంతో అవసరమన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు పిల్ల చేష్టలు: రిజిజు

సాక్షి, న్యూఢిల్లీ: మిస్ ఇండియా పోటీల్లో దళిత, ఆదివాసీల వర్గాలకు చోటు దక్కడం లేదంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. శనివారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన ‘సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్’లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు మంత్రి రిజిజు కౌంటర్ ఇచ్చారు. రాహుల్ వ్యాఖ్యలను పిల్ల చేష్టలుగా ఆయన ఆదివారం ‘ఎక్స్’లో అభివర్ణించారు. ‘పిల్ల చేష్టలు వినోదం పంచేవే కావచ్చు. కానీ, మీ విభజన ఎత్తుగడల్లో వెనుకబడిన వర్గాల వారిని ఎగతాళి చేయొద్దు. ప్రభుత్వాలు మిస్ ఇండియాను ఎంపిక చేయవు. సినిమాలకు నటులను ఎన్నుకోవు’అంటూ ఆయన హితవు పలికారు.

దర్శన్‌కు జైలులో వీఐపీ ట్రీట్మెంట్?

ఆరుబయట తీరుబడిగా డ్రింక్, సిగరెట్ తాగుతున్న ఫొటో వైరల్



బెంగళూరు: హత్య కేసులో జైల్లో ఉన్న కన్నడ నటుడు దర్శన్‌కు బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో వీఐపీ మర్యాద అందుతోంది. జైలు ఆవరణలో కుర్చీలో కూర్చుని డ్రింక్, సిగరెట్ తాగుతున్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఫొటోలో అతనితో పాటు కొందరు రౌడీషీటర్ ఖైదీలు కూడా ఉన్నారు. ఫొటోను గమనించిన జైళ్ల శాఖ అధికారులకు సమన్లు జారీ చేసింది. దర్శన్ అభిమాని అయిన 33 ఏళ్ల రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్, అతని భాగస్వామిగా భావిస్తున్న పవిత్ర గౌడతో పాటు మరో 15 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

పాక్ ప్రమాదాల్లో

40 మంది దుర్మరణం



ఇస్లామాబాద్/కరాచీ: పాకిస్తాన్‌లో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు బస్సుల ప్రమాదాల్లో 40 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 11 మంది యాత్రికులు సైతం ఉన్నారు. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని మాక్రాన్ తీరప్రాంత జాతీయరహదారిపై 70 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ఒక్కసారిగా పల్టీకొట్టింది. దీంతో బస్సులోని 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 35 మంది గాయపడ్డారు. ఇరాన్‌లో పర్యటించిన షియా యాత్రికులను తిరిగి పంజాబ్ ప్రావిన్స్‌కు తీసుకొస్తుండగా బస్సు బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ప్రమాదానికి గురైందని అధికారులు చెప్పారు. బాధితుల్లో ఎక్కువ మంది లాహోర్, గుజ్రన్‌వాలా ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు.

లోయలో పడి..

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు లోయలోకి దూసుకెళ్లడంతో 29 మంది చనిపోయారు. ముగ్గురు గాయపడ్డారు. అయితే పర్వతప్రాంతంలో ఘటన జరగడంతో ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. మృతులు సధాయోతి జిల్లాకు చెందిన వారని ఆ జిల్లా డెప్యూటీ కమిషనర్ ఉమర్ ఫరూక్ చెప్పారు. ఘటనపై పాక్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ సంతాపం వ్యక్తంచేశారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

ప్రతిగా రాకెట్లు, డ్రోన్లతో విరుచుకుపడ్డ హెజ్బొల్లా



జెరూసలేం: లెబనాన్ కేంద్రంగా పనిచేసే మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లాపై ఆదివారం ఉదయం ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. హెజ్బొల్లా దాడి చేయెచ్చన్న సమాచారంతో ముందస్తుగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో 100 యుద్ధ విమానాలు పాల్గొన్నాయని తెలిపింది. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతం వైపు గురిపెట్టి ఉన్న వందలాదిగా రాకెట్లు ఈ దాడిలో ధ్వంసమైనట్లు ప్రధాని నెతన్యాహు తెలిపారు. అదే సమయంలో, 350 వరకు కత్యుషా రాకెట్లను, డ్రోన్లను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించినట్లు హెజ్బొల్లా తెలిపింది.

కాంగ్రెస్, ఎస్పీలతో పొత్తు అసంభవం: మాయా



లక్నో: కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)విధానాలపై బీఎస్పీ చీఫ్ మాయావతి మండిపడ్డారు. ఆ రెండు పార్టీలు ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి పార్టీలతో భవిష్యత్తులో జరిగే ఎలాంటి ఎన్నికల్లోనూ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టారు. ఆదివారం ‘ఎక్స్’లో మాయావతి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను భారత రత్నతో ఎందుకు గౌరవించలేదని ప్రశ్నించారు. ఇందుకుగాను అంబేడ్కర్ వాదులు కాంగ్రెస్‌ను ఎన్నటికీ క్షమించబోరన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా ఉన్న కాన్షీరాం మృతి చెందాక కనీసం ఒక్క రోజు కూడా జాతీయ సంతాప దినంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించలేదు. ఆ సమయంలో యూపీలో అధికారంలో ఉన్న ఎస్పీ కూడా సంతాప దినంగా ప్రకటించలేదు. ఈ రెండు పార్టీలు ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నాయి’అని నిప్పులు చెరిగారు.

సాక్షి

హైదరాబాద్

సోమవారం । 26 । ఆగస్టు । 2024

గరిష్ఠం/కనిష్ఠం
30.0/23.0

వాతావరణం

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 30.. కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



విజేతలకు చెక్ అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, నిఖత్ జరీన్



బయోడైవర్సిటీ సెంటర్ వద్ద రన్నర్లు



ఇటు ఉత్సాహంగా యువత..

అటు ఉల్లాసంగా బామ్మ పరుగు



పీపుల్స్ ప్లాజాలో..



పరుగును ప్రారంభిస్తున్న నగర సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి

జోరుగా మారథాన్

మూడు కేటగిరీల్లో రన్ • నెక్లెస్ రోడ్డు టు గచ్చిబౌలి

విజేతలకు పతకాలు అందజేసిన సీఎం

సాక్షి, సిటీబ్యూరో/ఖైరతాబాద్/చందానగర్: ఎన్‌ఎండీసీ హైదరాబాద్ మారథాన్ విజయవంతంగా ముగిసింది. ఫుల్ మారథాన్‌తో పాటు హాఫ్ మారథాన్, 10 కే మారథాన్ నిర్వహించారు. నగరంలోని నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజా నుంచి మారథాన్ ప్రారంభమైంది. ఆదివారం ఉదయం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. 10కే రన్ మాత్రం హైటెక్స్ గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైంది. ఈ రన్‌ను ఎన్‌ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, సైబరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ప్రారంభించారు. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మారథాన్‌లో 25 వేలకు పైగా రన్నర్లు పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల మీదుగా సాగిన రన్.. గచ్చిబౌలి స్టేడియంలో ముగిసింది. గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు సీఎం రేవంత్‌రెడ్డి పతకాలను, చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, బాక్సర్ నిఖత్ జరీన్, ఐడీఎఫ్‌సీ బ్యాంకు చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నారాయణ్, రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మహిళల విభాగం (ఎలైట్ రన్నర్స్)లో షీలా చెబెత్ ప్రథమ, జనేత్ కిప్టు ద్వితీయ, అలెమిటు హరోయే తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇండియన్ కేటగిరీ (మహిళలు)లో అశ్వినీ మదన్, జ్యోతి గవాతే, భాగీరథీ బిష్ట్ మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారు. పురుషుల ఎలైట్ విభాగంలో హమ్మింగ్టన్ కిమాయో, ఎజెకిల్, ఫెలెక్ డెర్సెమాతు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఇండియన్ కేటగిరీ (పురుషులు) శ్రీను బుగత ప్రథమ, సోను టోమర్ ద్వితీయ, అనంత్ గావోంకర్ తృతీయ స్థానాల్లో నిలిచారు.

వి'చిత్ర'పురి'

జీఓ 658 ప్రకారం విల్లాలు నిర్మించొద్దు

- అయినా అనుమతులు ఇచ్చిన హెచ్‌ఎండీఏ
- అప్పటి కమిటీ నిర్ణయాలతో సభ్యులకు నష్టం
- చిత్రపురి హౌసింగ్ సొసైటీ సభ్యుడి ఫిర్యాదు
- నోటీసు జారీ చేసిన మణికొండ మున్సిపాలిటీ

మణికొండ: సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్టులలో పని చేస్తున్న కార్మికులకు చిత్రపురి హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో కేటాయించిన 67 ఎకరాల స్థలంలోని నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వీటిలో సగానికి పైగా మంది విక్రయించడంతో ఇతరులు వచ్చి చేరారు. ఇక మిగిలిన 225 విల్లాల (రోవ్ హౌస్‌లు)ను దక్కించుకున్న వారే సొంత డబ్బులతో నిర్మాణాలను పూర్తి చేసుకుని ఉంటున్నారు. మరికొన్ని అసంపూర్తి దశలో ఉన్నాయి. 1994లో జీఓ 658 ప్రకారం చిత్రపురి కార్మికులకు కేటాయించిన 67 ఎకరాల్లో ఫ్లాట్‌ల రూపంలోనే నిర్మాణాలు చేయాలని ఉంది. కానీ.. ఇందుకు విరుద్ధంగా 2009లో హెచ్‌ఎండీఏ 225 విల్లాలకు అనుమతి ఇచ్చింది. అప్పటి ప్రభుత్వంలో చక్రం తిప్పిన చిత్రపురి హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం అనుమతులను తెచ్చింది. దీంతో కార్మికులు ఉండాల్సిన కాలనీలో చిత్ర పరిశ్రమలోని పెద్దలకు సైతం విల్లాల రూపంలో కేటాయింపులు జరిగాయి.

అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా..

హెచ్‌ఎండీఏ 225 విల్లాలకు 1536 చదరపు అడుగులలో విస్తీర్ణంలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వగా వాటిని 2250 చదరపు అడుగులకు పెంచి నిర్మించారు. 225 విల్లాలకు అనుమతి ఇవ్వగా వాటిని 231కి పెంచారు. 2014లో తిరిగి హెచ్‌ఎండీఏకు రివైజ్ అనుమతి కోరుతూ పెట్టిన దరఖాస్తు ఇప్పటి వరకు పెండింగ్‌లోనే ఉంది. అదనంగా కట్టిన ఆరు విల్లాలలో ఇప్పటికే నాలుగింటిని మణికొండ మున్సిపాలిటీ అధికారులు కూల్చివేశారు. మరో రెండు కూల్చేందుకు సమయం ఇచ్చారు. మిగతా 225 విల్లాల నిర్మాణాలపై నోటీసు జారీ చేశారు. వాటిపై వివరణ రాగానే చర్యలకు హైడ్రాకు నివేదిస్తామని అందులో పేర్కొన్నారు.

సభ్యుడి ఫిర్యాదుతో..

చిత్రపురిలోని గృహాలు, భూమి ధరలు పెరిగిపోవటంతో కొంత మంది తమ విల్లాల నిర్మాణాలను పూర్తి చేసుకుని ఉంటున్నారు. డబ్బు ఉన్నవారు ఏకంగా జీప్లస్ 3 అంతస్తులు నిర్మించుకున్నారు. ప్రస్తుతం అందులోని సభ్యుడు ఒ.కల్యాణ్ మున్సిపల్ అధికారులకు చిత్రపురిలో జీఓకు, అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీంతో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేదంటే అదనపు నిర్మాణాలను కూల్చివేస్తామని శనివారం మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ నోటీసు జారీ చేశారు.



చిత్రపురి కాలనీలోని విల్లాలు



అనుమతులు ఇస్తే సమస్య తీరుతుంది..

2014లో హెచ్‌ఎండీఏ అనుమతులకు భిన్నంగా నిర్మాణాలు చేసిన విషయం వాస్తవమే. వాటికి రివైజ్డ్ అనుమతులు ఇవ్వాలని మరో దరఖాస్తు పెట్టాం. కోర్టులో కేసులు ఉండటంతో అనుమతులు ఇవ్వలేదు. ప్రస్తుతం కొత్తగా జీఓ 658కు విరుద్ధంగా ఫ్లాట్‌లు కాకుండా విల్లాలు కట్టారనే ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో 225 మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం రివైజ్డ్ అనుమతులు, రెగ్యులరైజ్‌కు అవకాశం ఇస్తే సమస్య తీరుతుంది.

– వి.అనిల్‌కుమార్, అధ్యక్షుడు, చిత్రపురి హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ

ఫిర్యాదు రావటంతోనే..

చిత్రపురి హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీలో అనుమతులకు విరుద్ధంగా, జీఓకు వ్యతిరేకంగా నిర్మాణాలు జరిగాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని సొసైటీ సభ్యుడే ఫిర్యాదు చేశారు. ఇప్పటికే అదనంగా ఉన్న ఆరు విల్లాలను గుర్తించి వాటిలో నాలుగింటిని నేలమట్టం చేశాం. మిగతా రెండింటినీ కూల్చివేస్తాం. కొత్తగా వచ్చిన ఫిర్యాదుపై నోటీసు ఇచ్చి వారి నుంచి సమాధానం రాగానే చర్యలకు మున్సిపాలిటీ, హైడ్రా ఉపక్రమిస్తుంది.

– డి. ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ



వినాయక మండపాల ఏర్పాటుకు

అనుమతి తప్పనిసరి

- నగర పోలీసు కమిషనర్ శ్రీనివాసరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి నేపథ్యంలో నగరంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు కచ్చితంగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం పలు మార్గదర్శకాలు జారీ చేశారు. దీనికోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ లింక్ (www.policeportal.tspolice.gov.in) మంగళవారం నుంచి పని చేస్తుందని, వచ్చే నెల 6 లోపు నిర్దేశిత ఫార్మాట్‌లో అవసరమైన పత్రాలు జోడించి దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, సమాచారం కావాలన్నా 87126 65785లో సంప్రదించాలన్నారు.



గండిపేట కట్టపై హైడ్రాకు మద్దతుగా వాక్‌లో పాల్గొన్న, గండిపేట వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

చెరువులను కాపాడాలి

- నినదించిన గండిపేట వెల్ఫేర్ సొసైటీ
- హైడ్రాకు మద్దతుగా గండిపేట కట్టపై వాక్
- తరలివచ్చిన విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు

మణికొండ: చెరువులను కాపాడాలి.. హైడ్రా ముందుకెళ్లాలి.. హైదరాబాద్ మనది.. హైడ్రా మనందరిదీ.. మనమంతా చెరువులను కాపాడుకోవాలి.. అంటూ గండిపేట వెల్ఫేర్ సొసైటీ, సీబీఐటీ, ఎంజీఐటీ, వివిధ పాఠశాలల విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు నినదించారు. ఉస్మాన్‌సాగర్ (గండిపేట) చెరువు కట్టపై హైడ్రాకు మద్దతుగా వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు రాజశ్రీ, వేణుగోపాల్, సంస్కృత, శ్రీలత, అన్వితలు మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో నిజాం నవాబు మనకు 7 వేల శుద్ధి నీటి చెరువులు నిర్మించి ఇస్తే మనం వాటిని 70కి తగ్గించి మురికి కూపాలుగా మార్చామన్నారు. వాటికి తిరిగి పూర్వ వైభవం తేవాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి హైడ్రాను ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చివేయటం శుభ పరిణామం అని పేర్కొన్నారు. ఎంతటి ఒత్తిడి వచ్చినా హైడ్రా పనులను ఆపవద్దని, హైదరాబాద్ నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించిన గండిపేట, హిమాయత్‌సాగర్‌లను బతికించాలని కోరారు.



హైడ్రాకు మద్దతుగా వాక్‌లో పాల్గొన్న విద్యార్థులు

బీ కేర్‌ఫుల్!

రహదారి భద్రతపై రవాణా శాఖ నజర్

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- సమన్వయంతో ప్రమాదాల నియంత్రణ
- బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రత్యేక కార్యాచరణ
- అత్యవసర వైద్యసేవలపై అత్యంత శ్రద్ధ



సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రతపై రవాణా శాఖ సీరియస్‌గా దృష్టి సారించింది. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులయ్యేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనేందుకు సన్నాహాలు చేపట్టింది. మద్యం తాగి వాహనాలు నడిపేవారు, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపేవారి డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేయాలని నిర్ణయించింది. ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడటంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఒకవైపు రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూనే మరోవైపు వివిధ ప్రభుత్వ విభాగాలతో కలిసి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టనున్నారు. డయల్ 108 వాహనాల సహకారంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించి ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు.

కార్యాచరణపై కసరత్తు..

పోలీసు, ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మెడికల్ అండ్ హెల్త్, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవేస్ అథారిటీ, తదితర సంస్థల అధికారులతో రవాణా శాఖ రెండు రోజుల క్రితం సమావేశం ఏర్పాటు చేసింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన కార్యాచరణపై వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో మాట్లాడారు. ప్రమాదాల నియంత్రణకు అన్ని విభాగాలు సమన్వయంతో కలిసి పని చేయాలని కోరారు. మరోవైపు రవాణాశాఖ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై ప్రణాళికలను రూపొందించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

సత్వరమే వైద్యసేవలు..

- ప్రమాద బాధితులకు సత్వరమే వైద్యసేవలు అందితే చాలా వరకు మరణాలను అరికట్టవచ్చు. ఇందుకోసం అంబులెన్స్‌లు ఆస్పత్రులకు వెంటనే చేరుకొనేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అంబులెన్స్‌లోనే అత్యవసర వైద్యసేవలను అందజేస్తూ సమీపంలోని ఆస్పత్రులతో సమన్వయం చేసుకోవాలి. అత్యవసర వైద్యసేవల అమలు తీరుపై నిరంతరం సమీక్షించుకోవడం అవసరం.
- రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి.
- 108 వాహనాల సహకారంతో హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎక్కడెక్కడ బ్లాక్‌స్పాట్స్ ఉన్నాయో గుర్తించి అవకాశం ఉన్నచోట రోడ్ల విస్తరణ చేపట్టాలి. అలాంటి అవకాశం లేని చోట వాహనదారులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు ఉండాలి.

- గత ఏడాది వరకు తెలంగాణలో సుమారు 22 వేలకు పైగా ప్రమాదాలు జరిగినట్లు గుర్తించారు. ఈ ప్రమాదాల్లో 7 వేల మందికిపైగా మృత్యువాత పడ్డారు. మరో రెండు వేల మంది తీవ్రంగా, 10 వేల మందికి పైగా ఒకస్థాయిలో గాయపడగా, రెండు వేల మందికి పైగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.
- వాహనాలు ఢీకొని పాదచారులు మృతి చెందడం పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. నేషనల్ హైవేస్‌తో పాటు అన్ని చోట్ల కాలిబాటలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ఆర్‌అండ్‌బీ తదితర సంస్థలు కాలిబాటలను ఏర్పాటు చేసేలా కృషి చేయాలి.

కాలిబాటలపై ప్రత్యేక శ్రద్ధ..

- మరోవైపు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు ప్రతి నెలా క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించారు.

సాక్షి సోమవారం । 26 । ఆగస్టు । 2024

కారులో తిరుగుతూ సైబర్ నేరాలు

- పోలీసులు లొకేషన్ గుర్తుపట్టకుండా కొత్త ఎత్తుగడ
- వాహనాలలో రోజుకో ప్రాంతంలో తిరుగుతూ మోసాలు
- పోలీసులకు సాంకేతిక ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు

సాక్షి, సిటీబ్యూరో: పోలీసులకు చిక్కకుండా సైబర్ నేరస్తులు ఎప్పటికప్పుడు సరికొత్త ఎత్తులు వేస్తున్నారు. ఫోన్ నంబర్, బ్యాంకు ఖాతాలను బట్టి తమను గుర్తిస్తున్నారని గ్రహించిన నేరస్తులు 'మ్యూల్ అకౌంట్ల' పేరుతో సిమ్, బ్యాంక్ అకౌంట్లను సేకరిస్తున్నారు. తాజాగా లొకేషన్‌కు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్, టవర్ లొకేషన్ ఆధారంగా పోలీసులు తమ ఉనికిని పసిగడుతున్నారని తెలుసుకున్న కేటుగాళ్లు సరికొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. కాల్ సెంటర్ల ద్వారా మోసాలు చేస్తే ఏదో ఒకరోజు పోలీసులకు చిక్కుతామని భావించి కొత్తగా మొబైల్ కాల్ సెంటర్లకు తెరలేపారు.

నిర్మానుష్య ప్రాంతాల్లో నిలిపి..

ఆయా కేసుల్లో ఎలాంటి సాంకేతిక ఆధారాలు లభించకుండా కారు, వ్యాన్ వంటి కదిలే వాహనాలలో మొబైల్ కాల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఐదారు మంది సైబర్ నేరస్తులు ముఠాగా ఏర్పడి, నాలుగైదు వాహనాలలో సెల్‌ఫోన్లు, కస్టమర్ల డేటాతో తలోదిక్కున తిరుగుతున్నారు. నిర్మానుష్య ప్రాంతంలో వాహనాలను నిలిపి, అమాయకులకు ఫోన్లు చేసి కస్టమర్ కేర్, ఓఎల్ఎక్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్.. ఇలా పలు రకాలుగా బురిడీ కొట్టిస్తూ అందినంత డబ్బులు దండుకున్న తర్వాత సాయంత్రానికి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు.

లొకేషన్ గుర్తించడం సవాలే..

కదిలే ఫోన్ కాల్ సిగ్నల్ లొకేషన్ గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఒక్కో రోజు ఒక్కో చోట నుంచి నేరాలు చేసినట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్, లొకేషన్స్ వస్తుంటాయి. అక్కడికి వెళ్లి చూస్తే అదంతా హైవే, నిర్మానుష్య ప్రాంతం ఉంటున్నాయి. దీంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. డార్క్‌నెట్, జాబ్ పోర్టల్స్, సోషల్ మీడియా ఇలా వివిధ మార్గాల ద్వారా కస్టమర్ల పేరు, ఫోన్ నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేవారు. గిఫ్టులు, పార్ట్ టైం జాబ్స్, పెట్టుబడులు ఇలా రకరకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారు.

ఆర్అండ్‌బీ రహదారికి అడుగులు



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

- వెంకటాపూర్–చందానగర్ రోడ్డును సర్వే చేసిన అధికారులు
- స్థానిక నేతల వినతికి స్పందించిన మంత్రి కోమటిరెడ్డి

మొయినాబాద్: గ్రామీణ రోడ్డును ఆర్అండ్‌బీ రహదారిగా మార్చేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మండల పరిధిలోని వెంకటాపూర్–చందానగర్ దారిని ఆర్అండ్‌బీ రోడ్డుగా మార్చేందుకు ఆదివారం అధికారులు సర్వే చేపట్టారు. శనివారం మొయినాబాద్ మండలానికి వచ్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. శంషాబాద్–షాబాద్ రోడ్డులోని కవేలిగూడ నుంచి వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్, మొయినాబాద్, పెద్దమంగళారం గ్రామాల మీదుగా హిమాయత్‌నగర్–తంగడ్‌పల్లి రోడ్డులోని చందానగర్ గేటు వరకు ఉన్న పంచాయతీరాజ్ రహదారిని ఆర్అండ్‌బీ రోడ్డుగా మార్చాలని స్థానిక నాయకులు మంత్రికి విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి రోడ్డును పరిశీలించి సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం ఆర్అండ్‌బీ ఎస్‌సీ వెంకటేశ్వరావు, జేసీ చంద్రశేఖర్ మొయినాబాద్‌కు వచ్చారు. వెంకటాపూర్ చౌరస్తా నుంచి చందానగర్ చౌరస్తా వరకు 16 కిలోమీటర్లు సర్వే నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంటనే స్పందించి రోడ్డు సర్వే చేయించడంతో స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అధికారుల వెంట పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాంరెడ్డి, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

గణేశా.. అధికారుల తమాషా!

- మట్టి విగ్రహాలు ఉచితంగా వచ్చే అవకాశమున్నా ఖర్చుకే బల్దియా రెడీ
- అధికారులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కు?



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఖజానా ఖాళీగా ఉన్నా వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకున్నా.. నెలనెలా సిబ్బంది జీతాల చెల్లింపులే కష్టమవుతున్నా.. జీహెచ్ఎంసీ ఇవేవీ పట్టించుకోవడం లేదు. ఉచితంగా లభించేచోట సైతం ఖర్చు చేసేందుకే సిద్ధమైంది. ఇప్పటికే కార్పొరేటర్ల టూర్లకు దాదాపు రూ.1.25 కోట్లు వెచ్చించేందుకు సిద్ధమైన అధికారులు మట్టి గణపతి పేరిట మరో రూ.కోటిన్నరకుపైగా వ్యయం చేయనున్నారు. అధికారుల ఈ వైఖరి పలు అనుమానాలకు తావిస్తోంది. జీహెచ్ఎంసీ గత రెండేళ్లుగా వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు, చెరువులు కలుషితం కాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా లభించే అవకాశమున్నా ఆ దిశగా ఆలోచించకుండా కేవలం వాటిని తయారు చేసే కొందరు కాంట్రాక్టర్లకు లబ్ధి కలిగించాలనే ఉద్దేశంతోనే ఈసారి సైతం టెండర్లు పిలిచినట్లు తెలుస్తోంది. గతేడాది సైతం టెండర్ల ద్వారా ఆ ప్రక్రియ చేపట్టినప్పటికీ, తయారు కావాల్సినన్ని విగ్రహాలు తయారు కాలేదు. చెప్పిన వాటికంటే తక్కువే పంపిణీ చేశారు. ప్రజలు ఇళ్లలో పూజలు నిర్వహించుకునేందుకు విగ్రహాలు కావాలంటే... పేర్లు, ఫోన్ నెంబర్లు, ఆధార్ కార్డులుసహా జత చేయాలని నానా రూల్స్ చెప్పి తిప్పి పంపారు. ఆ తర్వాత చాలా విగ్రహాలు ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైనా, చిత్తు కాగితాల్లోనూ కనిపించాయి. రూ.కోటికిపైగా నిధులు వెచ్చించింది పడేయడానికా? అనే విమర్శలు వెల్లువెత్తినా పట్టించుకున్న పాపాన పోలేదు.

సీఎస్సార్ కింద చేయలేరా?

జీహెచ్ఎంసీ రూ.కోట్ల విలువైన పనుల్ని కార్పొరేట్ సంస్థలకు సీఎస్సార్ కింద అప్పగిస్తోంది. ఏకంగా మోడల్ మార్కెట్లనే ఇస్తోంది. చెరువుల్ని దత్తతకిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రజల భక్తికి, పర్యావరణహితానికి సంబంధించిన మట్టి వినాయక విగ్రహాల్ని ఉచితంగా పంపిణీ చేసేందుకు సంప్రదిస్తే ముందుకొచ్చే సంస్థలుంటాయని అధికారులకు తెలియనిది కాదు. దానివల్ల తమకేం లాభమని అనుకున్నారో, కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారో కానీ, మట్టి వినాయక ప్రతిమల తయారీకి టెండర్లు పిలిచారు. ఎల్1 రేట్‌కు తయారీ పనులు అప్పగిస్తామని, 5 శాతం విగ్రహాలు ఎక్కువగా ఇస్తామన్నారు. ఈ తతంగమంతా చూస్తుంటే ఇదేదో సిండికేట్ వ్యవహారంలా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అధికారులు విగ్రహాల తయారీకి ఇచ్చిన గడువు మూడురోజులే కావడం ఇందుకు ఊతమిస్తోంది. టెండర్లు ఫైనల్ చేసేది ఈ నెల 27వ తేదీ అయితే 31వ తేదీలోగా విగ్రహాల్ని సరఫరా చేయాలనే నిబంధన విధించారు. అంటే స్వల్ప గడువులోగా 3.10 లక్షల విగ్రహాలు జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ సూచించిన ప్రదేశాలకు చేర్చాలి. కెమికల్స్, పీఓపీ వాడకూడదనే నిబంధనలున్నాయి.

టెండర్ల ద్వారా తయారు చేయించే మట్టి వినాయక విగ్రహాలు ఇలా..

ఏ సైజు	ఎన్ని విగ్రహాలు
8 అంగుళాలు	2,70,000
1 అడుగు	30,000
18 అంగుళాలు	10,000

గత సంవత్సరం సైతం ఇన్ని విగ్రహాలకే కోటిన్నరకు పైగా వెచ్చించారు. అంటే ఈసారీ కోటిన్నరకు పైగా ఖర్చు కానుంది.

ఏది సెల్ఫ్ హెల్ప్?

సీఎస్సార్ ద్వారా సేకరించలేకపోయినా జీహెచ్ఎంసీలోని సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల ద్వారా తయారీ చేయించినా గ్రూపు మహిళలకు ఆదాయం లభించేది. జీహెచ్ఎంసీలో 49వేలకు పైగా సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లున్నాయి. వాటిల్లోని మహిళలకు మట్టివిగ్రహాల తయారీలో శిక్షణనిచ్చి, అవసరమైన మట్టిని సమకూరిస్తే, జీహెచ్ఎంసీకి టెండరు వ్యయం తగ్గడంతోపాటు వారికి ఆదాయం లభించేది. జీహెచ్ఎంసీలో పేరుకు యూసీడీ విభాగం ఉన్నా, వేలాది సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులున్నా వారికి ఉపకరించే పనులు చేయరనే ఆరోపణలకు కూడా జీహెచ్ఎంసీ ఈ చర్య ఊతమిస్తోంది. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను ఇతరత్రా పనులకు వినియోగిస్తారు కానీ, వారి ఉపాధికి మార్గం చూపకపోవడం జీహెచ్ఎంసీకే చెల్లుతోంది.

పోలీసుల ప్రతిష్ట పెంచాలి

తెలంగాణ రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం



సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో మర్యాదగా మెలగాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పోలీసుల ప్రతిష్టను ఇనుమడింపజేయాలని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం పిలుపునిచ్చింది. ఆదివారం సంఘం వార్షిక జనరల్ బాడీ సమావేశం మాసబ్‌ట్యాంక్ వద్ద జరిగింది. ఈ సమావేశానికి చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నవీన్‌చంద్, సీనియర్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు అప్పారావు, ఎస్ఎస్‌పీ యాదవ్ కమల్ కుమార్, రతన్, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్ డీజీ, గోపాల్‌రెడ్డి డీజీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్ల వయసు దాటిన వారిని సత్కరించారు.

పబ్‌లు, బార్లలో ఎక్సైజ్ తనిఖీలు

25 పబ్బుల్లో డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌తో పరీక్షలు

సాక్షి, సిటీబ్యూరో: పబ్బులు, బార్లలో ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 25 పబ్‌లు, బార్లలో తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ డిటెక్టర్లతో ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించారు. డ్రగ్స్ తీసుకున్నట్లుగా ఎలాంటి నిర్ధారణలు నమోదు కాలేదు. ఎక్సైజ్‌శాఖ నిర్వహించిన ఆకస్మిక తనిఖీలతో పబ్‌లలో అలజడి చోటుచేసుకుంది. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషి, హైదరాబాద్ రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్లు అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్.కిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి

హయత్‌నగర్: ఓ డ్రైవర్ రెండు వాహనాల మధ్య ఇరుక్కుని మృతి చెందాడు. హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద అంబర్‌పేటకు చెందిన శెట్టి రాజేష్(38) టిప్పర్ వాహనాన్ని అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో గజ్జి స్వామి పార్కింగ్ ప్రాంతంలో పార్కు చేయటానికి వచ్చాడు. పార్కింగ్ గేటు మూసి ఉండటంతో టిప్పర్ వాహనాన్ని గేటు వద్ద నిలిపాడు. హ్యాండ్ బ్రేక్ వేయటం మరిచిపోయి వాహనం దిగి గేటు వైపు వెళ్లాడు. అయితే టిప్పర్ వాహనం కదలటంతో వాహనాన్ని ఆపేందుకు యత్నించాడు. వాహనం ఆగకపోవడంతో అక్కడే నిలిచి ఉన్న కళాశాల బస్సు, టిప్పర్ మధ్య ఇరుక్కుపోయి రాజేష్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లలో కారం చల్లి.. లూటీ

రూ.1.20 లక్షలు అపహరణ

మొయినాబాద్: కూల్‌డ్రింక్స్ సప్లయ్ చేసే యువకుల వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి కళ్లలో కారంపొడి చల్లి నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మండల పరిధిలోని సురంగల్– కనకమామిడి మార్గమధ్యలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపులకు కూల్‌డ్రింక్స్ సప్లయ్ చేసే ఇద్దరు యువకులు మహ్మద్ ఈసా, భరత్‌కుమార్ శంషాబాద్‌లోని గోదాం నుంచి వాహనంలో కూల్‌డ్రింక్స్ తీసుకుని మొయినాబాద్ మండలం సురంగల్‌లోని షాపుల్లో సరఫరా చేశారు. అక్కడి నుంచి కనకమామిడి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని అడ్డగించి ఇద్దరి కళ్లలో కారం పొడి చల్లారు. రాళ్లతో వారిపై దాడి చేసి వారి వద్ద ఉన్న బ్యాగును లాక్కుని పారిపోయారు. బ్యాగులో రూ.1.20 లక్షలు ఉన్నాయి. కారం పొడి మంటలు చల్లారిన తరువాత బాధితులు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తూనికలు, కొలతల శాఖలో దంపతుల సస్పెన్షన్

సాక్షి, సిటీబ్యూరో: తూనికలు, కొలతల శాఖలో జిల్లా ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న భార్యాభర్తలపై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు, అక్రమవసూళ్లు, ఆదాయానికి మించి ఆస్తుల కలిగి ఉన్నారని అభియోగాలు నిర్ధారణ కావడంతో దంపతులైన హైదరాబాద్ డీఎల్ఎంఓ అనురాధ దేవి, వరంగల్ డీఎల్ఎంఓ ప్రవీణ్‌కుమార్‌లను సస్పెండ్ చేస్తూ పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు.

నేరాలపై నజర్

- ఉక్కుపాదంతో అణచివేస్తాం
- డీసీపీ సునీతా రెడ్డి



రోహింగ్యా ముస్లింలకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ సునీతా రెడ్డి

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా కొనసాగుతున్న నేరాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తరచూ హత్యలు, హత్యాయత్నాలు జరుగుతుండడం .. గంజాయి సరఫరా లాంటి విషయాలు వెలుగుచూస్తుండడంతో మహేశ్వరం డీసీపీ డి.సునీతా రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం రాయల్ కాలనీలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. అదనపు డీసీపీ బి.వి.సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డితో పాటు సీఏఆర్ హెడ్ క్వార్టర్స్, ఎస్‌ఓటీ పోలీసులతో మొత్తం 287 మంది కలిసి ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి ఇంటింటి సోదాలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 63 వాహనాలు, మూడు బాటిళ్ల ఆక్సిటోసిన్ స్టెరాయిడ్ (గేదెలు అధికంగా పాలు ఇచ్చేందుకు వినియోగించే ఉత్ప్రేరకం)లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు రౌడీషీటర్లు, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా రోహింగ్యా ముస్లిం యువకులకు ఇక్కడి నిబంధనలు పాటిస్తూ నేరాలకు దూరంగా ఉండాలని డీసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ఈ రోజుల్లో కొంతమంది యువత మాదక ద్రవ్యాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై స్టేషన్ పరిధిలో 24 గంటల పాటు పెట్రోలింగ్ కొనసాగిస్తామన్నారు. నేరాలకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. స్థానిక పౌరులు కూడా అనుమానాస్పదంగా సంచరించే వారి సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు.

కనెక్షన్.. కలెక్షన్!

కరెంటోళ్లకు కాసులు కురిపిస్తున్న కొత్త కనెక్షన్లు

- ఒక్కో పనికి ఒక్కో రేటు 'ఫిక్స్'
- ఇస్తే సరి లేదంటే ముప్పుతిప్పలు
- తరచూ ఏసీబీకి పట్టుబడుతున్న అధికారులు
- అయినా ఆగని అక్రమ వసూళ్లు



ఏ పనికి ఎంత వసూలు చేస్తున్నారంటే.. (సుమారు)

పని	వసూలు
రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉన్న ఇంటికి ఒక్కో మీటర్‌కు	రూ.1,500-2,000
నోటరీ ల్యాండ్/ ఇంటి కనెక్షన్‌కు	రూ.10,000-20,000
లైన్ షిఫ్టింగ్‌కు	రూ.15,000-20,000
కొత్తలైను ఏర్పాటుకు	రూ.40,000-50,000
ప్యానల్‌బోర్డు అనుమతికి	రూ.55,000-60,000
బహుళ అంతస్తుల భవనానికి 63 కేవీఏ డీటీఆర్ మంజూరుకు	రూ.1,80,000-2,00,000

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్తలైన్లు, లైన్ షిఫ్టింగ్ పనులు, మీటర్లు, డీటీఆర్‌లు, ప్యానల్ బోర్డులు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. నిబంధనల మేరకు లోడును బట్టి ఫీజులు చెల్లిస్తున్నా.. క్షేత్రస్థాయిలోని ఆర్టిజన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఏఈ, ఏడీఈ, డీఈ ఇలా ఎవరి స్థాయిలో వారికి చేయి తడపనిదే పని కావడం లేదు. నిరాకరించిన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. అధికారుల తీరుతో విసుగుచెందుతున్న వినియోగదారులు చివరికి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. తరచూ ఏదో ఒకచోట.. ఎవరో ఒకరు ఏసీబీకి పట్టుబడుతూనే ఉన్నారు. అయినా.. అక్రమార్కుల వైఖరిలో మాత్రం మార్పు రావడం లేదు.

వేతనం బోలెడు.. అయినా వదలరు

వాస్తవానికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే డిస్కం ఇంజనీర్ల వేతనాలు చాలా ఎక్కువే. ఒక్కో డీఈకి సీనియార్టీని బట్టి నెలకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనం చెల్లిస్తుంది. సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్ల వేతనాలు కూడా రూ.లక్షకు పైమాటే. ప్రభుత్వం వీరికి భారీగా వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ.. వీరిలో కొంతమంది అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా ఫోకల్, నాన్ ఫోకల్ అనే పేరుతో పోస్టులను సృష్టించి పోస్టింగ్ కోసం చేసిన ఖర్చులను తిరిగి రాబట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటుపడి అవినీతి నిరోధకశాఖ వలలో చిక్కుతున్నారు. ప్రత్యక్షంగా తమ భవిష్యత్తును పాడు చేసుకుంటూ పరోక్షంగా సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. ఏసీబీకి చిక్కిన వారు ఆ తర్వాత అంతకంటే పెద్ద పోస్టుల్లో చేరుతుండటం గమనార్హం.

దరఖాస్తును బట్టి ధర

ఔటర్‌కు అటు ఇటుగా అనేక బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు వెలుస్తున్నాయి. కొత్త మీటర్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతి నెలా 2,500 మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో 250 మంది ప్యానల్ బోర్డుల కోసం, వందమంది వరకు డీటీఆర్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. భారీ బహుళ అంతస్తుల భవనాలకు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఫైర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ విభాగాల నుంచి ఎన్‌ఓసీలు తప్పనిసరి. చాలామంది ఆయా విభాగాల నుంచి అనుమతి తీసుకోకపోవడం, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతుండడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు రూ.రెండు లక్షలకుపైగా, వెంచర్‌లో కొత్తలైన్ల ఏర్పాటుకు రూ.ఐదు లక్షలకుపైగా డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

"అక్రమార్కులను ఉపేక్షించబోం

క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లు ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం. ఉద్దేశపూర్వకంగా ఫైళ్లను తొక్కిపెట్టి.. సకాలంలో కనెక్షన్లు జారీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. అంతర్గత విచారణకు ఆదేశించడంతో పాటు పదోన్నతులు, పోస్టింగ్‌లు నిలిపివేస్తాం. భవిష్యత్తులో వారికి సంస్థ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ విషయంలోనూ కోత విధిస్తాం.

– ముషారఫ్ ఫారూఖీ, సీఎండీ, టీజీఎస్పీడీసీఎల్

అక్రమ నిర్మాణాలకు అ'ధనం'గా..

ఇక భూదాన్, వక్ఫ్ బోర్డు, దేవాదాయశాఖ, అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో చేపట్టే నిర్మాణాలు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ప్రత్యక్షంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతుండటంతో పాటు పరోక్షంగా ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి కారణమవుతున్నారు. తాజాగా మంచాల మండలంలోని ఓ వెంచర్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న 11కేవీ, 33కేవీ లైన్ల మార్పునకు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు సరూర్‌నగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ (టెక్నికల్) డివిజనల్ ఇంజనీర్ (డీఈ) టి.రామ్మోహన్ డబ్బులు డిమాండ్ చేసి, సదరు కాంట్రాక్టర్ నుంచి రూ.18 వేలు తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విషయం సంచలనం సృష్టించింది.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

లిబర్టీ: పారిశుద్ధ్య కార్మికుల సపేవలు ఎంతో గోప్పవని వాటికి వెలకట్టలేమని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ప్రీతంసింగ్, దిలీప్‌సింగ్ అన్నారు. మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో కార్మికులు, సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. అలాంటి వారి సేవలు ఎంతో గొప్పవన్నారు.

పేదల ప్రాణాలు కాపాడుతున్న సీఎంఆర్‌ఎఫ్


ఎల్‌ఓసీని అందజేస్తున్న సీఎస్ రెడ్డి

రహమత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది నిరుపేదల ప్రాణాల నిలబడుతున్నాయని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎస్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని హెచ్‌ఎఫ్‌నగర్ చెందిన ఫర్జానాబేగంకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఎల్‌ఓసీని ఆదివారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని ఎంతో మంది నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంగా నిలుస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్రనామార్చన



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి పవిత్రోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఆదివారం వేడుకల్లో భాగంగా ఉదయం సుప్రభాతం, ద్వారతోరణ ధ్వజ కుంభారాధన, కమలాలతో సహస్ర నామార్చాన, హోమం, నిత్య పూర్ణాహుతి, సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిగాయి. పవిత్రోత్సవాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

'మన్‌కీ బాత్' వీక్షించిన బీజేపీ నేతలు


మన్‌కీ బాత్ తిలకిస్తున్న బీజేపీ నాయకులు

ఫిలింనగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం జూబ్లీహిల్స్ డివిజన్ బూత్‌నెంబర్ 176 ఆధ్వర్యంలో వీక్షించారు. ఇందులో బీజేపీ ఖైరతాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, అనిల్ కోకుల, సతీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి


నూతన కార్యవర్గ సభ్యులు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్ శ్రీసాయి రెసిడెన్సీ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడిగా మహమ్మద్ సర్దార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా పుష్పలీల, సెక్రటరీగా శ్రీరామమూర్తి, జాయింట్ సెక్రటరీగా భాగ్యరేఖ, ట్రెజరర్‌గా సీతారత్నం, మెంబర్స్‌గా ఉమాదేవి, సువర్చల, హేమన, నాగేశ్వరరావు, విజయ ఎన్నికయ్యారు. అసోషియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఫిలింనగర్‌లో వినాయకచవితి కర్రపూజ


కర్ర పూజ చేస్తున్న సంఘం ప్రతినిధులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ మహనీయుల విగ్రహాల చౌరస్తాలో ప్రతియేటా ఫిలింనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 7వ తేదీన జరిగే వినాయక చవితి సందర్భంగా ఇక్కడ విగ్రహం ఏర్పాటు కోసం ఆదివారం కర్రపూజ నిర్వహించారు. మండపం నిర్మాణం, విగ్రహం ఏర్పాటుకు ముందు పనుల్లో భాగంగా కర్రపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా నేతలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కర్రపూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా పూజాధికాలను నిర్వహించి పండుగ వాతావరణంలో జరిపారు.

క్యాండిల్ ర్యాలీ

శ్రీనగర్‌కాలనీ: మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, అత్యాచారాలు ఆపాలని ఎర్రగడ్డ డివిజన్ వాసవి బృందావన్ కమ్యూనిటీ సొసైటీలో ఆదివారం క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. వెస్ట్ బెంగాల్‌లో వైద్యురాలిని హత్యచేసిన చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని, మహిళల రక్షణ మనందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో వీరయ్యగుప్తా, సుబ్బరాజు, రవీంద్రనాథ్, భాస్కర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, కమ్యూనిటీ మహిళలు పాల్గొన్నారు.


క్యాండిల్ ర్యాలీని నిర్వహిస్తున్న మహిళలు

'నిషా'చరులపై పోలీసుల నజర్!

- మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వైనం
- పోలీసులకు చిక్కుతున్న వాహనదారులు
- రెండోసారి పట్టుబడితే జైలుకే...
- కొన్ని సందర్భాల్లో డ్రైవింగ్ లైసెన్స్ రద్దు
- వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో 5540 కేసులు నమోదు
- రోజూ కొనసాగుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు


డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

బంజారాహిల్స్: అతిగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. ఒకటి కంటే ఎక్కువ సార్లు మద్యం సేవించి పట్టుబడితే జైలు శిక్ష కూడా విధిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పరిస్థితి తీవ్రతను గుర్తించిన న్యాయమూర్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తున్నారు. అయినా సరే కొంతమంది రెండుసార్లు, మూడు సార్లు కూడా ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్‌లో చిక్కుతున్నారు. ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు చోట్ల డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తూ మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి వారిని కౌన్సెలింగ్‌కు హాజరుపరుస్తున్నారు. అంతేకాకుండా న్యాయస్థానంలో కూడా హాజరుపరుస్తున్నారు. ఒకసారి కంటే ఎక్కువ పట్టుబడ్డ వారికి జైలు శిక్ష విధిస్తూ రూ. 3300 జరిమానా కూడా విధిస్తున్నారు. మొదటిసారి పట్టుబడ్డ వారికి రూ. 2100 జరిమానా విధించడం జరుగుతుంది.

◆ పబ్‌లు, క్లబ్‌లు అత్యధికంగా ఉన్న జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట ప్రాంతాల్లో రోజూ ఎక్కడో చోట డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లు జరుగుతున్నాయి. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ ఈ తనిఖీల్లో 15–20 మంది వరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి జులై 31వ తేదీ వరకు ఏడు నెలల వ్యవధిలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజగుట్ట పోలీస్‌స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 5,540 మంది పట్టుబడ్డారు.

◆ ఇందులో 150 మందికి పైగా జైలు శిక్షకు గురయ్యారు. పెద్ద మొత్తంలో జరిమానాలు చెల్లించారు. చాలా వాహనాలు ఈ డ్రైవ్‌లో సీజ్ అయ్యి ఇంకా ఆయా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఆవరణలోనే సరైన ధ్రువపత్రాలు లేక మగ్గుతున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపరాదంటూ ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ అవగాహన కలిగిస్తున్నా చాలామందిలో ఇంకా మార్పు రావడం లేదు.

◆ వెస్ట్ జోన్ ట్రాఫిక్ పరిధిలో మొత్తం 5540 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా, ఇందులో 2660 కార్లు ఉన్నాయి. బెంజ్ కార్లు 30 ఉండగా, బీఎండబ్ల్యు కార్లు 40 వరకు ఉన్నాయి. ఆడి కార్లు 38 పట్టుబడ్డాయి. ఖరీదైన కార్లు పెద్ద సంఖ్యలో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడుతున్నాయి.

◆ చాలావరకు మాదాపూర్, జూబ్లీహిల్స్‌లలో పబ్‌ల నుంచి పీకలదాకా మద్యం సేవించి మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్న వారే అధికంగా ఉంటున్నారు. వారం రోజుల క్రితం బంజారాహిల్స్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం మత్తులో ఉన్న ఓ మహిళ బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌కు ససేమిరా అంటూ విధులకు ఆటంకం కలిగించింది. ఓ ట్రాఫిక్ పోలీసు ఫోన్‌ను ధ్వంసం చేసింది.

◆ ఇలా మద్యం మత్తులో వాహనదారుల ప్రవర్తన ఆందోళనకరంగా ఉంటుంది. వీరంతా అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. గత రెండు నెలల వ్యవధిలో జూబ్లీహిల్స్‌లో మద్యం మత్తులో కార్లు నడుపుతూ ఆరు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇలా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కేసులు భారీగా నమోదవుతున్నాయి.

ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని...

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	డ్రంకన్ డ్రైవ్ కేసులు
పంజగుట్ట	1152
ఎస్సార్‌నగర్	1817
జూబ్లీహిల్స్	1465
బంజారాహిల్స్	1106

ఫిలింనగర్‌లో ఫుట్‌పాత్‌పై అడ్డంగా బోర్డులు


ఫుట్‌పాత్‌పై అడ్డంగా ప్రచార బోర్డులు ఏర్పాటుచేసిన దృశ్యం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని అపోలో ఆస్పత్రి చౌరస్తా సమీపంలో స్మార్ట్ బజార్ ఎదురుగా ఏర్పాటు చేసిన వైన్‌షాపు నిర్వాహకులు ఫుట్‌పాత్‌లు, రోడ్డును ఆక్రమించి ప్రచార కక్కుర్తి కోసం అడ్డంగా నిబంధనలకు విరుద్ధంగా బోర్డులు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఫెన్సింగ్ కూడా నిర్మించడంతో ఇక్కడి నుంచి ఫుట్‌పాత్‌పై రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా ఈ రోడ్డు, ఫుట్‌పాత్‌పై నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన ప్రచార బోర్డులు, ఫెన్సింగ్‌తో పాటు వైన్‌షాపుకు చెందిన బోర్డులను పూర్తిగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇక వైన్‌షాపుల నిర్వాహకుల నిర్వాకంతో సాయంత్రం నుంచి రాత్రి వరకు ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతుంది. రోడ్డు పక్కనే మద్యం సేవిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై జీహెచ్‌ఎంసీతో పాటు డీఆర్‌ఎఫ్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి అడ్డంకులు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


విద్యార్థినులకు ప్రోత్సాహకాన్నిస్తున్న మేయర్

ఎన్‌బీటీనగర్‌లో ఎడ్యుకేషన్ క్యాంప్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం 'టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్' ఎడ్యుకేషన్ క్యాంప్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ పాల్గొన్నారు. 2014 నుంచి ఈ సంస్థ పేదరికంలో ఉన్న యువతుల ఉన్నతి కోసం పనిచేస్తున్నది. నైతిక విలువలు నేర్పడంతో పాటు సమాజంలో ఎలా ముందుకువెళ్లాలి అనే దానిపై ఈ సంస్థ కొనసాగుతుంది. కార్యక్రమంలో మహ్మద్ ఖలీకుర్ రెహ్మాన్, టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విభూతి జైన్, రీనా హిండోచా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు కౌన్సెలింగ్ కూడా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులు కూడా ఈ సంస్థ అందజేస్తుంది.


వేడుకలకు హాజరైన బ్రహ్మకుమారీలు,అతిథులు

ఘనంగా 'బ్రహ్మకుమారీల వేడుక'

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14 నందినగర్‌లోని బ్రహ్మకుమారీస్ బంజారాహిల్స్ సెంటర్ సంస్థ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మౌంట్‌అబూ నుంచి ప్రత్యేక అతిథిగా ఉమ్మడి పరిపాలనాధిపతి రాజయోగిని బీకే సంతోష్ దీదీ పాల్గొన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శి బీకే మృత్యుంజయ విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. అలాగే హైదరాబాద్ శాంతిసరోవర్ డైరెక్టర్ బీకే కుల్దీప్‌దీదీ కూడా పాల్గొన్నారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేశారు. సేవా కార్యక్రమాలను వివరించారు. సంస్థకు సేవలందిస్తున్న వారిని ఈ సందర్భంగా సన్మానించారు. టీవీకే రమణప్రసాద్, సంజయ్‌సంఘీ, దుర్గాబెహన్, రాజగోపాల్‌రెడ్డి, సుభద్రాదేవి, నంగునూరి చంద్రశేఖర్, మనీష్‌అగర్వాల్, బి.పవన్‌కుమార్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీకృష్ణ జన్మాష్టమి


చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారి ఆర్యవర్ధన్


సరస్వతీ విద్యామందిర్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు, నృత్యం చేస్తున్న గోపికలు

బంజారాహిల్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం నివాసాలు, అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో సందడిగా జరుపుకొన్నారు. చిన్ని కృష్ణుల వేషధారణలో చిన్నారులను ముస్తాబు చేసిన తల్లిదండ్రులు వారితో కలిసి ఆయా కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో కాలనీలు, బస్తీల్లో ఈ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. బాలికలను గోపికలుగా, బాలురను కృష్ణుడిగా అలంకరించి ఆయా కమ్యూనిటీల్లో ఈ వేడుకలకు కొత్తదనాన్ని తీసుకువచ్చారు. పలు పాఠశాలల్లో రెండు రోజుల నుంచి జన్మాష్టమి వేడుకలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు.

సరస్వతీ విద్యామందిర్‌లో...



పంజగుట్ట: వెంకటరమణ కాలనీలోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణల్లో అలరించారు. చిన్ని కృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులు ఉట్టి కొట్టించే విధానం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు శఠగోపం జగన్మోహనాచార్యులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధానోపాధ్యాడు తంగెళ్లపల్లి రమేష్ పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చి మృత్యువాత

వెంగళరావునగర్: దొంగతనానికి వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున మధురానగర్ మెట్రోస్టేషన్ సమీపంలోని ఆగ్రా స్వీట్స్ వద్ద ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు ఓ వ్యక్తి వచ్చి దొంగతనానికి ప్రయత్నించాడు. ఒక పక్క డోర్ తెరిచి రెండోది కూడా ఓపెన్ చేస్తుండగా డబ్బా పూర్తిగా ఒరిగి అతనిపై పడటంతో ఊపిరాడక మృతిచెందాడు. ఉదయం స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.డబ్బాకు ఎదురుగా ఉన్న సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా డబ్బా పడి మృతిచెందినట్లుగా తెలిసింది. ఇదిలా ఉండగా ఈ ఘటనపై పండ్ల వ్యాపారిని కొట్టి చంపారని కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్‌లో ప్రచారం చేశారు. స్పందించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏదైనా ఘటన జరిగినపుడు పత్రికలు, ఛానల్స్, యూట్యూబ్ విలేకరులు సంబంధిత పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ద్వారా విషయాన్ని తెలుసుకుని ప్రసారం చేయాలని అంతేగాని అవాస్తవాలను వైరల్ చేయడం ద్వారా ప్రజలు ఆందోళన చెందుతారని హెచ్చరించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియలేదన్నారు.

ఉద్యోగం, రుణాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు

ఒకరిపై కేసు నమోదు

వెంగళరావునగర్ : ఉద్యోగం, రుణాలు ఇప్పిస్తానని పలువురిని మోసగించిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన జి.నర్సింగరావుకు ఎం.ఉమా మధుసూధన్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను వాస్తు నిపుణుడినని చెప్పుకునేవాడు. మీ ఇంటికి వచ్చి వాస్తుదోషం ఉందని అందుకే ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పాడు. తాను రూ.30 లక్షలు రుణం ఇప్పిస్తానని అందుకోసం రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో నర్సింగరావు నమ్మి జూన్ నెలలో రూ.2 లక్షలు ఇచ్చాడు. నెలలో రుణం ఇప్పిస్తానని చెప్పిన మధుసూధన్‌రెడ్డి కాలాయాపన చేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడు. అతడి ఇంటికి వెళ్లగా సుమాంజలి, సంతోష్, రాకేష్ అనే వ్యక్తులు మాయమాటలు చెప్పి పంపిస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత ఇంటికి తాళంవేసి వెళ్లిపోయారు.

◆ ఇదిలా ఉండగా ఎల్లారెడ్డిగూడలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించే ఎస్.రాంబాబు అనే వ్యక్తి కుమారుడికి నేవీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3 లక్షలు, డబుల్ బెడ్‌రూం ఇప్పిస్తానని మరో లక్ష తీసుకున్నాడు. రాంబాబు ఎన్నిసార్లు అడిగినా తప్పించుకుని తిరుగుతున్నాడు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని రాంబాబు గట్టిగా అడగటంతో చెక్‌లు ఇచ్చాడు. వాటిని బాధితుడు బ్యాంక్‌లో వేయగా అవి బౌన్స్ అయ్యాయి. ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉండటంతో మోసపోయినట్లు గ్రహించి మధుసూధన్‌రెడ్డిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నిబంధనలు పాటించని పబ్బులపై కేసుల నమోదు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రెండు పబ్బులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం జూబ్లీహిల్స్‌లోని లార్డ్స్ ఆఫ్ డ్రింక్స్, బ్రాండ్ వే పబ్‌లు శనివారం రాత్రి తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమయ్యాయి. ఈ రెండు పబ్బుల యాజమాన్యం వాహనాలు నిలిపేందుకు సరైన సౌకర్యం కల్పించకపోవడంతో వాహనాలన్నీ రోడ్డు మీద నిలిచాయి. దీంతో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.40 గంటల నుంచి 1.30 గంటల వరకు పబ్బుల మీద తీవ్రంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. కాగా రాత్రి విధుల్లో ఉన్న ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి పోటోలు, వీడియోలు తీశారు. ట్రాఫిక్‌ను సరిదిద్దారు. పోలీసులు ఈ రెండు పబ్బులపై సుమోటోగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనవడికి అండగా నిలిచిన తాతయ్యలు


నాగేందర్‌కు అగ్రిమెంట్ దస్తావేజు అందిస్తున్న దృశ్యం

రహమత్‌నగర్: తల్లిదండ్రులు లేని ఓ బాలుడికి తాతయ్యలు న్యాయం చేసి మానవత చాటుకున్నారు. ఇందిరానగర్ బస్తీ ఫేజ్–2లో నివాసముండే అనసూయ భర్త చనిపోయాడు. పేదరాలైన అనసూయ దీనస్థితి చూసిన మామలు వేముల యాదయ్య, వెంకటేశ్ అనసూయకు బస్తీకి కొంత స్థలం ఇచ్చారు. అయితే అనసూయ అన్న కే.యాదయ్య సదరు స్థలం కోసం అనసూయను 2016 హత్య చేశాడు. యాదయ్యతో అనసూయ కూమరుడైన నాగేందర్‌కు ప్రమాదం ఉందని గ్రహించిన తాతలు వేముల యాదయ్య, వెంకటేశ్ బస్తీలోని స్థలం అమ్మించి బోరబండ అంబేద్కర్‌నగర్‌లో ఇల్లుకొని వారిపేరు మీద అగ్రిమెంట్ చేసుకుని నాగేందర్‌కు అండగా ఉన్నారు. నాగేందర్‌కు మైనర్ తీరక అతని అమ్మమ్మ మల్లమ్మ విజ్ఞప్తి మేరకు ఆదివారం కుల సంఘం నాయకులు సమక్షంలో వేముల యాదయ్య, వెంకటేశ్ నాగేందర్ పేరుమీద ఇల్లు అగ్రిమెంట్ చేసి దానికి సంబంధించిన దస్తావేజులు అందించారు.

అవార్డు అందజేత


అవార్డు అందుకుంటున్న అహ్మద్ షరీఫ్

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడకు చెందిన రేడియంట్ హైస్కూల్‌కు ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్–2024 అవార్డు దక్కింది. శనివారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన వేడుకల్లో స్కూల్ చైర్మన్ అహ్మద్ షరీఫ్ ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. అధ్యక్షులు డా.సోమేశ్వర్, గౌరవ అధ్యక్షులుగా గోవిందు, నర్సయ్య, కోశాధికారిగా విష్ణు, ఉపాధ్యక్షులు వరలక్ష్మీ, శివశంకర్, సత్యనారాయణ రెడ్డి, పరుశరామ్, ప్రసన్న, రవీందర్ ఎన్నికయ్యారు.

ఉద్యమకారులకు అవకాశాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు పాలన పదవుల్లో అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి మార్కలను కోరారు. ఆదివారం ఆర్ట్ కాలేజీలో ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు భట్టు శ్రీహరి అధ్యక్షత కాంగ్రెస్ విద్యార్థి ఉద్యమ సదస్సు జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినాటి నుంచి అమలు చేస్తున్న వివిధ పథకాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యకారులకు 10 కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, 2 ఎమ్మెల్సీలు, ఒక రాజ్యసభ, జిల్లా పరిషత్తు ఛైర్మన్లు, మున్సిపల్ ఛైర్మన్లు, కమిషన్ మెంబర్లతో పాటు హైదరాబాద్‌లో 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని తర్వలో సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులను కోరనున్నట్లు తెలిపారు.

ప్రతి పాఠశాల నుంచి నామినేషన్ తప్పనిసరి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ , ప్రైవేట్ , రెసిడెన్షియల్, కేంద్రీయ విద్యాలయాలు తప్పనిసరిగా తమ పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులను ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ -2024-25 నామినేట్ చేయాలని జిల్లా విద్యా శాఖాధికారిణి రోహిణి తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ -2024-25 విద్యార్థుల నామినేషన్స్ ప్రక్రియ జులై 1 నుంచి ప్రారంభమైందని, సెప్టెంబర్ 15తో ముగుస్తుందని తెలిపారు. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్స్‌పై పూర్తి అవగాహన కల్పించి, ప్రతి జోన్ నుంచి ఉపాధ్యాయ కోఆర్డినేటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రతి పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులు నామినేట్ అయ్యేలా చూడాలని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావు 7799171277 , 7981950513 , 6300869388 సంప్రదించాలని సూచించారు.

బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలి



సభలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కులగణన చేపట్టకపోతే దేశవ్యాప్తంగా అగ్గిరాజేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో సామాజిక న్యాయ జేఏసీ ఆధ్వర్యంలో మహానీయుల జాతర, బీపీ మండల్ 106వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...... బీసీలకు రిజర్వేషన్లు కల్పించి సమాజంలో తలెత్తుకునేలా చేసిన ఘనత బీపీ మండల్‌దేనని కొనియాడారు. భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నా కొన్ని వర్గాల ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇందుకు బీపీ మండల్ కమీషన్ సిఫారసులను అమలు చేయకపోవడమే ప్రధాన కారణమన్నారు. పార్లమెంట్‌లో బీపీ మండల్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని, ఆయన జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ మాట్లాడుతూ.... బీసీలంతా ఐక్యంగా ఉండాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్ యాదవ్, సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్‌లతో పాటు వివిధ రాజకీయ, కుల సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

'జమిలి పోగు' పుస్తకావిష్కరణ



జమిలి పోగు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కుప్పిలి పద్మ తదితరులు

పంజగుట్ట: జమిలి పోగు పుస్తకంలోని 12 కథల్లో ప్రతి కథ బాధ, ఆశ్చర్యం కలిగించేలా ఉన్నాయని ప్రముఖ రచయిత్రి కుప్పిలి పద్మ అన్నారు. రచయిత్రి రుబీనా పర్వీన్ రచించిన 'జమిలి పోగు' కథల సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుప్పిలి పద్మ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త సజయ, సీనియర్ సంపాదకులు ఎన్.వేణుగోపాల్, ప్రముఖ కవి విజయ్ కుమార్ కోడూరి, బిబిసీ ఎడిటర్ జి.యస్.రామ్మోహన్ పాల్గొన్నారు. పుస్తకాన్ని, కథలను తన తల్లికి అంకితం చేస్తున్నట్లు పుస్తక రచయిత రుబీనా పర్వీన్ తెలిపారు.

నైపుణ్యతతోనే విజయం సొంతం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ అనిల్ సహస్రబుధే, బిట్స్ పిలానీ వీసీ రామ్‌గోపాల్‌రావు తదితరులు

జవహర్‌నగర్: నైపుణ్యతతోనే విజయాలు సొంతమవుతాయని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుధే అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో విల్ప్ వృత్తి విద్య శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆదివారం గ్రాడ్యుయేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ అనిల్ సహస్రబుధే మాట్లాడుతూ.. సాంకేతికతలో ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతుందని, నైపుణ్యతతోనే విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. విల్ప్‌లో విద్యనభ్యసించిన వారు ప్రపంచంలోని మల్టీనేషన్ కంపెనీల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్స్ వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేలా సన్నద్ధమవ్వాలన్నారు. అనంతరం బిట్స్ పిలానీ చాన్స్‌లర్ కుమార్ మంగళం బిర్లా వర్చువల్‌గా మాట్లాడారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ రామ్‌గోపాల్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కదలరు.. వదలరు..



వాణిజ్యపన్నుల శాఖలో ప్రమోషన్లకు సీనియర్ల అడ్డంకి

బదిలీలు జరగక ఉద్యోగుల అవస్థలు......

డీపీసీ కాలపరిమితి ముగిసేలోగా పూర్తి కావడంపై అనుమానాలు

అబిడ్స్: వాణిజ్యపన్నుల శాఖలో ప్రమోషన్ల లొల్లి కొనసాగుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు శాఖల్లో ఆయా శాఖల డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ)లు సమావేశమై సీనియర్లకు ప్రమోషన్లు ఇవ్వడంతో జూనియర్లందరికీ పదోన్నతులు దక్కాయి. కానీ వాణిజ్య పన్నుల శాఖ (జీఎస్‌టీ)లో అధికారుల తీరు ఇందుకు భిన్నంగా ఉంది. కొద్దిరోజుల్లోనే డీపీసీ కాలపరిమితి ముగియనుండడంతో ఇంకెప్పుడు సమావేశమవుతారని, ఇంకెప్పుడు ప్రమోషన్లు ఇస్తారని ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు జాయింట్ కమిషనర్ స్థాయి అధికారులు డీపీసీ సమావేశం జరకుండా ఉండేందుకు ఉన్నత స్థాయిలో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు శాఖలోని పలువురు అధికారులు, సిబ్బంది ఆరోపిస్తున్నారు.

కిస్సా డివిజన్‌కా..

డివిజన్ స్థాయిలో ఉన్న అధికారులకు ప్రమోషన్లు చేపడితే వారికి రాష్ట్ర కార్యాలయంలో పోస్టింగ్‌లు లభిస్తాయి. అయితే డివిజన్లలో సకల సౌకర్యాలు లభిస్తున్నందున డీపీసీ సమావేశం కాకుండా వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే పలువురు డివిజన్ స్థాయి అధికారులు సమావేశాలు నిర్వహిస్తూ డీపీసీ సమావేశం కాకుండా పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. అధికారుల సీనియారిటీ లిస్టులు తయారైనా ఎందుకు డీపీసీ సమావేశం నిర్వహించి ఆమోదం లేదని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్యపన్నుల శాఖ (జీఎస్‌టీ) అధికారులకు డివిజన్‌స్థాయి కార్యాలయాలపైనే మక్కువ ఎక్కువ. ఒక్క డివిజన్‌లో 8 నుంచి 10 సీటీఓ కార్యాలయాలు ఉండడంతో డివిజన్ స్థాయి అధికారులు ప్రమోషన్లకు అవకాశం ఉన్నా వాటిని కాదనుకుని డివిజన్ కార్యాలయాలకే పరిమితమయ్యేందుకు శ్రద్ధ చూపుతున్నారు. వాణిజ్యపన్నుల శాఖలో డివిజన్ స్థాయి అధికారులకు ప్రమోషన్లు కల్పిస్తే పెద్ద ఎత్తున బదిలీలు జరుగుతాయి. ప్రమోషన్లు పొందిన అధికారులందరికీ వివిధ డివిజన్లలో, రాష్ట్ర కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్ల ప్రక్రియ ఆగిపోవడంతో రాష్ట్రంలోని పలు శాఖల్లో పెద్ద ఎత్తున బదిలీలు జరిగినా వాణిజ్య పన్నుల శాఖలో మాత్రం బదిలీలు జరుగడంలేదు.



వాణిజ్యపన్నుల శాఖ రాష్ట్ర కార్యాలయం

ఓ ఉన్నతాధికారి హవా..

వాణిజ్యపన్నుల శాఖ (జీఎస్‌టీ)లో సీటీఓ స్థాయి అధికారి హవా కొనసాగిస్తున్నాడు. ఏడేళ్లు ఒకే డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వేరే డివిజన్‌కు బదిలీ అయినా తిరిగి తన ట్రాన్స్‌ఫర్‌ను రద్దు చేసుకుని అదే డివిజన్‌లో కొనసాగుతున్నారు. ఇలా కొందరు అధికారులకు రాష్ట్ర సాయి ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో ఇక్కడే తిష్టవేశారు. ఇలాంటి అధికారులను ఎందుకు బదిలీ చేయడం లేదని ఇతర ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడేళ్లల్లో వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్లుగా నియమితులైన అనిల్‌కుమార్, నీతూకుమార్, టీకె.శ్రీదేవి బదిలీపై వెళ్లినా సదరు అధికారి మాత్రం ఇక్కడే ఉండటం గమనార్హం.

వాణిజ్య పన్నుల శాఖపై ఏసీబీ నజర్

వాణిజ్యపన్నుల శాఖ జీఎస్‌టీ కార్యాలయాలపై ఏసీబీ దృష్టి సారించింది. ఇటీవల పలుసార్లు దాడులు నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్న అధికారుల ఆటకట్టిస్తున్నారు. జీఎస్‌టీ, ఇతర కార్యాలయాల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా ఏసీబీ ఉన్నతాధికారులు సైతం పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

బీమా వల

- కొత్త పాలసీలు, రెన్యూవల్ పేరిట మోసాలు
- నకిలీ ఈ-మెయిల్స్, సందేశాలు పంపిస్తున్న కేటుగాళ్లు
- ఏమరపాటుగా ఉంటే బ్యాంక్ అకౌంట్లు ఖాళీ
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

సాక్షి, సిటీబ్యూరో: బీమా పాలసీలు, రెన్యూవల్ పేరుతో వచ్చే సందేశాలు, ఫోన్ కాల్స్, లింకులకు ముందు వెనకా చూసుకోకుండా స్పందిస్తే నిండా మునిగినట్టే. బహుమతులు, ఉద్యోగాలు, బీమా బదలాయింపులు, సాంకేతిక సమస్యల సాకుతో, రెన్యూవల్ పేరుతో సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ప్రముఖ బీమా కంపెనీల పేర్లతో నకిలీ ఈ-మెయిల్స్, సందేశాలు పంపి డబ్బు కొల్లగొడుతున్న సంఘటనలు ఇటీవలి కాలంలో పెరిగిపోయాయని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఎక్కువ మంది విద్యా వంతులు, వృద్ధులు ఉండటం గమనార్హం.

ప్రొవైడర్ల నుంచి డేటా కొనుగోలు..

బీమా వివరాలు, వాటి గడువు, ఇతరత్రా సమాచారం ఇటు పాలసీదారులకు, అటు బీమా సంస్థలకు మాత్రమే తెలుస్తుంది. సైబర్ నేరగాళ్లు ఈ వ్యక్తిగత సమాచారాన్ని అడ్డదారుల్లో కొనుగోలు చేస్తున్నారు. డేటా ప్రొవైడర్లు, బ్రోకింగ్ కంపెనీలు రూ.10 వేలు ఇస్తే.. లక్షలాది మంది బీమా వివరాలను అందిస్తున్నాయి. ఇందులో పాలసీ వివరాలు, వాటి గడువు, వాహనాల నంబర్లు, వాటి ఇన్సూరెన్స్ పాలసీలు ఇలా పూర్తిగా వివరాలు వారి కేతికి అందుతున్నాయి. ఈ సమాచారంతో సైబర్ నేరగాళ్లు పాలసీదారులకు ఫోన్లు, మెసేజ్‌లు చేసి కొత్త బీమా, రెన్యూవల్‌తో అధిక లాభాలు, బహుమతులు అందుకోవచ్చని నమ్మించి బ్యాంకు ఖాతా వివరాలను సేకరిస్తున్నారు. వీటితో అకౌంట్లు ఖాళీ చేసేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- రెన్యూవల్, పాలసీ బదలాయింపు పేరుతో వచ్చే ఈ-మెయిల్స్, సందేశాలను నమ్మకూడదు.
- ప్రస్తుతం ఉన్న బీమా పాలసీకి బదులుగా కొత్తది తీసుకుంటే అధిక లాభాలు వస్తాయని చెప్పే మాయమాటలను విశ్వసించకూడదు.
- బీమా పాలసీలో మార్పులు చేసుకోవాల్సి వస్తే సదరు బీమా సంస్థను సంప్రదించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.
- ఇన్సూరెన్స్ వెరిఫికేషన్ కోసమని చెప్పి మీ పాన్, ఆధార్ నంబర్లు, బ్యాంకు వివరాలను అడిగితే.. అది సైబర్ మోసమేనని గుర్తించాలి.



నిజాయితీ అధికారుల సమాచారం ఇవ్వండి..

- పోస్టర్ ఆవిష్కరించిన సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్
- యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో అవినీతి రహిత అధికారులకు సత్కారం



సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో నిజాయితీగా పనిచేసిన, పనిచేస్తున్న అధికారుల సమాచారాన్ని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థకు అందించాలని సంస్థ సలహాదారు, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అన్నారు. నగరంలోని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో ఆదివారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ.., సమాజంలో రోజురోజుకు అవినీతి పెరిగిపోతుందని, దానిని నిర్మూలించే క్రమంలో నిజాయితీగా పనిచేసే వారిని గుర్తించి సత్కరిస్తూ నేటి తరానికి పరిచయం చేయబోతున్నామన్నారు. మన చుట్టూ ఎంతోమంది నిజాయితీగా పనిచేస్తున్నారనే విషయం చాలా మందికి తెలియదని, అలాంటి వారిని యువతరానికి స్ఫూర్తిగా నిలిపే బాధ్యతను తమ సంస్థ తీసుకుందన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ.. ఇది దేశంలో నిజాయితీపరుల సంఖ్యను పెంచే వినూత్న కార్యక్రమంగా పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న నిజాయితీ అధికారుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవినీతి రహిత సమాజం కోసం విడతల వారీగా నిజాయితీ అధికారులను, నాయకులను, సర్పంచులను సత్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సభ్యులు కొమటి రమేశ్ బాబు, బత్తిని రాజేశ్, జి.హరిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే కిడ్స్

'సౌత్ ఇండియా కరాటే'లో నగర విద్యార్థుల సత్తా

సాక్షి, సిటీబ్యూరో: సౌత్ ఇండియా కరాటే అసోసియేషన్, తమిళనాడు స్టేట్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 3వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొన్న నగర విద్యార్థులు మెడల్స్‌తో రాణించారు. వివిధ విభాగాల్లో రిత్విన్ సాయి, రాఘవ్, రియాన్ బంగారు పతకాలు సాధించారు. వీరితో పాటు శ్రేయాస్ యాదవ్, దేవాన్ష్, శ్రేయోషి రూజ్ వెండి పతకాలు, షేక్ అర్హాన్, తాడూరి మోక్షిత్, జనిత్ రాజూరి కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన వారిని తెలంగాణ షోబుకాయ్ ప్రెసిడెంట్, హెడ్ కోచ్ షిహాన్ సఫీ ఉద్దీన్ అభినందించారు.



జనంలో నుంచి పుట్టిందే జానపదం



నల్ల తీగల శ్రీనివాసచార్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనచారి తదితరులు

చిక్కడపల్లి: జనంలో నుంచి పుట్టింది జానపదమని తెలంగాణలో జానపద కళాకారులు అధికంగా ఉన్నారని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ జానపద దినోత్సవానికి ఆయన తెలంగాణ కళల వేదిక వ్యవస్థాపకులు పేరాల చంద్రశేఖర్‌రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులకు బహుమతులను అందజేశారు. ఐకాన్ అవార్డు గ్రహీతలు నర్ల సురేష్, డాక్టర్ నల్లతీగ శ్రీనివాసాచార్యులు, వీవీ మహేశ్వర్‌రావు, వీణా ప్రకాష్‌సింగ్, డాక్టర్ సరికొండ రమాదేవి, డాక్టర్ బి.శోభారాణి, కె.మంజుల, డాక్టర్ పిట్టల అంజయ్య, మేడిశెట్టి వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కళ కళ కోసంకాదు-సమాజ హితం కోసం అనే అంశంపై కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పేరాల చంద్రశేఖర్‌రావు, డాక్టర్ రాధా కుసుమ, ఎన్.వేణుగోపాలశర్మ, కె.మురళీమోహన్‌రాజు, అందే శ్రీధర్‌రెడ్డి, వై.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

మారథాన్‌లో ఆప్టమ్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఆదివారం జరిగిన ఎన్ఎమ్‌డీసీ మారథాన్‌లో మాదాపూర్‌లో ఉన్న ఆప్టమ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగులు గణనీయసంఖ్యలో పాల్గొన్నారు. ఈ మారథాన్‌లో తమ సంస్థకు చెందిన 1,486 మంది ఉద్యోగులు పాల్గొన్నారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆప్టమ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్పొరేట్ ట్రోఫీని అందజేశారని సంతోషం వ్యక్తం చేశారు.



ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ నేరుగా జీతాలు చెల్లించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ పద్మ, సీఐటీయూ నగర అధ్యక్షుడు జె .కుమారస్వామి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పిస్తూ హెల్త్ కార్డులు మంజూరు చేయలన్నారు. ప్రతి సంవత్సరం రూ. వెయ్యి ఇంక్రిమెంట్ కల్పించి గవర్నమెంట్ విడుదల చేసే ప్రతి నోటిఫికేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజ్ మార్కులు కలపాలన్నారు. ఔట్‌సోర్సింగ్‌ఉద్యోగులు వారి జీవిత కాలం పనిచేసిన ఎలాంటి ప్రయోజనాలు కల్పించకపోవడం దారుణమన్నారు. సర్వీస్‌లో మరణించిన, రిటైరైన ఉద్యోగులు కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందజేసి కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సెలవులను 15 నుండి 30కి పెంచాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. తెలంగాణ స్టేట్ ఆర్టిజెన్ ఎంప్లాయిస్ కార్పొరేషన్‌ను యాక్ట్ ఆఫ్ 1946 చట్టం ప్రకారం వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులి లక్ష్మయ్య, బొల్లం గోవర్ధన్, సంతోష్‌కుమార్, శ్రీధర్, జె. కృష్ణ, జె. సంధ్య, కె. విజయలక్ష్మి, జె. వినోద్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి


తుది మెరుగులు







మండపాలకు తరలి వెళ్లేందుకు గణనాథులు ముస్తాబవుతున్నారు. రెండు వారాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యాపారులు గణపతులకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆదివారం కనిపించిన దృశ్యమిదీ...

సాక్షి, ఫొటోగ్రాఫర్







జల వనరుల పరిరక్షణ అందరి బాధ్యత

- చెరువులను రక్షించుకోకుంటే విపత్కర పరిస్థితులు
- నీటి నిల్వసామర్థ్యం పెంచుకునేలా చూడాలి
- సామాజిక కార్యకర్త లుబ్నా సర్వత్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో వర్షం వస్తే చెరువుల్లో నీరు తొలగిస్తున్నారు. మనం చేయాల్సింది ఆక్రమణలు తొలగించాలి.. పూడిక తీయాలని సామాజిక కార్యకర్త లుబ్నా సర్వత్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'హైడ్రాలజీ ఆఫ్ లేక్స్, హైడ్రా రీ స్టోరేషన్ ఆఫ్ అవర్ వాటర్ బాడీస్' రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో 'ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లు ఉన్నాయి. మూసీ నదికి ఇరువైపులా వందలాది చెరువులు, వేలాది బావులు ఉన్నందున, వర్షం పడినపుడు వరద సమస్యే ఉండరాదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా ఎక్కడి నీరు అలా వెళ్లిపోయేలా ఉందన్నారు. అయితే వనరుల ఆక్రమణలు, పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోక నిర్వీర్యమైపోతున్నాయన్నారు. ఇప్పటికైనా అందరూ బాధ్యత తీసుకోవాలని లేని పక్షంలో బెంగళూరు, ఢిల్లీలా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో నీటి వనరుల ఆక్రమణలపై తాను 14 పిల్స్ వేశానని, వందలాది రిప్రజెంటేషన్స్ ఇచ్చినట్లు తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో పది ఎకరాలు ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలు ఉన్నాయని, కూల్చివేతల్లో మొత్తం పెద్దలే ఉన్నారన్నారు. ఘట్‌కేసర్ పరిశర ప్రాంతాల్లో గాలి, నీరు, ఆహారం కలుషితమవుతోందని సామాజిక కార్యకర్త పిట్టల శ్రీశైలం అన్నారు. వ్యర్థ రసాయన జలాలు మూసీలో వదిలేస్తున్నారని వాటిని నివారించాలని కోరారు. మూసీ పొడవునా ఈటీపీ, ఎస్‌టీపీలను నిర్మించాలని సూచించారు. ఘట్‌కేసర్‌లో హెచ్ఎండీఏ అనుమతులతో చెరువు శిఖం భూమిలో అపార్ట్‌మెంట్ నిర్మించినట్లు తెలిపారు. నాడెం చెరువులో 3 ఎకరాలకు బ్యాంకులు రూ.13 కోట్ల రుణం ఇచ్చాయన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రైవేటు ఆస్తులను మాత్రమే కూలగొడుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో చెరువుల్లో రోడ్లు వేశారని, సుందరీకరణ పేరుతో ట్యాంక్‌లను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాచేసిన వ్యక్తులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారని, వారిని పార్టీలు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పెబల్ సిటీ సమీపంలో పీరం చెరువు 50 ఎకరాలు ఉండేదని, ఇపుడు 20 ఎకరాలకు చేరిందని, బండ్లగూడ జాగీర్‌లో ఉన్న చెరువులు కబ్జాలకు గురవుతున్నాయన్నారు. ఆక్రమణలు, ఇతర సమస్యలను అరికట్టడానికకి లేక్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉస్మాన్‌సాగర్ సుమారు పది వేల ఎకరాలు ఉండేదని, అందులో దాదాపు 40 శాతం కబ్జాకు గురైందని, ఇపుడు 6,300 ఎకరాలు ఉన్నట్లు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ విశ్రాంత ఉద్యోగి కొండల్‌రావు, సామాజిక కార్యకర్త రహీంఉన్నీసాబేగం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 26, ఆగస్టు, 2024

నేను ఫ్యాషన్ లవర్ని అని చెప్పకుండానే చెప్పే మార్గం టాటూ.. ఇప్పుడు వయసుతో పనిలేకుండా అన్ని వర్గాల వారూ టాటూస్ని ముద్రించుకోవడం నగరంలో సర్వసాధారణంగా కనిపిస్తోంది. వాస్తవానికి ఎప్పటి నుంచో టాటూస్ వినియోగంలో అనుభవం ఉన్నవారితోపాటు కొత్తగా వాటి పట్ల ఆసక్తి పెంచుకుంటున్నవారికీ కొదవలేదు. ఈ నేపథ్యంలో ఎంత ఫ్యాషన్ అయినప్పటికీ టాటూ కల్చర్లోకి అడుగుపెట్టే ముందు కొన్ని జాగ్రత్తలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



వస్త్రోత్పత్తుల సోయగం

- శిల్పకళావేదికగా హ్యాండ్ టు హ్యాండ్ చేనేత ప్రదర్శన షురూ..
- ప్రారంభించిన మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ చందనా జయరాం

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్లోని శిల్పకళావేదికలో మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ చందనా జయరాం సందడి చేశారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన హ్యాండ్ టు హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శనను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ కొలువుదీరిన వస్త్రోత్పత్తుల గురించి చేనేత కళాకారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అనాదిగా వస్తున్న మన సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. వేడుకలు, సంబరాల్లో ఫ్యాషన్ వేర్ కన్నా ఇలాంటి ఉత్పత్తులవైపే యువత ఎక్కువ మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా దాదాపు 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని నిర్వాహకులు జయేష్ గుప్తా తెలిపారు. ఇందులో భాగంగా 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

వినూత్నంగా మెటల్ సిరీస్ వాచ్లు

సాక్షి, సిటీబ్యూరో: అధునాతన ఫ్యాషన్ హంగులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకునే హైదరాబాద్ నగర వేదికగా బోల్డ్–ఫ్యాషన్–ఫార్వర్డ్ మెటల్ సిరీస్ వాచ్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రముఖ 'ఫాస్ట్రాక్ స్మార్ట్' ఆధ్వర్యంలో ఆవిష్కరించిన ఈ మెటల్ సిరీస్ యువతను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా టైటాన్ కంపెనీ సేల్స్ హెడ్ ఆదిత్యరాజ్ మాట్లాడుతూ ఫాస్ట్రాక్ స్టెయిన్లెస్–స్టీల్ వాచ్ల నుంచి ప్రేరణ పొంది ఈ స్మార్ట్వాచ్ కలెక్షన్ ప్రీమియం–గ్రేడ్ మెటల్తో రూపొందించామని తెలిపారు. అధునాతన ఫ్యాషన్ గాడ్జెట్స్ను ఆస్వాదించడంలో నగరం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.



ఫుడ్ లవర్స్ అడ్డా.. హైదరాబాద్

'హైబిజ్' కార్యక్రమంలో ఫరియా అబ్దుల్లా సందడి



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హోటల్ తాజ్ దక్కన్ వేదికగా జరిగిన 3వ ఎడిషన్ హైబిజ్ టీవీ ఫుడ్ అవార్డ్స్ ప్రదాన కార్యక్రమంలో టాలీవుడ్ నటి ఫరియా అబ్దుల్లా సందడి చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై.. ఫుడ్ గ్రాఫ్లో నగరాన్ని అత్యున్నత స్థానానికి తీసుకొచ్చేందుకు కృషి చేసిన వ్యక్తులతోపాటు హోటళ్లు, రెస్టారెంట్లు తదితర బ్రాండ్లకు 50 పురస్కారాలను ప్రదానం చేసింది. కంట్రీ ఓవెన్ ఫౌండర్ డాక్టర్ సుధాకర్ రావు, వివేరా హోటల్స్ ఛైర్మన్ సద్ది వెంకట్రెడ్డిలకు లెజెండ్ అవార్డులను అందజేసింది. 'హైదరాబాద్ అంటేనే ఒక ఎమోషన్. నగరవాసులు ఫుడ్ను ప్రేమిస్తారు, ఆస్వాదిస్తారు' అని ఆమె అన్నారు. తనకు కట్టీ దాల్ చావల్ ఫేవరేట్ ఫుడ్ అని చెప్పారు. ఈ వేడుకల్లో భాగంగా మిస్ యూనివర్స్ తెలంగాణ నిహారిక సూద్, మిస్ గ్రాండ్ ఇండియా 2022 ప్రాచీ నాగ్పాల్ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సుచిరిండియా సీఈవో లయన్ డాక్టర్ వై.కిరణ్, జెమిని ఎడిబుల్స్ సేల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్రెడ్డి, విమల ఫీడ్స్ మధుసూదన్రావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



ట్రెండీ..టాటూ

ఇవి తెలియకుంటే తప్పదు చేటు!

టాటూ వేయించుకోవడానికి ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవడం ఎందుకో తెలియాలంటే.. టాటూ సైడ్ ఎఫెక్ట్స్ గురించి కూడా మనం తెలుసుకోవాలి. అప్పుడే ప్రిపరేషన్ లోపిస్తే వచ్చే పరేషాన్ ఏమిటో అర్థం అవుతుంది.

అనారోగ్య 'ముద్ర'..

అనస్థీషియా లేకుండా టాటూ వేయడం వల్ల కొంత నొప్పి, రక్తస్రావం కలిగే అవకాశం ఉంది. దీని గురించి ముందుగా తెలుసుకోవడం అవసరం. అలాగే టాటూ ఇంక్లో ఉండే రసాయనాలు లేదా లోహాలు, ప్రత్యేకించి కొన్ని రంగుల కారణంగా కొంతమందిలో అలర్జీ వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు దురద, దద్దుర్లు, వాపు తదితర లక్షణాలు టాటూ వేయించుకున్న వెంటనే లేదా కొన్ని సంవత్సరాల తర్వాత కూడా కనపడవచ్చు. టాటూల వల్ల అరుదుగా చర్మ కారక క్యాన్సర్కు కూడా కారణం కావచ్చు. ఎందుకంటే కొన్ని రంగులు లేదా వర్ణ ద్రవ్యాలు క్యాన్సర్ కారకాలు కావచ్చు.



ముద్రకు ముందు ముందస్తు జాగ్రత్తలు అవసరం

టాటూ వేయడానికి ముందు, దానికి వినియోగించే సూదులు క్రిమిరహితంగా ఉన్నాయని నిర్ధారించుకోవడం చాలా ముఖ్యం. స్టెరిలైజ్ చేయని లేదా కలుషితమైన సూదులను ఉపయోగించడం వల్ల హెచ్ఐవీ, హెపటైటిస్ బీ–సీ వంటి రక్తం ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడే ప్రమాదం పెరుగుతుంది.

- వెంటనే లేదా టాటూ వేసిన మొదటి రెండు వారాల్లో స్కిన్ ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. వాపు, నొప్పి, ఎరుపు, దురద లేదా దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటాయి. తీవ్రమైన సందర్భాల్లో జ్వరం, పుండ్లు లేదా చీముకు దారితీస్తుంది. శరీరంలోకి ఇంజెక్ట్ చేసే ముందు నాన్ స్టెరైల్ వాటర్ని కలిపితే స్కిన్ ఇన్ఫెక్షన్ కూడా రావచ్చు. కాబట్టి తరచి చూసుకోవడం అవసరం.
- ఎంఆర్ఐ స్కానింగ్ ప్రక్రియలు చేయించుకుంటున్న రోగులు పచ్చబొట్టు పొడిచిన ప్రదేశంలో మంట, దురద లేదా వాపును అనుభవించవచ్చు.
- ఇది తక్కువ–నాణ్యత లేని రంగులు లేదా టాటూ పిగ్మెంట్లలో ఐరన్ ఆక్సైడ్ వంటి రసాయనాల వల్ల కూడా కావచ్చు.
- టాటూ వేయడానికి అయ్యే ఖర్చు కళాకారుడిపై మాత్రమే కాక ఉపయోగించిన సిరా రకం, పచ్చబొట్టు పరిమాణం, ఇంక్ చేయాల్సిన ప్రాంతం మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుంది. ఖర్చుతో రాజీపడకుండా పేరున్న కళాకారుడితో టాటూ వేయించుకోవడం మేలు.

అజాగ్రత్తగా ఉంటే ఆరోగ్య సమస్యలు తప్పవు

- టాటూ వేయించుకున్న కొన్ని నెలల తర్వాత రంగు వాడిపోతుంది. కాబట్టి, రంగు సాంద్రతను స్థిరీకరించడానికి కొన్ని టచ్–అప్లు అవసరం కావచ్చు.
- స్కిన్ ఇన్ఫెక్షన్లు లేదా ఇతర సమస్యలను నివారించడానికి టాటూ అనంతర సంరక్షణ చాలా ముఖ్యం. ఆ ప్రాంతం పూర్తిగా నయం అయ్యే వరకూ కళాకారుడి సలహాను పాటించండి.



జాగ్రత్తలు ఇలా...

> క్రిమి రహితం చేసిన సూదులు, మంచి నాణ్యమైన పిగ్మెంట్లు, ఉపయోగించిన సూదులు సరిగ్గా డిస్పోజ్ చేయడం వంటి ప్రమాణాలు పాటించే పేరున్న, లైసెన్స్ పొందిన స్టూడియోను ఎంచుకోవాలి. పరిశుభ్రతగల పరికరాలు భద్రతా ప్రమాణాలకు కొలమానాలు. అవి మన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచేందుకు వీలుంటుంది.

> పచ్చబొట్టు వేసుకునే రోజున, ప్రక్రియ సమయంలో ఆకలి బాధలు, తల తిరగడం లేదా మూర్ఛ వంటివి నివారించడానికి పుష్కలంగా నీరు తాగండి. తగినంత ఆహారం తీసుకోండి. టాటూ వేయించుకోవడానికి ముందు రోజు రాత్రి తగినంత నిద్రకావాలి.

> స్వతహాగా చర్మ అలర్జీలకు గురయ్యే అవకాశం ఉన్నట్లయితే లేదా ముందుగా వ్యాధులు ఏవైనా ఉంటే, పచ్చబొట్టు వేయించుకునే ముందు వాటి గురించి వైద్యునితో చర్చించి వారి సలహా మేరకు టాటూ వేయించుకోవాలి.

ఫ్యాషన్ సరే.. ప్రిపరేషన్ ముఖ్యమంటున్న నిపుణులు

- టాటూలు వేసే పదాల స్పెల్లింగ్లు సరైనవని నిర్ధారించుకోవాలి. ఒక్కసారి టాటూ పూర్తయిన తర్వాత అక్షర దోషాలను సరిదిద్దలేరు.
- మధుమేహం నియంత్రణలో లేకుంటే వైద్య సలహా తీసుకోవడం మంచిది.
- టాటూ ఆర్టిస్ట్ చేతులను కడుక్కొని, స్టెరిలైజ్ చేసుకున్న తర్వాత టాటూ ప్రక్రియకు ముందు కొత్త గ్లౌజ్లు ఉపయోగిస్తున్నారని నిర్ధారించుకోండి.
- ప్రక్రియకు 24 గంటల ముందు కెఫిన్ లేదా ఆల్కహాల్ను తీసుకోవద్దు. ఈ పదార్థాలు రక్తాన్ని పలచన చేసేవిగా వైద్యులు చెబుతున్న నేపథ్యంలో ప్రక్రియ సమయంలో అధిక రక్తస్రావం ఉండవచ్చు.
- టాటూ కోసం ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోవలసి ఉంటుంది కాబట్టి వదులుగా సౌకర్యవంతంగా ఉండే దుస్తులను ధరించడం మంచిది.
- కనీసం 24 నుంచి 48 గంటల ముందు రక్తాన్ని పలచబరిచే మందులను తీసుకోకుండా ఉండటం మంచిది.

శుభ్రతతోనే.. సురక్షితం...



టాటూకి సురక్షితమైన ప్రొఫెషనల్ స్టూడియోను ఎంచుకోవాలి. ఆ ప్రదేశం కూడా పూర్తి పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా ఉండాలి. ఎటువంటి సందేహాలు కలిగినా ఆర్టిస్ట్ను ప్రశ్నించాలి. నీడిల్స్ తమ ముందే ఓపెన్ చేయాలని కోరాలి. రీ యూజబుల్ మెటీరియల్ అంతా ఆటో క్లోవ్లో స్టెరైల్ చేశారో లేదో గమనించాలి. అలాగే టాటూ వేసే సమయంలో నొప్పి భరించగలిగినంతే ఉంటుంది. అయితే శరీరంలో తల, పాదాలు, చేతుల అడుగు భాగం, పొత్తికడుపు, వెన్నెముక వంటి కొన్ని భాగాల్లోని చర్మ స్వభావం వల్ల కొంచెం నొప్పి ఎక్కువగా అనిపించవచ్చు. టాటూ వేసే సమయంలో వేసిన తర్వాత, కొన్ని రోజుల పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పూర్తిగా తెలుసుకోవాలి.

–అమిన్, టాటూ ఆర్టిస్ట్




మెయిడ్ కావాలా నాయనా?

పనిమనిషి కోసం ఓ ప్రత్యేక ప్లాట్ఫామ్

- ఉద్యోగాలు చేసుకునేవారికి ఎంతో మేలు
- ఉచిత సేవలందిస్తూ స్ఫూర్తివంతంగా నిలుస్తున్న ప్రీతి

సాక్షి, సిటీబ్యూరో: ఏ ఇంట చూసినా ఇంతి పని అంతా ఇంతాకాదు. పొద్దుతో ఆమె పోటీ పడుతోంది. ఉద్యోగ జీవనంలో ఇంటిపని, వంటపనికి అదనంగా ఇప్పుడు ఆమెకు ఆఫీస్ పని తోడైంది. లివింగ్ కాస్ట్, ఇతర ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో భార్యాభర్తలు జాబ్ చేస్తేనే, అనుకున్న లైఫ్ను లీడ్ చేయొచ్చని చాలామంది భావిస్తున్నారు. మహిళాసాధికారత పెరిగిన తర్వాత భర్తతోపాటు భార్య కూడా ఉద్యోగం చేస్తోంది. అదనపు పని, అదనపు ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఆమెకు పనిమనిషి అవసరం చాలా ఏర్పడింది. హైటెక్సిటీ లాంటి సాఫ్ట్వేర్ కంపెనీలు ఉన్న ప్రాంతాల్లో పనిమనుషులకు చాలా డిమాండ్ ఉంది. ఎంతగా అంటే ఎంత డబ్బు ఇచ్చినా కూడా ఖాళీగా లేము అనేంతగా..! ఇలాంటి సమస్యకు ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగి వినూత్న పరిష్కారం చూపుతున్నారు. 'ఆస్క్ లో' పేరుతో వాట్సాప్ వేదికగా ఈ ఆలోచనకు రూపం ఇచ్చారు. ఇలా నలుగురికి సాయపడేందుకు ప్రయత్నిస్తున్నారు. పనిమనుషులు, వంటవారు, డ్రైవర్లు కావాలనుకుంటే.. 'ఆస్క్ లో' వాట్సాప్కు మెసేజ్ పెడితే చాలు, మీకు కావాల్సిన పని చిటికెలో అయిపోతుందని చెబుతున్నారు. మీ మెసేజ్ పనిమనుషులు, డ్రైవర్లకు వెళ్తుంది. అది కూడా వాయిస్ రూపంలో తెలుగులో ఆటోమాటిక్గా పంపిస్తారు. మీకు కావాల్సిన సమయంలో వాళ్లు ఖాళీగా ఉంటే తాము వస్తామని తిరిగి మెసేజ్ చేస్తారు. అయితే అప్పటివరకే కాకుండా పూర్తిస్థాయిలో కూడా ఏ టైమ్కు రావాలో కూడా మాట్లాడుకుని పనికు కుదుర్చుకోవచ్చు. ఇలా పనిమనుషులు, డ్రైవర్లకు పని దొరకడంతోపాటు అవసరం ఉన్న ఉద్యోగులకు కూడా మేలు జరుగుతోంది. రెండు పార్టీల నడుమ మధ్యవర్తి లేకుండా నేరుగా వారే మాట్లాడుకునే వీలుంది.



చిరు ప్రయత్నం..

రాజస్థాన్కు చెందిన ప్రీతి 20 ఏళ్ల కింద హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. 10 ఏళ్ల నుంచి సాఫ్ట్వేర్గా పనిచేస్తున్నారు. నిత్యజీవితంలో ఎదురైన అనుభవాలు ఈ స్టార్టప్ ఏర్పాటు చేసేందుకు దోహదపడ్డాయని ప్రీతి పేర్కొన్నారు.

మహిళలకు ఉపయోగంగా ఉంటుందని..

ఎప్పటి నుంచో సామాన్యులకు ఏదైనా చేయాలనే ఆలోచన ఉండేదని, అది ఈ వేదిక ఏర్పాటుతో నెరవేరిందని ప్రీతి చెబుతున్నారు. అప్లికేషన్ లేదా వెబ్సైట్తో సంబంధం లేకుండా ఈ సేవలు వినియోగించుకోవచ్చని పేర్కొంటున్నారు. పైగా గ్రామాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారికి అప్లికేషన్స్ వెబ్సైట్ వాడటం రాకపోవచ్చు. అందుకే అలాంటివారికి సులువుగా పనిదొరికే విధంగా ఈ ప్లాట్ఫారం ఉపయోగపడుతుందని వివరించారు.

సేవా దృక్పథంతో..



సమాజానికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఈ సేవలను అందిస్తున్నా. భవిష్యత్తులో సేవలు మరింత మందికి అందించాలని భావిస్తున్నా. ఇప్పుడు నేను నివసిస్తున్న గచ్చిబౌలి ప్రాంతంలో మాత్రమే అందిస్తున్నా. చాలామంది ఈ సేవలను మెచ్చుకుంటున్నారు. చాలా సంతోషంగా ఉంది. కాస్త ఇబ్బంది అయినా వారి ప్రశంసలతో ముందుకు వెళ్లాలనే ఆకాంక్ష పెరుగుతోంది.

–ప్రీతి, ఆస్క్ లో, వ్యవస్థాపకురాలు

జర్నీ ఆఫ్ రిథమ్స్

ఈ నెల 31న ప్రత్యేక నాట్యప్రదర్శన





సాక్షి, సిటీబ్యూరో: 'అది ఒక రైల్వేస్టేషన్... పదహారు మంది నాట్యకారిణులు అందరూ ఒకే తరహా దుస్తులు, లగేజ్ ట్రాలీలతో ప్లాట్ఫాంపై సిద్ధంగా ఉన్నారు. రైలు ఎప్పుడు వస్తుందా.. అని ఎదురుచూస్తున్నారు. ఇంతలో రైలు ఆలస్యంగా వస్తుందని తెలవడంతో తమ పర్యటనలో భాగంగా ఏయే నగరాలను సందర్శించాలో చర్చించుకుంటున్నారు. ఆయా నగరాల్లో ప్రసిద్ధి చెందిన సంగీత రీతుల్లో భరతనాట్య ప్రదర్శన ఇవ్వాలని నిర్ణయించుకున్నారు..' ఇంతకీ ఇది ఏ రైల్వేస్టేషన్లో జరిగిందనేకదా.. మీ అనుమానం! ఇది నిజంగా జరగలేదు కానీ.. ఇలాంటి థీమ్తో ఓ నాట్యప్రదర్శన ఈ నెల 31న సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని గచ్చిబౌలి గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరగనుంది. భరతనాట్యాన్ని మాధ్యమంగా చేసుకుని దేశంలోని ముఖ్యమైన 16 సంగీత రీతులను ప్రయోగాత్మకంగా ప్రదర్శించనున్నారు. శివాన్ష్ మ్యూజిక్ అకాడమీ, తత్వ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. దాదాపు 1.45 గంటలపాటు ఈ నాట్య ప్రదర్శన నాన్స్టాప్గా సాగనుంది. ఈ ప్రయోగం కోసం 6 నెలలపాటు శ్రమించినట్లు శివాన్ష్ అకాడమీ నిర్వాహకురాలు, భరతనాట్య కళాకారిణి మైత్రీరావు చెప్పారు. 'జర్నీ ఆఫ్ రిథమ్స్' పేరిట సాగే ఈ నాట్య ప్రదర్శనకు ప్రముఖ రంగస్థల నటి, కర్ణాటక జానపద అకాడమీ అధ్యక్షురాలు పద్మశ్రీ మంజమ్మ జోగతి హాజరుకానున్నారు.

క్లుప్తంగా...

తెలుగు భాష అద్భుతం
'మన్ కీ బాత్'లో కొనియాడిన ప్రధాని



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు భాష అద్భుతం అని ప్రధాని మోదీ కొనియాడారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం '113వ మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. 'మిత్రులారా.. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం. ఇది నిజంగా అద్భుతమైన భాష. ప్రపంచవ్యాప్తంగా తెలుగు మాట్లాడే వారికి తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ మోదీ తెలుగులోనే శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు
మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ప్రజలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో సంతోషకరంగా ఈ పండుగ జరుపుకోవాలని ఆయన అభిలషించారు. రాష్ట్రంపైన, ప్రజలపైన శ్రీ కృష్ణ భగవానుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

తిరుమలలో ఎనిమిది ప్రథమ చికిత్సా కేంద్రాలు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4–12 వరకు జరగనున్న నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో 8 ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. లక్షలాదిగా వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో 2, రాంబగీచా అతిథి గృహాలు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, శిలాతోరణం, బాట గంగమ్మ ఆలయం, పాపవినాశనం, 7వ మైలు వద్ద ఒక్కొక్కటి చొప్పున వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, మందులు, అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్‌లను టీటీడీ సిద్ధం చేస్తోంది.

ఆలయ మహాద్వార గోపురానికి రంగులు
శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే శ్రీవారి ఆలయం, మాడవీధుల వద్ద మరమ్మతు పనులు ప్రారంభమవగా.. తాజాగా..శ్రీవారి ఆలయ మహాద్వార గోపురం వద్ద కార్మికులు రంగులు అద్దుతున్నారు. ఇంజినీరింగ్ పనులూ జోరుగా సాగుతున్నాయి.

శ్రీవారి సేవలో ప్రముఖులు
శ్రీవారిని ప్రముఖ క్రికెటర్ ఉమేష్ యాదవ్, సినీ గేయ రచయిత రామ జోగయ్య శాస్త్రి ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

త్వరలో టీటీడీపీకి కొత్త కమిటీలు
- ఇప్పటివరకు ఉన్న కమిటీలన్నీ రద్దు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటన
- చంద్రబాబును కలసిన బాబూమోహన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తెలుగుదేశం పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ఆ పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు వచ్చిన ఆయన టీటీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో టీటీడీపీని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందుకే పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలను రద్దు చేశామని, త్వరలోనే కొత్త కమిటీలు వేస్తామని వెల్లడించారు. ఇకపై తెలంగాణకు ప్రతీ 15 రోజులకొకసారి వస్తానని చెప్పారు.

చంద్రబాబుని కలసిన బాబూమోహన్
ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కి వచ్చిన చంద్రబాబును మాజీ మంత్రి బాబూమోహన్ కలిసి కొద్దిసేపు మాట్లాడి వెళ్లిపోయారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేసిన బాబూమోహన్ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి ఆందోల్ ఎమ్మెల్యే అయ్యారు. అనంతరం బీజేపీలో చేరారు. కాగా బాబూమోహన్ త్వరలో టీటీడీపీలో చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని, దశల వారీగా నిర్మాణాలు చేపట్టి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుతమున్న భవనాలకు అద్దెలు, విద్యుత్, వాటర్ చార్జీలు, వాహనాల అద్దె లాంటి బకాయిలను త్వరలోనే విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయండి
ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ల విషయంలో అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. భూముల విలువల సవరణ ప్రక్రియ విషయంలో థర్డ్ పార్టీ నివేదిక వచ్చిన తర్వాత త్వరలోనే మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. కాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఐజీ బుద్ధ ప్రకాశ్‌జ్యోతి శాఖ పనితీరు గురించి మంత్రికి వివరించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక నివేదికను మంత్రి పొంగులేటి విడుదల చేశారు. సమావేశంలో అదనపు ఐజీలు, డీఐజీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అది నేనే.. ఇదీ నేనే

పెన్షన్ స్కీమ్‌పై చంద్రబాబు ద్వంద్వ వైఖరి

ఉద్యోగుల మేలు కోసం వైఎస్ జగన్ సర్కారు మెరుగైన జీపీఎస్ తెస్తే వ్యతిరేకం

ఇప్పుడు తాను భాగస్వామిగా ఉన్న కేంద్రం అలాంటి పెన్షన్ స్కీమ్ తెస్తే నోరు మెదపని బాబు



సాక్షి, అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగుల పింఛన్ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు ద్వంద్వ వైఖరిపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వం మెరుగైన పింఛన్ వచ్చేలా గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తెస్తే చంద్రబాబు వ్యతిరేకించారని గుర్తు చేస్తున్నారు. జీపీఎస్ విధానంతో ఉద్యోగులకు నష్టం జరుగుతుందని.. సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుతోపాటు కూటమి నేతలు ప్రచారం చేశారని ఉద్యోగుల సంఘాల నేతలు గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంయుక్తంగా విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకొస్తామని హామీ ఇచ్చారని పేర్కొంటున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్‌ను వ్యతిరేకించిన చంద్రబాబు తాను భాగస్వామిగా ఉన్న కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) పేరుతో జీపీఎస్ తరహాలోనే తెచ్చినా నోరుమెదపకపోవడంపై తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇది ఆయన రెండు కళ్ల సిద్ధాంతానికి అద్దం పడుతోందని ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీపీఎస్ తరహాలోనే యూపీఎస్‌ను తెచ్చినా..
దాదాపు జీపీఎస్ తరహాలోనే తాజాగా కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను తెచ్చిందని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. అయినప్పటికీ కేంద్ర మంత్రిమండలిలో ఇద్దరు టీడీపీ సభ్యులు ఉన్నా చంద్రబాబు వ్యతిరేకించకపోవడంపై మండిపడుతున్నారు. ఇది చంద్రబాబు, కూటమి నేతలు సీపీఎస్ ఉద్యోగులను మోసం చేయడమేనని సీపీఎస్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీపీఎస్ వల్ల ఉద్యోగులకు నష్టం జరుగుతుందని ఎన్నికల్లో ప్రచారం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు కేంద్రం తీసుకువచ్చిన యూపీఎస్ వల్ల కూడా అంతే నష్టం జరుగుతున్నా నోరు విప్పకపోవడం ఏంటని నిలదీస్తున్నారు. సీపీఎస్ ఉద్యోగులను దగా చేయడమే ఆయన ఉద్దేశమని దుయ్యబడుతున్నారు.

> ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి తన ద్వంద్వ వైఖరిని ప్రదర్శించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని కోణాల్లో ఆలోచించి ఉద్యోగుల మేలు కోసం గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ను తెస్తే ఆయన గగ్గోలు పెట్టారు. దీనివల్ల ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతింటాయని గుండెలు బాదుకున్నారు. ఇప్పుడు చంద్రబాబు భాగస్వామిగా ఉన్న కేంద్ర ప్రభుత్వం.. వైఎస్ జగన్ ప్రభుత్వం తరహాలోనే యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను తెస్తే బాబు కిమ్మనడం లేదు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ తరఫున ఇద్దరు మంత్రులు ఉన్నా తనపై ఉన్న కేసులకు భయపడి యూపీఎస్‌ను వ్యతిరేకించే సాహసం చంద్రబాబు చేయడం లేదు. దీంతో ఆయన వైఖరిపై ఉద్యోగ సంఘాల నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఉద్యోగులను నిలువెల్లా మోసం చేయడమే బాబు ఉద్దేశమని నిప్పులు చెరుగుతున్నారు.

బయటపడ్డ చంద్రబాబు మోసపూరిత నైజం..
ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని సమీక్షించకుండా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు జూలై 12న జీపీఎస్ అమలుకు ఆర్థిక శాఖ ద్వారా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయించారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు మెరుగైన విధానంపై ఉద్యోగ సంఘాలతో చర్చించలేదని ధ్వజమెత్తుతున్నారు. జీపీఎస్ అమలు కోసం గెజిట్ విడుదల చేయించడంతోనే చంద్రబాబు మోసపూరిత నైజం బయటపడిందని నిప్పులు చెరుగుతున్నారు. గెజిట్ విడుదల విషయం మీడియాలో రావడంతో 'చంద్రబాబు ఆగ్రహం' అంటూ ఎల్లో మీడియాలో కథనాలు వచ్చాయని, గెజిట్ అమలు నిలిపేయాలని ఆదేశించారంటూ కూడా కథనాలు అచ్చేశాయని గుర్తు చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు గెజిట్ నిలుపుదల ఉత్తర్వులే జారీ కాలేదని ఉద్యోగ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బాబు ఆగ్రహమనేది ఉత్తి మాటేననేది.. గెజిట్ నిలుపుదల చేయకపోవడంతోనే అర్థమైందని మండిపడుతున్నారు. ఇప్పుడు మరోసారి కేంద్రం తెచ్చిన యూపీఎస్‌ను చంద్రబాబు, కూటమి నేతలు వ్యతిరేకించకపోవడంతో ఆ నేతల అసలు స్వరూపం బయటపడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీపీఎస్ అమలుకు గెజిట్ జారీ చేయించడంతో పాటు ఇప్పుడు కేంద్రం తెచ్చిన యూపీఎస్‌ను చంద్రబాబు వ్యతిరేకించలేదంటే సీపీఎస్ ఉద్యోగులను నిలువునా మోసం చేయడమేనని నిప్పులు చెరుగుతున్నారు. ఎన్నికల ముందో మాట.. ఎన్నికల తర్వాత మరో మాట చెప్పడంలో చంద్రబాబు నిజస్వరూపం బయటపడిందని ధ్వజమెత్తుతున్నారు. కేంద్రం యూపీఎస్ తెస్తే కనీసం మాట్లాడకపోవడం కూటమి నేతల ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని సీపీఎస్ ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

ఉద్యోగులను పూర్తిగా ముంచే స్కీమ్.. యూపీఎస్

తాజాగా కేంద్రం తెచ్చిన యూపీఎస్.. ఉద్యోగులను పూర్తిగా ముంచే స్కీమ్. చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగి నుంచి ఎలాంటి మొత్తం మినహాయించకుండా పింఛన్ పథకాన్ని అందించాలి. పెన్షన్ భిక్ష కాదు.. ప్లాన్లతో వచ్చే డబ్బు కాదు. ఇది ఉద్యోగి ప్రాథమిక హక్కు. ఉద్యోగుల ఆకాంక్షలకు సోమనాథన్ కమిటీ పూర్తిగా వ్యతిరేకం. ఇప్పుడున్న ఎన్‌పీఎస్ పథకంలో రిటైరయ్యాక వచ్చే 60 శాతం మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో పెడితే ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ కంటే 5 రెట్లు ఎక్కువ వస్తుంది. ఎలాంటి ప్లాన్లతో సంబంధం లేకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. 35, 40 ఏళ్ల పాటు ఉద్యోగి సర్వీసులో బేసిక్ పే, డీఏలో పది శాతం నొక్కేసి.. మ్యాచింగ్ గ్రాంట్ అంటూ దానికి కొంత పోగేసి, చివర్లో రిటైరయ్యాక మొత్తం కార్పస్ ఫండ్‌ను మింగేసే కుట్రే యూపీఎస్. ఉద్యోగుల పెన్షన్ సొమ్మును షేర్ మార్కెట్లో పెట్టడం ఎవరి ప్రయోజనాల కోసం?.

– సీఐ దాస్, ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

ప్రభుత్వం ఉద్యోగుల ఆకాంక్షల మేరకు పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలి. తాజాగా కేంద్రం తెచ్చిన యూపీఎస్‌లో ప్రాన్ ఎమౌంట్ మొత్తాన్ని ప్రభుత్వం తీసుకుని 50 శాతం పింఛన్‌ను డీఆర్‌తో కలిపి ఇస్తారా? లేక ప్రస్తుత పింఛన్ పథకంలో ఉన్నట్లు 60 శాతం ప్రాన్ అమౌంట్ ఇస్తారా? అనేది తేల్చాలి. అలాగే యూపీఎస్ పెన్షన్‌ను ఏ విధంగా, ఎవరి ద్వారా చెల్లిస్తారనేదానిపైనా స్పష్టత ఇవ్వాలి. సర్వీసులో ఉండి మరణించిన ఉద్యోగికి కుటుంబ పింఛన్ 60 శాతం చెల్లిస్తారా? స్వచ్ఛంద పదవీ విరమణ విషయంలో కనీస సర్వీస్ ఎంతగా నిర్ణయిస్తారు? రిటైర్ అయ్యాక అప్పటివరకు ఉద్యోగి చెల్లించిన మొత్తం తిరిగి ఉద్యోగికి చెల్లిస్తారా? లేకపోతే యూపీఎస్, లంప్‌సమ్ ఎమౌంట్‌తో సరిపెడతారా? వీటన్నింటిపైనా స్పష్టత ఇవ్వాలి.

– కె.సతీష్, ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకుడు

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టలేదు
ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ: అనురాగ్ యూనివర్సిటీ 25 ఏళ్ల చరిత్రలో ఏరోజూ అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపట్టలేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మెడికల్ కళాశాల నిర్మాణానికి సంబంధించి పలు సర్వే నంబర్ల పరిధిలో వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతరంగా మార్చిన డాక్యుమెంట్లకు అన్ని ఆధారాలు ఉన్నాయని, 2017లో నీటిపారుదల శాఖ నుంచి ఎన్‌ఓసీ సైతం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాకే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. అనుమతులు ఇచ్చే సమయంలో ఎఫ్‌టీఎల్ నుంచి బఫర్ జోన్.. అక్కడి నుంచి తమ భూమికి ఎంత దూరం ఉందనే విషయాన్ని కొలతలు వేసి మ్యాప్‌లో పొందుపరిచారని, మెడికల్ కళాశాలకు సంబంధించిన స్థలం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో లేదని చెప్పినట్లు వివరించారు. అప్పటి మేడ్చల్ కలెక్టర్‌తో పాటు డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ అంగీకరించి, హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు పంపిన ఎన్‌ఓసీ సైతం ఉందని చెప్పారు. అన్ని అనుమతులు పొందాకే మరింత వెనక్కి జరిగి భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రభుత్వం కావాలనే తనపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. చట్ట పరిధిలోనే న్యాయం కోసం పోరాటం చేస్తామని పల్లా స్పష్టం చేశారు.

బీసీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి
మంత్రి పొన్నంను కలిసి విన్నవించిన ఆర్.కృష్ణయ్య



రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

అంబర్‌పేట: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్ బిల్లులు, వసతి గృహాల అద్దెలు, విద్యుత్ బిల్లులను తక్షణమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం ఆయన నివాసంలో కలసి బీసీ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తుండటంతో వాటి అద్దెలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. దీంతో భవన యాజమానులు హాస్టల్‌ను ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తుండటంతో విద్యార్థులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ వారు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో వివిధ కాలేజీల్లో చదివే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటు రూ.5 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదని దీంతో కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్‌లను ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు జి.మల్లేశ్, వేముల రామకృష్ణ, కొట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల కోసం మరో జేఏసీ

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడిగా లచ్చిరెడ్డి
- టీజీవో, టీఎన్జీవోల జేఏసీకి ప్రత్యామ్నాయంగా 65 సంఘాలతో ఏర్పాటు
- గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ సంఘాల తీరును ఎండగట్టిన నేతలు
- ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమమే ఎజెండాగా పనిచేస్తామని ప్రకటన



ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్, అంబర్‌పేట: తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పేరుతో కొత్త సంఘం పురుడు పోసుకుంది. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం సాధ్యం కాలేదని, సంఘాల నేతలు తమ స్వలాభం కోసమే పనిచేశారని ఆరోపిస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశమైన దాదాపు 65 సంఘాల నేతలు కలిసి ఈ జేఏసీని ఏర్పాటు చేసుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డిని ఎన్నుకున్నారు. వారసత్వ నాయకత్వంతో నడుస్తున్న తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో), తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో)తో పాటు ఇప్పటికే ఉన్న జేఏసీకి ప్రత్యామ్నాయంగా ఈ జేఏసీని ఏర్పాటు చేస్తున్నట్టు నేతలు ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో పాటు సీపీఎస్, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘాలతో కలిసి ఈ జేఏసీని ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

ఉలుకూ పలుకూ లేనందుకే
గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల హక్కులకు భంగం కలిగినా.. జేఏసీ నేతలు నోరు మెదపలేదని ఈ సమావేశంలో పాల్గొన్న నేతలు ఆరోపించారు. ఉద్యోగ సంఘాలను ఉక్కుపాదంతో అణచివేసినప్పుడు, ప్రతి నెలా ఒకటో తేదీన ఇవ్వాల్సిన వేతనాలను నెల పొడవునా పదేళ్ల పాటు ఇచ్చినప్పుడు ఉలుకూ పలుకూ లేకుండా వ్యవహరించినందునే ఈ జేఏసీ ఏర్పాటు చేయాల్సి వస్తోందని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తూ వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేసినప్పుడు గానీ, ఇతర శాఖల ఉనికి లేకుండా చేసి ఉద్యోగులను ఇబ్బంది పెట్టినప్పుడు గానీ, తక్షణమే ఇవ్వాల్సిన 3 డీఏలను పెండింగ్‌లో పెట్టినప్పుడు గానీ.. అప్పటి జేఏసీ నాయకులు పట్టించుకోలేదని నిందించారు.

అన్యాయాలు పునరావృతం కావద్దనే ఏకతాటిపైకి: నూతన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి
సమావేశంలో భాగంగా జేఏసీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో జరిగిన పొరపాట్లు, ఉద్యోగులకు జరిగిన అన్యాయాలు పునరావృతం కావద్దనే తాము ఏకతాటిపైకి వచ్చామని వెల్లడించారు. ఉద్యోగ సంఘాల పేరుతో భవిష్యత్తులో ఉద్యోగులకు మోసం జరగకూడదని, సంఘాల గుత్తాధిపత్యం ఉండొద్దన్న ఆలోచనతోనే ముందుకెళతామన్నారు. ఉద్యోగాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగాలు పోయినా ఆ సంఘాలు పట్టించుకోలేదని, 610 జీవో అన్యాయంపై పోరాడితే తెలంగాణ వచ్చిన తర్వాత 317 జీవో తెచ్చి ఉద్యోగులకు అన్యాయం చేశారన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలను నిర్వీర్యం చేశారని, ఉద్యోగుల స్వేచ్ఛను హరించారని, ఇంత జరుగుతున్నా ఒక్క మాట మాట్లాడలేని సంఘాల నేతలు ఉద్యోగుల్లో నమ్మకం కోల్పోయారని చెప్పారు. అందుకే ఇప్పుడు తామంతా ఏకమయ్యామన్నారు.

ప్రజా ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తాం
ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తోన్న ప్రజా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి సానుకూల నిర్ణయాలు జరిగేలా చూస్తామని లచ్చిరెడ్డి చెప్పారు. శాఖల వారీగా ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఉద్యోగుల సంక్షేమం విషయంలో సరికొత్త పంథాలో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ సమావేశంలో ఆర్టీసీ, విద్య, న్యాయ, విద్యుత్, మెడికల్, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, జలమండలి, మున్సిపల్, వ్యవసాయ, సీపీఎస్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, పీసీబీ తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలు అశ్వత్థామరెడ్డి, నిర్మల, లక్ష్మారెడ్డి, సంపత్ కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, కుమారస్వామి, మైపాల్‌రెడ్డి, షౌకత్ అలీ, శ్రీకాంత్, గరిక ఉపేందర్‌రావు, గోపాల్ రెడ్డి, కె.రామకృష్ణ, ఎస్ రాములు, రమేష్ పాక, ఫూల్ సింగ్ చౌహాన్, హరికిషన్, తిరుపతి నాయక్, డాక్టర్ కత్తి జనార్దన్, మేడి రమేష్, దేవికా రొక్కం, మమత, వాణి సక్కుబాయి, కమలాకర్ పాల్గొన్నారు.

5 సెకన్లలో రెండు పేలుళ్లు

మొదట మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ ప్యానెల్ గదిలో పేలుడు

- 5 సెకన్లలోనే ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్‌లో రెండో పేలుడు
- కార్మికులు తప్పించుకొనే అవకాశమే లేకపోయింది
- భవన నిర్మాణంలో లోపాలు, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం
- భవనం అన్ని అంతస్తులకు ఒక్కటే మెట్ల మార్గం
- అందువల్లే ప్రాణనష్టం అధికంగా ఉంది
- ఎసైన్షియా ప్రమాదంపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక



ప్రమాదం జరిగిన ఎసైన్షియా భవనం

సాక్షి, విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో నిర్లక్ష్యం కారణంగానే పెను ప్రమాదం సంభవించిందని, ప్రాణ నష్టం ఎక్కువగా ఉందని ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వెల్లడించింది. తొలి పేలుడు జరిగిన 5 సెకన్లలోనే మరో పేలుడు సంభవించిందని తెలిపింది. భారీ పేలుళ్ల ధాటికి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడం, గ్రౌండ్ ఫ్లోర్ గోడలు, మొదటి అంతస్తు శ్లాబు కొంత భాగం కూలడం, ఈ సంస్థ భవనాలకు అత్యవసర మార్గాలు, అత్యవసర మెట్లు లేకపోవడంతో కార్మికులు తప్పించుకోలేక ప్రాణ నష్టం అధికంగా ఉందని వెల్లడించింది. ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ఈ నెల 21న జరిగిన ఘోర ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడగా 39 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణంపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల శాఖ, బాయిలింగ్, ఫైర్ సేఫ్టీ, ఏపీపీసీబీ అధికారులు, నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ ఇంత ఘోర ప్రమాదం జరగడానికి ముందు ఏం జరిగింది, కారణాలేమిటో క్షుణ్ణంగా విచారణ జరిపి ప్రాథమిక నివేదిక రూపొందించింది. వారం రోజుల్లో మరో నివేదిక ఇవ్వనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

ఈ నివేదికలోని ప్రధానాంశాలు..

- కొత్త డ్రగ్స్ తయారీకి ప్రయోగాలు ఇక్కడే జరుగుతుంటాయి. బ్యాచ్‌ల వారీగా పరిశోధనలు చేస్తుంటారు. మూడు నెలల విరామం తర్వాత ఫస్ట్ బ్యాచ్ పరిశోధన ప్రారంభించింది.
- ఆరోజు రియాక్టర్‌లో 500 లీటర్ల మిథైల్ టెర్ట్ బ్యూటైల్ ఈథర్ (ఎంటీబీఈ) ద్రావకం తయారీకి వాక్యూమ్ డిస్టిలేషన్ ప్రారంభించారు.
- ఇక్కడ తయారయ్యే వాక్యూమ్ డిస్టిలేషన్‌ని నైట్రోజన్ ప్రెజర్ ద్వారా రెండో ఫ్లోర్‌లో ఉన్న 5 వేల లీటర్ల స్టోరేజ్‌ట్యాంక్‌కు పంపింగ్ చేస్తున్నారు.
- మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రెండో అంతస్తులో ఎంటీబీఈ లీకై ఘాటైన వాసన వస్తుండటాన్ని ప్రొడక్షన్ టీమ్ గుర్తించింది. ఇది క్రమంగా మొదటి అంతస్తుకూ వ్యాపించింది.
- మొదటి అంతస్తులోని కార్మికులు ఆ వాసనను గుర్తించారు. వెంటనే అప్రమత్తమై అక్కడి నుంచి రెండో అంతస్తుకు వెళ్తున్న ఎంటీబీఈ పైప్ లైన్‌ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫర్ లైన్‌లో ఎంటీబీఈ వాక్యూమ్ లీకవుతున్నట్లు గుర్తించారు.
- వెంటనే ఇంజినీరింగ్ అండ్ ప్రొడక్షన్ సిబ్బందికి కార్మికులు సమాచారమిచ్చారు. లంచ్ టైమ్ కావడంతో ఆ సమయంలో ఆ సిబ్బంది అందరూ భోజనం చేస్తున్నారు. దీంతో లీకేజీని అరికట్టేందుకు ఎవ్వరూ రాలేదు.
- మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో భోజనం అనంతరం వచ్చిన బృందాలు లీకేజీని అరికట్టే ప్రక్రియ ప్రారంభించాయి.
- కానీ.. అప్పటికే ఏహెచ్‌యూల ద్వారా కమ్ముకున్న ఆవిరి లోవర్ ఎక్స్‌ప్లోజివ్ లిమిట్ (ఎల్ఈఎల్) స్థాయికి చేరుకుంది. దీంతో హఠాత్తుగా గ్రౌండ్ ఫ్లోర్లోని ఎంసీసీ ప్యానెల్‌లో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి గ్రౌండ్ ఫ్లోర్ ప్లెయిన్ సిమెంట్, కాంక్రీట్ (పీసీసీ) గోడలు కూలిపోయాయి. మొదటి అంతస్తు శ్లాబులో కొంత భాగం కుప్పకూలింది.
- వెంటనే కార్మికులు, సిబ్బంది బయటకు వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు.
- 5 సెకన్లలోనే గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఏహెచ్‌యూ మెయిన్ ప్యానల్‌లో రెండో పేలుడు సంభవించింది. దీంతో.. ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్స్ ఉన్న మొదటి, రెండో అంతస్తుల్లోని అన్ని రూమ్‌లూ తీవ్ర ప్రభావానికి గురయ్యాయి.
- ఈ పేలుడు తీవ్రత పీడీ ల్యాబ్, యుటిలిటీ, ప్రొడక్షన్ ఏరియాలోనూ తీవ్ర ప్రభావం చూపింది.
- వెంటవెంటనే పేలుళ్లు సంభవించడం, అత్యవసర మార్గాలు కూడా లేకపోవడంతో కార్మికులు తప్పించుకోవడానికి అవకాశం లేకపోయింది.
- ఎంటీబీఈ 28 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద లోవర్ ఎక్స్‌ప్లోజివ్ లిమిట్ (ఎల్ఈఎల్) 1.6 శాతం, అప్పర్ ఎక్స్‌ప్లోజివ్ లిమిట్ (యూఈఎల్) 15.1 శాతం ఉంది. ఈ ఎంటీబీఈ ఆవిరి అన్ని ప్రాంతాలకూ తీవ్రస్థాయిలో విస్తరించడమే ప్రమాదానికి ప్రధాన కారణం.
- బిల్డింగ్ నిర్మాణంలో లోపాలు కూడా ప్రమాద తీవ్రతకు ప్రధాన కారణం. పీడీ ల్యాబ్, ఆఫీస్ బిల్డింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పక్కపక్కనే ఉండకూడదు. కానీ.. అన్నీ ఒకే చోట ఏర్పాటు చేశారు.
- ముఖ్యంగా.. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లకు ఒక్కటే మెట్ల మార్గం ఉంది. ఎలాంటి అత్యవసర మార్గాలు, అత్యవసర మెట్లు లేవు. ఉన్న ఒక్క మార్గం మొదటి పేలుడు ధాటికే కూలిపోయింది.
- భవనం చుట్టూ ఎక్స్‌టర్నల్ కారిడార్లు లేవు. అనుసంధానించే మెట్లు కూడా లేవు. దీనివల్ల కొందరు దూకేందుకు ప్రయత్నించినా.. భవన శిథిలాల కింద పడి నలిగిపోయారు.



ఆదివారం హైకోర్టులో అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవంలో పాల్గొన్న జస్టిస్ మాధవి దేవి. చిత్రంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు శాంతి భూషణ్, సంజీవరెడ్డి, ఉపాధ్యక్షురాలు దీప్తి, ఇతర కార్యవర్గ సభ్యులు



ఉత్సవంలో పాల్గొన్న జస్టిస్ సూరేపల్లి నంద

ముగిసిన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

▶ మొదటి పేజీ తరువాయి

ఈ నెలాఖరు నుంచి అన్ని కాలేజీలు క్లాసులు మొదలు పెడతాయని అధికారులు చెబుతున్నారు.

ప్రధాన కాలేజీల్లో 100 శాతం
కన్వీనర్ కోటా కింద 175 కాలేజీల్లో ఈ ఏడాది 86,943 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. స్లైడింగ్ పూర్తయ్యాక 75,107 సీట్లను భర్తీ చేశారు. ఇంకా 11,836 సీట్లు మిగిలాయి. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్ సహా పలు కంప్యూటర్ అనుబంధ కోర్సుల్లో 61,587 సీట్లు అందుబాటులో ఉండగా ఇప్పటివరకు 57,637 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 3,950 సీట్లు మిగిలాయి. అందులో సీఎస్ఈలో 1,305 సీట్లు, ఐటీలో 385, డేటా సైన్స్‌లో 712, ఏఐఎంఎల్‌లో 787 సీట్లు మిగిలాయి. అవన్నీ చిన్న కాలేజీల్లోనే ఉన్నాయి. హైదరాబాద్‌లోని టాప్ కాలేజీల్లో కంప్యూటర్ సీట్లన్నీ భర్తీ అయ్యాయి. స్పాట్ అడ్మిషన్లలోనూ మిగిలిన సీట్లకు డిమాండ్ ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఆ మూడు కోర్సులకు కనిపించని ఆదరణ
బీటెక్ సివిల్, మెకానికల్, ఈఈఈ కోర్సుల్లో ఈ ఏడాది దాదాపు 10 వేల సీట్లు తగ్గాయి. వాటి స్థానంలో సీఎస్సీ, ఇతర కంప్యూటర్ కోర్సులకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. అయితే అందుబాటులో ఉన్న సీట్లలోనూ విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపించలేదు. ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో 1,708 సీట్లు, ఈఈఈలో 2,162, సివిల్‌లో 1,442, మెకానికల్‌లో 1,803 సీట్లు మిగిలాయి. తొలి కౌన్సెలింగ్ నుంచి స్లైడింగ్ వరకు ఈ బ్రాంచీల్లో ఇదే ట్రెండ్ కనిపించింది. స్లైడింగ్ సమయంలో దాదాపు 5 వేల మందికి బ్రాంచీలు మారాయి. అందులో 3,500 మందికి కంప్యూటర్, అనుబంధ బ్రాంచీల్లో సీట్లు లభించాయి.

యాజమాన్య కోటాపై నిఘా
యాజమాన్య కోటా కింద 30 శాతం సీట్లను కాలేజీలు భర్తీ చేస్తాయి. 15 శాతం జేఈఈ, ఈఏపీసెట్ ర్యాంకర్లకు కేటాయించి ఆ తర్వాత ఇంటర్ మార్కులను ప్రామాణికంగా తీసుకోవాలి. మిగిలిన 15 శాతం సీట్లను ప్రవాస భారతీయులు స్పాన్సర్ చేసిన వారికి ఇస్తారు. అయితే యాజమాన్య కోటా సీట్లలో కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయనే ఫిర్యాదులొచ్చాయి. ర్యాంకర్లను పట్టించుకోకుండా ఎక్కువ డబ్బు ఇచ్చిన వారికే సీట్లు కేటాయించినట్లు ఆరోపణలున్నాయి. యాజమాన్య కోటా సీట్ల భర్తీకి సంబంధించి ప్రతి దరఖాస్తునూ ర్యాటిఫై చేసేప్పుడు సాంకేతిక, ఉన్నత విద్యామండలి అధికారులు నిశితంగా పరిశీలించాలి. కానీ ఏటా ఇది నామమాత్రపు తంతుగా నడుస్తోంది. ఈసారి అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలని, అనర్హులకు సీట్లు ఇస్తే ర్యాటిఫై చేయొద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ర్యాటిఫికేషన్‌కు ఈసారి యంత్రాంగాన్ని పెంచాలని అధికారులు నిర్ణయించారు.

సన్నిధి

నేడు కృష్ణాష్టమి పర్వదినం

రూపు నల్లన.. చూపు చల్లన. మనసు తెల్లన...
మాట మధురం. పలుకు బంగారం.
నవ్వు సమ్మోహకరం. వ్యక్తిత్వం విశిష్టం..
ఆ ముద్ర అనితర సాధ్యం.
అందుకే... నమ్మిన వారికి కొండంత అండ.
అసలు కృష్ణుడంటేనే సచ్చిదానంద రూపం..
అలౌకిక ఆనందానికి ప్రతిరూపం..
అందుకే ఆ నామం ఆరాధనీయం.. సదా స్మరణీయం.

సమ్మోహన స్వరూపుడు



దుష్టశిక్షణకు, శిష్ట రక్షణకూ శ్రీ మహావిష్ణువు ధరించిన పది అవతారాలలో ఎనిమిదవ అవతారంగా నందన నామ సంవత్సర దక్షిణాయన వర్ష ఋతువు శ్రావణ బహుళ అష్టమి రోహిణీ నక్షత్రం నాలుగో పాదాన గురువారం నాడు అర్ధరాత్రి యదువంశంలో దేవకీ, వసుదేవులకు జన్మించాడు. నేడు ఆయన ఆవిర్భవించిన రోజు. ఈ సందర్భంగా ఓ వ్యాస పారిజాతం.

చిలిపి కృష్ణునిగా, గో పాలకునిగా, రాధా మనోహరునిగా, రుక్మిణీ సత్యభామాది అష్టపత్నులకూ ఇష్టుడైన వాడిగా... గోపికావల్లభుడిగా... యాదవ ప్రభువుగా, పార్థుడి సారథియైన పాండవ పక్షపాతిగాను, గీతా బోధకునిగా, తత్త్వోపదేశకునిగా, దేవదేవునిగా, రాజనీతిజ్ఞునిగా... ఇలా బహువిధాలుగా శ్రీ కృష్ణుని రూపం, వ్యక్తిత్వం, దైవత్వం ద్యోతకమవుతుంటాయి. ఎన్నిసార్లు చదివినా, ఎంత తెలుసుకున్నా ఆయన లీలలు మిగిలిపోతూనే ఉంటాయి.

శ్రీ కృష్ణుడు బాల్యంలోనే తన లీలల ద్వారా భక్తులకు జ్ఞానోపదేశం చేశాడు. గోపికల ఇళ్లలో వెన్నముద్దలను దొంగిలించి తినేవాడు. అది చాలదన్నట్టు వారిలో వారికి తంపులు పెట్టేవాడు. అందులోని అంతరార్థమేమిటంటే..

జ్ఞానానికి సంకేతమైన వెన్న అజ్ఞానానికి చిహ్నమైన నల్లని కుండలలో కదా ఉండేది. అందుకే కుండ పెంకులనే అజ్ఞానాంధకారాన్ని తొలగించి, వెలుగుకు, విజ్ఞానానికి చిహ్నమైన వెన్నను దొంగిలించడం ద్వారా తన భక్తుల మనసులో విజ్ఞానపు వెలుగులు నింపేవాడు.

గోపాలకృష్ణుడు

'గో' అంటే ఆవు అని సామాన్యార్థం. గోపాలకుడు అంటే గోవులను కాసే వ్యక్తి. అయితే 'గో' అనే శబ్దానికి కిరణాలు, భూమి, పంచభూతాలు, జీవుడు అన్నవి విశేషార్థాలు. కాబట్టి గోవులను పాలించేవాడు అంటే సంరక్షించేవాడు కాబట్టి ఆయన గోపాలకృష్ణుడయ్యాడు.

మోహన కృష్ణుడు

శ్రీకృష్ణునిది మేఘశ్యామల వర్ణం. అంటే చామన చాయ. నల్లని రంగు దేనికీ తక్కువ కాదని చాటటమే అందులోని అంతరార్థం. బంగారు పిందెల మొలతాడు, సరిమువ్వగజ్జెలు, శిఖలో పింఛం, పట్టు దట్టి, కస్తూరీ తిలకం, వక్షస్థలంలో కౌస్తుభమణి... ఇవన్నీ ఆయన విభవానికి చిహ్నాలు. నాయనమ్మ అలంకరించిన నెమలిపింఛాన్ని ఆమె ప్రీతికోసం ఎల్లప్పుడూ ధరించేవాడు. చేతిలోని మురళి గోవులను, గోపబాలకులను అలరించేందుకు ఉద్దేశించినదే. శ్రీకృష్ణుని పూజించేవారికి మాయవలన కలిగే దుఃఖాలు దరిచేరవని అంటారు.

కృష్ణజన్మాష్టమీ వ్రతం చేసుకునేవారు ఉదయాన్నే లేచి తలస్నానం చేసి, షోడశోపచారాలతో కృష్ణుని పూజించాలి. పగలంతా ఉపవసించి సాయంకాలం చిన్ని కృష్ణుని విగ్రహాన్ని పూజించి, తర్వాత ఊయలలో ఉంచి, ఊపాలి. కృష్ణునికి ప్రీతికరమైన పాలు, వెన్న, పండ్లు, అటుకులు మొదలైన వాటిని నైవేద్యం పెట్టి, కృష్ణుని పూజించి, భాగవత గ్రంథాన్ని పఠించినా, దానం చేసినా చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయని భాగవతోక్తి.

వేణుమాధవుడు

కన్నయ్య వేణువును విడిచిపెట్టి క్షణం కూడా ఉండలేడు. వేణువు, మాధవుల అనుబంధం ఎంత గొప్పదంటే...కృష్ణుడికి అర్పించుకోవడం కోసం వేణువు తనను తాను డొల్లగా చేసుకుంటే, ఆ డొల్లలో గాలిని నింపడం కోసం కృష్ణుడు ఎప్పుడూ దానిని తన పెదవుల దగ్గరే ఉంచుకునేవాడు. అందుకే కృష్ణుడి పెదవులు తనను తాకినప్పుడు పరవశించి మృదు మధురమైన గానాన్ని వినిపిస్తుంది వేణువు.

అందుకే నేను, నాది అనే వాటికి మనిషి దూరం కావాలి. తాను తానుగా మిగలాలి. తన స్వచ్ఛమైన మనస్సును మాధవుడికి అర్పించాలి. అలాంటి మనసున్న మనుషుల్ని పరమాత్మ అక్కున చేర్చుకుంటాడు.

– డి.వి.ఆర్. భాస్కర్

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పూజ ఎందుకు చేయాలి !

కొడుకు ఉన్నాడా ఇంట్లో !!!.. ఉన్నాడు... చాలు ... పెద్ద ఊరట. ''జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ...'' ..వెళ్ళవలసిందే. తప్పదు... వాడుంటే చాలు.. తనూభవుడు... ఒక ఊరట. ''ఆత్మావై పుత్రనామాసి...'' (ఓ పుత్రా! నేనే నువ్వు) ఈశ్వరుడు ఎంత ఊరట కల్పించాడో చూడండి!!! మరిదంతా ఎలా ప్రభవిస్తున్నది...అంటే వివాహం వల్ల. ఈ సంపదకంతటికీ పునాది గృహస్థాశ్రమం... ఇక్కడే నువ్వు తండ్రి రుణం నుంచి విముక్తుడవవుతున్నావు. తండ్రి నీకు ఎలా జన్మనిచ్చాడో నీవు కూడా వేరొక జీవునకు శరీరాన్ని కల్పించావు. అలా కల్పించి సంతానం ద్వారా ఊరట పొందావు. పితృరుణాన్ని తీర్చుకున్నావు. అది ధర్మపత్ని సహకారం లేకుండా తీరేది కానే కాదు. అందుకు గృహస్థాశ్రమ ప్రవేశం. తరువాత.. వైరాగ్య సుఖం... అదెట్లా రావాలి! రామకృష్ణ పరమహంస– 'బొట్టుబొట్టుగా రాదు, వైరాగ్యం వస్తే వరదలా వస్తుంది'..అంటారు. వైరాగ్యంలోకి వెళ్ళినవాడు నిరంతరం పరబ్రహ్మను గురించి తనలో తాను రమిస్తుంటాడు. మళ్ళీ మునుపటి జీవితంలోకి రాడు.. ''యోగరతో వాభోగరతోవా/సంగరతో వా సంగవిహీనః /యస్య బ్రహ్మని రమతే చిత్తం/ నందతి నందతి నందత్యేవ...''.. దీనికంతటికీ కారణం గృహస్థాశ్రమం.

ఆపైన దేవతల రుణం. ఇంద్రియాలన్నింటికీ దేవతలు అధిష్ఠాన శక్తులుగా ఉన్నారు. అందువల్ల వారి రుణం తీర్చుకోవాలి. దానికోసమే ఇంటింటా పూజా విధానం అనేది వచ్చింది. పూజ దేనికి? కృతజ్ఞతలు చెప్పుకోవడానికి. మనిషికి ఉండవలసిన ప్రధాన లక్షణం– కృతజ్ఞత కలిగి ఉండడం.''బ్రహ్మఘ్నే చ సురాపే చ చోరే భగ్నవ్రతే తథా / నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః''అంటాడు లక్ష్మణస్వామి కిష్కింధ కాండలో. ఎవరికయినా నిష్కృతి ఉందేమో కానీ, పొందిన ఉపకారాన్ని మరిచిపోయిన వాడికి మాత్రం నిష్కృతి లేదు. ఎవరు మనకు ఉపకారం చేశారో వారికి మనం ప్రత్యుపకారం చేయడం చాలా గొప్ప విషయం... అందుకే..ఏష ధర్మః సనాతనః(ఇదీ మన సనాతన ధర్మం) అంటారు రామాయణంలో. బద్దెన గారు కూడా..''ఉపకారికినుపకారము కాదు సేయ వివరింపంగా అపకారికి నుపకారము నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ''.. అన్నారు కదా! అందుకే మనకు ఉపకారం చేసిన దేవతలకు ప్రత్యుపకారం చేసి దేవతా రుణాన్ని తీర్చుకోవాలి... అలా చేయాలన్నా గృహస్థాశ్రమ స్వీకారం తప్పనిసరి.

ఇంద్రియాల ద్వారా దేవతలు మనకు చేసిన ఉపకారం ఏమిటి? ఐదు జ్ఞానేంద్రియాలను శక్తి సమకూర్చి ఇస్తున్నారు. వీటి ద్వారానే కొన్ని కోట్ల సుఖాలను, కొన్ని కోట్ల దుఃఖాలను మనం అనుభవిస్తున్నాం. కన్నును ఆధారం చేసుకుని మనకు ఇస్తున్న సుఖాలకు కృతజ్ఞతగా పాదాల చెంత దీపం పెట్టి నమస్కరిస్తున్నాం. చెవులిచ్చాడు. వేదాలే కాదు, సంగీతమే కాదు, చిన్న పిల్లల వచ్చీరాని మాటలను కూడా విని ఆనందిస్తున్నాం. హిరణ్యాక్షుడు ప్రహ్లాదుడితో.. 'అనుదిన సంతోషణములు/జనితశ్రమతాపదుఃఖ సంశోషణముల్/తనయుల సంభాషణములు/ జనకులకుం గర్ణయుగళ సద్భూషణముల్' అంటాడు. ఆ అవకాశం కల్పించినందుకు పూలతో పూజ చేస్తాం. రుచులను ఆస్వాదించడానికి నాలుక ఇచ్చినందుకు మధుర పదార్థాలతో నైవేద్యం పెడుతున్నాం. చర్మస్పర్శ అనుభూతిని ప్రసాదించినందుకు చందన లేపనంతో సేవిస్తున్నాం. ఈ ఐదు ఉపచారాలతో భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మంచి మాట

స్వీయ క్రమశిక్షణ

మనం అభివృద్ధి చేయగల అత్యంత ముఖ్యమైన జీవన నైపుణ్యాలలో స్వీయ–క్రమశిక్షణ ఒకటి. ఏదైనా ఒక పనిని మనం చేస్తున్నప్పుడు ఆ మార్గంలో ఎలాంటి ప్రలోభాలు, ఆకర్షణలు ఎదురైనా వాటికి ఏ మాత్రం ప్రభావితం కాకుండా మనస్సుని నియంత్రించుకుని.. చేస్తూన్న పనిపైనే సంపూర్ణమైన దృష్టిని కేంద్రీకరించడమే' స్వీయ క్రమశిక్షణ' .

స్వీయ–క్రమశిక్షణ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. నమ్మకమైన వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో సహాయపడుతుంది. ఇది సమయపాలన కూడా నేర్పుతుంది. అలాగే, తనను తాను మలచుకోవడానికి, అభివృద్ధి సాధించడానికి ఇంధనంగా పనిచేస్తుంది. ఇది ఏకాగ్రతను పెంచుతుంది. పరధ్యానాన్ని నివారించడానికి సహాయపడుతుంది. అలాగే, ఒత్తిడిని దూరం చేస్తూ, కష్టతరమైన పరిస్థితుల్లో ప్రశాంతంగా... ధైర్యంగా ఎలా ఉండవచ్చో అవగతం చేస్తుంది.



వివిధ కార్యకలాపాలకు ఎలాంటి ప్రణాళికలు అవలంబించాలో, ఎలా నిర్వహించాలో నేర్పుతుంది. స్వీయ–క్రమశిక్షణ కలిగిన వారు తమ లక్ష్యాలపై దృష్టిసారిస్తే, పరీక్షలలో బాగా రాణించడానికి, వారి అభ్యాస లక్ష్యాలను సాధించడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అధ్యయనాలు వెల్లడించాయి.

ఇతర జీవిత నైపుణ్యాల మాదిరిగానే, స్వీయ–క్రమశిక్షణలో ప్రావీణ్యం సంపాదించడానికి చాలా సంవత్సరాల అభ్యాసం అవసరం. అయితే ఇది బాహ్యంగా ఎవరో మనల్ని అదుపు చేస్తుంటే అలవరచుకునేదిలా కాకుండా మనకు మనమే పరి చేసుకునేలా ఉండాలి. గాంధీజీ, అబ్దుల్ కలామ్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, థామస్ ఆల్వా ఎడిసన్, అబ్రహాం లింకన్, హెన్రీఫోర్డ్, ఆండ్రో కార్నెగీ, వాల్ట్ డిస్నీ, బరాక్ ఒబామా వంటి మహనీయులంతా తమ తమ జీవితాలలో పాటించిన ' స్వీయ క్రమశిక్షణ వల్లే ఉన్నత శిఖరాలకు చేరుకుని, జననీరాజనాలందుకున్నారు.

స్వీయ క్రమశిక్షణ అనేది ఓ గొప్ప వ్యక్తిత్వపు లక్షణం. ఇది నిరంతరం చేయాల్సిన తపస్సు లాంటిది. ఒకానొక విద్యార్థి తన జీవితంలో పాటించే స్వీయ క్రమశిక్షణ ఆ విద్యార్థి పూర్తి జీవితానికి బంగారు బాట అవుతుంది

కనుక స్వీయ క్రమశిక్షణను సరైన వయస్సులో నేర్పించి అలవాటు చేసినట్లయితే అది జీవితాంతం మన వ్యక్తిగత అభివృద్ధికి, విజయ సాధనకు సహాయపడుతుంది. స్వీయ క్రమశిక్షణను అలవరచుకోవడానికి ఎప్పటికప్పుడు మనల్ని ప్రేరేపించుకుని సాధన చేస్తే స్వీయ క్రమశిక్షణ మన సొంతమై, అనేక విజయాలను సంపాదించి పెడుతుంది. ఇది మన భవిష్యత్ గమ్యాన్ని దిశానిర్దేశం చేయడంతో పాటు, మన జీవితానికి ఓ అర్థాన్ని, పరమార్థాన్ని అందించి పెడుతుంది. కనుక ఏ మనిషైతే స్వీయ క్రమశిక్షణను అలవరచుకుంటాడో, అలాంటి వారు జీవితంలో అత్యంత సులువుగా ఉన్నత శిఖరాలను చేరుకుంటారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి అనిపించుకోదు.

– దాసరి దుర్గా ప్రసాద్

సినిమా



'కంగువ' పోస్టర్

కంగువ వాయిదా?

'కంగువ' సినిమా దసరాకు రిలీజ్ కావడం లేదనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కంగువ'. దిశా పటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్, యోగిబాబు ఇతర కీలక పాత్రల్లో నటించారు. యూవీ క్రియేషన్స్, స్టూడియో గ్రీన్ సంస్థలు ఈ సినిమాను నిర్మించాయి. ఈ చిత్రాన్ని అక్టోబరు 10న విడుదల చేయనున్నట్లు ఇటీవల మేకర్స్ ప్రకటించారు. దసరా సెలవులను టార్గెట్‌గా చేసుకుని 'కంగువ' సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఈ సినిమా అక్టోబరు 10న విడుదల కావడం లేదని, నవంబరులో విడుదలయ్యే అవకాశం ఉందని, అది కూడా దీపావళి పండగ సమయంలో రిలీజ్ చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోందనే టాక్ తమిళ పరిశ్రమలో వినిపిస్తోంది. ఈ విషయంపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది.



భార్యతో ఆటా పాటా!

పొల్లాచ్చిలో ఆడి పాడుతున్నారు హీరో వెంకటేశ్, హీరోయిన్ ఐశ్వర్యా రాజేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఓ సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో వెంకటేశ్ మాజీ పోలీసాఫీసర్ పాత్ర చేస్తుండగా, ఆయన భార్య పాత్రలో ఐశ్వర్యా రాజేశ్ నటిస్తున్నారు. మీనాక్షీ చౌదరి మరో కథానాయికగా చేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ ప్రస్తుతం పొల్లాచ్చిలో జరుగుతోంది. అక్కడి అందమైన ప్రదేశాల్లో భార్యాభర్త (సినిమాలో వెంకటేశ్, ఐశ్వర్య) నేపథ్యంలో సాగే ఒక పాట చిత్రీకరిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ పాటకి భాస్కరభట్ల సాహిత్యం ఇవ్వగా, భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ''ముక్కోణపు ప్రేమకథ, క్రైమ్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది. 2025 సంక్రాంతి సందర్భంగా ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి.



• వెంకటేశ్


నమ్మకమే బలం



• ప్రియదర్శి

ప్రియదర్శి, రూపా కొడువాయూర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సారంగపాణి జాతకం'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తొంభై శాతం పూర్తయింది. నేడు (ఆగస్టు 25) ప్రియదర్శి పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ–''నమ్మకం మనిషికి బలాన్నిస్తుంది. కానీ, మూఢ నమ్మకం బుద్ధిమంతుడిని కూడా బలహీనుడిగా చేసి, నవ్వులపాలు చేస్తుంది. అలా నవ్వులపాలైన ఓ మధ్య తరగతి యువకుడి కథే 'సారంగపాణి జాతకం' చిత్రకథ. తన నమ్మకం, ప్రేమల మధ్య నలిగిన ఓ యువకుడి కథాంశాన్ని వినోదాత్మకంగా చూపిస్తున్నాం'' అని అన్నారు. ''ఓ మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా లేక అతను చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానంగా ఈ చిత్రం ఉంటుంది. సెప్టెంబరు 5 వరకు మిగిలిన రెండు పాటలు, సన్నివేశాల చిత్రీకరణ జరిపి, షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేస్తాం. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. వివేక్ సాగర్ మంచి బాణీలు ఇచ్చారు'' అని తెలిపారు శివలెంక కృష్ణప్రసాద్.

అక్టోబరులో ఆరంభం



• రణ్‌బీర్ కపూర్



• విక్కీ కౌశల్

అక్టోబరులో లవ్ అండ్ వార్ అంటున్నారట రణ్‌బీర్ కపూర్. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందనున్న తాజా చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ ఈ సినిమాలో లీడ్ రోల్స్‌లో నటించనున్నారు. ఈ ఏడాది జనవరిలో ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. కానీ చిత్రీకరణ ప్రారంభం కాలేదు. అయితే ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను సెప్టెంబరు లోపు పూర్తి చేసి, అక్టోబరు మొదటి వారంలో సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలని అనుకుంటున్నారట భన్సాలీ. ముందుగా అక్టోబరులో రణ్‌బీర్ కపూర్ సోలో సీన్స్‌తో ఈ సినిమా చిత్రీకరణ ఆరంభం అవుతుందట. ఆ తర్వాత రణ్‌బీర్ – విక్కీ కౌశల్‌ల కాంబినేషన్‌లోని ఫ్రెండ్‌షిప్ సన్నివేశాలను చిత్రీకరిస్తారని, ఆ తర్వాత రణ్‌బీర్ కపూర్ – ఆలియా – విక్కీ కౌశల్ కాంబినేషన్‌లోని సన్నివేశాలను షూట్ చేయాలనుకుంటున్నారని బాలీవుడ్ సమాచారం. ముక్కోణపు ప్రేమకథా చిత్రంగా 'లవ్ అండ్ వార్'ని తెరకెక్కిస్తున్నారట. ఈ సినిమా 2025 క్రిస్మస్‌కి రిలీజ్ కానుంది.



• ఆలియా భట్

నో అంటే నో! - తాప్సీ

''నేను నటిని మాత్రమే. పబ్లిక్ ప్రాపర్టీని కాదు'' అంటున్నారు హీరోయిన్ తాప్సీ. కె. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో మంచు మనోజ్ హీరోగా నటించిన 'ఝుమ్మంది నాదం' (2010) సినిమాతో హీరోయిన్‌గా పరిచయమయ్యారు తాప్సీ. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాలతో పాటు తమిళ, మలయాళ, హిందీ చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీ కొన్నేళ్లుగా బాలీవుడ్ పైనే ఫోకస్ పెట్టారు. వరుస హిందీ సినిమాలతో దూసుకెళుతున్న తాప్సీ తాజాగా చేసిన బోల్డ్ కామెంట్స్ వైరల్‌గా మారాయి. సాధారణంగా సెలబ్రిటీలను చూసినప్పుడు వారి ఫోటోలు, వీడియోలు తీయడం కోసం ఉత్సాహం చూపుతుటాంటారు. ఇటీవల తాప్సీని తమ కెమెరాల్లో బంధించేందుకు కొందరు పోటీ పడ్డారట. అయితే అందుకు ఆమె నో అంటే నో చెప్పారు. ''నేను నటిని మాత్రమే.. పబ్లిక్ ప్రాపర్టీని కాదు. రెండింటికీ చాలా తేడా ఉంది. కెమెరాలతో నా పైకి దూసుకు రావడం, ఫిజికల్‌గా హ్యాండిల్ చేయడం చాలా తప్పు. ఎవరైనా నో అని చెబితే వారి అభిప్రాయానికి గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలి. నేను ఇలా అంటున్నానని కొందరు నన్ను తప్పుగా అర్థం చేసుకోవచ్చు. అలాంటప్పుడు ఎందుకు హీరోయిన్‌గా చేస్తున్నావ్? అని కామెంట్ చేయొచ్చు. కానీ నటన నాకు నచ్చిన వృత్తి... అందుకే సినిమాలు చేస్తున్నాను'' అన్నారు తాప్సీ.

వచ్చే నెల చిన్న కథ కాదు



• విశ్వదేవ్, నివేదా థామస్

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35–చిన్న కథ కాదు'. నందకిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ సినిమా విడుదల తేదీ మారింది. తొలుత ఈ చిత్రాన్ని ఆగస్టు 15న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ రిలీజ్ చేయలేదు. తాజాగా సెప్టెంబరు 6న విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ''న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్ చిత్రం '35–చిన్న కథ కాదు'. ఇప్పటికే విడుదలైన మా సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కి చాలా మంచి స్పందన వచ్చింది. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా సాగే ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది.

నవ్వుతూనే ఉంటారు

''నేను–కీర్తన' సినిమా పూర్తి వినోదాత్మకంగా రూపొందింది. రెండున్నర గంటలపాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అని చిమటా రమేశ్‌బాబు అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'నేను–కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లుగా నటించారు. చిమటా జ్యోతిర్మయి సమర్పణలో చిమటా లక్ష్మీకుమారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిమటా రమేశ్‌బాబు మాట్లాడుతూ– ''నేను–కీర్తన' కథను ఆరు నెలలు శ్రమించి సిద్ధం చేశాను. ఈ కథకి దర్శకుడిగా, హీరోగా నేనైతేనే పూర్తి న్యాయం చేయగలనని పించింది. ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా, హీరోగా నాకు చాలా మంచి పేరు వస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. రిషిత మాట్లాడుతూ– ''తెలుగు అమ్మాయిలకు మన ఇండస్ట్రీలో చోటు లేదనే వాదనను వ్యతిరేకిస్తాను. ప్రతిభ ఉండి పట్టుదలతో ప్రయత్నిస్తే తెలుగు అమ్మాయిలు కూడా హీరోయిన్లుగా రాణించవచ్చు. 'నేను–కీర్తన' హీరోయిన్‌గా నా కెరీర్‌కి శుభారంభం ఇస్తుందనే నమ్మకం ఉంది'' అని తెలిపారు.



• రిషిత, రమేశ్‌బాబు

వేట మొదలైంది

తేజస్ వీరమాచినేని, అక్షయ రోమి హీరో హీరోయిన్లుగా బన్నీ అశ్వంత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రాజా మార్కండేయ'. 'వేట మొదలైంది' అనేది ఉప శీర్షిక. శ్రీధర్ సామా, వెంకట్ గౌడ్ పంజా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, లోగో ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ– ''కథ బాగుంటే చిన్న సినిమాలైనా కోట్ల రూపాయల కలెక్షన్స్ రాబడతాయని, ఈ కోవలోకి 'రాజా మార్కండేయ' సినిమా కూడా చేరుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''మా సినిమా 90 శాతం చిత్రీకరణ పూర్తయింది'' అని తెలిపారు దర్శక–నిర్మాతలు.



• అక్షయ, తేజస్



ఆసియా అండర్-15 బాలికల సింగిల్స్ విజేత తన్వీ పత్రి

ఆద్యంతం నిలకడగా ఆడిన భారత టీనేజ్ షట్లర్ తన్వీ పత్రి ఆసియా అండర్-15 బ్యాడ్మింటన్ బాలికల సింగిల్స్ చాంపియన్‌గా అవతరించింది. చైనాలోని చెంగ్డూ నగరంలో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో ఒడిశాకు చెందిన 13 ఏళ్ల తన్వీ వరుస గేముల్లో గెలిచింది. టాప్ సీడ్ హోదాలో బరిలోకి దిగిన తన్వీ తుది పోరులో 22-20, 21-11తో రెండో సీడ్ థి థు హుయెన్ ఎన్గుయెన్ (వియత్నాం)పై విజయం సాధించింది. టైటిల్ గెలిచిన క్రమంలో తన్వీ టోర్నీ మొత్తంలో తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఈ గెలుపుతో ఆసియా అండర్-15 బాలికల సింగిల్స్ విభాగంలో టైటిల్ సాధించిన మూడో భారత క్రీడాకారిణిగా తన్వీ గుర్తింపు పొందింది. 2017లో హైదరాబాద్ అమ్మాయి సామియా ఇమాద్ ఫారూఖీ, 2019లో గుజరాత్ అమ్మాయి తస్నీమ్ మీర్ ఈ ఘనత సాధించారు. ఇదే టోర్నీలో బాలుర అండర్-17 సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ ప్లేయర్ జ్ఞాన దత్తు సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాన్ని సాధించాడు.

పరాజయంతో పర్యటన సమాప్తం

అనధికారిక టెస్టులో ఆస్ట్రేలియా 'ఎ' చేతిలో ఓడిపోయిన భారత 'ఎ' జట్టు



ఉమా ఛెత్రీ

గోల్డ్‌కోస్ట్ (ఆస్ట్రేలియా): భారత మహిళల 'ఎ' జట్టు ఆస్ట్రేలియా పర్యటనను పరాజయంతో ముగించింది. ఇప్పటికే టి20, వన్డే సిరీస్‌లు కోల్పోయిన మన అమ్మాయిలు... ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరిగిన ఏకైక అనధికారిక టెస్టులోనూ పరాజయం పాలయ్యారు. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత 'ఎ' జట్టు 45 పరుగుల తేడాతో ఓడింది. 289 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 149/6తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 92.5 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. చివరి రోజు 94 పరుగులు చేసిన భారత్ మిగిలిన నాలుగు వికెట్లు కోల్పోయింది. ఉమా ఛెత్రీ (80 బంతుల్లో 47; 6 ఫోర్లు), రాఘవి బిష్త్ (102 బంతుల్లో 26; ఒక ఫోర్) పోరాడారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 61 పరుగులు జోడించి ఆశలు రేపినా... లోయర్ ఆర్డర్ విఫలమవడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. ఆస్ట్రేలియా బౌలర్లలో టెస్ ఫ్లింటాఫ్, చార్లీ నాట్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులు చేయగా.. భారత మహిళల 'ఎ' జట్టు 184 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 260 పరుగులు చేసింది. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుతో మొత్తం ఏడు మ్యాచ్ (3 టి20లు, 3 వన్డేలు, ఒక అనధికారిక టెస్టు)లు ఆడిన భారత మహిళల 'ఎ' జట్టు అందులో ఒక్క వన్డేలో మాత్రమే గెలుపొందింది.

వుడ్ స్థానంలో హాల్

మాంచెస్టర్: ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ మార్క్ వుడ్ శ్రీలంకతో జరిగే తర్వాతి రెండు టెస్టు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. శనివారం ముగిసిన తొలి టెస్టులో అతను తొడ కండరాల గాయంతో టెస్టు మధ్యలోనే తప్పుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత గాయం తీవ్రతపై స్పష్టత రావడంతో వుడ్ ఈ సిరీస్‌లో ఆడలేడని తేలింది. వుడ్ స్థానంలో ఇంగ్లండ్ సెలక్టర్లు లీసెస్టర్‌షైర్ లెఫ్ట్ ఆర్మ్ పేస్ బౌలర్ జోష్ హల్‌ను ఎంపిక చేశారు. 20 ఏళ్ల హల్ దేశవాళీ క్రికెట్‌లో తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అయితే హల్‌ను ఎంపిక చేసినా... ఇప్పటికే జట్టులో ఉన్న మరో పేసర్ ఒలీ స్టోన్ రెండో టెస్టులో వుడ్‌కు బదులుగా బరిలోకి దిగే అవకాశం ఉంది. గురువారం నుంచి లార్డ్స్‌లో రెండో టెస్టు జరుగుతుంది.

25వ గ్రాండ్‌స్లామ్ వేటలో...

యూఎస్ ఓపెన్‌కు జొకోవిచ్ సిద్ధం

నేటి నుంచి సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ



2008లో నొవాక్ జొకోవిచ్ తన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలిచాడు. ఈ క్రమంలో వరుసగా గత 11 గ్రాండ్‌స్లామ్‌లను పంచుకున్న ఫెడరర్, నాదల్ జోరును నిలువరించాడు. 2011లో జొకోవిచ్ తొలి సారి వరల్డ్ నంబర్ వన్‌గా నిలిచిన కొత్త అధ్యాయానికి తెర తీశాడు. ఇప్పుడు 2024లో తన 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచి ఆల్‌టైమ్ రికార్డును సృష్టించేందుకు అతను సిద్ధమయ్యాడు. యూఎస్ ఓపెన్‌లో సమరానికి జొకోవిచ్ సై అంటున్నాడు. ట్రోఫీని అందుకొని జొకోవిచ్ కొత్త చరిత్ర సృష్టిస్తాడా అనేది ఆసక్తికరం.

న్యూయార్క్: సీజన్‌లో చివరి గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విభాగంలో సెర్బియా స్టార్, వరల్డ్ నంబర్ 2 నొవాక్ జొకోవిచ్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. నేటి నుంచి జరిగే ఈ టోర్నీలో అతను విజేతగా నిలిస్తే మార్గరెట్ కోర్ట్ (24)ను దాటి అత్యధికంగా 25 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించిన తొలి ఆటగాడిగా చరిత్రకెక్కుతాడు. 2023లో ఇక్కడ టైటిల్ నెగ్గిన జొకోవిచ్ అదే ఫలితాన్ని పునరావృతం చేస్తే ఫెడరర్ (2004-08) తర్వాత టైటిల్ నిలబెట్టుకున్న మొదటి ఆటగాడిగా కూడా నిలుస్తాడు. తన తొలి రౌండ్‌లో 37 ఏళ్ల జొకోవిచ్ 138వ ర్యాంకర్ రాడు అల్బోట్ (మాల్డోవా)తో తలపడతాడు. 18వసారి యూఎస్ ఓపెన్‌లో ఆడనున్న జొకోవిచ్ ఈ టోర్నీలో 2005లో తొలిసారి బరిలోకి దిగి మూడో రౌండ్‌లో ఓటమి పాలయ్యాడు. అయితే 2011, 2015, 2018, 2023లలో నాలుగు సార్లు టైటిల్ నెగ్గిన అతను మరో ఆరుసార్లు రన్నరప్‌గా నిలిచాడు. 'ఎప్పుడైనా గెలుపు ఒక్కటే లక్ష్యం. బాగా ఆడి ముందుగా ఫైనల్ వరకు చేరడం, ఆ తర్వాత టైటిల్ కోసం పోరాడటమే నాకు తెలుసు. ఈ తరహా దృక్పథంలో ఇప్పుడు కూడా ఎలాంటి మార్పూ లేదు' అని జొకొవిచ్ అన్నాడు. ఇటీవలే పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణం గెలుచుకున్న జొకోవిచ్ మరింత ఉత్సాహంతో యూఎస్ ఓపెన్‌కు సన్నద్ధమయ్యాడు. 'నా జీవితంలో ఒలింపిక్ స్వర్ణం అతి పెద్ద ఘనత. నా కల నెరవేరింది. టెన్నిస్ కోర్టులో అలాంటి భావోద్వేగాలు నేను ఎప్పుడూ ప్రదర్శించలేదు. అంతకు ముందు సెర్బియా ఫ్లాగ్‌బేరర్‌గా నిలబడిన ఘట్టం అన్ని గ్రాండ్‌స్లామ్ విజయాలకంటే మిన్న. అన్నీ గెలిచేశావు కదా ఇంకా ఏం కావాలి అని కొందరు అడుగుతున్నారు. అయితే నాలో ఇంకా గెలవాలనే తపన ఉంది. మరిన్ని ఘనతలు సాధించాలని కోరుకుంటా. టెన్నిస్ ఆడేందుకు, చూసేందుకు ఇంకా చాలా మందికి స్ఫూర్తిగా నిలవాలనుకుంటున్నా' అని జొకోవిచ్ వ్యాఖ్యానించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీలు టెన్నిస్‌కు మూలస్తంభాల్లాంటివని... ఇలాంటి చోట బాగా ఆడేందుకు ప్రేరణ లేకపోతే ఇంకెక్కడా ఆడలేరని అభిప్రాయపడ్డాడు.



బంగ్లా చేతిలో పాక్ 'పిండి'

- తొలి టెస్టులో బంగ్లాదేశ్ ఘన విజయం
- 10 వికెట్లతో పాకిస్తాన్ చిత్తు

రావల్పిండి: సొంతగడ్డపై టెస్టు మ్యాచ్... అటువైపు తమతో పోలిస్తే బలహీన ప్రత్యర్థి... బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై నాలుగు రోజుల ఆటలో పరుగుల వరద పారింది... ఇక చివరి రోజు ఆట ఇలాగే సాగి మ్యాచ్ 'డ్రా'గా ముగియడం లాంఛనమే అనిపించింది. కానీ బంగ్లాదేశ్ అద్భుతం చేసి చూపించింది... తమ స్పిన్ బలగంతో పాకిస్తాన్‌ను పడగొట్టింది... అనిశ్చితికి మారుపేరైన పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 55.5 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది.. సంచలన ప్రదర్శన ఫలితంగా బంగ్లాదేశ్ తమ టెస్టు చరిత్రలోనే తొలిసారి పాకిస్తాన్‌ను ఓడించింది. తొలి ఇన్నింగ్స్‌ను భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసిన పాక్ చివరకు పరాజయం పాలైంది. విదేశీ గడ్డపై తొలిసారి జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన నజ్ముల్ హసన్ షంటో తన పుట్టిన రోజున అరుదైన విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం ముగిసిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ 10 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 23/1తో ఐదో రోజు ఆట కొనసాగించిన పాక్ బ్యాటర్లు బంగ్లా బౌలింగ్ ముందు తేలిపోయారు. ఫలితంగా రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 146 పరుగులకే ఆలౌటైంది. మొహమ్మద్ రిజ్వాన్ (80 బంతుల్లో 51; 6 ఫోర్లు), అబ్దుల్లా షఫీక్ (86 బంతుల్లో 37; 3 ఫోర్లు) మాత్రమే కొద్దిగా పోరాడగలిగారు. తొలి 3 వికెట్లు పేసర్ల ఖాతాలోకి వెళ్లగా... ఆ తర్వాత ఆఫ్‌స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ 4, లెఫ్టార్మ్ స్పిన్నర్ షకీబ్ అల్ హసన్ 3 వికెట్లతో పాక్‌ను దెబ్బ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో 117 పరుగుల ఆధిక్యం సాధించిన బంగ్లా ముందు కేవలం 30 పరుగుల లక్ష్యం నిలిచింది. వికెట్ కోల్పోకుండా 6.3 ఓవర్లలో అర గంటలోపే దీనిని అందుకొని బంగ్లాదేశ్ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. మొదటి ఇన్నింగ్స్‌ను పాక్ 6 వికెట్ల నష్టానికి 448 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా... బంగ్లాదేశ్ 565 పరుగులు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కీలకమైన 191 పరుగులు చేసిన ముష్ఫికర్ రహీమ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టు ఇదే మైదానంలో శుక్రవారం నుంచి జరుగుతుంది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎల్‌పీఎస్‌సీ, తిరువనంతపురంలో 30 పోస్టులు

తిరువనంతపురంలోని ఇస్రోకు చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ)..వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-11, టెక్నీషియన్ బి-11, హెవీ వెహికల్ డ్రైవర్(ఎ)-05, లైట్ వెహికల్ డ్రైవర్(ఎ)-02, కుక్-01.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, వెల్డర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టర్నర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్,ఫిట్టర్,మెషినిస్ట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. డ్రైవర్ పోస్టుకు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్/లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, పబ్లిక్ సర్వీస్ బ్యాడ్జీ తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.44,900 నుంచి రూ.1,42,400, టెక్నీషియన్ బి పోస్టులకు రూ.21,700 నుంచి రూ.69,100, ఇతర పోస్టులకు రూ.19,900 నుంచి రూ.63,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 27.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.09.2024.
» **పని ప్రదేశాలు:** బెంగళూరు, వలియామల.
» **వెబ్‌సైట్:** https://www.lpsc.gov.in

పీజీసీఐఎల్‌లో 1,031 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్) దేశవ్యాప్తంగా పీజీసీఐఎల్ కేంద్రాలు/ప్రాజెక్ట్/రీజియన్లలో వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1,031.
» **పీజీసీఐఎల్ కేంద్రం/ప్రాజెక్ట్/రీజియన్:** కార్పొరేట్ సెంటర్(గురుగ్రామ్), నార్తెర్న్ రీజియన్-1(ఫరీదాబాద్), నార్తర్న్ రీజియన్-2(జమ్ము), నార్తెర్న్ రీజియన్-3(లక్నో), ఈస్టర్న్ రీజియన్-1(పాట్నా), ఈస్టర్న్ రీజియన్-2(కోల్‌కతా), నార్త్ ఈస్టర్న్ రీజియన్(షిల్లాంగ్), ఒడిశా ప్రాజెక్ట్(భువనేశ్వర్), వెస్టర్న్ రీజియన్-1(నాగ్‌పూర్), వెస్టర్న్ రీజియన్-2(వడోదర), సదరన్ రీజియన్-1(హైదరాబాద్), సదరన్ రీజియన్-2(బెంగళూరు).
» **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, సివిల్, ఎలక్ట్రానిక్స్/టెలికాం.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎంబీఏ, పీజీ డిప్లొమా, ఎల్ఎల్‌బీ, బీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **అప్రెంటిస్ కాలం:** ఒక సంవత్సరం.
» **స్టైపెండ్:** ఐటీఐ ట్రేడ్ రూ.13,500, డిప్లొమా ట్రేడ్ రూ.15,000, గ్రాడ్యుయేట్ ట్రేడ్/హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్/సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్/లా ఎగ్జిక్యూటివ్/రాజభాష అసిస్టెంట్ రూ.17,500.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.powergrid.in

మెయిన్స్‌లో మెరిసేలా

సివిల్ సర్వీసెస్ మెయిన్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత సర్వీసుల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో రెండో దశ పరీక్ష! మొదటి దశలో దాదాపు అయిదు లక్షల మందితో పోటీపడి మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు.. రెండో దశలోనూ రాణిస్తే విజయం అడుగు దూరంలో ఉన్నట్లే!! కాబట్టి ఏ ఒక్క సబ్జెక్ట్‌ను నిర్లక్ష్యం చేయకుండా సన్నద్ధమవ్వాల్సిన ఆవశ్యకత! మరోవైపు.. సివిల్స్-2024కు సంబంధించి మెయిన్ ఎగ్జామినేషన్ సమయం సమీపిస్తోంది. సెప్టెంబర్ 20 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. మెయిన్స్‌లో ప్రతిభ చూపేందుకు ప్రిపరేషన్ ప్లాన్, ఎగ్జామ్ డే టిప్స్..

» సెప్టెంబర్ 20 నుంచి సివిల్స్-2024 మెయిన్ పరీక్షలు
» సమయ పాలన, సబ్జెక్ట్‌లకు ప్రాధాన్యం తప్పనిసరి
» ప్రశ్నల సరళి, సమాధానాలివ్వడంపై నేర్పు అవసరం
» రైటింగ్ ప్రాక్టీస్ అత్యంత కీలకమంటున్న నిపుణులు

❖ **1,056:** సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 ద్వారా భర్తీ చేయనున్న పోస్టుల సంఖ్య!
❖ **14,627:** సివిల్స్ ఎంపిక ప్రక్రియ తొలి దశ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్‌కు ఎంపికైన అభ్యర్థుల సంఖ్య!! అంటే.. ఒక్కో పోస్ట్‌కు దాదాపు 14 మంది పోటీ పడుతున్న పరిస్థితి. దీంతో.. 1:2 లేదా 1:3 నిష్పత్తిలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఎంపికయ్యేందుకు కీలకమైన మెయిన్ ఎగ్జామినేషన్‌లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది.

ప్రిపరేషన్‌లో వైవిధ్యం

ప్రిలిమ్స్‌తో పోలిస్తే.. మెయిన్ పరీక్ష పూర్తిగా భిన్నంగా ఉంటుంది. వ్యాసరూప విధానంలో జరిగే మెయిన్‌లో ఒక జనరల్ ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు, ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌కు సంబంధించి రెండు పేపర్లు ఉంటాయి. వీటికి అదనంగా ఇంగ్లిష్, రీజనల్ లాంగ్వేజ్ అర్హత పేపర్లు రాయాలి. ప్రిపరేషన్‌లో ఆయా సబ్జెక్ట్‌ల వారీగా ముఖ్యాంశాలను గుర్తించడం, ప్రశ్నలు అడిగే తీరును అవగాహన చేసుకోవడం, అందుకు అనుగుణంగా సమాధానాలు సిద్ధం చేసుకోవడం, వాటిని నిర్దిష్ట పదపరిమితితో ప్రజెంట్ చేయగలడం.. ఇలా విభిన్న కోణాల్లో వైవిధ్యంగా ప్రిపరేషన్ సాగించాలి.

సబ్జెక్ట్‌ల వారీగా సమయపాలన

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు ప్రతి సబ్జెక్ట్‌కు తప్పనిసరిగా టైమ్ కేటాయించాలి. అన్ని సబ్జెక్ట్‌లను చదివే విధంగా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి. జనరల్ ఎస్సేతోపాటు జనరల్ స్టడీస్ పేపర్లలో భాగంగా ఉండే సబ్జెక్ట్‌లను ఏ మాత్రం విస్మరించకూడదు. ప్రతి రోజు ప్రతి పేపర్‌కు కనీసం రెండు గంటల సమయం కేటాయించుకోవాలి. ఇలా వీలుకాని అభ్యర్థులు ఒక రోజు మూడు పేపర్లు, మరో రోజు మరో మూడు పేపర్లు చదివే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇలా రోజు వారీగా సబ్జెక్ట్‌లను విభజించి చదివే క్రమంలో.. పరీక్ష సమయానికి అన్ని సబ్జెక్ట్‌ల ప్రిపరేషన్ పూర్తి చేయగలమా? లేదా? అని విశ్లేషణ చేసుకోవాలి. దానికి అనుగుణంగా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ముఖ్యంగా పరీక్షకు ముందు ముఖ్యమైన అంశాలన్నీ చదివేలా వ్యవహరించాలి.



జనరల్ ఎస్సే

సివిల్స్ మెయిన్స్ అభ్యర్థులు జనరల్ ఎస్సేను ప్రత్యేక శ్రద్ధతో ప్రిపేరవ్వాలి. గత కొన్నేళ్ల ప్రశ్నల తీరును పరిశీలిస్తే.. కోర్ టాపిక్స్‌తోపాటు, సమకాలీన అంశాలపైనా ఎస్సే రాయమని అడుగుతున్నారు. కాబట్టి సమకాలీన, వర్తమాన అంశాలకు సంబంధించిన వ్యాసాన్ని పరిపూర్ణంగా రాసే విధంగా నైపుణ్యం సాధించాలి. సమాధానాలు ఇచ్చేందుకు అందుబాటులో ఉన్న సమయం, సమాధానం నిడివి (పదాల సంఖ్య)ని గుర్తించి.. దానికి అనుగుణంగా సమాచారం విశ్లేషణాత్మకంగా పొందుపర్చే నైపుణ్యం అలవరచుకోవాలి.

జీఎస్ పేపర్-1కు ఇలా

మెయిన్ పరీక్ష జీఎస్ పేపర్-1లో చరిత్ర, జాగ్రఫీపై ప్రశ్నలు అడుగుతారు. హిస్టరీ విస్తృతమైన సబ్జెక్ట్. కాబట్టి ముందుగా జాగ్రఫీపై పట్టు సాధిస్తే తక్కువ సిలబస్‌తో ఎక్కువ మార్కులు సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది. జాగ్రఫీలోని అంశాలు కోర్, కాంటెంపరరీ కలయికగా ఉంటున్నాయని.. ఇది స్కోరింగ్‌కు దోహదం చేస్తుందని నిపుణులు అంటున్నారు. హిస్టరీకి సంబంధించి ప్రపంచ చరిత్రలో పారిశ్రామిక విప్లవం, ప్రపంచ యుద్ధాలు, ఐరోపాలో నూతన రాజ్యాల ఆవిర్భావం, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో వలసవాదం, స్వాతంత్ర్య ఉద్యమాల్లో కీలక పరిణామాలపై దృష్టిపెట్టాలి.

జీఎస్-పేపర్-2

ఈ పేపర్‌లో రాణించాలంటే.. రాజ్యాంగ పీఠిక మొదలు తాజా సవరణల వరకూ.. అన్ని ముఖ్య అంశాలపై పట్టు సాధించాలి. ప్రస్తుత సమయంలో ప్రజా పరిపాలన, రాజకీయ వ్యవస్థ, అంతర్జాతీయ సంబంధాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా 1935 భారత ప్రభుత్వ చట్టం,1947 స్వాతంత్ర్య చట్టంపై అవగాహన పెంచుకోవాలి. సమకాలీన, కోర్ అంశాలను అనుసంధానం చేసుకుంటూ అభ్యసనం సాగించాలి.

జీఎస్-3.. గణాంకాలు + విశ్లేషణ

ఇందులో టెక్నాలజీ, ఆర్థికాభివృద్ధి, బయో డైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి గణాంకాలు, వాస్తవ పరిస్థితులపై సమాచారం సేకరించుకోవాలి. ఎకనామీలో ప్రణాళికా పెట్టుబడుల్లో భాగంగా ప్రభుత్వ రంగ వనరుల సమీకరణకు ఆధారాలు, వాటి ధోరణులు, వివిధ రంగాల మధ్య వనరుల పంపిణీ తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి. భారత్‌లో సమ్మిళిత వృద్ధి పాత్ర, ఆహార భద్రత, బడ్జెటింగ్ తీరుతెన్నులతోపాటు వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులను చదవాలి. సమాధానాలిచ్చేటప్పుడు కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా విశ్లేషణ చేసే నేర్పు సొంతం చేసుకోవాలి.

జీఎస్-4.. నైతిక విలువలకు పట్టం

అభ్యర్థులు విశ్లేషణాత్మకంగా, సునిశిత దృష్టితో సమాధానాలు ఇవ్వగలిగే నేర్పు సొంతం చేసుకుంటే మంచి మార్కులు పొందేందుకు ఆస్కారం ఉన్న పేపర్ ఇది. పరిపాలనలో నైతిక విలువల ఆవశ్యకతకు సంబంధించిన అంశాలపై దృష్టిసారించాలి. వ్యక్తిగత, సామాజిక సంబంధాల్లో ఈ విలువలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయో తెలుసుకోవాలి. ప్రభుత్వ విధానాల అమలు,నిధుల ఖర్చు, విధుల నిర్వహణలో జవాబుదారీతనం,పారదర్శకతలో నైతికత ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి. మతం-నైతికత, వర్ణ వ్యవస్థ-నైతికత, కుటుంబం-నైతికత.. ఇలా వివిధ సామాజిక అంశాలను, సమకాలీన అంశాలతో అనుసంధానిస్తూ చదవాలి.

సివిల్స్ మెయిన్స్.. ఎగ్జామ్ డే టిప్స్

- వీలైనంత త్వరగా అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- పరీక్ష కేంద్రం చిరునామాను ఒక రోజు ముందుగానే తెలుసుకోవాలి.
- పరీక్షకు ముందు రోజు ఎలాంటి టెన్షన్ పడకుండా జాగ్రత్త పడాలి.
- ఆరోగ్యం విషయంలోనూ జాగ్రత్తపడాలి. తేలికపాటి ఆహారం తీసుకోవడం మేలు చేస్తుంది.
- పరీక్ష రోజు.. సెంటర్‌కు ఒక గంట ముందుగా చేరుకోవాలి.
- అన్ని పేపర్లను అటెంప్ట్ చేయాలి. ఒక పేపర్‌లో సరిగా సమాధానాలివ్వలేకపోయామని.. తదుపరి పేపర్లను విస్మరించడం సరికాదు.
- అరవై శాతం మార్కులు లక్ష్యంగా సమాధానాలు రాయాలి.
- భావ వ్యక్తీకరణ పరంగా సూటిగా, సరళంగా, స్పష్టంగా సమాధానాలు ఉండాలి.
- అర్హత పేపర్లను(జనరల్ ఇంగ్లిష్, రీజనల్ లాంగ్వేజ్) కూడా సీరియస్‌గా పరిగణించాలి.
- ఒక పేపర్ పూర్తయిన తర్వాత మరో పేపర్‌కు మధ్య లభించే సమయంలో అంతకుముందు పేపర్ గురించి ఇతరులతో చర్చించడం వంటివి చేయకూడదు.

ఆప్షనల్ పేపర్లకు ఇలా

ఆప్షనల్ సబ్జెక్ట్‌కు సంబంధించిన రెండు పేపర్లు స్కోరింగ్‌లో కీలకం. కాబట్టి అభ్యర్థులు తాము ఎంచుకున్న ఆప్షనల్ ఏదైనా సరే సమగ్ర అధ్యయనం చేయాలి. ప్రస్తుత సమయంలో ప్రశ్నలు అడిగే ఆస్కారమున్న అంశాలను గుర్తించి.. వాటిపై మరింత లోతుగా అధ్యయనం చేయాలి. గత కొన్నేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించి, ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

క్వాలిఫయింగ్ పేపర్లు

మెయిన్స్ ఎగ్జామ్‌లో క్వాలిఫయింగ్ పేపర్లుగా పేర్కొనే ఇండియన్ లాంగ్వేజ్, ఇంగ్లిష్ పేపర్లలో అర్హత సాధించడం కూడా ముఖ్యమని గుర్తించాలి. చాలా మంది అభ్యర్థులు ఈ రెండింటిపై అంతగా శ్రద్ధ చూపరు. తుది విజేతల జాబితాలో నిలవాలంటే.. ఈ పేపర్లలోనూ కనీస అర్హత మార్కులు సాధించాలి. ఈ రెండు పేపర్లలోనూ తప్పనిసరిగా 25 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

పునశ్చరణకు ప్రాధాన్యం

ప్రస్తుతం సమయంలో అభ్యర్థులు పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. దీంతోపాటు సమాధానాలు రాసే నేర్పు సొంతం చేసుకోవాలి. పాత ప్రశ్న పత్రాలు, నమూనా ప్రశ్న పత్రాలను పరిశీలించి.. వాటిలోని ప్రశ్నలకు సమాధానాలు రాయడం ప్రాక్టీస్ చేయాలి. సమాధానాలు రాసేటప్పుడు వ్యాసం మాదిరిగా కాకుండా పాయింట్లు, ఫ్లో చార్ట్‌ల రూపంలో విశ్లేషిస్తే.. ఎగ్జామినర్‌ను ఆకట్టుకునేందుకు ఆస్కారం ఉంటుంది. భావ వ్యక్తీకరణ ఆకట్టుకునే రీతిలో ఉండాలి.

పరీక్ష రోజు ఇలా

- ఎన్ని నెలలు, సంవత్సరాలు కష్టపడినా.. పరీక్ష రోజు, పరీక్ష హాల్లో అందుబాటులో ఉండే మూడు గంటల సమయంలో చూపే ప్రతిభ విజయాన్ని నిర్దేశిస్తుంది.
- మూడు గంటల వ్యవధిలో ఒక్కో ప్రశ్నకు కేటాయించిన మార్కులకు అనుగుణంగా సమాధానాల నిడివి ఉండేలా చూసుకోవాలి.
- మెయిన్స్‌లో సమాధానాలకు ఉపక్రమించే ముందు అభ్యర్థులు తొలుత ప్రశ్న పత్రం ఆసాంతం పరిశీలించాలి. ఇందుకోసం కనీసం అయిదు నిమిషాలు కేటాయించాలి.
- బాగా ప్రిపరేషన్ సాగించిన అభ్యర్థులకు మొత్తం ప్రశ్నల్లో బాగా తెలిసిన ప్రశ్నలు కచ్చితంగా పది నుంచి పన్నెండు వరకు ఉంటాయి. కాబట్టి ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. మెయిన్ ఎగ్జామినేషన్‌లో ఇచ్చే సమాధానాలు స్పష్టంగా, సరళంగా ఉండేలా వ్యవహరించాలి. ప్రశ్న అడిగిన తీరుకు అనుగుణంగా సమాధానం ఇవ్వాలి.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
26-8-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	33	81,086
నిఫ్టీ ▲	12	24,823

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,878	▲	258
డోజోన్స్	41,175	▲	462
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,328	▲	40
డాక్స్	18,633	▲	140
షాంఘై	2,854	▲	6
నికాయ్	38,364	▲	153

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.53	84.55
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.82	111.43
€	యూరో	ఎస్‌బీఐ	92.30	94.70
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.08	58.38
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.47	57.42
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.98	66.43
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.48	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.96	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.88	12.71



స్టాక్స్, ఫండ్స్‌పై సులువుగా రుణాలు

- అత్యవసరాల్లో గట్టెక్కే మార్గం..
- వడ్డీ రేట్లు కూడా తక్కువ స్థాయిలోనే
- స్వల్పకాల అవసరాలకే అనుకూలం

పెట్టుబడులకు 'రుణ' పడదాం!

ఆర్థిక అత్యవసర పరిస్థితి ఏర్పడితే.. రుణం తీసుకోవడమే ఎక్కువ మంది అనుసరించే మార్గం. అవసరాన్ని వెంటనే గట్టెక్కడమే ముఖ్యంగా చూస్తుంటారు. వడ్డీ రేటు గణనీయంగా ఉండే క్రెడిట్‌కార్డు రుణాలే కాదు, వ్యక్తిగత రుణాలను ఆశ్రయిస్తుంటారు. దీంతో అప్పటికి అవసరం తీరుతుందేమో కానీ, ఆ తర్వాత ఆర్థికంగా భారాన్ని మోయాల్సి వస్తుంది. కొందరు స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఉంటే వాటిని ఉపసంహరించుకుంటారు. కానీ, వీటికంటే మెరుగైన ఆప్షన్ ఉంది. స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌ను విక్రయించాల్సిన అవసరం లేకుండా, వాటిపై చౌక వడ్డీకే రుణం పొందొచ్చు. దీనివల్ల పెట్టుబడుల వృద్ధి ప్రయోజనాన్ని కోల్పోవాల్సిన అవసరం ఏర్పడదు. పైగా రుణంపై వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చు.

– సాక్షి, బిజినెస్‌డెస్క్

ఫండ్స్/స్టాక్స్..

మ్యూచువల్ ఫండ్స్‌పై రుణం పొందడాన్ని లోన్ ఎగైనెస్ట్ మ్యూచువల్ ఫండ్స్ (ఎల్‌ఏఎంఎఫ్)గా.. షేర్లపై రుణం పొందడాన్ని లోన్ ఎగైనెస్ట్ సెక్యూరిటీస్ (ఎల్‌ఏఎస్)గా చెబుతారు. ఇవి సెక్యూర్డ్ రుణాలు. మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు/షేర్లు లేదా బాండ్లు తదితర సెక్యూరిటీలను తనఖా పెట్టుకుని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు రుణాలు మంజూరు చేస్తాయి. కనుక రుణగ్రహీత క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉండాల్సిన అవసరం లేదు. స్వల్పకాల అవసరాల కోసం ఈ రుణాలు తీసుకోవచ్చు. వీటిపై 9–11 శాతం మధ్య వడ్డీ రేటు అమలవుతుంటుంది. మిరే అస్సెట్ సంస్థ 10.5 శాతం వార్షిక వడ్డీ రేటును అమలు చేస్తోంది. డిజిటల్‌గా, నిమిషాల వ్యవధిలోనే రుణం పొందే వెసులుబాటు కూడా ఉంటుంది.



అర్హతలు..

- సెబీ అనుమతించిన కంపెనీల షేర్లకే రుణాలు పరిమితం. దాదాపు అన్ని బ్లూచిప్ షేర్లకు, టాప్–250 షేర్లకు రుణాలు లభిస్తాయి. డీలిస్ట్ అయిన వాటికి అవకాశం లేదు. ఏ షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లపై రుణం లభిస్తుందో.. ప్రతి బ్యాంక్, ఎన్‌బీఎఫ్‌సీ ఒక జాబితాను నిర్వహిస్తుంటాయి.
- ఒక్కసారి వీటిపై రుణం తీసుకున్నారంటే, అవి తనఖాలోకి వెళ్లినట్టు అర్థం చేసుకోవాలి. కనుక రుణం తీర్చే వరకు వాటిని విక్రయించలేరు.
- మ్యూచువల్ ఫండ్స్ లేదా స్టాక్స్ విలువలో నిర్ణీత శాతం వరకే రుణం లభిస్తుంది. ఇక్కడ కూడా లోన్–టు–వేల్యూ (ఎల్‌టీవీ) వర్తిస్తుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ఆర్‌బీఐ నిర్దేశించిన ఎల్‌టీవీ 75 శాతంగా ఉంది. చాలా సంస్థలు ఈక్విటీ ఫండ్స్‌పై 50–60% మేరకే రుణం ఇస్తున్నాయి. మిరే అస్సెట్ సంస్థ 45 శాతానికే రుణాన్ని పరిమితం చేస్తోంది. రుణం ఇచ్చే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ విడిగా రుణగ్రహీత తిరిగి చెల్లింపుల సామర్థ్యాలను అంచనా వేసుకున్న తర్వాత ఇంతకంటే తక్కువే మంజూరు చేయవచ్చు.
- పెట్టుబడుల విలువలో రుణం 50 శాతం మించకుండా ఉంటేనే నయం. ఎందుకంటే తనఖాలో ఉంచిన షేర్లు, సెక్యూరిటీలు, ఫండ్స్ యూనిట్ల విలువను రుణం ఇచ్చిన సంస్థలు ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటాయి. ముఖ్యంగా మార్కెట్లు కరెక్షన్‌కు లోనైతే ఈ పనిని వెంటనే చేస్తాయి. అప్పుడు లోన్–టు–వేల్యూని మించి రుణం విలువ పెరిగిపోతుంది. దీంతో అదనపు సెక్యూరిటీలు/ఫండ్స్ యూనిట్లను తనఖా ఉంచాలని అవి కోరతాయి. లేదా నగదు సర్దుబాటు చేయాలని కోరతాయి. లేదంటే అదనపు వడ్డీని విధిస్తాయి. లేదా తనఖాలో ఉంచిన వాటిని వెంటనే విక్రయించి సొమ్ము చేసుకుంటాయి. రుణం తీసుకున్న వ్యక్తి స్పందన ఆధారంగా ఈ చర్యలు ఉంటాయి.
- ఓవర్ డ్రాఫ్ట్ రూపంలో ఈ రుణం మంజూరు అవుతుంది. ఉదాహరణకు తనఖా పెట్టిన సెక్యూరిటీలు, ఫండ్స్ యూనిట్లపై రూ.5 లక్షల రుణానికి ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం లభించిందని అనుకుందాం. అప్పుడు రూ.2 లక్షలే వినియోగించుకుంటే ఆ మొత్తంపైనే వడ్డీ పడుతుంది. ఎన్ని రోజులు వినియోగించుకుంటే, అంతవరకే వడ్డీ పడుతుంది. కాకపోతే తీసుకున్న రుణంపై వడ్డీని ప్రతినెలా చెల్లించాల్సిందే.
- రుణంపై కనిష్ఠ, గరిష్ఠ పరిమితులను బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు అమలు చేస్తున్నాయి.
- వ్యక్తిగత రుణాలను ముందస్తుగా తీర్చివేస్తే ప్రీక్లోజర్ చార్జీలను బ్యాంక్‌లు వసూలు చేస్తుంటాయి. కానీ, స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ రుణాలపై ప్రీక్లోజర్ చార్జీల్లేవు.
- వ్యక్తిగత రుణాల మాదిరే మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్‌పై రుణాలను ఎందుకు వినియోగించుకోవాలనే విషయంలో పరతులు ఉండవు. చట్టవిరుద్ధమైన, స్పెక్యులేటివ్ అవసరాలకే వినియోగించుకోకూడదు.
- తనఖాలోని షేర్లు, స్టాక్స్‌కు సంబంధించి డివిడెండ్లు, బోనస్, ఇతరత్రా ప్రయోజనాలు ఇన్వెస్టర్‌కే లభిస్తాయి.
- గడువు ముగిసిన తర్వాత షేర్లు, ఫండ్స్ యూనిట్లపై రుణాన్ని పునరుద్ధరించుకోవచ్చు.
- రుణంపై వడ్డీ, అసలు చెల్లింపుల్లో విఫలమైతే తనఖాలో ఉంచిన సెక్యూరిటీలు, స్టాక్స్‌ను విక్రయించే అధికారం రుణం ఇచ్చిన సంస్థలకు ఉంటుంది. విక్రయించగా వచ్చిన మొత్తాన్ని రుణంతో సర్దుబాటు చేసుకుంటాయి. మిగులు ఉంటే రుణగ్రహీతకు చెల్లిస్తాయి. ఇంకా బకాయి మిగిలి ఉంటే రుణగ్రహీత నుంచి రాబట్టేందుకు తదుపరి చర్యలు తీసుకుంటాయి.



డెట్ ఫండ్స్‌పై వద్దు..

డెట్ ఫండ్స్‌లో రాబడులు 6–8 శాతం మధ్యే ఉంటాయి. వీటిపై రుణం తీసుకుంటే చెల్లించాల్సిన వడ్డీ 10–12 శాతం మధ్య ఉంటుంది. దీనికి బదులు ఆ పెట్టుబడులను విక్రయించుకోవడమే మెరుగైన నిర్ణయం అవుతుంది. కేవలం ఈక్విటీ ఫండ్స్, స్టాక్స్‌పై రుణానికే పరిమితం కావాలి. ఎందుకంటే, ఈక్విటీ ఫండ్స్, స్టాక్స్‌లో దీర్ఘకాలంలో రాబడులు 15 శాతం స్థాయిలో ఉంటాయి. కనుక వడ్డీ చెల్లింపులు పోను ఎంతో కొంత మిగులు ఉంటుంది.

చార్జీలు..

సకాలంలో చెల్లింపులు చేయనప్పుడు పీనల్ చార్జీలు విధిస్తాయి. అలాగే, సెక్యూరిటీ ఇన్వొకేషన్ చార్జీ, కలెక్షన్ చార్జీ, లీగల్ చార్జీ, స్టాంప్ డ్యూటీ, చెక్ బౌన్స్ చార్జీలు కూడా ఉంటాయి. రుణ కాల పరిమితి సాధారణంగా ఒక ఏడాది ఉంటుంది. తర్వాత రెన్యువల్ చేసుకోవాలి. దీనిపైనా చార్జీలు విధిస్తాయి. రుణం తీసుకోవడానికి ముందే ఈ చార్జీల గురించి సమగ్రంగా తెలుసుకోవాలి.

ఇతర ఆప్షన్లు



బంగారం, ప్రాపర్టీ (ఇల్లు లేదా స్థలం), జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్లపైనా సెక్యూర్డ్ రుణాలు పొందొచ్చు. కాకపోతే స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లపై డిజిటల్‌గా, వేగంగా రుణం లభిస్తుంది. కనుక ఇది అత్యవసర నిధిగానూ అక్కరకు వస్తుంది. తక్కువ రేటుకే రుణం తీసుకోవాలని భావిస్తే, భిన్న సంస్థల మధ్య వడ్డీ రేటును పరిశీలించాలి. అలాగే, బంగారం, జీవిత బీమా ప్లాన్లు ఉంటే వాటి రేట్లను విచారించి, చౌక మార్గాన్ని ఎంపిక చేసుకోవచ్చు. వ్యక్తిగత రుణం చివరి ఎంపికగానే ఉండాలి.

విక్రయించడం మార్గం కాదు..



రిటైల్ ఇన్వెస్టర్లు ఇటీవలి కాలంలో పెద్ద మొత్తంలో ఈక్విటీ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుండటం చూస్తున్నాం. ఈక్విటీ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే వారిలో 59 శాతం మంది 24 నెలలకు మించి కొనసాగిస్తున్నారు. మిగిలిన వారు ఆ లోపే విక్రయిస్తున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇలా చేయడం దీర్ఘకాల లక్ష్యాలకు విరుద్ధం. పెట్టుబడులు ఉపసంహరించుకోకుండా, ఓవర్‌డ్రాఫ్ట్ రుణ సదుపాయం ద్వారా స్వల్పకాల అవసరాలను అధిగమించడమే మంచి ఆప్షన్ అవుతుంది. మిరే అస్సెట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ డేటా ప్రకారం .. ఫండ్స్, షేర్లపై రుణాలను 30 శాతం మంది వ్యాపార అవసరాల కోసం, 19 శాతం మంది ఇంటి నవీకరణ కోసం, 18 % మంది పిల్లల స్కూల్/కాలేజీ ఫీజుల కోసం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఎస్‌బీఐ యోనో నుంచే..



దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ అయిన ఎస్‌బీఐ సైతం మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లపై రుణం ఇస్తోంది. అది కూడా యోనో యాప్ నుంచే దరఖాస్తు చేసుకుని, డిజిటల్‌గా రుణాన్ని పొందొచ్చు. క్యామ్స్ వద్ద నమోదైన అన్ని అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల (ఏఎంసీలు/మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు) మ్యూచువల్ ఫండ్స్ పథకాలపై, ఆకర్షణీయమైన రేట్లకే రుణాన్ని ఇస్తున్నట్టు ఎస్‌బీఐ చెబుతోంది. గతంలో కేవలం ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ పథకాలపై, అది కూడా బ్యాంక్ శాఖకు వెళ్లి తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు యోనో నుంచి పది నిమిషాల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. రుణం విలువపై 0.50 శాతం ప్రాసెసింగ్‌చార్జీ, జీఎస్‌టీ చెల్లించుకోవాలి.

ఎల్‌అండ్‌టీ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 3,598 **టార్గెట్:** రూ. 4,150

ఎందుకంటే: ప్రైవేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం ఎల్‌అండ్‌టీ ఈ ఏడాది(2024–25) తొలి త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించి వెలువడ్డాయి. క్యూ1(ఏప్రిల్–జూన్)లో వార్షికంగా ఆదాయం 15 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా) 15 శాతం, నికర లాభం 12 శాతం చొప్పున ఎగశాయి. సీజనల్‌గా బలహీన క్వార్టర్ అయినప్పటికీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన పటిష్ఠ పనితీరు చూపింది. కంపెనీకి కీలకమైన ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్(ఈఅండ్‌సీ) ఆదాయం 18 శాతం, ఇబిటా 21 శాతం చొప్పున జంప్ చేశాయి. ఈ విభాగం మార్జిన్లు స్వల్పంగా బలపడి 7.6 శాతాన్ని తాకాయి. వెరసి అంచనాలను అధిగమించాయి. ఇందుకు ప్రధానంగా విదేశీ ఆర్డర్ల ఎగ్జిక్యూషన్(ఆదాయం) తోడ్పాటునిచ్చింది. దేశీయంగా ఆదాయం ఫ్లాట్‌గా నమోదైంది. ఇందుకు సార్వత్రిక ఎన్నికలు, శ్రామికుల కొరత, వడగాల్పులు కొనసాగడం వంటి అంశాలు ప్రతికూలంగా పరిణమించాయి. ఆర్డర్ల రాక 8 శాతం పుంజుకోగా.. ఆర్డర్‌బుక్ విలువ వార్షిక ప్రాతిపదికన 19 శాతం మెరుగుపడింది. అంతర్జాతీయ ఆర్డర్లు ఇందుకు సహకరించాయి. బలహీన హైడ్రోకార్బన్ ప్రాస్పెక్ట్స్ కారణంగా ఆర్డర్ పైప్‌లైన్ 10 శాతం నీరసించింది. దీంతో అమ్మకాలతో పోలిస్తే నెట్‌వర్కింగ్ క్యాపిటల్ 13.9 శాతానికి క్షీణించింది. మెగా, అల్ట్రామెగా ప్రాజెక్టుల పూర్తిలో ఆలస్యం, ఆర్డర్ల రాక మందగించడం, కమోడిటీ ధరల పెరుగుదల, వర్కింగ్ క్యాపిటల్ ఆవశ్యకత తదితర అంశాలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

కేపీఐటీ | బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,834 **టార్గెట్:** రూ. 2,100

ఎందుకంటే: ఐటీ రంగ సంస్థ కేపీఐటీ టెక్నాలజీస్ ప్రత్యేక ఇంజనీరింగ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఈఆర్‌అండ్‌డీ) సర్వీసులందిస్తోంది. ప్రధానంగా ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ వేల్యూ చైన్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సొల్యూషన్లు సమకూర్చుతోంది. ప్రపంచవ్యాప్తంగా తయారీ రంగ తదితర దిగ్గజ కంపెనీ(ఓఈఎం)లకు సేవలు అందిస్తోంది. అంతేకాకుండా వాణిజ్య వాహనాలు, ప్యాసింజర్ కార్ల విభాగాలలోనూ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌కు సొల్యూషన్లు రూపొందిస్తోంది. ఆటోమోటివ్ పరిశ్రమలో ఆధునిక టెక్నాలజీల అభివృద్ధి ద్వారా పలురకాల వృద్ధి అవకాశాలకు దారి ఏర్పడుతుంది. సెమీకండక్టర్ల వినియోగం, సాఫ్ట్‌వేర్ ఆధారిత డ్రైవర్ అసిస్టెన్స్ వ్యవస్థలతోపాటు.. కనెక్టెడ్, ఆటానమస్, షేర్డ్ అండ్ ఎలక్ట్రిక్(సీఏఎస్‌ఈ) సాంకేతికతలు ఆయా విభాగాలలో భారీ అవకాశాలకు తెరతీస్తున్నాయి. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మేషన్ బాటలో సాగుతున్న ఆటోమోటివ్ పరిశ్రమలో కంపెనీ పటిష్ఠ కార్యకలాపాలు కలిగి ఉంది. ఆయా విభాగాల(వర్టికల్స్)లో సామర్థ్యాలను పెంచుకోవడం, పలుడీల్స్‌ను గెలుపొందడం వంటి సానుకూల అంశాల నేపథ్యంలో కంపెనీ ఆదాయ వృద్ధి కొనసాగే వీలుంది. వెరసి ఈ ఆర్థిక సంవత్సరానికి(2024–25) కంపెనీ 18–22 శాతం మధ్య ఆదాయ వృద్ధి అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. నిర్వహణ లాభం(ఇబిటా) 20.5 శాతం స్థాయిలో పుంజుకోనుందని మరోసారి కంపెనీ అంచనా వేసింది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఫెడ్‌వైపు ఇన్వెస్టర్ల చూపు | టెక్ కంపెనీలపై ఇన్ఫీ కన్ను

న్యూ ఫండ్ ఆఫర్స్

డీఎస్‌పీ నిఫ్టీ టాప్ 10
ఈక్వల్ వెయిట్ ఇండెక్స్ ఫండ్



డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ తాజాగా నిఫ్టీ టాప్ 10 ఈక్వల్ వెయిట్ ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ టాప్ 10 ఈక్వల్ వెయిట్ ఈటీఎఫ్‌లను ప్రవేశపెట్టింది. ఇది ప్రధానంగా నిఫ్టీ 50 సూచీలోని టాప్ 10 కంపెనీల్లో, సమాన వెయిటేజీతో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఆగస్టు 30తో ముగుస్తుంది. గత ఆరు నెలల సగటు ఫ్రీ–ఫ్లోట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసిన 10 స్టాక్స్‌లో ఇది ఇన్వెస్ట్ చేస్తుంది. ఇన్ఫోసిస్, ఐటీసీ, టీసీఎస్, హిందుస్తాన్ యూనిలీవర్, ఎల్‌అండ్‌టీ, రిలయన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వీటిలో ఉన్నాయి. స్మాల్, మిడ్ క్యాప్ షేర్లపై ఆసక్తి పెరిగినా పలు పెద్ద, మెగా క్యాప్ స్టాక్స్ ఆకర్షణీయమైన వేల్యుయేషన్స్ వద్దే ట్రేడవుతున్నాయని డీఎస్‌పీ ఎంఎఫ్ సీఎఫ్‌ఏ అనిల్ ఘేలానీ తెలిపారు. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక పోర్ట్‌ఫోలియోలో ఈ ఫండ్‌ను భాగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. మార్కెట్లు పడినప్పుడు డ్రాడౌన్లు తగ్గించేందుకు, దీర్ఘకాలికంగా మెరుగైన రాబడిని పొందేందుకు ఇది ఉపయోగపడగలదని వివరించారు.

యాక్సిస్ ఎంఎఫ్ నుంచి
కన్జంప్షన్ ఫండ్



యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ కొత్తగా కన్జంప్షన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సెప్టెంబర్ 6తో ముగుస్తుంది. కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీనికి నిఫ్టీ ఇండియా కన్జంప్షన్ టీఆర్‌ఐ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. పెరుగుతున్న ఆదాయాలు, కేవలం అవసరాలకే పరిమితం కాకుండా ఇతరత్రా ప్రీమియం ఉత్పత్తులు, సేవలపైనా ఖర్చు చేసే ధోరణులు పెరుగుతుండటం మొదలైనవి దేశీయంగా వినియోగానికి ఊతమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగ సంబంధ రంగాలు గణనీయంగా వృద్ధి చెందనున్నాయి. దీనితో వాటిల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడుల అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఫండ్ ఉపయోగపడగలదని యాక్సిస్ ఏఎంసీ ఎండీ గోప్‌కుమార్ తెలిపారు. ఈ ఫండ్ ప్రధానంగా ఎఫ్‌ఎంసీజీ, రిటైలింగ్, ఆటో, రియల్టీ, టెలికం, హెల్త్‌కేర్ వంటి రంగాల సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. దీనికి హితేష్ దాస్, శ్రేయాష్ దేవాల్కర్, కృష్ణా నారాయణ్ ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు.

బరోడా బీఎన్‌పీ పారిబా
డివిడెండ్ ఈల్డ్ ఫండ్



డివిడెండ్ ఈల్డింగ్ స్టాక్‌లలో ప్రధానంగా ఇన్వెస్ట్ చేసే డివిడెండ్ ఈల్డ్ ఫండ్‌ను బరోడా బీఎన్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ ప్రవేశపెట్టింది. ఇటు పెట్టుబడి వృద్ధి అటు డివిడెండ్‌పరంగా ఆదాయాన్ని కూడా ఇచ్చే విధంగా ఇది ఉంటుంది. ఇది అధిక స్థాయిలో ఫ్రీ క్యాష్ ఫ్లో, స్థిరంగా డివిడెండ్లు చెల్లించే చరిత్ర గల కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇందుకోసం మార్కెట్‌క్యాప్‌తో సంబంధం లేకుండా సముచిత ధరలో లభిస్తున్న కంపెనీలను అయిదు అంచెల వడపోత ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారని బరోడా బీఎన్‌పీ పారిబా ఏఎంసీ సీఈవో సురేష్ సోనీ తెలిపారు. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సెప్టెంబర్ 5న ముగుస్తుంది. గత 16 ఏళ్లలో దాదాపు పదేళ్ల పాటు నిఫ్టీ 500 టీఆర్‌ఐ ఇండెక్స్‌కి మించి నిఫ్టీ డివిడెండ్ ఆపర్చూనిటీస్ 50 టీఆర్‌ఐ మెరుగైన పనితీరు కనపర్చింది. నిర్దిష్ట అధ్యయనం ప్రకారం 2007లో నిఫ్టీ టీఆర్‌ఐలో ఇన్వెస్ట్ చేసిన రూ. 1 లక్ష ఇప్పుడు రూ. 6.7 లక్షలకు పెరిగితే, అదే మొత్తం నిఫ్టీ డివిడెండ్ ఆపర్చూనిటీస్ 50 టీఆర్‌ఐలో రూ. 10.4 లక్షలకు పెరిగి ఉండేదని సంస్థ తెలిపింది.

ఆకర్షణీయంగా లార్జ్ క్యాప్ ఫండ్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పటిష్ఠమైన ఫండమెంటల్స్, పాలసీపరమైన మద్దతు, సత్ఫలితాలిస్తున్న పెట్టుబడులు, వివిధ పరిశ్రమలవ్యాప్తంగా సామర్థ్యాల పెంపు తదితర అంశాల ఊతంతో దీర్ఘకాలికంగా భారత ఎకానమీ వృద్ధి అవకాశాలు బాగున్నాయని పీజీఐఎం ఇండియా మ్యుచువల్ ఫండ్ సీఐవో వినయ్ పహాడియా తెలిపారు. రిస్క్, రివార్డు ప్రాతిపదికన చూసినప్పుడు స్వల్పకాలికంగా మిడ్, స్మాల్‌క్యాప్స్‌తో పోలిస్తే లార్జ్ క్యాప్స్ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని ఆయన వివరించారు. ఇటీవలి రాబడులను బట్టి చూస్తే భారీగా పెరిగిన కొన్ని మిడ్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ కొంత నెమ్మదించే అవకాశం ఉందన్నారు. గత 1–4 ఏళ్లుగా ధరలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో షేర్ల ఎంపికలో కాస్త ఆచితూచి వ్యవహరించడం శ్రేయస్కరమని పహాడియా సూచించారు. దేశ విదేశ ఇన్వెస్టర్లు భారతీయ ఈక్విటీలపై ఆసక్తి కనబరుస్తున్నారని పహాడియా పేర్కొన్నారు. గత క్యాలెండర్ సంవత్సరంలో విదేశీ ఇన్వెస్టర్లు 22 బిలియన్ డాలర్ల విలువ చేసే ఈక్విటీలను కొనుగోలు చేసినట్లు చెప్పారు.



వినయ్ పహాడియా
సీఐవో, పీజీఐఎం, ఇండియా ఎంఎఫ్



మరోవైపు, 2020 క్యాలెండర్ సంవత్సరం నుంచి దేశీ ఇన్వెస్టర్లు (డీఐఐ) దాదాపు నిరంతరాయంగా కొనుగోళ్లు చేస్తూనే ఉన్నట్లు వివరించారు. ఈ ఏడాది ప్రథమార్ధంలో డీఐఐల పెట్టుబడులు సుమారు 29 బిలియన్ డాలర్ల మేర నమోదైనట్లు చెప్పారు. ఇక రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కూడా 2020 క్యాలెండర్ సంవత్సరం నుంచి గణనీయంగా పెరిగినట్లు వివరించారు. జీడీపీ వృద్ధి గణాంకాలు, పెరుగుతున్న తలసరి ఆదాయం, పాలసీ సంస్కరణల కొనసాగింపు, పెట్టుబడులపై ప్రధానంగా దృష్టి పెట్టడం వంటి అంశాలతో దేశీ ఈక్విటీల దీర్ఘకాలిక అంచనాలు మెరుగ్గా ఉన్నాయని పహాడియా చెప్పారు. వివిధ మార్కెట్‌క్యాప్‌లవ్యాప్తంగా ఇన్వెస్ట్ చేసే పీజీఐఎం ఇండియా మల్టీ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు ఆయన వివరించారు. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సెప్టెంబర్ 5తో ముగుస్తుంది. మరో రెండు ఫండ్స్‌ను కూడా ప్రవేశపెట్టనున్నట్లు పహాడియా చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-8-2024	
విశాఖ	505–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	72.00
2-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	450–00
వరంగల్	452–00
రిటైల్ ధర	5.10



గ్రేటర్‌లో వాహనాల విస్ఫోటనమిదీ

కేటగిరీ	వాహనాల సంఖ్య
ఆటోరిక్షాలు	1,07,862
కాంట్రాక్ట్ క్యారేజీలు	6,835
స్కూల్ బస్సులు	14,624
ఎలక్ట్రిక్ ఆటోరిక్షాలు	41
మ్యాక్సీక్యాబ్‌లు	15,754
గూడ్స్ వాహనాలు	3,14,359
క్యాబ్‌లు	79,609
కార్లు	14,82,028
ద్విచక్రవాహనాలు	59,25,468
ప్రైవేట్ సర్వీస్ వాహనాలు	2,274
స్టేజీ క్యారేజీలు	8,569
ట్రాక్టర్ ట్రాలర్లు	45,806
ఇతర వాహనాలు	40,421
మొత్తం వాహనాలు	80,43,650

సిటీ స్టీరింగ్ లాక్!

భారీగా పెరిగిన వాహనాలతో హైదరాబాద్ నగరం దిగ్బంధం • పీక్ అవర్స్‌లో అంగుళం కూడా ఖాళీ లేనట్టుగా వాహనాలు

సాక్షి, హైదరాబాద్:

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వాహన విస్ఫోటనం తారస్థాయికి చేరింది. రోడ్లపై అంగుళం కూడా ఖాళీలేనట్టుగా కార్లు, బైకులు, ఇతర వాహనాలు నిండిపోయి కనిపిస్తున్నాయి. నత్త నడకను తలపిస్తున్నట్టుగా ఒకదాని వెనుక ఒకటి మెల్లగా కదులుతున్నాయి. ఎప్పుడైనా కాసిన్ని చినుకులు పడితే అంతే.. గంటలకు గంటలు ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. బండి తీసుకుని రోడ్డెక్కితే నరకమే. అలాగని బస్సు ఎక్కుదామనుకుంటే.. అదే ట్రాఫిక్ చిక్కు. అంతంత సేపు కిక్కిరిసిన జనంలో నిలబడి ప్రయాణించలేని పరిస్థితి. ఎంఎంటీఎస్ రైళ్లోనో, మెట్రోలోనో వెళదామనుకుంటే.. ఇంటి నుంచి స్టేషన్లకు, స్టేషన్ల నుంచి ఆఫీసులకు వెళ్లేందుకు సరిగా రవాణా సదుపాయాలు లేని దుస్థితి. మొత్తంగా హైదరాబాద్ నగరం వాహనాల రద్దీతో 'గ్రిడ్ లాక్'స్థాయికి చేరుకుంటోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజారవాణాను మెరుగుపర్చడం, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కల్పించడమే ఈ సమస్యకు పరిష్కారమనే అభిప్రాయం వస్తోంది.

రవాణా సౌకర్యాలు సరిగా లేక..

హైదరాబాద్ మహానగరం అన్నివైపులా శరవేగంగా విస్తరిస్తోంది. ఇందుకు అనుగుణంగా రహదారులు, ప్రజారవాణా సదుపాయాలు మాత్రం పెరగడం లేదు. దీనితో వ్యక్తిగత వాహనాల వినియోగం భారీగా పెరిగింది. నగరం పరిధిలోనే ఏటా 3.5 లక్షల నుంచి 4.5 లక్షల వరకు వాహనాలు కొత్తగా వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతంఅన్ని రకాల వాహనాలు కలిపి 80 లక్షలు ఉంటే.. అందులో ద్విచక్ర వాహనాలు 60 లక్షలు, మరో 15 లక్షల వరకు కార్లు ఉండటం గమనార్హం. నగరంలోని రోడ్లపై రోజూ పీక్ అవర్స్‌లో ప్రతి కిలోమీటర్‌కు 30 వేల వరకు వాహనాలు ప్రయాణిస్తున్నట్టు అంచనా. ఇంత రద్దీతో నగరం దిగ్బంధమైపోయిన పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ప్రజా రవాణాలో కీలకమైన సిటీ బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గింది. బెంగళూరు, ముంబై వంటి మెట్రోపాలిటన్ నగరాల్లో బస్సుల సంఖ్య ఆరేడు వేలకుపైనే ఉంది. మరిన్ని బస్సులను పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. దానికి విరుద్ధంగా హైదరాబాద్‌లో బస్సుల సంఖ్య గత నాలుగైదేళ్లలో 3,885 నుంచి 2,550 కంటే తగ్గిపోవడం ఆందోళనకరం. ఔటర్ రింగ్ రోడ్డును దాటి మరీ నగరం విస్తరిస్తూ ఉంటే.. ప్రజా రవాణా సౌకర్యాలు మాత్రం పెరగడం లేదు.

'బండి'తప్పనిసరి అయిపోయి..

నగరంలో ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం నిత్యం రాకపోకలు సాగించేవారు సొంత వాహనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. నగరంలోని చాలా ప్రాంతాలను ప్రధాన మార్గాలకు అనుసంధానించే ప్రజా రవాణా సౌకర్యం సరిగా లేకపోవడమే దీనికి కారణం. అదే బస్సెక్కే విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు కిక్కిరిసి, ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తోంది. మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ ఆ మేరకు బస్సుల సంఖ్య పెరగలేదు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ గణాంకాల ప్రకారం.. 7,228 చదరపు కిలోమీటర్ల హైదరాబాద్ మెట్రోపాలిటన్‌ఏరియా (హెచ్ఎంఏ) పరిధిలో ప్రజా రవాణా సదుపాయం 31 శాతమే ఉంది.



అక్కడ పెరిగాయి... ఇక్కడ తగ్గాయి..

బెంగళూరులో ప్రస్తుతం 7,000 సిటీ బస్సులు ఉన్నాయి. వీటిని 13,000కు పెంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. ఢిల్లీలోనూ బస్సుల సంఖ్యను 6,000 నుంచి 7,000కు పెంచారు. కానీ గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం బస్సుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. నాలుగేళ్ల కిందటి వరకు ఇక్కడ 3,885 బస్సులు నడవగా.. ఇప్పుడీ సంఖ్య 2,550కు తగ్గింది. సిటీ జనాభా పెరుగుతున్న క్రమంలో ప్రజారవాణాలో కీలకమైన ఆర్టీసీ బస్సుల సంఖ్య తగ్గిపోతుండటం ఆందోళనకరం.

గత పదేళ్లలో రోడ్డెక్కిన కొత్త వాహనాలు..

సంవత్సరం	వాహనాలు
2014-15	2,90,850
2015-16	3,91,758
2016-17	4,21,217
2017-18	4,43,834
2018-19	4,97,252
2019-20	5,26,760
2020-21	3,02,348
2021-22	3,70247
2022-23	4,87,942
2023-24	5,23,245

మొత్తం 42,55,453

ఏం చేస్తే.. సమస్యకు చెక్ పెట్టొచ్చు?

మెట్రో మార్గాలు పెరిగితే ఎంతో ప్రయోజనం

నాగోల్–రాయదుర్గం, ఎల్‌బీనగర్–మియాపూర్, జేబీఎస్–ఎంజీబీఎస్‌ల మధ్య ప్రస్తుతం రోజుకు 1,030కుపైగా మెట్రోరైలు ట్రిప్పులు నడుస్తున్నాయి. 4.8 లక్షల నుంచి 5 లక్షల వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మెట్రో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూపోతోంది. రైళ్లు, మెట్రో స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బోగీల సంఖ్య పెంచాల్సి ఉందని గత ఏడాదే గుర్తించారు. కానీ ఇప్పటివరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు లేవు. మూడు కోచ్‌ల మెట్రోలోనే కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది. ఢిల్లీలోని మెట్రోరైళ్లలో 6 నుంచి 8 కోచ్‌లు ఉన్నాయి. బెంగళూరులో కూడా 6 కోచ్‌లతో మెట్రో రైళ్లు పరుగులు తీస్తున్నాయి. హైదరాబాద్‌లో మాత్రం 2017 నుంచీ కూడా మూడు కోచ్‌లే ఉండటం గమనార్హం. అదనంగా కోచ్‌లను ఏర్పాటు చేస్తే తప్ప రద్దీ నియంత్రణకు పరిష్కారం లభించదు.

ఎంఎంటీఎస్‌ను విస్తరించాలి

ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ పూర్తయినా సర్వీసులు మాత్రం పెరగలేదు. పైగా గతంలో 121 ఎంఎంటీఎస్‌లు ఉంటే ఇప్పుడు 70కి తగ్గాయి. మరోవైపు లింగంపల్లి నుంచి పటాన్‌చెరు–తెల్లాపూర్ వరకు, మేడ్చల్ నుంచి ఉందానగర్ వరకు, సికింద్రాబాద్ నుంచి ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ లైన్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ అందుకు అనుగుణంగా సర్వీసులు పెరగలేదు. ప్రయాణికుల సంఖ్యను బట్టి చూస్తే.. వివిధ మార్గాల్లో కలిపి కనీసం 250 ఎంఎంటీఎస్ సర్వీసులు నడపాల్సి ఉంటుందని అంచనా. కానీ ప్రస్తుతం అందులో మూడో వంతు కూడా లేవు. కొత్తగా ఎంఎంటీఎస్ విస్తరణతోపాటు సర్వీసుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది.

లాస్ట్‌మైల్ కనెక్టివిటీ అవసరం...

మెట్రోరైల్ స్టేషన్ల నుంచి కాలనీలకు, శివారు ప్రాంతాలకు సమర్థవంతమైన కనెక్టివిటీ లేకపోవడం వల్ల నగరవాసులు సొంత వాహనాలపై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. మెట్రో రైలు దిగిన ప్రయాణికుడు ఇంటికి చేరేందుకు మరో ప్రజా రవాణా వ్యవస్థ అందుబాటులో లేదు. ఆటోలు, క్యాబ్‌లలో వెళ్లాలంటే.. రోజూ వందలకు వందలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇది ఆచరణ సాధ్యం కాదు. అదే లాస్ట్‌మైల్ కనెక్టివిటీని పెంచితే.. ప్రజా రవాణా వినియోగం పెరుగుతుంది.

ప్రజారవాణా పెరగాలి



వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గాలంటే ప్రజారవాణా సదుపాయాలు పెరగడం ఒక్కటే పరిష్కారం. గత పదేళ్లలో జనాభా పెరిగినట్టుగా రవాణా సదుపాయాలు పెరగలేదు. దీంతో ప్రజలు సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది.

– మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ఉపరవాణా కమిషనర్, రంగారెడ్డి జిల్లా

కనెక్టివిటీయే అతిపెద్ద సవాల్

హైదరాబాద్ నగరానికి నలువైపులా కనెక్టివిటీ లేకపోవడం ఇక్కడి ప్రజారవాణాలో అతి పెద్ద సమస్య. దీనితో వాహనాల వినియోగం బాగా పెరిగింది. కాలుష్య కారకాలు కూడా ప్రమాదకర స్థాయికి చేరాయి. ప్రభుత్వం తక్షణమే ప్రజారవాణా సదుపాయాలపై దృష్టి సారించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

– ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి, పర్యావరణ నిపుణుడు



వాగులో ఈదుకుంటూ వస్తున్న గ్రామస్తులు

సరుకులు కావాలంటే.. వాగు ఈదాల్సిందే

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం అల్లంవారిఘణపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎలిశెట్టిపల్లిలో జంపన్న వాగు శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎలిశెట్టిపల్లి నుంచి భూటారం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడం, వాగుకు వంతెన కూడా లేకపోవడంతో నిత్యావసర సరుకుల కోసం గిరిజనులు వాగు దాటి చెల్పాక మీదుగా ఏటూరునాగారం చేరుకుంటున్నారు. ఎలిశెట్టిపల్లి, కొత్తూరు గ్రామాలు ఏటూరునాగారం ఐటీడీఏ కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉండి కూడా రోడ్డు, రవాణా సదుపాయాలకు నోచుకోని దుస్థితి నెలకొంది. ఎలిశెట్టిపల్లిలో సుమారు 100 ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయి. ఇటీవల వరదల సమయంలో వాగు ఉప్పొంగడంతో ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన పడవలు, వరదలు తగ్గిన తర్వాత తొలగించారు. అయితే ఈ రెండు రోజుల్లో కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి.

కనిపెట్టారు... పనిపట్టారు

- రూ.175 కోట్ల సైబర్ మోసాల్లో ఇద్దరు అరెస్టు
- అమాయకుల పేరిట ఖాతాలు తెరిచి లావాదేవీలు
- మ్యూల్ బ్యాంక్ ఖాతాలతో దుబాయ్ నుంచి సైబర్ మోసాలు

సాక్షి, హైదరాబాద్: అమాయకులకు కమీషన్ల ఆశజూపి వారి పేరిట తెరిచిన బ్యాంకు ఖాతాలను సైబర్ నేరాలకు వినియోగిస్తున్న ఓ ముఠా గుట్టురట్టు చేశారు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు. ఈ ముఠాలోని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరిని హైదరాబాద్‌లోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్‌షోయబ్ తఖ్వీర్, మొగల్‌పురాకు చెందిన మహ్మద్‌బిన్ అహ్మద్ బవాజీర్‌గా గుర్తించారు. ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్)లో హైదరాబాద్‌లోని షంషీర్‌గంజ్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఆరు బ్యాంకు ఖాతాలపై ఎక్కువ ఫిర్యాదులు రావడంతో టీజీ సీఎస్‌బీ అధికారులు దృష్టిసారించి పలు కీలక విషయాలు గుర్తించారు. సుమోటోగా కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ ఖాతాల నుంచి రెండు నెలల స్వల్ప వ్యవధిలోనే రూ.175 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ ఖాతాలపై దాదాపు 600 సైబర్ నేరాలు నమోదై ఉన్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. ఈ మేరకు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

దుబాయ్‌లో కీలక నిందితుడు

ఈ ముఠాలో కీలక నిందితుడు దుబాయ్ కేంద్రంగా సైబర్‌మోసాలు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అతని ఐదుగురు సహచరులు పేద ప్రజలకు కమీషన్ల ఆశచూపి వారి వివరాలతో బ్యాంకు ఖాతాలు (మ్యూల్ ఖాతాలు) తెరిపిస్తున్నారు. అలా బ్యాంకు ఖాతాలు తెరిచిన తర్వాత వాటిని సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన లావాదేవీలకు, హవాలా కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. ఇలాంటి మ్యూల్ ఖాతాలు తెరవడానికి అవసరమైన పత్రాలను సిద్ధం చేయడంలో షోయబ్ కీలక పాత్ర పోషించాడు. షోయబ్, ఇతర సహచరులు కొంతమంది పేద వ్యక్తులను ఒప్పించి ఫిబ్రవరి 2024లో ఎస్‌బీఐ షంషీర్‌గంజ్ బ్రాంచ్‌లో ఆరు కరెంట్ ఖాతాలను తెరిపించారు. చెక్కులపై ఖాతాదారుల సంతకాలు తీసుకుని వాటిని షోయబ్, బవాజీర్ తమ వద్దనే పెట్టుకున్నారు. ప్రధాన మోసగాడి ఆదేశాలను అనుసరించి సహచరులు డబ్బును విత్‌డ్రా చేసి ఏజెంట్ల ద్వారా పలువురు వ్యక్తులకు పంపిణీ చేశారు. ఆ బ్యాంకు ఖాతాల ద్వారా మార్చి, ఏప్రిల్‌లో రూ.175 కోట్ల మేర లావాదేవీలు జరిపినట్లు అధికారులు గుర్తించారు. ఎస్పీ దేవేందర్‌సింగ్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టిన డీఎస్పీలు హరికృష్ణ, కేవీఎం ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీను, మహేందర్, కానిస్టేబుల్ వెంకట్ గౌడ్, సయ్యద్ తాహెర్, కృష్ణస్వామి, శంకర్‌ను శిఖాగోయల్ అభినందించారు. ఏవైనా అనుమానాస్పద లావాదేవీలు తమ ఖాతాలో జరుగుతున్నట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ప్రజలకు సూచించారు.

పట్టాల మధ్యలో పడుకుని... ప్రాణాలు కాపాడుకుని..



రైలు వెళ్తుండగా పట్టాల మధ్యలో పడుకున్న మహిళ

బషీరాబాద్: రైలుపట్టాలు దాటబోయిన మహిళ అకస్మాత్తుగా రైలు కదలడంతో పట్టాల మధ్యలో పడుకుని ప్రాణాలు కాపాడుకుంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా నావంద్గీ(బషీరాబాద్) రైల్వే స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. మండలానికి చెందిన ఓ గుర్తు తెలియని మహిళ నావంద్గీ రైల్వేస్టేషన్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆగి ఉన్న గూడ్స్ రైలు కింద నుంచి పట్టాలు దాటేందుకు యత్నించింది. అదే సమయంలో రైలు కదలడంతో ప్లాట్‌ఫామ్‌పై ఉన్న యువకుడు ఆమెను అప్రమత్తం చేశాడు. దీంతో రైలు వెళ్లిపోయే వరకు పట్టాల మధ్యలో పడుకుని ప్రాణాలను కాపాడుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

156 మందుల కాంబినేషన్లపై కేంద్రం నిషేధం

సాక్షి, హైదరాబాద్: జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులు, అలర్జీలు సహా పలు రకాల సాధారణ అనారోగ్యాలకు తయారు చేస్తున్న మందుల కాంబినేషన్లు చాలా ప్రమాదకరమని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అందువల్ల డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం–1940 సెక్షన్ 26ఏ ప్రకారం 156 రకాల డ్రగ్స్ తయారీ, విక్రయాలు, మార్కెటింగ్‌పై తాజాగా నిషేధం విధించింది. ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) డ్రగ్స్ వల్ల లాభాలకన్నా ప్రమాదాలే ఎక్కువని హెచ్చరించింది. డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు అపెక్స్ ప్యానెల్, నిపుణుల కమిటీ చేసిన సూచనల మేరకు ఈ చర్యలు చేపట్టింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.









రణ్ ఆఫ్ కచ్ ఉప్పు ఎడారి. గుజరాత్ ఆహారం, ఆహార్యం కొలువుదీరే ప్రదేశం. ఇక్కడ జరిగే సాంస్కృతిక వేడుకలు ప్రపంచ ప్రసిద్ధి. ఈ వేడుకల కోసం ఏటా దేశవిదేశాల నుంచి ఎనిమిది వేల మందికి పైగా పర్యాటకులు గుజరాత్ బాట పడుతుంటారు. చారిత్రక, సాంస్కృతిక, సంప్రదాయిక గుజరాత్‌ని చూడవచ్చు. ఈ ఏడాది మనం కూడా చూసొద్దాం.

కచ్ మహోత్సవ్

జానపద వేడుకలు







రణ్ ఆఫ్ కచ్ ఎక్కడ ఉంది!

లవణవారి నది, రాజస్థాన్ రాష్ట్రం, అజ్మీర్‌లో పుట్టింది. వాడుకలో లూనీ నది అయింది. నీరు ఉప్పగా ఉంటుంది. అరేబియా సముద్రంలో కలవాలనుకుని థార్ ఎడారి మీదుగా, గుజరాత్ వైపు ప్రవాహం మొదలు పెట్టింది. అయితే ఈ ప్రదేశంలో అరేబియా తీరం వెంబడి నేల సముద్ర మట్టానికంటే పదిహేను మీటర్ల ఎత్తుగా ఉండడంతో లూనీ ప్రవాహం సముద్రాన్ని చేరకనే నేలలో ఇంకిపోతోంది. అలా ఇంకిపోతూ విస్తరించిన ఉప్పు ఎడారి పేరే రణ్ ఆఫ్ కచ్. ఈ ప్రదేశం గుజరాత్ రాష్ట్రం కచ్ జిల్లాలో ఉంది. ఇది గొప్ప టూరిస్ట్ డెస్టినేషన్. ఏటా దాదాపు నాలుగు నెలల పాటు నిర్వహించే వేడుకలు ఈ ఏడాది నవంబరు ఒకటి నుంచి మొదలు కానున్నాయి.


అద్దాలు, పూసలు కుట్టిన ఘాగ్రా, చోలీ, తల మీదుగా కప్పుకునే అద్దాలు కుట్టిన ఓణీ మహిళల ఆహార్యం. చోర్నీ లేదా ధోతీ, కేడియు (గౌను వంటి కుర్తా), తలకు బాందినీ ప్రింట్ అద్దిన రంగురంగుల పగిడీ మగవాళ్ల ఆహార్యం. ఆభరణాలు కూడా వైవిధ్యంగా ఉంటాయి. గాజులు, చోకర్, నెక్లెస్, చెవి రింగులు, నత్తు, చాంద్‌బాలీలు, నడుముకు చైన్‌లు, కాళ్లకు మట్టపట్టీలతో గుజరాతీలు ప్రత్యేకంగా కనిపిస్తారు. సంప్రదాయ ఆహార్యంలో దంపతుల శిల్పాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ● ఈ వేడుకను గుజరాత్ టూరిజమ్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తుంది. టెంట్ సిటీలో బస బుక్ చేసుకోవడం ఇప్పటి నుంచే మొదలవుతుంది. అఫిషియల్ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఈ వేడుకలకు వెళ్లడానికి ఎయిర్‌పోర్ట్ కచ్ జిల్లా కేంద్రం భుజ్ నగరంలో ఉంది.

వైవిధ్యతల వేదిక

రణ్ ఆఫ్ కచ్ ప్రదేశంలో ఉప్పు ఎడారి మీద సూర్యకిరణాలు సప్తవర్ణాలను ప్రతిబింబిస్తుంటాయి. సాయంత్రాలు చల్లని వెన్నెలలో తెల్లటి నేల మల్లెల తివాచీని తలపిస్తుంది. కచ్ ఉత్సవాల కోసం మూడు వందలకు పైగా టెంట్‌లు నిర్మిస్తారు. గుజరాత్ గ్రామీణ ప్రాంతాల గుడిసెలను పోలిన నిర్మాణాలు కూడా ఉంటాయి. పర్యాటకులకు బస వాటిలోనే. క్రాఫ్ట్ విలేజ్‌లో వందలాది దుకాణాలలో గుజరాత్ సంప్రదాయ కళలు, కళారూపాలు, లెదర్ ఆర్టికల్స్, ఉడెన్ హ్యాండీక్రాఫ్ట్స్ కాపర్ బెల్స్ కొలువుదీరి ఈ టూర్‌కి గుర్తుగా ఇంటికి తీసుకెళ్లమంటుంటాయి. ఇక దుస్తుల్లో బాతిక్ ప్రింట్, అజ్రక్ ప్రింట్, రోగన్ వర్క్, సిల్వర్ వర్క్, మడ్‌మిర్రర్ వర్క్, కచ్ వర్క్, మట్వా ఎంబ్రాయిడరీలు ఏది కొనాలో తేల్చుకోనివ్వవు. సాంస్కృతిక వేదికల మీద సంగీత నాట్యరీతుల ప్రదర్శనలు జరుగుతుంటాయి. ఉప్పు నేల మీద ఎర్రటి తివాచీలు పరిచి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. గుజరాత్ జానపద సంగీత నృత్య ప్రదర్శనలు కూడా ఉంటాయి. కచ్ మహోత్సవం గుజరాత్ ఎత్నిసిటీ ప్రదర్శన కోసమే అన్నట్లు ఉంటుంది. వైవిధ్యత అంతటినీ ఒక చోట రాశిపోసినట్లు ఉంటుంది. కాబట్టి టూర్‌ని ఆద్యంతం ఆస్వాదించవచ్చు.

ఒంటెబండి ఎక్కవచ్చు


ఒంటె మీద స్వారీ చేయడం తెలిసిందే, ఇక్కడ ఒంటెబండిలో విహారం మరో చక్కటి అనుభూతి. హనీమూన్ కపుల్ కోసం మినీ బండి, ఫ్యామిలీ కోసం పెద్ద బండ్లు ఉంటాయి. సూర్య కిరణాలు సోకి తెల్లగా మిలమిల మెరుస్తున్న ఉప్పు కయ్యల్లో ఒంటె పాదాల ముద్రలు పడుతుంటాయి. కొంత సేపటికే ఉప్పు కరిగి పాదముద్రలు మాయమైపోతాయి. ఒంటెబండి సవారీతోపాటు హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కిస్తే పిల్లలకు టూర్ హండ్రెడ్ పర్సెంట్ సంతోషాన్నిచ్చినట్లే.



● మడికెరె ఫోర్ట్‌లో ఒక ప్యాలెస్

కూర్గ్

మంచి కాఫీలాంటి టూర్!





కూర్గ్ అందమైన ప్రదేశం, ప్రశాంతమైన వాతావరణం, పచ్చదనానికి కొత్త చిగుర్లు తొడిగినట్లు ఉంటుంది ఏడాదంతా. కాఫీ తోటలు, మిరియాల తీగలు అల్లుకున్న మహావృక్షాలు. ఆ వృక్షాల కొమ్మలకు తేనెపట్టులు. జీవవైవిధ్యతలో సౌందర్యమంతా ఒక్కచోట రాశిపోసినట్లు ఉంటుంది. పశ్చిమ కనుమల్లో విస్తరించిన ఈ ప్రదేశం ప్రాచీన కాలం నుంచి జనావాసం. కొడగు జాతి నివసించే ప్రదేశం కాబట్టి దీనిపేరు కొడగు. బ్రిటిష్ నాలుక మీద కూర్గ్ రూపం సంతరించుకున్న ఈ ప్రదేశం యోధుల ఆరామం. కొడవ ప్రజలు అత్యంత శాంతికాముకులు, యుద్ధకళల్లో ఆరితేరిన వాళ్లు. అడవుల్లో ప్రశాంతంగా జీవిస్తూ ఉంటారు. శత్రువు ఎదురైతే మాత్రం వారిలోని యుద్ధనైపుణ్యం బయటకు వస్తుంది. కరియప్ప, తిమ్మయ్య వంటి కొడవ వీరులు సైన్యంలో గొప్ప సేవలందించారు. కొడవల జీవనశైలిలో ఆయుధధారణ తప్పనిసరి. మగవాళ్లు నల్లటి పొడవైన కుప్యా చాలె ధరిస్తారు. నడుముకి ఒక వస్త్రాన్ని చుట్టుకుని అందులో కత్తిని దాస్తారు. మహిళలు చీరను చుట్టే తీరు వైవిధ్యంగా ఉంటుంది. వీరిలో కొత్తతరం సాధారణ ఆధునిక దుస్తులు ధరిస్తోంది. వేడుకలప్పుడు అందరూ సంప్రదాయ దుస్తులు ధరిస్తారు.

గ్రీన్ ట్రెకింగ్ జోన్

పశ్చిమ కనుమలలో ట్రెకింగ్ చేస్తూ కూర్గ్ ప్రకృతి సౌందర్యాన్ని వీక్షించడం, ఎలిఫెంట్‌సఫారీతోపాటు మడికెరె కోటను కూడా చూడాలి. కోట అని చెప్తే తప్ప కోట అని భావించలేం. ఎందుకంటే రాజస్థాన్ కోటల్లాగ శత్రుదుర్భేద్యంగా ఏమీ ఉండదు. కోట లోపల ఉండే ప్యాలెస్‌లు కూడా ఎర్ర పెంకుతో నిర్మించిన రెండంతస్థుల నిర్మాణాలే. అత్యంత సాధారణంగా ఉంటుంది. ఒక ప్యాలెస్‌లో పోలీస్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం, ఒక ప్యాలెస్‌లో మ్యూజియం ఉన్నాయి. కూర్గ్ కళల నిలయం అది. ఇక్కడ పర్యటించడానికి సెప్టెంబర్ నుంచి జూన్ వరకు సౌకర్యమే. కానీ ట్రెకింగ్‌కి అక్టోబర్ నుంచి మార్చి మధ్య సౌకర్యం.

మంచు తివాచీ మీద
వెన్నెల విహారం

స్పితి వ్యాలీ



స్పితిలోయలో సోనూసూద్





నేలంటే నేలా కాదు, నింగి అంటే నింగీ కాదు. రెండింటి మధ్య విస్తరించిన మంచు తివాచీ. పర్వతాల ఒడిలో ఓ హిమానీనదం. శీతాకాలంలో నీటి ఆనవాలు కనిపించదు. వేసవికాలంలో మంద్రంగా సాగుతుంది ప్రవాహం. ఇక్కడ మనకున్నట్లు మూడు కాలాలుండవు. ఆకాశం మేఘావృతం కావడం, వర్షపు చినుకు ఒంటి పడినప్పుడు కలిగే పులకింత అనుభవంలోనే ఉండదు. వీళ్లకు ఉన్నవి వేసవి కాలం, శీతాకాలం మాత్రమే. వాన చుక్కకు నోచుకోని నేల మీద నివసించే ప్రజల్ని బతికించడానికి మంచుకిమనసు ద్రవించింది. నదిగా ప్రవహించింది. అదే స్పితి నది. ఈ నది ఉన్న ప్రదేశం స్పితి లోయ.

సోనూ సూద్ వెళ్లొచ్చాడు!

స్పితి నది, లోయ హిమాచల్ ప్రదేశ్‌లో ఉంది. హిమాలయపర్వతాల్లో కుంజుమ్ శ్రేణుల్లో ఉంది. ఇక్కడ వెయ్యేళ్లుగా జనావాసం ఉంది. వాళ్లకు ఈ నది నీరే ఆధారం కావడంతో ఇక్కడి గ్రామాలు నది తీరం వెంబడి విస్తరించి ఉంటాయి. అడ్వెంచర్ టూర్‌కి ఇది బెస్ట్ ప్లేస్. ఇటీవల బాలీవుడ్ నటుడు సోనూ సూద్ ఈ ప్రదేశంలో బైక్ రైడింగ్ చేసి తన అనుభవాలను పంచుకున్నారు. 'బైక్ మీద ఏడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాలనుకున్నాను, కానీ ఈ వాతావరణంలో ఏడు గంటల సేపు బైక్ రైడ్ చేసినా అలసట అనిపించలేదు. నా కాలేజ్ రోజులు గుర్తుకొచ్చాయి' అన్నారు సోనూ. యూత్‌ఫుల్ జర్నీ కోరుకునే వాళ్లు ట్రై చేయవచ్చు. పౌర్ణమి ముందు, వెనుక రోజుల్లో ప్లాన్ చేసుకుంటే మంచు మీద వెన్నెల కాంతులను కూడా ఆస్వాదించవచ్చు.

కళకు హృదయం ఉంటే చాలు అని కళ్లకు కట్టే చిత్రాలు చూస్తే అనిపించకమానదు. తమలోని కళను కాన్వాస్ మీద కుంచెతో కదిలించే చేతులు ఎన్నో ఉంటాయి. కానీ, మదిలోని భావాలను ఆత్మవిశ్వాసమే కుంచెగా మలిచి పాదాలతోనూ, నోటితోనూ వేసే పెయింటింగ్స్ అయితే..

హార్ట్ ఫుల్ పెయింటింగ్స్!



ఆర్ట్

ప్రపంచవ్యాప్తంగా మౌత్ అండ్ ఫూట్ పెయింటింగ్ ఆర్టిస్టులు వందల సంఖ్యలో ఉన్నారు. మన దేశంలో పాతికమంది కళాకారులు తమ పాదాలతోనూ, నోటితోనూ రంగులతో కాన్వాస్‌లకు కొత్త ఊపిరి పోస్తున్నారు. వాల్‌పెయింటింగ్స్, గొడుగు, మగ్స్, బాటిల్స్, బ్యాగ్స్, ఫ్యాబ్రిక్, పేపర్.. యాక్ససరీస్‌పైన కూడా ప్రతిభను చూపుతూ ఉపాధి మార్గాలకు కొత్త దారులను అన్వేషిస్తున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీలేఖ మందలపల్లి, కేరళ వాసి సునీత, పానిపట్ నుంచి రుచిగోవర్, కాశ్మీర్ నుంచి ఉత్తమ్‌కుమార్.. ఇలా పాతికమంది మౌత్ అండ్ ఫుట్ పెయింటర్స్ ఉన్నారు. వీరు అన్ని రాష్ట్రాలలో ఎగ్జిబిషన్స్ నిర్వహిస్తూ తమలాంటి వారిని కలుసుకుంటున్నారు.

''కార్పొరేట్ రంగంలో ఉన్న వారికి మోటివేషనల్ వర్క్‌షాప్స్, పెయింటింగ్ వర్క్‌షాప్స్ కూడా నిర్వహిస్తున్నాం'' అని చెబుతున్నారు శ్రీలేఖ మందలపల్లి. ఆమె మౌత్ పెయింట్ ఆర్టిస్ట్. పుట్టుకతో ఆర్థోగ్రైపోసిస్ మల్టీప్లెక్స్ కంజెనిటా అనే అరుదైన సమస్యతో జన్మించిన శ్రీలేఖ వీల్ చైర్‌కే పరిమితమైంది. రోజువారీ పనులన్నింటికీ సహాయం అవసరం. వైకల్యం ఆమెను మౌత్ పెయింటర్‌గా మార్చకుండా ఆపలేకపోయింది. 2003లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత, ఆమె ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌ను ప్రారంభించింది. ఆయిల్ పెయింటింగ్‌లోనూ నైపుణ్యం సాధించింది. తనలాంటి వైకల్యం ఉన్న ఇతరులను ప్రోత్సహించడానికి, సహాయం చేయడానికి తన వంతు కృషి చేస్తుంది.









కడవరకు

నా చివరి శ్వాస వరకు చిత్రాలను గీస్తూనే ఉంటాను. ఎంతో మంది ప్రేమ నన్ను మీ మధ్య సజీవంగా ఉంచుతోంది.

- ఉత్తమ్ కుమార్

వర్క్‌షాప్స్

ఇన్‌స్టిట్యూట్‌లు, పాఠశాలలు, కార్పొరేట్ కంపెనీలలో మోటివేషనల్ వర్క్‌షాప్‌లను నిర్వహిస్తుంటాను. అభిరుచి ఉన్న వాళ్లకు ఆర్ట్ క్లాస్‌లను తీసుకుంటాను. 2013 నుండి ఎమ్ఎఫ్‌పిఎ సంస్థలో సభ్యురాలిగా ఉన్నాను.

- శ్రీలేఖ

పాదాలతో ప్రతిభ

స్వప్న అగస్టిన్ కేరళలోని పాతానికాడ్ లో జన్మించారు. ఆమె పుట్టుకతో రెండు చేతులు లేవు. చిన్నప్పుడు కూడా పెయింటింగ్, డ్రాయింగ్‌తో సహా అన్ని పనులను తన పాదాలతో చేయడం అలవాటు చేసుకుంది. కళ పట్ల ఆమె ప్రతిభను త్వరలోనే కనుగొనడం వలన, ఆమె పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే పెయింటింగ్‌ను కొనసాగించడానికి ఆమె తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆమెకు అవసరమైన మద్దతు మరియు ప్రోత్సాహాన్ని అందించారు. ఆమె చిత్రాలు విద్యార్థుల వార్తాలేఖలు, యువత పత్రికలలో ప్రచురించబడ్డాయి. స్వప్న భారతదేశంలో జరిగిన అనేక గ్రూప్ ఎగ్జిబిషన్లలో పాల్గొంది.

ప్రేమ - శ్రద్ధ

కాశ్మీర్‌లోని చిన్న పట్టణమైన మజౌరీ విలేజ్‌లో పేద కుటుంబంలో జన్మించిన ఉత్తమ్‌కి పట్టు లేని చెయ్యి. ఎడమ పాదం మాత్రమే పని చేస్తుంది. చుట్టుపక్కల వారితో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, ఉత్తమ్ సవాలుగా తీసుకొని తన సత్తా ఏమిటో ప్రపంచానికి చూపించాలని నిర్ణయించుకున్నారు. చాలా కష్టంతో, ఉత్తమ్ తన ఎడమ పాదంతో వేలాడుతున్న చేతితో పాక్షికంగా పెన్సిల్‌ను పట్టుకోవడం ప్రారంభించాడు. 12వ తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత, ఉత్తమ్ అనేక ఆర్ట్ ఎగ్జిబిషన్‌లు మరియు పబ్లిక్ ఆర్ట్ షోలలో పాల్గొని, ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థల నుండి అనేక అనులేఖనాలు, అవార్డులు మరియు ప్రశంసలను గెలుచుకున్నారు.

మనసులో ఉన్న భావాలను, సమాజ స్థితులను కళ్లకు కట్టినట్టుగా చిత్రించే ఆర్టిస్టుల్లో తమకో ప్రత్యేక దారిని ఎంచుకొని, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఈ హార్టిస్టులు.

మన ఖాదీ

గ్లోబల్ బ్రాండ్





మన దేశీయుల చేతిలో రూపుదిద్దుకుని, గ్లోబల్ మార్కెట్‌లో భారతీయ బ్రాండ్‌గా వెలుగొందుతోంది ఖాదీ. చేతితో నేసిన వస్త్రం కావడం, ప్రత్యేకత, పారదర్శకత, నాణ్యత కారణంగా ఖాదీ ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందింది. విశిష్టమైన చరిత్ర, గుర్తింపు, ఆకర్షణ, హస్తకళా పద్ధతులు ఆధునిక విలాసవంతమైన వస్త్రంగా మారే సామర్థ్యాన్ని ఖాదీకి ఇచ్చిందని సామాజిక వేత్తలు చెబుతున్న మాట.

దేశ స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యమైన జాతీయ చిహ్నంగా పరిగణించిన ఖాదీ ఈ ఎనిమిదేళ్లలో విక్రయాల్లో నాలుగు రెట్లు వృద్ధిని నమోదు చేసింది. భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఖాదీ ఫ్యాషన్ ఎంపికగా మారింది. ఖాదీ వస్త్రాల విక్రయం 2013-14 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల స్థాయి 1,081 కోట్లతో పోలిస్తే 2023-24లో 6,496 కోట్లకు చేరి, 500 శాతం పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 5,943 కోట్ల విలువైన ఖాదీ వస్త్రాలు విక్రయించబడ్డాయి. యుకె, యూరోప్, దుబాయ్ వరకు ప్రచార కార్యక్రమాలు ఖాదీ గ్లోబల్ రీచ్‌ను ప్రోత్సహించాయి. 2017-18లో భారతదేశ చేనేత ఉత్పత్తుల ఎగుమతులు 355.9 మిలియన్లకు చేరుకున్నాయి. యుఎస్, యుకె, స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాలు ఖాదీకి అతిపెద్ద మార్కెట్లుగా ఉన్నాయి.

యువతను ఆకర్షించే ప్రయత్నాలు

ప్రధాని మోడీ ఇచ్చిన 'ఖాదీ ఫర్ నేషన్, ఖాదీ ఫర్ ఫ్యాషన్' అనే నినాదం ఒక ఫ్యాషన్ స్టేట్‌మెంట్ మాత్రమే కాదు దేశం గర్వించదగిన చిహ్నం కూడా. భారత ప్రభుత్వం ఖాదీని గ్లోబల్ బ్రాండ్‌గా మార్చడానికి, ఖాదీ ఎగుమతులను పెంచడానికి ప్రయత్నిస్తోంది. జర్మనీ, యుకె, ఆస్ట్రేలియా, రష్యా, చైనాలలో ఖాదీ ట్రేడ్‌మార్క్ నమోదయ్యింది. యువతను ఆకర్షించే ప్రయత్నాల ఫలితంగా ఖాదీ ప్రజాదరణ పెరుగుతోంది. ఉదాహరణకు: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఖాదీ, ఖాదీ ఇన్‌స్టిట్యూషన్‌లు కళ్లు చెదిరే రంగులు, ఆధునిక సిల్హౌట్‌లతో కొత్త దుస్తులను అభివృద్ధి చేయడానికి సహకరిస్తున్నాయి.

ఈ ఎకో ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్ ఇప్పుడు దేశీ, విదేశీయుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని పొందింది. అయితే, ఖాదీ అధిక ధర, పరిమితంగా లభించడం కారణంగా ప్రపంచ ఫ్యాషన్ మార్కెట్‌లో బ్రాండ్ విజయం సాధించడం కష్టంగా ఉంటుందని మరికొందరు పేర్కొంటున్నారు.


లండన్‌లో మన ఒడిస్సీ





కళ

ఒడిస్సీ నృత్యకారిణి సాడే బుద్దాల్ లండన్ కంటెంపరరీ డ్యాన్స్ స్కూల్ నుండి ఇటీవల గ్లోబల్ సౌత్ స్కాలర్‌షిప్‌ను గెలుచుకున్న మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచింది. ఆమె కరేబియన్ దీవుల లోని ట్రినిడాడ్ అండ్ టొబాగో నుండి ఒడిస్సీ నృత్యంలో మాస్టర్స్ చేస్తోంది. బుద్దాల్ రీసెర్చ్‌కి అయ్యే ఖర్చు 21,300 పౌండ్లు (మన దేశ కరెన్సీలో దాదాపు రెండు కోట్లపైనే)స్కాలర్‌షిప్‌గా అందిస్తుంది. 35 ఏళ్ల బద్దాల్ సెయింట్ ఆగస్టిన్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో చదువుతున్నప్పటి నుండి భారతీయ శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించింది. గతులు నేర్చుకునే మొదటి దశలోనే చదువు కారణంగా నృత్యాన్ని నేర్చుకోవడం ఆపేసింది. సైకాలజీ డిగ్రీ చేస్తున్నప్పుడు ఒడిస్సీ శాస్త్రీయ నృత్యంవైపు ఆకర్షితురాలైంది. ''పాతికేళ్ల వయసులో ట్రినిడాడ్ అండ్ టొబాగో లోని నృత్యాంజలి థియేటర్‌లో ఆర్టిస్టిక్ డైరెక్టర్ గురు మొండిరా బాల్కరన్‌సింగ్ ఆధ్వర్యంలో నేర్చుకోవడం ప్రారంభించాను. పదేళ్లుగా వారి ప్రదర్శనలలో సభ్యురాలిని. నా జీవిత గమ్యాన్ని నృత్యంతో అన్వేషించాలనుకుంటున్నాను. నా పూర్వీకులలో ఎవరూ నృత్యకారులు లేరు. కానీ, నాకు మాత్రం భారతదేశంలో ఒడిషాలో పుట్టిన ఈ నృత్య కళ ప్రాణమైంది. సామాజిక మార్పుకు నాదైన భాషలో అవగాహన తీసుకురావాలంటే నాదైన సొంత గుర్తింపు ఉండాలి. అందుకు ఈ ఒడిస్సీ నృత్యం ప్రతిబింబిస్తుంది. ట్రినిడాడ్ అండ్ టొబాగో సంస్కృతి చాలా గొప్పది. వారి సంస్కృతిలో నా ఈ శాస్త్రీయ నృత్యాన్ని చేర్చి, లోతైన అధ్యయనం చేయాలనుకుంటున్నాను'' అని చెప్పే ఈ నృత్యకారిణి మాటలు ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకుంటున్నాయి.



అత్యుత్తమ స్థానానికి చేరాలంటే
ప్రస్తుత సంతృప్తికర స్థాయిని వదులుకోడానికి భయపడకూడదు.
- జాన్ డి. రాక్‌ఫెల్లర్, అమెరికన్ పారిశ్రామిక దిగ్గజం

సాక్షి ప్లస్
సోమవారం। 26-8-2024

బిజినెస్ రీల్..

సెబీ ఆదేశాలను పరిశీలిస్తున్నాం

అనిల్ అంబానీ ప్రతినిధి వెల్లడి



న్యూఢిల్లీ: నిధుల మళ్లింపు ఆరోపణల కేసులో అయిదేళ్ల పాటు నిషేధం, జరిమానా విధిస్తూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ జారీ చేసిన ఆదేశాలను పరిశీలిస్తున్నట్లు వ్యాపారవేత్త అనిల్ అంబానీ ప్రతినిధి వెల్లడించారు. దీనిపై లీగల్ బృందం సలహా మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 2022లో సెబీ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా అనిల్ అంబానీ ఇప్పటికే రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ బోర్డులకు రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో వివరించారు. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధులను మళ్లించిన కేసులో అనిల్ అంబానీతో పాటు 24 మందిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి అయిదేళ్ల నిషేధించడంతో పాటు అంబానీపై రూ. 25 కోట్ల జరిమానా కూడా విధించిన సంగతి తెలిసిందే.

రబ్బర్ బోర్డ్‌తో త్రయంభూ సొల్యూషన్స్ ఎంవోయూ

న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖలో భాగమైన ది రబ్బర్ బోర్డుతో హైదరాబాద్‌కు చెందిన సస్టెయిన బిలిటీ టెక్నాలజీ కంపెనీ త్రయంభూ సొల్యూషన్స్ (టీఆర్ఎస్‌టీ01) అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. యూరోపియన్ యూనియన్ డీఫారెస్టేషన్ నిబంధనల (ఈయూడీఆర్) పాటింపునకు, నేచురల్ రబ్బర్ ఎగుమతిదార్లకు తోడ్పాటునిచ్చేందుకు ఇది ఉపయోగపడగలదని ది రబ్బర్ బోర్డ్ సీఈవో ఎం వసంతగేశన్, టీఆర్ఎస్‌టీ01 సీఈవో ప్రబీర్ మిశ్రా తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 30 నుంచి ఈయూడీఆర్ పూర్తి స్థాయిలో అమల్లోకి రానుంది. వీటి ప్రకారం అడవులను తొలగించిన ప్రాంతాల నుంచి రబ్బర్, కాఫీ, కోకో, సోయా వంటి కమోడిటీలకు సంబంధించిన ఉత్పత్తులను ఎగుమతి చేయడంపై ఆంక్షలు వర్తిస్తాయి. ఈయూడీఆర్‌కి అనుగుణంగా ఎగుమతిదార్లకు తాము టీఆర్ఎస్‌టీ01చెయిన్ పేరిట మదింపు సర్టిఫికెట్లను జారీ చేయనున్నట్లు మిశ్రా తెలిపారు.


మరిన్ని ప్రాంతీయ భాషల్లో జాయిన్‌డెవ్‌ఆప్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్లౌడ్ ఇంజినీరింగ్, డెవ్‌ఆప్స్ శిక్షణ సంస్థ జాయిన్‌డెవ్‌ఆప్స్ మరిన్ని ప్రాంతీయ భాషల్లోకి విస్తరిస్తోంది. ప్రస్తుతం తెలుగు, ఇంగ్లీష్‌లో శిక్షణనిస్తుండగా వచ్చే రెండు నెలల వ్యవధిలో హిందీ, తమిళంలోనూ ప్రారంభించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు శివ కుమార్ రెడ్డి మెట్టుకూరు తెలిపారు. సంక్లిష్టమైన సాంకేతిక కోర్సులను ప్రాంతీయ భాషల్లో నేర్చుకోవడం ద్వారా మరింత పట్టు సాధించేందుకు వీలుంటుందని, ఉద్యోగావకాశాలూ మెరుగుపడగలవని ఆయన పేర్కొన్నారు. రెజ్యూమె, ఇంటర్వ్యూ అసిస్టెన్స్ సర్వీసులు కూడా అందిస్తున్నామన్నారు. ఇందుకోసం జాబ్ పోర్టల్స్, పలు సంస్థల హెచ్ఆర్ విభాగాలతో కూడా జట్టు కడుతున్నామని శివకుమార్ వివరించారు. ఇప్పటివరకు తెలుగులో సుమారు 6,500 మందికి, ఇంగ్లీష్‌లో దాదాపు అయిదు వేల మందికి శిక్షణనిచ్చినట్లు పేర్కొన్నారు.

ఫెడ్‌వైపు ఇన్వెస్టర్ల చూపు

- ఆర్థిక గణాంకాలకూ ప్రాధాన్యం
- ఎఫ్అండ్‌వో ముగింపు ఎఫెక్ట్
- మార్కెట్ల కదలికలపై ప్రభావం
- స్టాక్ విశ్లేషకుల అంచనాలు



న్యూఢిల్లీ: స్థూల ఆర్థిక గణాంకాలు, ప్రపంచ మార్కెట్ల పరిస్థితులు తదితర అంశాలు ఈ వారం మార్కెట్ల కదలికలపై ప్రభావం చూపనున్నాయి. వీటికితోడు ఆగస్ట్ డెరివేటివ్ సిరీస్ ముగింపు సైతం కీలకంకానున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. గత వారాంతాన జాక్సన్ హోల్ వద్ద యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ పలు అంశాలపై చేసిన ప్రసంగానికీ ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు. వచ్చే నెల(సెప్టెంబర్)లో నిర్వహించనున్న పాలసీ సమావేశంలో వడ్డీ రేట్ల తగ్గింపునకు వీలున్నట్లు పావెల్ సంకేతాలిచ్చారు. దీంతో వారాంతాన యూఎస్ మార్కెట్లు సానుకూలంగా స్పందించాయి. లాభాలతో ముగిశాయి. ఈ బాటలో దేశీయంగానూ సెంటిమెంటు మెరుగుపడే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.

మరింత పురోగతి

స్టాక్ ఆధారిత కదలికల నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు మరింత పురోగమించే వీలున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే నెలవారీ ఎఫ్అండ్‌వో కాంట్రాక్టుల గడువు ముగియనున్న కారణంగా మార్కెట్లు కొంతమేర ఆటుపోట్లను చవిచూడవచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు. భవిష్యత్‌లో వడ్డీ రేట్ల తగ్గింపు బాటలో సాగేందుకు తగిన విధంగా సన్నద్ధమవుతున్నట్లు పావెల్ సంకేతాలిచ్చినట్లు తెలియజేశారు. దీంతో నేడు(సోమవారం) మార్కెట్లు పావెల్ ప్రసంగానికి అనుగుణంగా రియాక్ట్‌కానున్నట్లు అంచనా వేశారు. పాలసీ సర్దుబాట్లకు తగిన సమయం ఆసన్నమైనట్లు పావెల్ పేర్కొనడం గమనార్హం! వచ్చే సమావేశంలో ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించనున్నట్లు పలువురు నిపుణులు ఊహిస్తున్నారు. ఉపాధి గణాంకాలు బలహీనపడిన నేపథ్యంలో వేగవంత చర్యలకు వీలున్నట్లు భావిస్తున్నారు.

మాంద్యానికి చెక్

ఈ నెల మొదట్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ మాంద్యం బారిన పడనున్నట్లు చెలరేగిన ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లను దెబ్బతీసిన సంగతి తెలిసిందే. అయితే ఫెడ్ చైర్మన్ పావెల్ సమీప భవిష్యత్‌లో ఇందుకు అవకాశాలు తక్కువేనంటూ అభిప్రాయపడ్డారు. అయితే వడ్డీ రేట్లను అధిక స్థాయిలో తగ్గించే అవకాశాలు తక్కువేనని యాక్సిస్ సెక్యూరిటీస్ పీఎంఎస్ విభాగం ఇన్వెస్ట్‌మెంట్ చీఫ్ నవీన్ కులకర్ణి పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పాలసీ సర్దుబాట్లకు వీలున్నట్లు తెలియజేశారు.

రికవరీ ర్యాలీ

సానుకూల యూఎస్ ఆర్థిక గణాంకాలు, ఆర్థిక మాంద్య భయాలు తొలగడం తదితరాల నేపథ్యంలో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో రికవరీ ర్యాలీకి వీలున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ అభిప్రాయపడ్డారు. మరోపక్క ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ చర్చలు, విదేశీ మార్కెట్లో చమురు ధరల తగ్గుదల సెంటిమెంటుకు బలాన్నివ్వనున్నట్లు తెలియజేశారు. కాగా.. దేశీ ఆర్థిక వ్యవస్థ(జీడీపీ) వృద్ధి గణాంకాలు, మౌలిక రంగ పనితీరు వంటి అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టిపెట్టనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ విభాగ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. వారాంతాన(30న) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసిక(ఏప్రిల్-జూన్) జీడీపీ గణాంకాలు వెలువడనున్నాయి. ఈ బాటలో జులై నెలకు మౌలిక సదుపాయాల రంగ వివరాలు సైతం వెల్లడికానున్నాయి. ఈ అంశాలకుతోడు దేశ, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల తీరు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలు, మార్కెట్ల నడకను ప్రభావితం చేయగలవని విశ్లేషణ.

గత వారమిలా

గత వారం సెన్సెక్స్ నికరంగా 649 పాయింట్లు జమ చేసుకుంది. 81,086 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 282 పాయింట్లు బలపడి 24,823 వద్ద స్థిరపడింది. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 1,609 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. డీఐఐలు రూ. 13,020 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి.

డెట్‌వైపు ఎఫ్‌పీఐల మొగ్గు

ఈ నెలలో రూ. 11,366 కోట్ల పెట్టుబడులు



దేశీ రుణ(డెట్) మార్కెట్‌పట్ల ఇటీవల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఆసక్తి చూపుతున్నారు. డిపాజిటరీ గణాంకాల ప్రకారం ఈ నెలలో ఇప్పటి(24)వరకూ రూ. 11,366 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. దీంతో డెట్ మార్కెట్లో మొత్తం ఎఫ్‌పీఐ పెట్టుబడులు రూ. 1.02 లక్షల కోట్లకు చేరాయి. ఈ ఏడాది జూన్‌లో జేపీ మార్గాన్ ఎమర్జింగ్ మార్కెట్ గవర్నమెంట్ బాండ్ ఇండెక్సులలో ఇండియాను చేర్చడంతో ఎఫ్‌పీఐ పెట్టుబడులను ఆకట్టుకుంటున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. దేశీ మార్కెట్‌కు జులైలో నికరంగా రూ. 22,363 కోట్లు, జూన్‌లో రూ. 14,955 కోట్లు, మే నెలలో రూ. 8,760 కోట్లు చొప్పున పెట్టుబడులు లభించాయి. అయితే అంతకుముందు ఏప్రిల్‌లో రూ. 10,949 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. 2023 అక్టోబర్‌లో భారత్‌ను చేర్చాక గ్లోబల్ బాండ్ ఇండెక్సులలో చోటు అంచనాలతో ఎఫ్‌పీఐలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ నిపుణులు తెలియజేశారు. కాగా.. మరోవైపు ఈ నెలలో ఇప్పటివరకూ ఎఫ్‌పీఐలు ఈక్విటీల నుంచి రూ. 16,305 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం గమనార్హం! యూఎస్ మాంద్య భయాలు, భౌగోళిక రాజకీయ వివాదాలు, యెన్ క్యారీ ట్రేడ్ అన్‌వైండింగ్ వంటి అంశాలు ప్రభావం చూపుతున్నట్లు విశ్లేషకులు వివరించారు.

టెక్ కంపెనీలపై ఇన్ఫీ కన్ను

- సాస్, డేటా అనలిటిక్స్ సంస్థల కొనుగోలుపై ఆసక్తి
- సంస్థ సీఈవో సలిల్ పరేఖ్ వెల్లడి



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మరిన్ని టెక్ కంపెనీలను కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టింది. ప్రధానంగా డేటా అనలిటిక్స్, సాస్ తదితర రంగాల సంస్థలను దక్కించుకునే యోచనలో ఉంది. ఇన్ఫీ సీఈవో సలిల్ పరేఖ్ ఈ విషయాలు తెలిపారు. యూరప్, అమెరికా వంటి మార్కెట్లను పరిశీలిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇన్ఫోసిస్ ఈ మధ్య కాలంలో ఇన్‌సెమీ టెక్నాలజీ సర్వీసెస్, ఇన్-టెక్ హోల్డింగ్ సంస్థలను కొనుగోలు చేసిన నేపథ్యంలో పరేఖ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇన్‌టెక్‌ను సుమారు రూ. 4,045 కోట్లకు దక్కించుకోగా, ఇన్‌సెమీ టెక్నాలజీ సర్వీసెస్‌ను సుమారు రూ. 280 కోట్లకు ఇన్ఫోసిస్ కొనుగోలు చేసింది. తాము ప్రస్తుతం మరిన్ని సంస్థలను మదింపు చేస్తున్నామని పరేఖ్ చెప్పారు. అయితే, ఈ ఆర్థిక సంవత్సరంలోనే డీల్ కుదిరే అవకాశం ఉందా లేదా అనేది ఇప్పుడే చెప్పలేనని ఆయన పేర్కొన్నారు. మరోవైపు జనరేటివ్ ఏఐపై క్లయింట్ల నుంచి పెద్ద ఎత్తున ఆసక్తి వ్యక్తమవుతోందని, దానికి తగ్గట్లుగానే తమ సామర్థ్యాలను పెంచుకుంటున్నామని పరేఖ్ తెలిపారు. కొత్త తరం టెక్నాలజీల వల్ల తమ కంపెనీలో ఉద్వాసనలు ఉండకపోవచ్చని ఆయన పేర్కొన్నారు. 3.9 బిలియన్ డాలర్ల జీఎస్‌టీ డిమాండ్ నోటీసుపై స్పందిస్తూ తాము ఇప్పటికే వెల్లడించినవి తప్ప కొత్త అప్‌డేట్‌లేమీ లేవని పరేఖ్ చెప్పారు.

ఐసీఐసీఐ ప్రూ వేల్యూ డిస్కవరీ ఫండ్‌కు ఇరవై ఏళ్లు



ఎండీ నిమేష్ షా

ముంబై: వేల్యూ కేటగిరీలో దాదాపు నాలుగో వంతు వాటా ఉన్న వేల్యూ డిస్కవరీ ఫండ్‌ను ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయినట్లు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఎండీ నిమేష్ షా తెలిపారు. ప్రస్తుతం ఈ స్కీము నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రూ. 48,806 కోట్లుగా ఉందని, వేల్యూ కేటగిరీ మొత్తం ఏయూఎంలో 25.9 శాతం వాటా ఉందని వివరించారు. 2004 ఆగస్టులో దీన్ని ప్రారంభించినప్పుడు రూ. 10 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఉంటే అది ఏటా 21 శాతం రాబడితో ప్రస్తుతం దాదాపు రూ. 4.56 కోట్లు అయ్యేదని షా చెప్పారు. ఇదే వ్యవధిలో నిఫ్టీ 50 వార్షికంగా 16.2 శాతమే అందించిందని, పెట్టుబడి కేవలం రూ. 2 కోట్లకు పరిమితమయ్యేదని ఆయన తెలిపారు. ఉండాల్సిన విలువ కన్నా తక్కువగా, ఆకర్షణీయమైన వేల్యుయేషన్లలో లభించే స్టాక్స్‌లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుందని షా చెప్పారు. దీన్ని ప్రారంభించినప్పుడు దేశీయంగా ఈ తరహా ఫండ్స్ రాణించగలవా అనే సందేహాలు వ్యక్తమయినప్పటికీ, ఆ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ ఇది మెరుగైన పనితీరుతో రాణిస్తోందని సంస్థ ఈడీ ఎస్ నరేన్ తెలిపారు. దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు సిప్ పద్ధతిలో ఇందులో ఇన్వెస్ట్ చేయడాన్ని పరిశీలించవచ్చన్నారు. దీన్ని ప్రారంభించినప్పటి నుంచి ప్రతి నెలా రూ. 10,000 ఇన్వెస్ట్ చేసి ఉంటే రూ.24 లక్షల పెట్టుబడి విలువ 19.41 శాతం వార్షిక వృద్ధితో ప్రస్తుతం రూ. 2.3 కోట్లకు చేరేదని నరేన్ తెలిపారు. అదే నిఫ్టీ 50 టీఆర్ఐని చూస్తే 14.21 శాతమే వార్షిక రాబడి ఉండేదని పేర్కొన్నారు.

పీఎస్‌యూ దిగ్గజాలకు జరిమానాలు

జాబితాలో ఐవోసీ, బీపీసీఎల్, గెయిల్



న్యూఢిల్లీ: చమురు రంగ పీఎస్‌యూ దిగ్గజాలకు వరుసగా ఐదో త్రైమాసికంలోనూ జరిమానాల వడ్డింపు కొనసాగింది. జాబితాలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్), గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా(గెయిల్), ఆయిల్ ఇండియా లిమిటెడ్(ఓఐఎల్), మంగళూర్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ ఉన్నాయి. లిస్టింగ్ నిబంధనలకు అనుగుణంగా ఆయా కంపెనీల బోర్డులలో అవసరమైనమేర స్వతంత్ర, మహిళా డైరెక్టర్లను ఎంపిక చేసుకోకపోవడంతో జరిమానాల వడ్డింపు కొనసాగింది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ1(ఏప్రిల్-జూన్)లోనూ స్వతంత్ర, మహిళా డైరెక్టర్లను తగిన సంఖ్యలో నియమించుకోవడంలో విఫలంకావడంతో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ గరిష్టంగా రూ. 5,36,900, కనిష్టంగా రూ. 2,41,900 మధ్య జరిమానాలు విధించాయి.

డిజైన్, టెక్నాలజీలో మహిళలకు అగ్రస్థానం

ఫాక్స్‌కాన్ ఇండియా ప్రాధాన్యతలు



న్యూఢిల్లీ: ఐఫోన్ కాంట్రాక్టు తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ తమ భారత విభాగంలో మహిళలకు ప్రాధాన్యమివ్వడంపై మరింతగా దృష్టి పెడుతోంది. కేవలం అసెంబ్లింగ్‌కే పరిమితం కాకుండా డిజైన్, టెక్నాలజీ సంబంధ హోదాల్లో మరింత మంది మహిళలు సారథ్య బాధ్యతలు చేపట్టాలని కోరుకుంటున్నట్లు ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియు తెలిపారు. కెరియర్‌లో పురోగతి కోసం వారికి మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో 70 శాతం మంది మహిళలు, 30 శాతం మంది పురుషులు ఉన్నారు. కంపెనీకి భారత్‌లో మొత్తం 48,000 మంది ఉద్యోగులు ఉండగా, కొత్తగా రిక్రూట్ చేసుకున్న వారిలో 25 శాతం మంది వివాహిత మహిళలు ఉన్నట్లు లియు వివరించారు. సంస్థ ఇటీవలే చెన్నైకి దగ్గర్లోని శ్రీపెరంబుదూర్‌లో మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ను ఆవిష్కరించింది. ఫాక్స్‌కాన్ రూ. 25,000 కోట్లతో కర్ణాటకలో మొబైల్ తయారీ ప్లాంటును నిర్మిస్తోంది. దీనితో 40,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగగలదని అంచనా. అటు ఎలక్ట్రిక్ వాహనాల కోసం బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ యూనిట్ ఏర్పాటు కోసం తమిళనాడు ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది.

దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను లేకుండా..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి

కె.వి.ఎన్ లావణ్య

ట్యాక్సేషన్ నిపుణులు

దీర్ఘకాలిక మూలధన లాభాల మీద పన్ను భారం ఏమాత్రం పడకుండా ప్లానింగ్ చేసుకోవచ్చు. గత వారం అమల్లో ఉన్న ఏ పద్ధతిలో అయితే తక్కువ భారం ఉంటుందో ఉదాహరణలతో తెలుసుకున్నాం. మీకు ఏమాత్రం పన్ను భారం లేకుండా ఉండాలంటే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. ఒక్క విషయం మీరు గమనించే ఉంటారు. ఇండెక్సింగ్‌కి సంబంధించి, రేటుకు సంబంధించి మార్పులు వచ్చాయి. కానీ మిగతా ప్లానింగ్‌కి సంబంధించిన వాటిల్లో ఎటువంటి మార్పులు లేవు. అవన్నీ యథాతథం.

కొత్త స్థిరాస్తి .. అంటే ఇల్లు కొనండి (ఇల్లు అమ్మితేనే)

ముందుగా రూల్స్ ప్రకారం దీర్ఘకాలిక మూలధనం మీద లాభాల్ని లెక్కించండి. ఇప్పుడు మీ చేతిలో మీరు అమ్మిన 'పాత' ఇల్లు ప్రతిఫలం (సేల్ కన్సిడరేషన్) బ్యాంకులో జమ అయి ఉంది. అన్ని కాగితాలు, లెక్కలు ఉన్నాయి. 'పాతది' అమ్మిన తేదీ నుంచి 3 సంవత్సరాల లోపల కొత్తది కొనండి. కట్టుకోండి .. లేదా ఒక సంవత్సరం ముందుకు వెళ్లి అంటే .. వెనక్కి వెళ్లి, భవిష్యత్‌లో 2 సంవత్సరాల్లో కొనండి లేదా కట్టుకోండి. మీరు ప్రతిఫలం అంతా ఖర్చు పెట్టనక్కర్లేదు. కేవలం మూలధన లాభం మాత్రమే. మూలధన లాభాలు రూ. 2 కోట్ల లోపల ఉంటే ఒకటేమిటి రెండు ఇళ్లు కొనొచ్చు. కొత్త ఇంటి మీద ఎంతైనా వెచ్చించవచ్చు. కానీ పది కోట్లు దాటి మినహాయింపు ఇవ్వరు. సకాలంలో ఇల్లు కొనలేకపోతే, రిటర్ను గడువు తేదీ లోపల బ్యాంకులో నిర్దేశిత స్కీమ్‌లో ఆ మొత్తాన్ని డిపాజిట్ చేయండి. మీ మినహాయింపు పొందండి. స్కీమ్‌లో వచ్చే వడ్డీ ఆదాయం అవుతుంది.

బాండ్లలో ఇన్వెస్ట్ చేయండి (ఇల్లు, జాగా అమ్మితేనే)

గతంలో మనం ఎన్నోసార్లు చెప్పుకున్నాం. మీ కుటుంబ అవసరాలన్నీ దృష్టిలో పెట్టుకుని ప్లానింగ్ చేయాలని. ఇంటి మీద ఇన్వెస్ట్‌మెంట్ వద్దనుకుంటే బాండ్లలో పెట్టవచ్చు. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లేదా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ వారు జారీ చేసే బాండ్లలో పెట్టండి. 'పాత ఆస్తి' అమ్మిన 6 నెలల్లోపల ఇన్వెస్ట్ చేయాలి. పరిమితి మేరకు రూ. 50 లక్షల వరకు మినహాయింపు ఉంది. బాండ్స్ మీద 5.25% వస్తుంది. దీని మీద పన్ను భారం ఉంది. లాకిన్ పీరియడ్ 5 సంవత్సరాలు.

ఏ ఆస్తి అమ్మినా (ఇల్లు తప్ప) ఇల్లు కొనండి..

ఇక్కడ తిరకాసు ఏమిటంటే, ఏ స్థిరాస్తి అమ్మినా (ఇల్లు అమ్మకం కాదండి) మీ చేతికొచ్చే ప్రతిఫలం, అంటే మొత్తం.. పై రెండింటిలో కేవలం మూలధన లాభాన్ని ఇన్వెస్ట్ చేస్తే చాలు. కానీ ఇక్కడ మొత్తం ఇన్వెస్ట్ చేయాలి. మిగతా షరతులు అక్కడా, ఇక్కడా అవే. ఎటువంటి మార్పూ లేదు.

పది కోట్ల పరిమితి ఉంది. క్యాపిటల్ గెయిన్ స్కీమ్ ఉంది. అయితే, ఆస్తి అమ్మే నాటికి ఒక ఇల్లు మించి కలిగి ఉండకూడదు. కొత్త ఇంటిని 3 సంవత్సరాల దాకా అమ్మకూడదు. అంతే కాకుండా కొత్త ఇల్లు కాకుండా వేరే ఇల్లు కొనకూడదు. కట్టుకోకూడదు. కేవలం రూ. 10 కోట్లు దాటి మూలధన లాభం మీద మినహాయింపు ఇవ్వరు.

ఈ మూడు పద్ధతుల్లో మీ పన్నుభారం తగ్గుతుంది. మీకు ఏది అనువో, అనుకూలమో ఆలోచించి, అర్థవంతమైన నిర్ణయం తీసుకోండి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

ఆర్థిక స్వాతంత్ర్యానికి డేటా ఆధారిత వ్యూహాలు



కార్తీక్ కుమార్, ఫండ్ మేనేజర్, యాక్సిస్ మ్యుచువల్ ఫండ్

భారత్‌కు స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టడంలో వ్యూహాత్మక ప్రణాళికలు, మొక్కవోని దీక్ష కీలక పాత్ర పోషించినట్లే ఆర్థిక స్వాతంత్ర్యం సాధించేందుకు కూడా వ్యూహాలు అవసరం. నిలకడగా సంపద సృష్టించుకునే బాటలో ముందుకెళ్లేటప్పుడు పెట్టుబడులపరంగా అనేక సంక్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయి. ఇలాంటప్పుడే ఇటు డేటా అటు గణిత మోడల్స్ కలబోతతో ఒక పద్ధతిగా ఉండే క్వాంటిటేటివ్ ఇన్వెస్టింగ్ అనేది ఒడిదుడుకుల ఆర్థిక పరిస్థితులు, ఎప్పటికప్పుడు మారిపోయే పెట్టుబడుల ధోరణులను సమర్ధంగా ఎదుర్కొనేందుకు శక్తిమంతమైన సాధనంగా ఉపయోగపడగలదు.



క్వాంటిటేటివ్ ఇన్వెస్టింగ్ విధానమనేది సాధారణ మార్కెట్ డేటా మొదలుకుని అసాధారణమైన శాటిలైట్ ఇమేజరీ, సోషల్ మీడియా సెంటిమెంటు వరకు డేటాను విస్తృతంగా విశ్లేషిస్తుంది. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఇది మరింత మెరుగైన విధానంగా ఉంటుంది. సాధారణంగా మనిషి పరిశీలనకు అందని ఇలాంటి వివరాలన్నీ కూడా మరింత కచ్చితత్వంతో పెట్టుబడి సంబంధ నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడగలుగుతాయి.

ఇలాంటి విధానాలతో ప్రయోజనాల్లో కొన్ని..

భావోద్వేగపరమైన పక్షపాత ధోరణులు తగ్గుతాయి: పెట్టుబడుల విషయంలో సహేతుకమైన నిర్ణయం తీసుకోవడంలో మానవపరమైన భావోద్వేగాలు చాలా సందర్భాల్లో తప్పుదారి పట్టిస్తుంటాయి. కానీ, క్వాంటిటేటివ్ మోడల్స్ అనేవి ప్రీ-డిఫైన్డ్ ఆల్గోరిథమ్స్ ఆధారంగా పనిచేస్తాయి. ఫలితంగా భయం, అత్యాశ వంటి భావోద్వేగాల ప్రభావాలు తగ్గుతాయి. డేటా సంబంధిత మోడల్స్‌పై ఆధారపడటం వల్ల క్వాంటిటేటివ్ ఇన్వెస్టింగ్ అనేది సంపద సృష్టి విషయంలో క్రమశిక్షణను పెంపొందిస్తుంది. ముందుగానే నిర్దేశించుకున్న వ్యూహాలు నిలకడగా అమలు కావడం వల్ల స్వల్పకాలిక మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావం తగ్గుతుంది. పటిష్టమైన రిస్క్ మేనేజ్‌మెంట్ విధానాలతో ఈ పద్ధతి, దీర్ఘకాలంలో సంపద సృష్టికి దోహదపడుతుంది.

వేగవంతంగా డేటా విశ్లేషణ: విస్తృతమైన డేటా సెట్స్‌ను ఒక పద్ధతిగా, వేగవంతంగా విశ్లేషించగలిగే సామర్థ్యాలు కలిగి ఉండటమనేది క్వాంటిటేటివ్ ఇన్వెస్టింగ్ ప్రధాన బలం. సాధారణంగా అర్థం చేసుకోవడానికి చాలా సమయం పట్టేసే ధోరణులను, ట్రెండ్‌లను, వ్యత్యాసాలను, ఇతరత్రా డేటా పాయింట్లను సకాలంలో గుర్తించి అవసరమైన వ్యూహాలను అమలు చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. అధునాతన వ్యూహాలను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు క్వాంటిటేటివ్ ఇన్వెస్టింగ్ ఉపయోగపడుతోంది. ఒకప్పుడు సంస్థాగత ఇన్వెస్టర్లకు మాత్రమే పరిమితమైన ఈ విధానాలు ఇప్పుడు సామాన్య ఇన్వెస్టర్లకు కూడా అందుబాటులో ఉన్నాయి. దీనితో అందరికీ సమాన అవకాశాలు దక్కుతాయి. మరింత నిలకడగా రాబడులను పొందేందుకు, రిస్కులకు తగ్గట్లు పనితీరును మెరుగుపర్చుకునేందుకు మరిన్ని అవకాశాలు లభించగలవు.

డైవర్సిఫికేషన్: విస్తృతమైన అసెట్స్‌ను, సంకేతాలను విశ్లేషించడం ద్వారా క్వాంటిటేటివ్ మోడల్స్ అనేవి రిస్కును తగ్గించే వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోలను రూపొందించగలవు. దీర్ఘకాలికంగా చూస్తే సంపద సంరక్షణకు ఇది కీలకం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, పోర్ట్‌ఫోలియోలో బలహీనతలను ఎప్పటికప్పుడు మదింపు చేసేందుకు క్వాంటిటేటివ్ మోడల్స్‌లో వివిధ రిస్క్ ప్రమాణాలను కూడా పొందుపర్చేందుకు వీలుంటుంది. రిస్క్ మేనేజ్‌మెంట్‌లో క్రియాశీలకంగా ఉండేందుకు, పెట్టుబడుల వ్యూహాల్లో సర్దుబాట్లు చేసుకునేందుకు ఇది ఉపయోగపడగలదు.

సమర్థత: క్వాంటిటేటివ్ ఇన్వెస్టింగ్‌కి సాంకేతికత కీలకంగా ఉంటుంది. విస్తృతమైన డేటాసెట్స్‌ను ప్రాసెస్ చేసేందుకు, పెట్టుబడి అవకాశాలను గుర్తించేందుకు అధునాతన అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, హై-పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్‌ను ఉపయోగిస్తారు. మార్కెట్ తీరుతెన్నులను మరింత సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఈ టెక్నాలజీ తోడ్పడుతుంది. క్వాంటిటేటివ్ మోడల్స్ ద్వారా పెట్టుబడి ప్రక్రియలను ఆటోమేట్ చేయడం వల్ల ఖర్చులు ఆదా కావడంతో పాటు సమర్థత కూడా మెరుగుపడుతుంది.

సవాళ్ళూ ఉంటాయ్

మోడల్ రిస్క్, అంటే ఆర్థిక పరిస్థితుల్లో ఏవైనా పెద్ద మార్పులు వస్తే ప్రస్తుతం అనుసరిస్తున్న మోడల్ నిర్దిష్ట సందర్భానికి తగ్గట్లుగా ఉపయోగపడకుండా పోతుంది. ఇది నిరంతరం ఉండే సమస్య. మార్కెట్లు ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి కాబట్టి గతంలో పనిచేసిన వ్యూహాలు భవిష్యత్తులోనూ పని చేస్తాయనే గ్యారంటీ ఉండదు. కానీ ఈ రిస్కులు ఉన్నప్పటికీ, ఒక పద్ధతి ప్రకారం ఉండే క్వాంటిటేటివ్ ఇన్వెస్టింగ్ అనేది దీర్ఘకాలంలో మరింత నిలకడైన రాబడులు అందిస్తూ, ఆర్థిక స్వాతంత్ర్య సాధన దిశగా ముందుకెళ్లేందుకు తోడ్పడే విధంగా ఉండగలదు. ఆర్థిక స్వాతంత్ర్య లక్ష్యాలను సాధించుకునే క్రమంలో డేటా ఆధారిత అవగాహన ఒక శక్తిమంతమైన నేస్తంగా ఉండగలదు. ఆర్థిక అక్షరాస్యతకు క్వాంటిటేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహాలు కూడా జతయితే, పూర్తి సమాచారంతో నిర్ణయాలు తీసుకోవడంలో, రిస్కులను సమర్థంగా ఎదుర్కొనడంలో, దీర్ఘకాలిక లక్ష్యాల సాధన దిశగా ముందుకెళ్లడంలో మదుపర్లకు ఉపయోగకరంగా ఉంటుంది. భారతదేశ స్వాతంత్ర్యానికి సమిష్టి కృషే కారణం. అలాగే, ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే దిశగా సాగించే వ్యక్తిగత ప్రయాణంలో వ్యూహాత్మక ప్రణాళిక, జీవితాంతం నేర్చుకునే నిబద్ధత కీలకమైనవిగా ఉంటాయి.

ఎస్... నోరిస్



విన్నర్స్ ట్రోఫీతో లాండో నోరిస్

డచ్ గ్రాండ్‌ప్రి చాంప్ లాండో నోరిస్

కెరీర్‌లో రెండో రేసు నెగ్గిన మెక్‌లారెన్ డ్రైవర్

సొంతగడ్డపై వెర్‌స్టాపెన్‌కు షాక్

రెండో స్థానానికి పరిమితమైన రెడ్‌బుల్ డ్రైవర్

వరుసగా ఐదో రేసులో దక్కని అగ్రస్థానం



రన్నరప్ ట్రోఫీతో వెర్‌స్టాపెన్

రేసు ఆరంభంలోనే వెనుకబడినా... ఆ తర్వాత పుంజుకొని మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ ఫార్ములావన్ డచ్ గ్రాండ్‌ప్రి రేసులో విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో ప్రధాన రేసును ప్రారంభించిన ఈ బ్రిటన్ డ్రైవర్... సమీప ప్రత్యర్థి, రెడ్‌బుల్ రేసర్ మాక్స్ వెర్‌స్టాపెన్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానం దక్కించుకున్నాడు. కెరీర్‌లో రెండో రేసు నెగ్గిన నోరిస్... డ్రైవర్స్ ప్రపంచ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో వెర్‌స్టాపెన్ ఆధిక్యాన్ని తగ్గించాడు. గత మూడేళ్లుగా డచ్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన స్థానిక డ్రైవర్ వెర్‌స్టాపెన్ ఈసారి మాత్రం రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

జాండ్‌వర్ట్ (నెదర్లాండ్స్): సొంతగడ్డపై గత మూడేళ్లుగా తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్, నెదర్లాండ్స్ స్టార్ మాక్స్ వెర్‌స్టాపెన్‌కు ఈసారి చుక్కెదురైంది. ఆదివారం జరిగిన డచ్ గ్రాండ్‌ప్రి ప్రధాన రేసులో వెర్‌స్టాపెన్‌ను నిలువరించి బ్రిటన్ డ్రైవర్ లాండో నోరిస్ (మెక్‌లారెన్) చాంపియన్‌గా అవతరించాడు. గత కొన్ని రేసుల మాదిరిగానే తొలి ల్యాప్‌లో వెనుకబడ్డ నోరిస్ ఆ తర్వాత విజృంభించాడు. 18వ ల్యాప్‌లో వెర్‌స్టాపెన్‌ను వెనక్కి నెట్టిన నోరిస్... ఆ తర్వాత రేసు ముగిసేవరకు అదే జోరు కొనసాగిస్తూ విజేతగా నిలిచాడు. నిర్ణీత 72 ల్యాప్‌లను నోరిస్ అందరికంటే ముందుగా, వేగంగా 1 గంట 30 నిమిషాల 45.519 సెకన్లలో పూర్తి చేయగా... వెర్‌స్టాపెన్ 1 గంట 31 నిమిషాల 08.415 సెకన్లు తీసుకొని రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ (1 గంట 31 నిమిషాల 10.958 సెకన్లు) మూడో స్థానంతో రేసును ముగించాడు. బ్రిటన్ స్టార్, మెర్సిడెస్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 2021లో ఫార్ములావన్ క్యాలెండర్‌లో తిరిగి వచ్చిన డచ్ గ్రాండ్‌ప్రిలో వరుసగా మూడుసార్లు విజేతగా నిలిచి... కెరీర్‌లో 200వ రేసు బరిలోకి దిగిన వెర్‌స్టాపెన్ ఆరంభంలో దూకుడు కనబర్చినా చివరి వరకు దాన్ని కొనసాగించడంలో విఫలమయ్యాడు. మొత్తం 72 ల్యాప్‌లు ఉన్న 307 కిలోమీటర్ల ఈ రేసులో ఒక్కో ల్యాప్ 4.2 కిలోమీటర్లు కాగా... 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన నోరిస్ ఆద్యంతం ముందంజలో దూసుకెళ్లాడు. వెర్‌స్టాపెన్ కంటే 22.8 సెకన్ల ముందు గమ్యాన్ని చేరిన నోరిస్... తాజా సీజన్‌లో ప్రత్యర్థిపై తొలిసారి పూర్తి ఆధిపత్యం కనబర్చాడు. రెప్పపాటు కాలంలో అత్యంత వేగంగా ల్యాప్ పూర్తి చేసిన రికార్డును నోరిస్ చేజార్చుకున్నాడు. స్పెయిన్, హంగేరీ, బెల్జియం రేసుల మాదిరిగానే ఈసారి కూడా నోరిస్ ఆరంభ ల్యాప్‌లో వెనుకబడ్డా... జాండ్‌వర్ట్ సర్క్యూట్‌లో పరిస్థితులను అనువుగా మలుచుకుంటూ ముందుకు సాగాడు. గత తప్పిదాలను పునరావృతం చేయకుండా వెర్‌స్టాపెన్‌ను అధిగమించాడు. ఈ ఏడాది మేలో జరిగిన మయామి గ్రాండ్‌ప్రిలో తొలిసారి విజేతగా నిలిచిన నోరిస్ సీజన్‌లో రెండో టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. మొత్తం 24 రేసుల ఈ సీజన్‌లో 15వ రేసు ముగిసేసరికి డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో వెర్‌స్టాపెన్ 295 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... నోరిస్ 225 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. తాజా సీజన్‌లో మరో తొమ్మిది రేసులు మిగిలుండగా.. ఈ ఇద్దరి మధ్య 70 పాయింట్ల వ్యత్యాసం ఉంది. సీజన్‌లోని తదుపరి రేసు ఇటాలియన్ గ్రాండ్‌ప్రి సెప్టెంబర్ 1న మోంజాలో జరుగుతుంది.

డ్రైవర్స్ చాంపియన్‌షిప్ (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	పాయింట్లు
1	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	295
2	నోరిస్	మెక్‌లారెన్	225
3	లెక్‌లెర్క్	ఫెరారీ	192
4	పియాస్ట్రి	మెక్‌లారెన్	179
5	సెయింజ్	ఫెరారీ	172
6	హామిల్టన్	మెర్సిడెస్	154
7	పెరెజ్	రెడ్‌బుల్	139
8	రసెల్	మెర్సిడెస్	122
9	అలోన్సో	ఆస్టన్‌మార్టిన్	50
10	లాన్స్‌స్ట్రోల్	ఆస్టన్ మార్టిన్	24

తదుపరి రేసు: ఇటాలియన్ గ్రాండ్‌ప్రి
వేదిక: మోంజా తేదీ: సెప్టెంబర్ 1

డచ్ గ్రాండ్‌ప్రి ప్రధాన రేసు ఫలితాలు

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	నోరిస్	మెక్‌లారెన్	1:30:45.519	–	26
2	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:31:08.415	22.896 సెకన్లు	18
3	లెక్‌లెర్క్	ఫెరారీ	1:31:10.958	25.439 సెకన్లు	15
4	పియాస్ట్రి	మెక్‌లారెన్	1:31:12.856	27.337 సెకన్లు	12
5	సెయింజ్	ఫెరారీ	1:31:17.656	32.137 సెకన్లు	10
6	పెరెజ్	రెడ్‌బుల్	1:31:25.061	39.542 సెకన్లు	8
7	జార్జ్ రసెల్	మెర్సిడెస్	1:31:30.136	44.617 సెకన్లు	6
8	హామిల్టన్	మెర్సిడెస్	1:31:35.118	49.599 సెకన్లు	4
9	గాస్లీ	అల్పైన్	1:30:54.123	1 ల్యాప్	2
10	అలెన్సో	ఆస్టన్ మార్టిన్	1:30:59.052	1 ల్యాప్	1

200 రెడ్‌బుల్ రేసర్ వెర్‌స్టాపెన్ కెరీర్‌లో 200 రేసులు పూర్తి చేసుకున్నాడు. ఫార్ములావన్ చరిత్రలో 200 రేసులు పూర్తి చేసుకున్న 23వ డ్రైవర్‌గా వెర్‌స్టాపెన్ గుర్తింపు పొందాడు. 393 రేసులతో ఫెర్నాండో అలోన్సో టాప్ ర్యాంక్‌లో ఉండగా... కిమీ రైకోనెన్ (350) రెండో స్థానంలో, లూయిస్ హామిల్టన్ (347) మూడో స్థానంలో ఉన్నారు.

ఫాతిమా సారథ్యంలో...

మహిళల టి20 ప్రపంచకప్ బరిలో పాకిస్తాన్ జట్టు

కరాచీ: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల టి20 ప్రపంచకప్ బరిలోకి దిగే పాకిస్తాన్ జట్టుకు ఫాతిమా సనా కెప్టెన్‌గా ఎంపికైంది. అక్టోబర్ 3 నుంచి 20 వరకు యూఏఈ వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నీ కోసం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆదివారం జట్టును ప్రకటించింది. గతంలో పాకిస్తాన్ జట్టుకు సారథ్యం వహించిన 37 ఏళ్ల నిదా దర్ స్థానంలో ఫాతిమాను కెప్టెన్‌గా ఎంపిక చేసింది. జాతీయ జట్టు తరఫున 41 వన్డేలు, 40 టి20లు ఆడిన అనుభవం ఉన్న ఫాతిమా పలు దేశవాళీ టోర్నీల్లో జట్టుకు నాయకత్వం వహించింది. గత ప్రపంచకప్‌లో పాల్గొన్న 10 మంది ప్లేయర్లను ఈసారీ ఎంపిక చేశారు. ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్, శ్రీలంకతో కలిసి పాకిస్తాన్ మహిళల జట్టు గ్రూప్ 'ఎ'లో పోటీ పడనుంది.

పాకిస్తాన్ జట్టు: ఫాతిమా సనా (కెప్టెన్), ఆలియా, డయానా బేగ్, గుల్ ఫెరోజా, ఇరమ్ మునీబా, నష్రా, నిదా దర్, ఉమైమా, సదాఫ్, సాదియా, సిద్రా అమిన్, సయ్యదా అరూబ్ షా, తస్మియా రుబాబ్, తుబా హసన్.



డిక్లేర్ చేసి... ఓటమిని ఆహ్వానించి...



బాబర్ ఆజమ్ క్లీన్‌బౌల్డ్

రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో పాకిస్తాన్ జట్టు పిచ్‌ను అంచనా వేయడంతో పూర్తిగా విఫలమైంది. ఒక్క రెగ్యులర్ స్పిన్నర్ లేకుండా ఏకంగా నలుగురు పేస్ బౌలర్లతో ఆ జట్టు ఆడగా... బంగ్లాదేశ్ ఇద్దరు ప్రధాన స్పిన్నర్లతో బరిలోకి దిగింది. పాక్ అత్యుత్సాహంతో 6 వికెట్లకే తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయగా... ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ బంగ్లాదేశ్ ఏకంగా 117 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. చివరి రోజు బంగ్లాదేశ్ సీనియర్ స్పిన్నర్లు షకీబ్, మెహదీ హసన్ మిరాజ్ చెలరేగిపోవడంతో పాక్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. పాకిస్తాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ తొలి ఇన్నింగ్స్‌లో 'డకౌట్'కాగా, రెండో ఇన్నింగ్స్‌లో 22 పరుగులకే చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన సాద్ షకీల్ రెండో ఇన్నింగ్స్‌లో 'డకౌట్' అయ్యాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌కు సంబంధించి కొన్ని గణాంకాలు చూస్తే...

1 పాకిస్తాన్‌పై బంగ్లాదేశ్‌కు ఇది టెస్టుల్లో తొలి విజయం. గతంలో 13 సార్లు ఇరు జట్లు తలపడగా... పాక్ 12 గెలిచింది. మరో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.

1 తొలి ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థికి 400కు పైగా పరుగులు ఇచ్చి కూడా బంగ్లా టెస్టు గెలవడం ఇదే తొలిసారి.

3 ఆరు లేదా అంతకంటే తక్కువ వికెట్లు కోల్పోయి తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన సందర్భంలో ఒక జట్టు ఓడటం ఇది మూడోసారి మాత్రమే.

9 బంగ్లాదేశ్ టెస్టుల్లో 11 జట్లను ఎదుర్కోగా... తాజా విజయంతో 9 టీమ్‌లపై ఆ జట్టు విజయం సాధించినట్లయింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్, పాకిస్తాన్, శ్రీలంక, జింబాబ్వే, ఐర్లాండ్, అఫ్గానిస్తాన్‌లపై నెగ్గిన బంగ్లాదేశ్... టెస్టుల్లో ఇప్పటి వరకు భారత్(13 టెస్టులు), దక్షిణాఫ్రికా (14 టెస్టులు)లను మాత్రమే ఓడించలేకపోయింది.

9 సొంతగడ్డపై పాకిస్తాన్ వరుసగా గత 9 టెస్టుల్లో విజయాన్ని అందుకోలేకపోయింది. వీటిలో 5 మ్యాచ్‌లు ఓడిన పాక్ మరో 4 డ్రా చేసుకుంది. ఆఖరి సారిగా 2021లో దక్షిణాఫ్రికాను రావల్పిండిలో ఆ జట్టు ఓడించింది.

191 ముష్ఫికర్ సాధించిన 191 పరుగులు బంగ్లాదేశ్ తరఫున ఆరో అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు. ఆ దేశం తరఫున టాప్-10లో ఐదు ముష్ఫికర్‌వే ఉన్నాయి.

తారిణి తడాఖా...

మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో టైటిల్స్ సొంతం
- పురుషుల సింగిల్స్ విజేత రౌనక్
- మహిళల సింగిల్స్‌లో రన్నరప్ నవ్య



చిరాగ్ శెట్టి, శ్రీకాంత్ చేతుల మీదుగా స్వర్ణ పతకాలు అందుకున్న అనంతరం మహిళల డబుల్స్ విజేతలు తారిణి, శ్రావణి

సాక్షి, హైదరాబాద్: కొటక్ ఇండియా అండర్-19 జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్లు అదరగొట్టారు. మూడు విభాగాల్లో చాంపియన్స్‌గా నిలిచారు. మహారాష్ట్రకు చెందిన తారిణి సూరి రెండు విభాగాల్లో విజేతగా నిలిచి 'డబుల్' సాధించింది. పురుషుల సింగిల్స్‌లో రౌనక్ చౌహాన్ టైటిల్ దక్కించుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నవ్య కందేరి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. గచ్చిబౌలిలోని కొటక్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆరు రోజులపాటు జరిగిన ఈ టోర్నీ ఆదివారంతో ముగిసింది. భారత్‌తోపాటు చైనీస్ తైపీ, ఇండోనేసియా, మలేసియా, థాయ్‌లాండ్, యూఏఈ, ఉగాండా, నేపాల్ దేశాల నుంచి 250 మందికిపైగా ప్లేయర్లు ఈ టోర్నీలో పోటీపడ్డారు. భారత బ్యాడ్మింటన్ జట్టు చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, స్టార్ ప్లేయర్లు చిరాగ్ శెట్టి, కిడాంబి శ్రీకాంత్ విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళల డబుల్స్ ఫైనల్లో తారిణి సూరి–శ్రావణి వాలేకర్ జంట (భారత్) 21–10, 21–15తో కేలా అనీసా పుత్రి–మిచా లియోనా వర్దోయో (ఇండోనేసియా) జోడీపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సమరంలో తారిణి సూరి–భవ్య్ ఛాబ్రా (భారత్) ద్వయం 21–13, 19–21, 21–14తో అతావుత్ శ్రీపెయి–పన్నావి పొలియామ్ (థాయ్‌లాండ్) జోడీపై గెలిచింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో రౌనక్ చౌహాన్ 25–23, 16–21, 22–20తో భారత్‌కే చెందిన లక్ష్ చెంగప్ప అయ్యప్పపై గెలిచాడు. మహిళల సింగిల్స్ తుది పోరులో టాప్ సీడ్ నవ్య కందేరి 14–21, 19–21తో థాలిత రమాధాని విర్యావన్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో హువాంగ్ హాంగ్ యు–యాన్ బిన్ హువాంగ్ (చైనీస్ తైపీ) ద్వయం 21–15, 13–21, 21–18తో హుంగ్ మింగ్ చెన్–చెంగ్ హాన్ త్సాయ్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచి టైటిల్ దక్కించుకుంది.



రౌనక్



నవ్య

సీఎంల సందడి









1. ఆదివారం రాంచీలో గిరిజన వేషధారణలో డోలు వాయిస్తున్న అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ
2. ఇండోర్‌లో జన్మాష్టమి సంబరాల్లో బాలునితో ఉట్టి కొట్టిస్తున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్
3. ఆప్ నేత సిసోడియాతో కలిసి అమృత్‌సర్ స్వర్ణదేవాలయాన్ని సందర్శిస్తున్న పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్
4. రైల్లో జోధ్‌పూర్ వెళ్తూ ప్రయాణికులతో సరదాగా ముచ్చటిస్తున్న రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

కొరియర్ దొంగలను పట్టిచ్చిన ఎయిర్‌ట్యాగ్

- టెక్నాలజీని వాడుకున్న బాధిత మహిళ
- అమెరికాలో జరిగిన గమ్మత్తైన ఘటన

తనకొచ్చే కొరియర్ పార్శిళ్లు సొంత మెయిల్ డబ్బా నుంచి తరచూ చోరీకి గురవుతుండటంతో ఓ అమెరికన్ మహిళకు చిర్రెత్తుకొచ్చింది. పోలీసులకు ఫిర్యాదుచేయకుండా తానే దొంగలను కనిపెట్టాలని నిశ్చయించుకుంది. అందుకు సాంకేతికతను వాడుకుంది. విజయవంతంగా దొంగలను పోలీసులకు పట్టిచ్చింది. అమెరికాలోని శాంటా బార్బరాకౌంటీలోని లాస్ అలామస్ పోస్టాఫీస్ వద్ద ఈ చోరీల పర్వం జరిగింది. తాళం చెవి పరిమాణంలో ఉండే ఆపిల్ కంపెనీ ఎయిర్‌ట్యాగ్‌ను ఆమె ఇందుకు అస్త్రంగా వాడింది. దొంగలను పట్టుకునేందుకు



తొలుత తన అడ్రస్‌కు తానే ఒక కొరియర్ పార్శిల్ పంపుకుంది. అందులో ఎయిర్‌ట్యాగ్‌నూ జతచేసింది. ఎయిర్‌ట్యాగ్ ప్రత్యేకత ఏంటంటే.. అది ఏ క్షణంలో ఎక్కడ ఉన్నా బ్లూటూత్ సిగ్నల్ ద్వారా తన జీపీఎస్ లొకేషన్‌ను యజమాని యాపిల్ తెరపై అత్యంత కచ్చితత్వంతో కనిపించేలా చేస్తుంది. ఇది తెలియని ఇద్దరు దొంగలు యథాలాపంగా ఆమెకొచ్చిన కొరియర్ పార్శిల్‌ను కొట్టేసి ఎంచక్కా తమ ఇంటికి తీసుకెళ్లారు. ఎయిర్‌ట్యాగ్ సిగ్నల్‌తో ఇద్దరు దొంగల జాడ ఆమెకు ఇట్టే తెల్సిపోయింది. దాంతో వాళ్లు పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. వాళ్లింట్లో మరో డజను మంది బాధితుల పార్శిళ్లున్నాయి! మహిళ తెలివిని పోలీసులు మెచ్చుకున్నారు. దొంగలను జైలుకు పంపారు. ఇతర బాధితుల పార్శిళ్లను తిరిగి అప్పజెప్పే పనిలో పడ్డారు. బెయిల్ కావాలంటే దొంగ డొనాల్డ్ దాదాపు రూ. 3.85 కోట్లు, మరో దొంగ లారా దాదాపు రూ. 42 లక్షల పూచీకత్తు చెల్లించాలని కోర్టు షరతులు విధించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

రోబో బోట్లతో.. నదుల సుందరీకరణ

నదులు, జల వనరుల్లో చెత్త, వ్యర్థాల ఏరివేత

- మెరైన్ టెక్ స్టార్టప్ 'క్లియర్‌బాట్' సారథ్యంలో వినూత్నయత్నం
- హాంకాంగ్, థాయిలాండ్‌తో పాటు భారత్‌లో కూడా కార్యకలాపాలు

నేల మీద చెత్తను ఎత్తి వేయడానికి అనేకానేక మార్గాలున్నాయి. కానీ వ్యర్థాలతో పోటెత్తిపోతున్న నదులు, సరస్సులు, ఇతర నీటి వనరుల పరిస్థితేమిటి? యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్‌లో రోబోటిక్స్ చదువుతున్న సిద్ధాంత్ గుప్తాను ఇదే ప్రశ్న తొలిచేసింది. అలా బీజం పడింది... 'క్లియర్ బాట్' అనే మెరైన్ టెక్ స్టార్టప్‌కు. ఇది రూపొందించిన రోబో బోట్ నీటి నుంచి వ్యర్థాలను వేరు చేస్తుంది. ఈ చిన్ని పడవ ఇప్పుడు ఆసియా అంతటా సముద్ర జలాలను ఎంచక్కా శుభ్రపరుస్తోంది. మన దేశంలోని గంగా నదితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోని నదులనూ శుభ్రం చేసేస్తోంది...

– సాక్షి, నేషనల్ డెస్క్

మనిషి వెళ్లిన చోటల్లా తన ఆనవాలుగా వీలైనంత చెత్తను వదిలేసి వస్తున్నాడు. వాటర్ బాటిళ్లు, జ్యూస్ బాక్సులు, కార్టన్లు, కవర్లు.. ఇంకా నానారకాల ప్లాస్టిక్ తదితర చెత్త సముద్ర, నదీ తీరాలను ముంచెత్తుతోంది. ఇలా ఏటా ఏకంగా 33 బిలియన్ పౌండ్ల (1,500 కోట్ల కిలోల కిలోలు) ప్లాస్టిక్ చెత్త సముద్ర జలాలను ముంచెత్తుతున్నట్టు యూఎస్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఓషియానా అంచనా. అంటే నిమిషానికి ఏకంగా రెండు చెత్త ట్రక్కుల వ్యర్థాలను సముద్రంలో గుమ్మరిస్తున్నామన్నమాట. జల వనరులను ఈ భూతం బారినుంచి విముక్తం చేసేందుకు యూనివర్సిటీ ప్రాజెక్టుకింద సిద్ధాంత్ 2020లో క్లియర్‌బాట్‌ను స్థాపించారు. ప్రస్తుతం హాంకాంగ్, థాయిలాండ్‌తో పాటు భారత్‌లోనూ పలు ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్ క్లయింట్ల కోసం ఇది డజనుకు పైగా మర పడవలను నడుపుతోంది. స్థానిక వ్యర్థ నిర్వహణ కంపెనీలు, రీసైక్లర్లతో కలిసి పనిచేస్తోంది.



ఇలా పని చేస్తుంది...

పెద్ద మర పడవ నాలుగు మీటర్ల పొడవుంటుంది. గంటకు 3.5 మైళ్ల వేగంతో సాగుతూ గంటకు 200 కిలోల చెత్తను సేకరిస్తుంది. 1.5 మెట్రిక్ టన్నుల చెత్తను మోయగలదు. ఇక మూడు మీటర్ల చిన్న పడవ గంటకు 80 కిలోల వ్యర్థాలను సేకరిస్తుంది. 200 కిలోగ్రాముల బరువును మోయగలదు. ఈ పడవలు స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థతో, సౌరశక్తితో నడుస్తాయి. ఆన్‌లైన్ డ్యాష్‌బోర్డు ద్వారా వీటిని రిమోట్‌తో గైడ్ చేయవచ్చు. చకచకా కదులుతూ నీటి ఉపరితలంపై తేలియాడే వ్యర్థాలన్నింటినీ సేకరిస్తుంది. పారేసిన వాటర్ బాటిళ్లు, జ్యూస్ బాక్సులు, కార్టన్లు పడవ ముందు భాగంలో ఉన్న గ్యాప్ గుండా ప్రయాణించి కన్వేయర్ బెల్ట్ గుండా పడవ మధ్యలోని కలెక్షన్ బుట్టలో చెత్తలోకి చేరతాయి. సేకరించిన చెత్తను వేరే చేసే అల్గారిథమ్‌ను కూడా అభివృద్ధి చేశారు.

భారత్‌లో ఇలా...

మనదేశంలో అత్యంత పవిత్రమైనది భావించే గంగా నది కొన్నేళ్లుగా అత్యంత కలుషితంగా మారిపోతోంది. గంగను నుంచి కూడా వ్యర్థాలను 'క్లియర్‌బాట్' మర పడవలు సేకరిస్తున్నాయి. ఈశాన్య భారతంలో ఉమియం సరస్సు తదితర చోట్ల కూడా ఈ మర పడవలు బిజీగా ఉన్నాయి. జలమార్గాల అడుగు భాగాన్ని మ్యాప్ చేయడానికి, నీటి నాణ్యతను పరీక్షించడానికి, నమూనాలను సేకరించడానికి, నీటిలో చమురును శుద్ధి చేయడానికి కూడా వీటిని వాడొచ్చట. వచ్చే మార్చి నాటికి ఒక్క భారత్‌లోనే మరో 20 బోట్లను మోహరించాలని, మరో రెండేళ్లలో 50కి పెంచాలని క్లియర్‌బాట్ భావిస్తోంది.

అంతకుమించి...

ఈ మర పడవలు కేవలం వ్యర్థాల తరలింపుతో ఆగడం లేదు. బ్యాంకాక్‌లో పడవలు సరస్సులను కమ్మేసిన పాచి తదితరాలను కూడా తొలగిస్తున్నాయి. వలస పక్షుల విశ్రాంతి ప్రదేశమయిన హాంకాంగ్‌లో 'మైపో నేచర్ రిజర్వ్'లో నత్తల సంఖ్య పెరగకుండా ఉండేందుకు నత్తల గుడ్లను కూడా తొలగిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు ద్వారా గుడ్లను గుర్తిస్తాయివి! ది. రోబోటిక్ చేయి సాయంతో మొక్కల నుంచి గుడ్లను కదిలించి సేకరిస్తాయి. క్లియర్‌బాట్ బాటలో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా జల వనరుల శుద్ధిపై ఆసక్తి చూపుతుండటం శుభ పరిణామం.

సరదా డ్యాన్సులు.. స్పేస్‌వాక్ !

- ప్రయోగాలతో పాటు సునీత, విల్మోర్ ఆటవిడుపు
- వచ్చే ఫిబ్రవరిలో ఐఎస్ఎస్ నుంచి డ్రాగన్ స్పేస్‌షిప్‌లో భూమికి తిరిగి రానున్న ఇద్దరు నాసా వ్యోమగాములు

థ్రస్టర్లు మొరాయించడం, హీలియం లీకేజీ తదితరాలతో కష్టమ్మీద అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)తో అనుసంధానమైన బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్ ఇక వ్యోమగాముల ప్రయాణానికి సురక్షితం కాదని తేలిపోయింది. దీంతో ఐఎస్ఎస్‌లో ఆగిపోయిన వ్యోమగాములు సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు వచ్చే ఏడాది ఫిబ్రవరిదాకా అక్కడే ఉండి ఏం చేస్తారనే ప్రశ్న పలువురిని తొలిచేస్తోంది.

అన్ని పనుల్లో బిజీబిజీ: వారం రోజుల ప్రయోగం కోసం వచ్చిన సునీత, విల్మోర్‌లు.. ఇప్పటికే ఉంటున్న వ్యోమగాములతోపాటే పూర్తికాల ఆస్ట్రోనాట్స్‌గా మారిపోయారు. అక్కడ తోటి వ్యోమగాములు చేపట్టిన శాస్త్ర ప్రయోగాల్లో వీళ్లిద్దరూ పాలుపంచుకుంటున్నారు. అంతరిక్ష కేంద్రానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ను చెక్



చేయడం, సామగ్రిని సర్దడం, అత్య వసర పరిస్థితుల్లో ఐఎస్ ఎస్ నుంచి బయటికొచ్చి స్పేస్‌వాక్ చేస్తూ అవసరమైన రిపేర్లు చేస్తారు. శుక్రవారమే కొత్త శాటిలైట్లు, ప్రయోగాలు, ఉపకరణాలకు పనికొచ్చే అమెరికా 'నానోరాక్స్' ప్రైవేట్ సంస్థ కోసం కొత్త 'ఎయిర్‌లాక్'ను విల్మోర్ బిగించారు. మధ్యమధ్యలో సునీత, విల్మోర్ సరదాగా డ్యాన్సులు, వ్యాయామం చేస్తారు. అవి అక్కడ తప్పనిసరి. లేదంటే ఎముక సాంద్రత తగ్గిపోవడం, కండర సామర్థ్యం క్షీణించడం వంటి అనారోగ్యం బారినపడే ప్రమాదముంది. సునీత ఇప్పటికే స్పేస్ అథ్లెట్‌గా పేరొందారు. బైక్ తొక్కడం, సిములేట్ స్విమ్మింగ్ చేయడంతోపాటు ట్రయథ్లాన్ పూర్తిచేశారు.

– వాషింగ్టన్

టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్ అరెస్ట్

పారిస్: మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్(39)ను పారిస్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. అజర్‌బైజాన్ నుంచి పారిస్‌కు వచ్చిన ఆయన్ను శనివారం సాయంత్రం అవినీతి నిరోధక విభాగం అధికారులు



అదుపులోకి తీసుకున్నట్లు మీడియా తెలిపింది. ఈ అరెస్ట్‌పై ఫ్రాన్సు అధికారులు స్పందించలేదు. మనీ లాండరింగ్, డ్రగ్స్ దొంగ రవాణా, బాలలపై లైంగిక అకృత్యాల కంటెంట్ వంటి వాటికి టెలిగ్రామ్ యాప్ వేదికగా మారిందంటూ ఫ్రాన్సు అధికారులు దురోవ్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. దురోవ్ అరెస్ట్‌పై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. పశ్చిమ దేశాలు రెండు నాల్కల ధోరణి అవలంభిస్తున్నాయని మండిపడింది. టెలిగ్రామ్ యాప్‌ను బ్లాక్ చేయాలంటూ 2018లో రష్యా కోర్టు ఇచ్చిన తీర్పును హ్యూమన్ రైట్స్ వాచ్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్, ఫ్రీడమ్ హౌస్, రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ వంటి 26 ఎన్‌జీవోలు ఖండించాయని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా గుర్తు చేశారు. దురోవ్‌ను విడుదల చేయాలంటూ ఈ సంస్థలన్నీ ఇప్పుడు ఫ్రాన్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తాయా అని ప్రశ్నించారు.

ఇండిగో టికెట్ల బుకింగ్‌లో ఇకనుంచి 'ఎంఎక్స్' ఆప్షన్

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థ 'ఇండిగో' ప్రయాణికుల కోసం జెండర్–న్యూట్రల్ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. టికెట్ బుకింగ్ సమయంలో స్త్రీ, పురుష అనే కేటగిరీలను ఎంచుకోలేని ట్రాన్స్‌జెండర్ ప్రయాణికులకు 'ఎంఎక్స్' అనే ఆప్షన్‌ను తీసుకొచ్చింది. ఆన్‌లైన్‌లో టికెట్లను బుకింగ్ చేసుకునే వారికి మేల్, ఫిమేల్‌తో పాటు ఇకపై ఎంఎక్స్ కూడా అందుబాటులో ఉంటుంది. ఈ విధానాన్ని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా విమానయాన సంస్థలు ఇప్పటికే ప్రవేశపెట్టాయి. ఎల్‌జీబీటీక్యూ ప్లస్ వర్గాలకు అనుకూల



విధానాలను తీసుకొస్తున్నామని ఇండిగో గ్రూఫ్ చీఫ్ హెచ్‌ఆర్ అధికారి సుఖ్‌జీత్ ఎస్.పస్‌రిచా తెలిపారు. ఈ వర్గాలకు చెందిన వారిని తమ సంస్థలోని వేర్వేరు విభాగాల్లోకి చేర్చుకుంటున్నామని అన్నారు. దేశీయ మార్కెట్‌లో 62శాతం వాటా కలిగిన తమ సంస్థలో దివ్యాంగ ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

దెయ్యం వదిలిస్తామని ప్రాణం పోగొట్టారు

చండీగఢ్: మూర్ఛ వ్యాధిగ్రస్తుడికి పట్టిన దెయ్యం పోగొడతామంటూ ఒక పాస్టర్‌సహా పలువురు విచక్షణారహితంగా కొట్టడంతో ఆ రోగి ప్రాణాలు కోల్పోయిన ఘటన పంజాబ్‌లోని సంఘ్‌పురా గ్రామంలో జరిగింది. 30 ఏళ్ల శామ్యూల్ మాసీహ్ కోసం ప్రార్థన చేయాలని అతని భార్య, తల్లి కలిసి పాస్టర్ జాకబ్‌ను కోరగా రోగికి పట్టిన దెయ్యం వదిలిస్తానంటూ మరో 8మందితో కలిసి చావబాదాడు. దీంతో శామ్యూల్ చనిపోయాడు. పోలీసులు కేసు నమోదుచేసి పాస్టర్, మరో ఎనిమిది మందిపై కేసు నమోదుచేశారు.

రాజకీయాల్లోకి యువత

మన్‌కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం యువత ప్రజా జీవితంలోకి అడుగుపెట్టాలని, రాజకీయాల్లో చేరి దేశానికి సేవలందించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా బ్రహ్మాండంగా రాణించవచ్చని సూచించారు. ఆదివారం 'మన్‌కీ బాత్'లో ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువత రాజకీయాల్లో చేరాలని ఎర్రకోట నుంచి పిలుపు ఇచ్చానని గుర్తుచేశారు. అందుకు ఎంతోమంది యువత ఉత్సాహంగా స్పందిస్తుండటం హర్షణీయమన్నారు. వారి నుంచి తనకెన్నో లేఖలు వస్తున్నాయని వెల్లడించారు. సోషల్ మీడియాలోనూ మంచి స్పందన లభిస్తోందన్నారు. 'మన్‌కీ బాత్'లో మోదీ పలు అంశాల ప్రస్తావించి వాటిపై తన అభిప్రాయాలు వెల్లడించారు.

సంకోచం వద్దు

''రాజకీయాల్లో యువత ప్రవేశంపై ప్రజల నుంచి సలహాలు సూచనలు వస్తున్నాయి. రాణించాలంటే రాజకీయ నేపథ్యం అవసరం లేదు. ఎవరైనా రాజకీయాల్లో చేరి ప్రజాసేవ చేయొచ్చు. యువత నిర్భయంగా ప్రజా జీవితంలోకి రావాలి. వారి పరిజ్ఞానం, అనుభవం దేశానికి ఉపయోగపడాలన్నదే



నా ఆకాంక్ష. మీరు ముందడుగు వేస్తే మీ భవిత, దేశ భవిత మారతాయి'' అని మోదీ అన్నారు.

పేద పిల్లలకు బొమ్మలివ్వండి

అంతరిక్ష రంగంలో భారత్ దూసుకెళ్తుండడం హర్షణీయం. ఈ రంగంలో సంస్కరణలతో యువత లబ్ధి పొందుతోంది. కలిగిన కుటుంబాల వాళ్లు తమ పిల్లలు ఆడుకున్న పాత బొమ్మలను వాటిని కొనగల స్తోమత వారికివ్వాలి. వారి ముఖాల్లో వెలుగులు నింపాలి. పౌష్టికాహారంపై అవగాహన పెంచే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి. మీ చిన్న ప్రయత్నం పౌష్టికాహార లేమిపై యుద్ధానికి పెద్ద సాయం అవుతుంది. పారిస్ పారాలంపిక్స్‌లో పాల్గొంటున్న మన దివ్యాంగ సోదర సోదరీమణుల కోసం 140 కోట్ల మంది భారతీయులు ప్రార్థిస్తున్నారు'' అని మోదీ పేర్కొన్నారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా మారిన ఐఐటీ–మద్రాసు పూర్వవిద్యార్థులతో, అంతరిక్ష స్టార్టప్ సంస్థ 'గెలాక్స్‌ఐ' ప్రతినిధులతో కూడా ఆయన మాట్లాడారు.



సూర్యుడు సముద్రం సాంబా...

బ్రెజిల్‌లోని రియో డిజెనిరో నగర అందాలివి. నైట్ లైఫ్ రాజధానిగా ప్రపంచ నగరాలన్నింట్లో రియోకే టైమ్ ఔట్ తాజా సర్వేలో ప్రయాణ ప్రియులంతా ఓటేశారు

ఫ్రెంచ్ ఫ్రైస్ తినొద్దన్నందుకు కోర్టుకెక్కింది

అప్పుడే పుట్టిన బిడ్డపై, బాలింత భార్యపై భర్తకు అత్యంత మమకారం ఉండటం సాధారణం. తినకూడని ఆహారం తింటే ప్రమాదమని జాగ్రత్తగా చూసుకుంటారు. అయితే నాకు ఇప్పుడు ఫ్రెంచ్ ఫ్రైస్ కావాలని భార్య మారాం చేయడం, భర్త వారించడం, భార్య కోర్టుకెక్కడం చకచకా జరిగిపోయాయి. ఇలాంటి కేసు చూసి కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న అసహనం వ్యక్తంచేశారు. 'ఫ్రెంచ్ ఫ్రైస్ తినొద్దంటే భర్త క్రూరంగా ప్రవర్తించాడు అంటారా?. ఇదొక పనికిమాలిన కేసు' అంటూ జడ్జి ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే భర్తపై జరుగుతున్న దర్యాప్తును ఆపేయాలని ఉత్తర్వులు జారీచేశారు. అసలు ఆయనపై దర్యాప్తు చేయడమంటే చట్టానికి దుర్వినియోగం చేయడమే అని జడ్జి వ్యాఖ్యానించారు.



అసలేం జరిగింది?

ఈ దంపతులకు అమెరికాలో ఉన్నప్పుడు సంతానం కలిగింది. ప్రసవం వేళ ఫ్రెంచ్ ఫ్రైస్, అన్నం, మాంసం తినొద్దని భర్త, అత్తమామలు కోడలికి నచ్చజెప్పారు. అయితే తాను అవే తింటానని కోడలు మొండిపట్టు పట్టింది. వద్దని వారించడంతో కోర్టుకెక్కింది. ఈ నేపథ్యంలో భారత్‌కు వచ్చిన భర్తపై లుకౌట్ సర్క్యులర్ జారీ అయింది. దీంతో ఆయన తిరిగి అమెరికాలో ఉద్యోగంలో చేరలేని పరిస్థితి. విచారించిన కోర్టు తొలుత అతని తల్లిదండ్రులపై కొనసాగుతున్న దర్యాప్తును నిలిపివేయగా తాజాగా భర్తపై దర్యాప్తుకు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

– సాక్షి, నేషనల్ డెస్క్



చుట్టూ నీళ్లు.. మధ్యలో మెట్రో...

మహారాష్ట్రను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. ఆదివారం పుణెలో దంచికొట్టిన వాన ధాటికి జలమయంగా మారిన ఓ మెట్రో స్టేషన్ పరిసరాలు

కృష్ణాష్టమి సందడి



కృష్ణాష్టమి వేడుకలను ఊరూవాడా ఘనంగా నిర్వహిస్తున్నారు. చిన్నారులు గోపికా కృష్ణుల వేషధారణలో సందడి చేస్తుండగా యువత ఉట్టికొట్టే వేడుకల్లో పాల్గొంటూ అలరిస్తున్నారు. విజయవాడ రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ టెంపుల్ వద్ద జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకల్లో యువత ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న దృశ్యం

- సనకా లక్ష్మీ పవన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఎం'టైర్'.. ఎటెన్షన్!



4 కాదు, 6 కాదు.. ఏకంగా 136 టైర్లతో వెళుతున్న ఆ భారీ వాహనం.. చూపరుల దృష్టిని తన వైపునకు తిప్పుకొంది. తిరుచ్చి నుంచి హరియాణకు భారీ బాయిలర్‌తో వెళుతున్న ఈ వాహనం ఆదివారం గుంటూరు జిల్లా కాజా టోల్ గేట్ వద్ద కొద్ది సేపు ఆగడంతో ప్రయాణికులు దానిని ఆసక్తిగా తిలకించారు.

- కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అలతో పోటీ



బతుకుపోరులో గెలవాలంటే ఉవ్వెత్తున ఎగసిపడే అలలను సైతం చీల్చుకుంటూ ముందుకు సాగాల్సిందే. వేటే జీవనాధారమైన గంగపుత్రులు దీనికి ఏంతమాత్రం వెరవరు. విశాఖలోని మంగమారిపేట తీరంలో చేపలవేటకు సిద్ధమైన మత్స్యకారులు కెరటాలకు ఎదురొడ్డి తమ పడవను సముద్రంలోకి తీసుకువెళ్తున్న దృశ్యం

- పీఎల్ మోహన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గ్రామసభలు కొత్తగా జరుపుతున్నట్లు గొప్పలు

కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేత రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శ



కడప కార్పొరేషన్: రాష్ట్రంలో గ్రామ సభలు కొత్తగా జరుపుతున్నట్లు కూటమి ప్రభుత్వం గొప్పలు పోతోందని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం కడపలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సభలు ఎప్పటినుంచో జరుగుతున్నాయని, ఇప్పుడు కొత్తగా ఏమీ జరగడం లేదన్నారు. గ్రామాలకు సంబంధించిన పనులను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడానికి సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో ఈ సభలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని 95 శాతం స్థానిక సంస్థలు వైఎస్సార్‌సీపీ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు ఏ పదవీ లేకపోయినా పచ్చ కండువాలు కప్పుకొని గ్రామ సభల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, ఇదే వారు తీసుకొచ్చిన మార్పు అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన మూడున్నర నెలల్లోనే కూటమి ప్రభుత్వం రూ.13వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. ప్రభుత్వ పథకాలు అందక ప్రజలు ప్రైవేటు అప్పుల కోసం తిరుగుతూ ఈ ప్రభుత్వాన్ని ఎందుకు తెచ్చుకున్నామా అని పశ్చాత్తాప పడుతున్నారన్నారు. ఈ మూడు నెలల్లో ఈ ప్రభుత్వం చేసిందేమిటంటే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు చేయడం, వేధించడం, టీడీపీ, జనసేన నాయకులు వారిలో వారే కొట్టుకోవడం మాత్రమే చేశారన్నారు. కోడూరులోని మైసూరు వారిపల్లెలో జరిగిన గ్రామ సభకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వచ్చారని, ఆ పక్కనే జరిగిన రెండు గ్రామ సభలు 20 మంది కూడా లేక వెలవెలబోయాయన్నారు. కూటమి ప్రభుత్వం పాలనపై సీ ఓటర్ చేసిన సర్వేలో ప్రభుత్వ గ్రాఫ్ 11 శాతం పడిపోయిందన్నారు.

ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలపై విచారణ జరపాలి

సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఫార్మా కంపెనీల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. పలు ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ పది ముఖ్యమైన డిమాండ్లతో సీఎంకు రాసిన బహిరంగ లేఖను శ్రీనివాసరావు ఆదివారం మీడియాకు విడుదల చేశారు. ఈ లేఖలోని ముఖ్యాంశాలు.. అచ్చుతాపురం ఎస్ఈజెడ్‌లోని ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగిన 24 గంటల్లోపే పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో మరో ప్రమాదం జరిగింది. పొల్యూషన్ డిపార్ట్‌మెంట్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు, ఫైర్ డిపార్ట్‌మెంట్ల స్పందనే కరువైంది. ఉమ్మడి విశాఖలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పరిశ్రమల్లో ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు సేఫ్టీ ఆడిట్ నిర్వహించకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ నిర్వహించిన ప్రాథమిక విచారణలో ఎసైన్షియా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని నిర్ధారించారు. ఎస్ఈజెడ్‌లలో తనిఖీల నుంచి మినహాయింపునిస్తున్న జీవో నంబర్ 62(తేదీ.28-03-2019)ను తక్షణమే ఉపసంహరించాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో తనిఖీలు లేకపోవడమే ఈ ప్రమాదాలకు మూలకారణం. సేఫ్టీ ఆడిట్ రెగ్యులర్‌గా నిర్వహించాలి. అచ్యుతాపురం కేంద్రంగా 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, బర్న్ వార్డుతో ఏర్పాటు చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

భీకర బైకర్లు!



ట్రాఫిక్ రణగొణధ్వనులతో వాతావరణం ఇప్పటికే కలుషితమవుతోంది. ఈ క్రమంలోనే కొందరు ద్విచక్రవాహనదారులు సృష్టిస్తున్న భీకర శబ్దాలతో కాలుష్యం మరింతగా పెరుగుతోంది. బైక్‌లకు ఇష్టారాజ్యంగా సైలెన్సర్లు మార్చేసి హల్‌చల్ చేస్తున్నారు. గుండెలదిరే సౌండ్‌తో మోటార్‌సైకిల్ నడుపుతూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారు. చిత్రవిచిత్రమైన ధ్వనులను వెలువరించే వివిధ రకాల పొగ గొట్టాలను తమ వాహనాలకు అమర్చుకుని జనం చెవులు పగలగొడుతున్నారు. ఈ స్థాయి శబ్దాలు ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. కోరి వ్యాధులను కొనితెచ్చుకోవడమేనని హెచ్చరిస్తున్నారు.

- ద్విచక్రవాహనాల నుంచి గుండెలదిరే ధ్వనులు
- వింత వింత శబ్దాలతో దడ పుట్టిస్తున్న మోటారుసైకిళ్లు
- సైలెన్సర్లు మార్చేసి రోడ్లపై చక్కర్లు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- అధిక మోతతో ప్రమాదమంటున్న నిపుణులు



అధిక శబ్దంతో ముప్పు ఇదీ..

100 డెసిబెల్స్ దాటిన శబ్దం గుండె జబ్బులున్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది

110 డెసిబెల్స్ చికాకు, చర్మంపై రోమాలు నిక్కబొడుచుకుంటాయి. వణుకు మొదలవుతుంది.

120 డెసిబెల్స్ చికాకు, కోపంతో భరించలేని తలనొప్పి వస్తుంది.

160 డెసిబెల్స్ చెవుల్లోని వినికిడి కణాలు, నరాలు దెబ్బతింటాయి.

190 డెసిబెల్స్ కర్ణభేరి పగిలిపోతుంది. శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారు.

పర్యావరణానికీ ఇబ్బంది



రాజసం, హోదా ఉట్టి పడేలా ఉండాలని బుల్లెట్ కొనుక్కునేవాళ్లు ఒకరు. కుర్రకారు క్రేజ్‌గా కేటీఎం. 80వ దశకం నాటి ఆర్ ఎక్స్-100 పై రోడ్డుపై వెళుతుంటే ఆ హాయే వేరు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు సమస్యంతా రూ.లక్షలు వెచ్చించి కొంటున్న ద్విచక్ర వాహనాల పొగ గొట్టాలను ఇష్టానుసారం మార్చేసి, రోడ్లపై వెళ్లే ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయడమే. దీనికి తోడు బైకుల నుంచి వచ్చే వింత శబ్దాలతో పర్యావరణానికి కూడా ఇబ్బంది కలుగుతోంది. ఎదుటివారి పరిస్థితిని ఏమాత్రం పట్టించుకోకుండా రోడ్లపై తిరుగుతూ రోత పుట్టిస్తున్న వాళ్లపై పోలీసులు సరైన చర్యలు తీసుకోకుపోతే ఈ సమస్య మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా మనం 60 డెసిబెల్స్ శబ్దం వరకు వినగలం. అంతకంటే శబ్దం పెరిగేకొద్దీ ఒక్కో రకమైన వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది.

చట్టం చెబుతోంది ఇదీ..



ఒక వాహనం సైలెన్సర్ నుంచి నిర్ణీత డెసిబెల్స్ కంటే ఎక్కువ సౌండ్ వస్తే.. అది శబ్ద కాలుష్యం సృష్టించినట్టే. దీనికిగానూ మోటారు వాహన చట్టంలోని యాక్టు 1988 సెక్షన్ 190(2) ప్రకారం పోలీసులతో పాటు రవాణా శాఖ అధికారులు కేసు నమోదు చేయాలి. బైకు నడిపిన వ్యక్తికి రూ.10వేల జరిమానాతో పాటు, కేసు నమోదు చేసి కోర్టుకు పంపాలి. మళ్లీ రెండోసారి శబ్దకాలుష్యానికి కారణమైతే బైకు నడిపిన వ్యక్తికి జైలుశిక్ష విధించే అవకాశం కూడా ఉంది. ఇక మోటారు వాహనానికి కంపెనీ ఇచ్చిన భాగాలను మారిస్తే వారిపై ఎంవీఐ యాక్ట్ 1988 సెక్షన్ 191 ప్రకారం కేసు పెట్టవచ్చు. కొందరు కంపెనీ సైలెన్సర్లు తీసేస్తుంటే, మరికొందరు మఫ్లర్‌లను తీసేసి తీవ్రమైన శబ్ద కాలుష్యం సృష్టిస్తురు. మూడేళ్ల క్రితం చిత్తూరులో ఈ తరహా సైలెన్సర్లు అమర్చిన వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. పొగ గొట్టాలను తొలగించి, రోడ్డు రోలర్‌తో తొక్కించారు. రెండోసారి పట్టుబడ్డవారిపై కేసులు నమోదు చేశారు. కానీ ప్రస్తుతం తమ కళ్లెదుటే వింత వింత శబ్దాలు చేస్తూ బైకర్లు వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం



సైలెన్సర్లను మార్చేసి ఇష్టానుసారం ప్రజలకు ఇబ్బందులు కలిగే శబ్దాలు చేయడం మంచిది కాదు. అసలు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏ వయసులో వాహనాలు ఇవ్వాలో తెలుసుకోవాలి. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు మార్చకుండా చూసుకోవాలి. ఎంవీ యాక్టు కింద ఇలాంటి వారికి భారీ జరిమానాలు విధిస్తున్నాం. ఇక మెకానిక్‌లు కూడా సైలెన్సర్లను మార్పు చేస్తే కఠిన చర్యలు తీసుకుని వారిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా వెనుకాడం. సైలెన్సర్‌ను మార్పు చేయాలని ఎవరైనా మెకానిక్‌ల వద్దకు వస్తే, చేయమని కచ్చితంగా చెప్పండి. చట్ట పరిమితిలో లేని సైలెన్సర్లను విక్రయించేవారిపై కూడా చర్యలు తప్పవు. వీటి వల్ల ఎక్కడైనా ఇబ్బంది వస్తే డయల్-100 నంబర్‌కు సమాచారం ఇవ్వొచ్చు.

- మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు

చిత్తూరు అర్బన్: ఇటీవల ఏదో ఆటంబాబు పేలితే వచ్చే పెద్ద పెద్ద శబ్దాలతో ద్విచక్రవాహన చోదకులు కొందరు చేస్తున్న స్టంట్లు ప్రాణాలపైకి తెస్తున్నాయి. రోడ్లపై మితిమీరిన వేగంతో.. చెవులకు చిల్లులు పడే శబ్దాలతో రోడ్లపై కొందరు కుర్రకారు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. ద్విచక్రవాహనాలు కొనే సమయంలో కంపెనీ ద్వారా వచ్చే సైలెన్సర్లు (పొగ గొట్టాలు) తొలగించి, వాటి స్థానంలో రోత పుట్టించే వాటిని అమర్చుకుని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ప్రధానంగా ఎన్‌ఫీల్డ్, కేటీఎం, ఆర్‌ఎక్స్-100 లాంటి ద్విచక్రవాహనాల్లో ఈ తరహా సైలెన్సర్లను అమర్చుకుని ప్రజల కర్ణభేరితో ఆడుకుంటున్నారు. ఇందుకోసం షార్ట్ బాటిల్. అంగళూర్, డబుల్ బేరల్, రెడ్ రూస్టర్. అబ్బో ఇలాంటి పేర్లు చాలానే ఉన్నాయి. ఇవన్నీ పలు రకాల బైకులకు అమర్చే సైలెన్సర్ల పేర్లు. బాటిల్ పగులగొట్టినట్లు శబ్దం వస్తే షార్ట్ బాటిల్. అడవి పంది అరచినట్లు శబ్దం వచ్చే పొగ గొట్టానికి వైల్డ్ బోర్ ఎగ్జాస్ట్. తుపాకీ పేలుస్తున్నట్లు శబ్దం వస్తే టెయిల్ గన్నర్. ప్రస్తుతం ఈ తరహా వింత శబ్దాలు చేస్తూ రోడ్లపై తిరిగే ద్విచక్ర వాహనాలతో సామాన్యుల చెవులు పగిలిపోతున్నాయి.

అనారోగ్యం తప్పదు



శబ్ద తరంగాలను మన చెవికి కావాల్సిన దానికంటే ఎక్కువ స్థాయిలో వింటే శారీరక, మానసిక వ్యాధులు వస్తాయి. అధిక శబ్దాలను వినడం ద్వారా చెవిలోని నరాలు దెబ్బతిని వినికిడి వ్యవస్థకు రక్త ప్రసరణ నిలిచిపోతుంది. దీంతో శాశ్వతంగా వినికిడి లోపం ఏర్పడుతుంది. పైగా మానసికంగా ఒత్తిడి పెరిగి చిరాకు కలుగుతుంది. ఆ కోపాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, తెలిసినవాళ్లపై చూపిస్తుంటాం. దీంతో మానవ బంధాలు కూడా దెబ్బతింటాయి. ద్విచక్ర వాహనాలకు ఆయా కంపెనీలు ఇచ్చే సైలెన్సర్లను పెట్టుకోవడమే మంచిది. లేకుంటే అనారోగ్యం తప్పదు.

- పురుషోత్తం, వైద్య నిపుణుడు, చిత్తూరు ప్రభుత్వాసుపత్రి

ఏపీవోఏలో నిధుల దుర్వినియోగం!

- తక్షణమే సీఐడీ విచారణ చేపట్టాలి
- క్రీడా మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డికి జూడో సంఘం ప్రతినిధి నామిశెట్టి ఫిర్యాదు



మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన నామిశెట్టి వెంకట్

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ (ఏపీవోఏ) నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఆర్.కె.పురుషోత్తం, కె.పి.రావులపై సీఐడీ విచారణకు ఆదేశించాలని కోరుతూ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి జూడో సంఘం ప్రతినిధి నామిశెట్టి వెంకట్ ఫిర్యాదు చేశారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏపీవోఏలో ఉన్న రూ.కోట్ల నిధుల్లో, హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 58 శాతం వాటా ఆంధ్రాకు, 42 శాతం వాటా తెలంగాణకు విభజన చట్టం ప్రకారం కేటాయించబడిందని వెంకట్ తెలిపారు. పురుషోత్తం, కె.పి.రావు ఏపీవోఏను రెండుగా చీల్చి చెరో సంఘానికి నేటి వరకు ప్రతినిధులుగా చెలామణి అవుతున్నారని, 2015లో కె.పి.రావు సంఘంలోని రూ.18 లక్షలు, 2017లో పురుషోత్తం రూ.10 లక్షలు ఒక దఫా, రూ.27 లక్షలు రెండో దఫా విత్‌డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిద్దరు కొనసాగిస్తున్న సంఘాలను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), భారత ఒలింపిక్ సమాఖ్య ఇప్పటి వరకు గుర్తించలేదని స్పష్టం చేశారు. ఫోర్జరీ సంతకాలతో ఏపీవోఏ నిధులను అక్రమంగా డ్రా చేశారని వివరించారు. స్వార్థం కోసం రాష్ట్రంలోని క్రీడా సంఘాలను విభజించి పాలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, వీరి నిర్వాకంతో గడిచిన పదేళ్ల రాష్ట్రంలో క్రీడా వ్యవస్థ కునారిల్లిందని, వీరిపై సీఐడీ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. దీనికి స్పందించిన మంత్రి ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పురుషోత్తం వర్సెస్ కె.పి.రావు

ఏపీవోఏలో నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కె.పి.రావు చేసిన ఫిర్యాదు క్రీడా సంఘాల్లో చర్చకు దారితీసింది. తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యదర్శి జగదీశ్వర యాదవ్‌తో కుమ్మక్కై ఏపీవోఏలోని రూ.49 లక్షలను ఆర్.కె.పురుషోత్తం విత్‌డ్రా చేసి దుర్వినియోగం చేశారని సదరు లేఖలో కె.పి.రావు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీవోఏలోని నిధులను తాను దుర్వినియోగం చేయలేదని, ఏపీ ప్రభుత్వం చేపట్టే ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమేనని క్రీడల మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి రాసిన మరో లేఖలో కె.పి.రావు పేర్కొన్నారు. ఏపీవోఏలోని రూ.18 లక్షలను కె.పి.రావు 2015లో విత్‌డ్రా చేశారని, దీనిపై అప్పట్లోనే హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆర్.కె.పురుషోత్తం చెబుతున్నారు. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉందని తెలిపారు. అయితే ఏపీవోఏ పూర్తి నిర్వహణ బాధ్యతను ఇన్నాళ్లు తాను ఒక్కడినే చూసుకున్నానని, ఈ పదేళ్ల పాటు ఏపీవోఏ నిర్వహణకు తాను రూ. 2 కోట్ల వరకు ఖర్చు చేశానని చెప్పారు. ఈ క్రమంలో ఏపీవోఏలో నిధులను డ్రా చేసుకుంటే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. 2018లో జరిగిన జాతీయ క్రీడలకు వెళ్లే రాష్ట్ర క్రీడాకారులకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకున్నా.. తన సొంత ఖర్చులతో జట్లను తీసుకెళ్లానని గుర్తు చేశారు.

ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానంటూ ఘరానా మోసం



తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న బాధితులు

- రూ.కోటికి పైగా వసూలు చేసుకుని పరార్
- మూడేళ్లుగా బాధితుల ఎదురు చూపులు
- ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మదనపల్లె: తనకు రాజకీయంగా మంచి పలుకుబడి ఉందని.. ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి పలువురి వద్ద రూ.కోటికి పైగా వసూలు చేసి పరారయ్యాడు. మోసపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్ల బైలు పంచాయతీ భయ్యారెడ్డి కాలనీలో శాంతమ్మ.. కుమార్తె దివ్య, కుమారుడు శ్రీనివాసులతో కలిసి టైలరింగ్ చేస్తూ జీవిస్తోంది. ఆ ప్రాంతంలో ఉన్న అధిక శాతం మంది చేనేత కార్మికులు ఆమెకు బంధువులే. ఈ క్రమంలో 2021లో సత్యసాయి జిల్లా కదిరి మండలం ఇనగలూరుకు చెందిన మంజునాథ.. మదనపల్లెకు వచ్చి భయ్యారెడ్డి కాలనీలో దివ్యతో సహజీవనం చేస్తున్నాడు. బీటెక్ వరకు చదివిన మంజునాథ.. తనకు రాజకీయంగా పలుకుబడి ఉందని, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అందరికీ ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. అతని మాయమాటలు నమ్మిన శాంతమ్మ బంధువులు, పరిసర ప్రాంత ప్రజలు 2021 డిసెంబర్‌లో ఇళ్ల స్థలాల కోసం ఒక్కొక్కరు రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకూ చెల్లించారు. అందరి వద్ద విడతల వారీగా దాదాపు రూ.1 కోటికిపైనే వసూలు చేశాడు. ఇళ్ల పట్టాల మంజూరుకు అవసరమైన ప్రక్రియ జరుగుతోందంటూ ఏడాది కాలంగా నమ్మిస్తూ వచ్చాడు. ఆ తర్వాత అతనిపై నమ్మకం కోల్పోయిన స్థానికులు తమ నగదు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో పరారయ్యాడు. దీనిపై బాధితులు గతంలో రెండుసార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఆదివారం బాధితులంతా కలిసి మళ్లీ పోలీసులను ఆశ్రయించారు.

క్లుప్తంగా...

అనారోగ్యంతో ఏనుగు మృతి!



భాకరాపేట: అనారోగ్యంతో ఏనుగు మృతిచెందిన ఘటన తిరుపతి జిల్లా పులిబోనుపల్లె అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి కథనం మేరకు.. పశువుల కాపరులు పులిబోనుపల్లె అటవీ ప్రాంతానికి ఆదివారం పశువులు మేపేందుకు వెళ్లగా దుర్వాసన వెదజల్లుతున్న ఏనుగు కలేబరం కనిపించింది. దీంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు ఏనుగు కలేబరం వద్దకు వెళ్లి ఆదివారం రోజుల కిందట మరణించినట్లు తెలిపారు. ఏనుగు మృతికి కారణాలు తెలియరాలేదని, అనారోగ్యంతో మృతిచెందినట్లు భావిస్తున్నామని డీఎఫ్‌వో తెలిపారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పారిపోయిన గురుకులం విద్యార్థి

బుచ్చినాయుడుకండ్రిగ: చిత్తూరు జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కనమనంబేడు వద్ద ఉన్న ఏకలవ్య మోడల్ ఎస్టీ గురుకులంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి లోకేష్‌నాయిక్ శనివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయాడు. ఆదివారం విద్యార్థి తండ్రి బాలునాయిక్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి వరకు హాస్టల్ ఉన్న లోకేష్ నాయక్ శనివారం ఉదయం పారిపోయాడని తెలిపారు. కుమారుడు హాస్టల్ నుంచి పారిపోవటంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన మురుగన్ మహానాడు

సాక్షి, చెన్నై: తమిళనాడులోని దిండుగల్ జిల్లా పళనిలో ప్రపంచ స్థాయిలో హిందూ దేవదాయ శాఖ నిర్వహించిన ముత్తమిళ్ మురుగన్ మహానాడు ఆదివారం రాత్రితో ముగిసింది. చివరి రోజున మురుగన్ కీర్తిని చాటే విధంగా ఉపన్యాసాలు, సాంస్కృతిక సంబరాలు జరిగాయి. అలాగే మురుగన్‌పై దేశ విదేశాలకు చెందిన భక్తులు వ్యాసాలు, పరిశోధన పత్రాలను ఈ మహానాడులో సమర్పించారు. ఇందులో 35 మందిని ఎంపిక చేసి సత్కరించారు. అలాగే దేశ విదేశాలలో తమిళ్ కడవుల్ మురుగన్ సేవలో రాణిస్తున్న వారికి అవార్డులను హిందూ, దేవదాయ శాఖమంత్రి శేఖర్‌బాబు, ఆధీనాలు (పీఠాధిపతులు) ప్రదానం చేశారు.

ఎన్టీపీసీకి ఐదు జాతీయ అవార్డులు

తెలంగాణ

జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లాలోని ఎన్టీపీసీ (రామగుండం) ప్రాజెక్టు అత్యంత ప్రతిభ కనబరచి పలు విభాగాల్లో ప్రతిష్టాత్మకమైన ఐదు జాతీయ అవార్డులను సాధించింది. కేరళ రాష్ట్రం కోజికోడ్‌లోని తాజ్ గేట్‌వేలో శనివారం రాత్రి టస్కర్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో కేరళ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి పీఏ మహమ్మద్ రియాజ్ నుంచి హెచ్ఆర్ సీనియర్ అసిస్టెంట్ ప్రజ్ఞాన్ ప్రియదర్శిని, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఎగ్జిక్యూటివ్ రూపాలి రంజన్‌లు పురస్కారాలు అందుకున్నారు. గ్రామీణ క్రీడల ప్రమోషన్‌లో నైపుణ్యం, సోషల్ అవేర్‌నెస్ యాడ్ ఫిల్మ్, మానవ వన రులు-వైవిధ్యం-చేరిక విభాగాల్లో బంగారు అవార్డులు, పీపుల్-ఓరియెంటెడ్ ప్రాక్టీసెస్-మానవ వనరులు, సీఎస్సార్- ఇన్నోవేషన్ విభాగాల్లో కాంస్య పురస్కారాలను ఎన్టీపీసీ సాధించింది.

ఆర్వో (రివర్స్ ఆస్మోసిస్) నీటిని సురక్షితమైన తాగునీటిగా పరిగణించడం అలవాటైపోయింది. పదేళ్ల క్రితం వరకు వాటర్ ప్లాంట్లకే పరిమితమైన ఆర్వో ప్యూరిఫైర్లు ఇప్పుడు ఇళ్లల్లోనూ ప్రత్యక్షమయ్యాయి. నిజానికి పారిశ్రామిక రసాయనాలు, భారీ లోహాలు, పురుగు మందులు, ద్రావకాలు వంటి కలుషితాలను ఆర్వో సాంకేతికత తాగునీటి నుంచి తొలగిస్తుంది. కానీ.. ఇదే సందర్భంలో ఆర్వో ఫిల్టర్లు ఉపయోగించడం వల్ల శరీరానికి అవసరమైన ఖనిజాలు సైతం పూర్తిగా తగ్గిపోతున్నాయి. ఇలాంటి నీరు తాగడం వల్ల అనారోగ్యం పాలవుతారని నిపుణులు చెబుతున్నారు.

ఆర్వో నీరు.. ఆరోగ్యం బేజారు



రుచి కోసం నీటిలోని లవణాలను పూర్తిగా తొలగిస్తున్న వైనం

- టీడీఎస్ 20 పీపీఎం, పీహెచ్ 4 శాతం లోపే..
- ఈ నీరు తాగడం వల్ల పనిచేయని మందులు, తగ్గని రోగాలు
- ఐఎస్ఐ, బీఐఎస్, ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు ఉల్లంఘన
- ఐఎస్ స్టాండర్డ్స్ 10500:2012 నిబంధనలు పాటించని సంస్థలు
- కనీస ప్రాథమిక పరీక్షలు చేయకుండానే మార్కెట్లో అమ్మకం
- తాగునీటిలో పీహెచ్ 7–8 శాతం ఉంటేనే ఆరోగ్యం
- లీటర్ నీటిలో 100 ఎంజీ టీడీఎస్ తప్పనిసరి అంటున్న నిపుణులు



సాక్షి, అమరావతి: లీటర్ నీరు తాగిన అరగంటకే మళ్లీ మళ్లీ దాహం వేస్తుంటుంది. ఇలా ఎందుకు జరుగుతోందో తెలియడం లేదు. పదేళ్లకే థైరాయిడ్, పదిహేనేళ్లకే కీళ్ల నొప్పులతో పాటు యుక్తవయసులోనే ఎముకలు గుల్లబారిపోతున్నాయి. ఇరవై ఏళ్లకే కిడ్నీల్లో రాళ్లు, పాతికేళ్లకే కేన్సర్ వంటివి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు చిన్న వయసులోనే ఎందుకొస్తున్నాయి? అనారోగ్యానికి వాడుతున్న మందులు పని చేయడం లేదం పదిమంది వైద్యులను మారుస్తుంటారు గానీ, కారణాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. వీటన్నింటికీ మనం తాగే నీరే అన్నది గొంతు దిగని చేదు నిజం.

ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగినా..

ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. నిద్ర లేవగానే గోరువెచ్చని నీటిని తాగడం తప్పనిసరైంది. ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సమయానికి తినడం, పడుకోవడం.. ప్రతిరోజు నడక, వ్యాయామం వంటివి నిత్య జీవితంలో అలవాటుగా మారాయి. 40 ఏళ్ల వయసు రాగానే నెలకోసారి వైద్య పరీక్షలు చేయించుకుంటూ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కడకు వెళ్లినా బ్రాండెడ్ కంపెనీల నీటిని లీటర్ల చొప్పున కొనుక్కుని మరీ తాగుతున్నారు. కోవిడ్ తర్వాత ఈ జాగ్రత్తలు మరీ పెరిగాయి. హోటళ్లతోపాటు బస్సుల్లో సైతం బాటిల్ నీటినే ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఇవ్వకుంటే అడిగి మరీ తీసుకుంటున్నారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఏదో ఒక ఆరోగ్య సమస్య వెంటాడుతోంది. కారణమేంటో తెలియడం లేదంటూ చాలామంది ఆందోళన చెందుతుంటారు. సన్నిహితులను సలహా అడిగితే 'ఫలానా డాక్టర్‌కు చూపించుకో' అని సలహా ఇస్తే పాటిస్తున్నారే గానీ.. తాగుతున్న నీటిపై దృష్టి పెట్టడం లేదు. టీవీలు, సోషల్ మీడియాలో కనిపించే కార్పొరేట్ కంపెనీల యాడ్స్ సైతం మనిషి ఆలోచనలను తీవ్రంగా ప్రభావితం చేయడంతో 'ఏది.. ఏమిటి' అని తెలుసుకోకుండానే ఆదే నిజమని నమ్మి శరీరాన్ని గుల్ల చేసుకుంటున్నారు.

మనకు తెలియకుండానే విషం చేరుతోంది

మానవ శరీరం 70 శాతం పైగా నీటితో నిండి ఉంటుందని.. రోగాలు కూడా నీటివల్లే అధికంగా వస్తాయని చాలా మందికి తెలుసు. రోగాలు తగ్గేది కూడా ఆ నీటితోనే అన్న విషయం కొద్దిమంది మాత్రమే గ్రహిస్తారు. బోరు, కుళాయి నీరు మంచిది కాదని రివర్స్ ఆస్మోసిస్ (ఆర్వో) నీటిని పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా వాడుతున్నారు. ఆ నీరే ఇప్పుడు ప్రాణాంతకమవుతోంది. 'మినరల్ వాటర్' పేరుతో అమ్ముతున్న ఈ నీటిలో అసలు మినరల్స్ ఉండవంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

నిత్యం మన శరీరానికి కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, బై కార్బొనేట్, ఐరన్, జింక్ వంటి లవణాలు అవసరం. కానీ.. ఆర్వో నీటిలో ఇవేమీ ఉండవు. ఆర్వో ప్లాంట్ నీటిని రుచికోసం టీడీఎస్‌ను పూర్తిగా తగ్గించేస్తున్నారు. ఫలితంగా నీటిలో పీహెచ్ స్థాయి 4 శాతం వరకు పడిపోతోంది. తాగునీటి పీహెచ్ 6.5 శాతం కంటే తక్కువగా ఉంటే అది ఎసిడిటీ (గ్యాస్ సమస్య)కి కారణమవుతుందని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా మనిషి రక్తం పీహెచ్ 7.35 నుంచి 7.45 మధ్య ఉంటుంది. దానికి అనుగుణంగా తాగే నీటి పీహెచ్ కూడా 7 శాతం ఉంటేనే ఆరోగ్యకరమంటున్నారు ఆహార నిపుణులు. శుద్ధి చేసిన నీటితో ఆరోగ్యం బాగుంటుందని బలంగా నమ్మిన ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకుని వీధికొకటి చొప్పున ఆర్వో ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. రాష్ట్రంలో 10 వేలకు పైగా ఉన్న కమర్షియల్ వాటర్ ప్లాంట్లతో కనీస పరీక్షలు (బేసిక్ టెస్టులు) చేసేవి వంద లోపే ఉన్నాయని అంచనా. రాష్ట్రవ్యాప్తంగా 199 సంస్థలు మాత్రమే బీఐఎస్ అనుమతి తీసుకుని నడుస్తున్నాయి. అక్కడా ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా, కనీసం సక్రమంగా శుద్ధి చేయకుండా ఇస్తున్న నీరు ప్రజల ఆరోగ్యాన్ని మరింత తీవ్రంగా దెబ్బతీస్తోంది. వ్యాపారం రూ.కోట్లు చేస్తున్నా నీటి పీహెచ్ స్థాయి, ఆక్సిజన్, మినరల్స్ వంటివి ఎంత ప్రమాణంలో ఉండాలో కూడా తెలియకుండానే మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. వాటినే ప్రజలు ఉత్తమ నీటిగా భావించి తీసుకుంటున్నారు.

ఆర్వో నీటిలో పీహెచ్ 4 శాతం లోపే..

శుద్ధమైన తాగునీటిలో పొటెన్షియల్ ఆఫ్ హైడ్రోజన్ (పీహెచ్) స్థాయి 6.5 శాతం నుంచి 8.5 శాతం వరకు ఉండాలి. పీహెచ్ స్థాయి 6.5 శాతం కంటే తక్కువగా ఉంటే ఆ నీటిలో యాసిడ్స్ ఉన్నట్టు లెక్క. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) నిబంధనల ప్రకారం నీటిలో కరిగిన ఘన పదార్థాలు (టీడీఎస్) గరిష్ఠంగా 250 పీపీఎం, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాల ప్రకారం 300 పీపీఎంగా ఉండాలి. కనిష్ఠంగా 100 పీపీఎం అయినా ఉండాలి. కానీ ఆర్వో ప్లాంట్లలో నీటి పీహెచ్ 4 శాతం కంటే తక్కువ, టీడీఎస్ 20–30 పీపీఎం వరకు మాత్రమే ఉంటోంది. అంటే ఎలాంటి మినరల్స్ లేని నీటినే ప్రజలు ఆరోగ్యకరమైన నీరుగా తాగుతున్నారు. తక్కువ పీహెచ్, టీడీఎస్ ఉన్న నీరు తాగేందుకు రుచిగా ఉన్నా, శరీరానికి ఏవిధంగానూ మేలు చేయదు. ఆహారాన్ని, మందులను శరీరానికి అందించడంలో కీలక వాహకమైన నీరు తన పని సక్రమంగా చేయలేదు. ఒక విధంగా చెప్పాలంటే రోగం తగ్గేందుకు 20 ఎంజీ మాత్రను తక్కువ పీహెచ్ ఉన్న నీటితో వేసుకుంటే మందులో 10 ఎంజీ మాత్రమే శరీరానికి అందుతుంది.

రాష్ట్రంలో కమర్షియల్ వాటర్ ప్లాంట్లు	10,000
వీటిలో బేసిక్ టెస్టులు చేసేవి	100
బీఐఎస్ అనుమతితో నడుస్తున్నవి	199
బీఐఎస్ ప్రకారం తాగునీటికి చేయాల్సిన పరీక్షలు	47
కమర్షియల్ నీటికయితే చేయాల్సిన పరీక్షలు	72

47 రకాల పరీక్షలు తప్పనిసరి

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) 10500:2012లో సూచించిన నిబంధనల మేరకు తాగునీటికి 47 రకాల పరీక్షలు చేయాలి. కమర్షియల్ (14,543) నీటికైతే 72 రకాల పరీక్షలు తప్పనిసరి. వీటిలో ప్రతిరోజు చేయాల్సినవి, వారానికి ఒకసారి, మూడు నెలలకోసారి చేయాల్సిన పరీక్షలు కూడా ఉన్నాయి. ప్రతి ప్లాంట్‌లోను తప్పనిసరిగా నీటి రసాయన పరీక్షలు, బ్యాక్టీరియా టెస్టులు, భారలోహాల స్థాయిని గుర్తించే టెస్టులు చేసేందుకు తప్పనిసరిగా లేబొరేటరీలు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్ఐ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనలు పాటించాలి. కానీ.. అత్యధిక ఆర్వో ప్లాంట్లలో ఇవేమీ లేకుండానే సరఫరా చేస్తున్నారు. ఈ ఆర్వో నీరు శరీరాన్ని గుల్ల చేస్తుందంటే నమ్మడం కష్టమైనా ఇదే నిజమంటున్నారు ఆహార నిపుణులు.

అంకుడు కర్రతో సూక్ష్మ కృష్ణుడు

ఏటికొప్పాక కళాకారిణి చింతల లావణ్య నైపుణ్యం



యలమంచిలి రూరల్: అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలంలోని ఏటికొప్పాక పేరు చెప్పగానే ఖండాంతర ఖ్యాతి చెందిన లక్కబొమ్మలు గుర్తుకొస్తాయి. ఎన్నో అసాధ్యాలను సైతం సుసాధ్యం చేయగల కళానైపుణ్యత ఏటికొప్పాక హస్త కళాకారుల సొంతమని చెప్పాలి. సందర్భానుసారం ఈ గ్రామానికి చెందిన హస్తకళాకారులు తమ సృజనాత్మకతను చాటుకుంటూ ప్రపంచాన్ని, కళాభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన హస్త కళాకారిణి చింతల లావణ్య శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని తన మదిలో మెదిలిన ఊహకు చక్కని రూపాన్నిచ్చారు. ఒక చిన్న అంకుడు కర్ర ముక్కపై అతి సూక్ష్మమైన గోపాలుడి రూపాన్ని అద్భుతంగా తయారు చేశారు. 3.5 సెం.మీ. పొడవు, 2 సెం.మీ. వెడల్పున గోపాలుడి వేషధారణలో వున్న కృష్ణుడిని, ఆ వెనుక గోమాతను అద్భుతంగా చెక్కి ఔరా అనిపించారు. ఈ కళాఖండం విశేషంగా ఆకట్టుకుంటోంది. దీనిని తయారు చేయడానికి తనకు రెండు రోజుల సమయం పట్టిందని లావణ్య చెప్పారు. ఇటీవల వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆమె గోటిపై పట్టేంత అతి చిన్న సైజులో లక్ష్మీదేవి బొమ్మను అంకుడు కర్రతో తయారుచేశారు.

మంత్రాలయంలో 350 మందితో నృత్య ప్రదర్శన

అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



మంత్రాలయం: కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఆదివారం ఏకకాలంలో 350 మందితో నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. శ్రీరాఘవేంద్రస్వామి మఠం వేదికగా సాగిన ఈ నాట్య ప్రదర్శన వైభవంగా జరిగింది. మంత్రాలయం, జాతీయ శాస్త్రీయ నృత్య అకాడమీ (చెన్నరాయపట్నం, హాసన్ జిల్లా) ఆధ్వర్యంలోనీ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచం నలు మూలల నుంచి 350 మందికి పైగా కళాకారులు ఒకే వేదికపై నృత్యం చేశారు. 15 నిమిషాల పాటు శ్రీనామ రామ గీతాలకు నృత్యాలు చేశారు. ఇండోనేషియా, జపాన్‌తో సహా వివిధ దేశాల నుంచి కళాకారులు ప్రాతినిధ్యం వహించారు. అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డు బృందం సమక్షంలో మైమరిపించేలా నాట్య ప్రదర్శన చేశారు. వేడుకలో సంస్థ చీఫ్ మేనేజర్ అరవిందర్ సింగ్, సభ్యులు అక్షత, శశికళ, భాగ్యలక్ష్మి, భారతి, బాబు, నేషనల్ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ జనరల్ కార్యదర్శి స్వాతి భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ బాట గంగమ్మ ఆలయం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 79,521 మంది స్వామిని దర్శించుకున్నారు. 40,152 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శనం టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. రాజమండ్రి, ధవళేశ్వరానికి చెందిన నర్తన నటరాజ నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

నేడు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణభగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుపతి ఇస్కాన్ కమల మందిరంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇస్కాన్ మందిరాన్ని విద్యుద్దీపాలంకరణలు, శ్రీకృష్ణుడి ప్రతిరూపాలు, చిత్రపటాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం 9 నుంచి రాత్రి 11.45 గంటల వరకు భక్తులకు శ్రీరాధాగోవిందుల దర్శనం కల్పించనున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల భద్రతపై సమీక్ష

తిరుమల: తిరుమలలో అక్టోబర్ 4వ తేదీ నుంచి శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదివారం భద్రతపై సమీక్ష చేపట్టారు. భక్తులు, యాత్రికుల భద్రతే పరమావధిగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, తదనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

కిక్కిరిసిన కాణిపాకం

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శ్రావణ ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నూతన దంపతులకు తొలిసారిగా ప్రత్యేక దర్శనాలకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉట్టి కొట్టిన చిన్నారి కృష్ణులు

అమలాపురం టౌన్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా సంస్కార భారతి ఆధ్వర్యంలో స్థానిక గీతా విద్యాలయం ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగాయి. ఐదేళ్లలోపు బాల బాలికలు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టే వేడుక నిర్వహించారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: కాకినాడ జిల్లా జి.మామిడాడలో వేంచేసిన ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరి సత్యదేవుని ఆలయం ఆదివారం వేలాదిగా వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు 50 వివాహాలు జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. అంతరాలయం దర్శనానికి అరగంట పట్టింది. సుమారు 40వేల మంది స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో స్వామివారి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది.

వైభవంగా వేద విద్వత్ సభ

నిడదవోలు: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని మదనగోపాలస్వామి వారి ఆలయం వద్ద గాయత్రి వేద శాస్త్ర పరిషత్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 28వ వేద విద్వత్ సభను వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వేద పండితులు తరలివచ్చారు. లోక కల్యాణార్థం ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద పఠనం నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్లను ఆదివారం పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు గత రెండురోజుల్లో శుభముహూర్తాల వేళ ఒక్కటైన నూతన వధువరులు పెళ్లిదుస్తులపై ఇంద్రకీలాద్రికి విచ్చేసి కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రకృతి సేద్యం ఫలిస్తోంది

పార్వతీపురం మన్యం జిల్లాలో 74 వేల మందితో సాగు చేయించేలా ప్రణాళికలు



నూరు శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామం గొరడ వద్ద రైతులతో కలెక్టర్ శ్యాంప్రసాద్

సాక్షి, పార్వతీపురం మన్యం: మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల నానాటికీ అనర్థాలు అధికమవుతున్నాయి. మట్టిలో సత్తువ తగ్గి, సాగుకు మేలు చేసే సూక్ష్మ జీవులు అంతరించిపోతున్నాయి. ఖర్చు పెరుగుతూ.. గిట్టుబాటు దక్కక.. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను అందించడమే కాక.. ఇటు అధిక ఆదాయం పొందేలా.. ప్రకృతి సాగు దిశగా జిల్లాలో అధికార యంత్రాంగం కొన్నేళ్లుగా రైతులను మళ్లిస్తోంది. సేంద్రియ ఉత్పత్తుల వల్ల ఆరోగ్యం పదిలంతో పాటు.. లాభాల బాట పట్టవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఆ దిశగా వారు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి.

96 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం

పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గిరిజన ప్రాంతాలే అధికం. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, సీతంపేట, మక్కువ, పాచిపెంట, సాలూరు తదితర ప్రాంతాల్లో సహజసిద్ధ వనరులకు లోటులేదు. ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. ఇక్కడి ఆరోగ్యకర వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. సాగులో రసాయన వినియోగాన్ని తగ్గిస్తూ.. రైతులను పూర్తిగా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా అధికారులు కొన్నాళ్లుగా కృషి చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 74 వేల మంది రైతులను 96 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు దిశగా తీసుకెళ్లేందుకు నిర్దేశించుకున్నారు. ఇందులో పూర్తిగా వంద శాతం రసాయన రహిత పంటల సాగును 38,500 మంది రైతులతో చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వరి, జీడి, పత్తి, మొక్కజొన్న తదితర మేలైన పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

ప్రధాన పంట వరితో పాటు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా గట్లపైన చిక్కుడు, బీర, కాకర, మునగ, అరటి, బెండ తదితర కూరగాయలు.. కంది, బంతి వంటి వాటిని వేయడానికి ప్రోత్సహిస్తున్నారు. దీనికి అవసరమైన అవగాహన కల్పిస్తున్నారు. కేవలం అంతర పంటల వల్లే రైతులకు గట్ల పరిమాణం బట్టి ఎకరాకు రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు లాభం వస్తోంది. నవ ధాన్యాల సాగు కీలకం కావడంతో.. దీనిపై అవగాహన కల్పిస్తూ కిట్ల రూపంలో పంపిణీ చేస్తున్నారు. సుమారు 50 వేల మంది రైతులతో ఈ పద్ధతిని అవలంబిస్తున్నారు. దీనివల్ల ఎరువుల వినియోగం, పురుగుల నష్ట తీవ్రత, కలుపు తీవ్రత తగ్గుతుంది. నవ ధాన్యాలను వరి, మిశ్రమ పంటల్లోనూ తీసుకెళ్తున్నారు.

● గగనానికి రంగుల నగ



ఇంద్రధనుస్సు అంటేనే అద్భుతం.. మరి ఒకేసారి రెండు ఇంద్రధనుస్సులు ఏర్పడితే అది అపురూపమే. అందుకు వేదికైంది వరంగల్ జిల్లా నెక్కొండ గగనం. ఆదివారం సాయంత్రం ఓవైపు వర్షం.. మరోవైపు ఎండ కాసిన సమయంలో రెండు ఇంద్రధనుస్సులు కనువిందు చేశాయి. అత్యంత అరుదైన ఈ అద్భుతాన్ని స్థానికులు ఆసక్తితో తిలకించారు. -నెక్కొండ

● అమ్మ భరోసా..అమ్మాయి కులాసా..



బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకోవడంలో తల్లి తర్వాతే ఎవరైనా.. చిన్నారులను ఇంటి వద్ద వదిలి పొలం పనులకెళ్తే వీధి కుక్కల దాడుల వార్తలు చూసిన ఓ తల్లి.. కూతురిని పొలానికి వెంట తీసుకుపోయింది. చేను మధ్యలో గొడుగు కింద బిడ్డను కూర్చోబెట్టింది. చేతిలో బిస్కెట్ ప్యాకెట్ పెట్టి.. నిశ్చింతగా పత్తి పంటకు ఎరువు వేసింది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కొత్తపల్లి గ్రామంలో కనిపించిన దృశ్యమిది. -కొత్తగూడ

● నీలేశ్వరం



వర్షం పడుతూ.. ఆగుతూ ఆకాశం మబ్బులు కమ్ముకుంటే ఎంత ఆహ్లాదం. మరి ఒక్కసారిగా ఆకాశమంతా నీలిరంగులో మెరిసిపోతే ఎంత అద్భుతం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఆదివారం కనువిందు చేసిందీ దృశ్యం. -కాళేశ్వరం

ఆయిల్‌ఫెడ్‌లో అవినీతి జిడ్డు

మొక్కల నిర్వహణ పేరుతో రూ.కోట్లు వృథా ● గానుగనూనెకి నాసిరకపు పల్లీ

- నూనె కల్తీ అవుతుందంటున్న శాస్త్రవేత్తలు
- మార్క్‌ఫెడ్‌లో ఎరువుల సొమ్ము కాజేత
- జొన్నలను విక్రయించకుండా నాన్చివేత
- రైతుల పేరుతో అక్రమంగా రుణాలు
- వేర్ హౌసింగ్‌లో తాత్కాలిక ఉద్యోగుల హవా
- వ్యవసాయ కార్పొరేషన్లలో అధికారుల ఇష్టారాజ్యం



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయశాఖ పరిధిలోని కార్పొరేషన్లు అవినీతి అక్రమాలకు నిలయాలుగా మారాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.కోట్లు పక్కదారి పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్, టెస్కాబ్ వంటి సంస్థల్లో అక్రమాలు వెలుగుచూస్తున్నా, వాటిని అడ్డుకునే వ్యవస్థే లేకుండా పోయింది. మరీ దారుణమైన విషయం ఏంటంటే... అక్రమాలను అడ్డుకోవడం సంగతి పక్కన పెడితే, వాటిల్లో కీలకమైనవారే అక్రమాలకు పాల్పడే విధంగా వ్యాఖ్యలు చేయడం విస్మయం కలిగిస్తోంది.

నేను డబ్బులు తింటానంటూ నిస్సిగ్గుగా..

ఇటీవల కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. వ్యవసాయశాఖలోని ఓ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమితులైన ఒక రాజకీయ నేత కొందరు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, 'నేనేమీ డబ్బులు తిననని చెప్పడంలేదు. తప్పకుండా తింటాను. అలా చెప్పడానికి నేనేమీ సిగ్గుబడటం లేదు. కాబట్టి మీరు నాకు సహకరించాల'ని నేరుగా చెప్పేసిన నిర్వాకం చూసి అందరూ విస్తుపోయారట.

ఆయిల్‌పాంలో అంతులేని అవినీతి

రాష్ట్రంలో ఆయిల్‌పాం విస్తీర్ణాన్ని రానున్న కాలంలో ఏకంగా 20 లక్షల ఎకరాలకు తీసుకురావాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. వివిధ కంపెనీలు తమ లక్ష్యంలో కేవలం 20 శాతం వరకే చేరుకున్నాయి. 2023–24 వ్యవసాయ సీజన్‌లో కేవలం 85 వేల ఎకరాల్లోనే ఆయిల్‌పాం సాగైంది. ఈ ఏడాది లక్ష ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు కేవలం 13 వేల ఎకరాలకే పరిమితమైంది. దీనిపై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా అసహనం వ్యక్తం చేశారు. కాగా, 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో వివిధ దేశాలనుంచి ఏకంగా 82 లక్షల ఆయిల్‌పాం మొలకలు తెప్పించారు. కానీ ఆ స్థాయిలో సాగు జరగలేదు. మరోవైపు కొందరు రైతులకు నాసిరకపు మొక్కలు ఇవ్వడంతో అనేకమంది రైతులు నష్టపోయారు. దీంతో ఆయిల్ ఫెడ్ దగ్గర ఇంకా 40 లక్షల మొక్కలు నర్సరీల్లో పేరుకుపోయాయి. భారీగా మొక్కలు తేవడంలోనే అక్రమాలు తలెత్తాయన్న ఆరోపణలు ఒకవైపు ఉండగా, వాటి నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీంతో వాటి నిర్వహణకు నెలకు రూ.50 లక్షల వరకు ఆయిల్‌ఫెడ్‌పై భారం పడుతోందన్న ఆరోపణలున్నాయి. ఇందులోనూ కొందరు అధికారులు అక్రమాలకు తెరలేపారన్న విమర్శలున్నాయి.

నాసిరకపు పల్లీ గింజలతో ఆయిల్?

ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో శివరాంపల్లిలో ఆయిల్ ప్యాకింగ్ యూనిట్ ఉంది. అందులో వివిధ రకాల నూనెలను ప్యాకింగ్ చేసి విజయ ఆయిల్ పేరుతో విక్రయాలు చేస్తుంటారు. అక్కడ పల్లీ నూనె గానుగ తీయడాన్ని ప్రారంభించారు. అయితే పల్లీ నూనె కల్తీ రాకుండా ఉండాలంటే పల్లీ గింజలు అత్యంత నాణ్యమైనవిగా ఉండాలి. అందులో పుచ్చిపోయినవి ఉంటే ఆ నూనె నాణ్యత దెబ్బతింటుందని, విషపూరితం కూడా అవుతుందని ఐఐసీటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. కానీ ఇక్కడ మాత్రం అనేకసార్లు నాసిరకపు పల్లీ గింజలను తీసుకొచ్చి గానుగ నూనె తీస్తున్నారని కొందరు అధికారులే అంటున్నారు. దీనిపై పర్యవేక్షణ కరువైంది.

నాలుగున్నరేళ్లయినా పాలకమండలి సమావేశమే లేదు..

మార్క్‌ఫెడ్‌లో ఇలా అడుగడుగునా అక్రమాలే రాజ్యమేలుతున్నాయి. అయినా అక్కడ చర్యలు ఉండవు. కేవలం లాబీయింగ్‌లే కనిపిస్తాయి. అక్కడ పాలకమండలి ఏర్పాటై నాలుగున్నరేళ్లు కావొస్తున్నా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించలేదు. దీనికి బాధ్యుడైన ఓ అధికారిని తొలగించాలని బోర్డు తీర్మానం చేసినా ఇప్పటి వరకు చర్య తీసుకోలేదు. ఆయనకు పైస్థాయిలో అండదండలున్నాయన్న ప్రచారం జరుగుతోంది.

టెస్కాబ్ తప్పుల తడకతో రైతులు బలి

తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) పరిధిలో రుణమాఫీకి సంబంధించి తప్పుల తడకలు వెలుగుచూశాయి. దీని ఆధ్వర్యంలో నడిచే జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (ప్యాక్స్)లు రుణమాఫీ డేటాను సక్రమంగా నిర్వహించకపోవడంతో వేల సంఖ్యలో రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోయారు. మొదట్లో ఒక్క ఖమ్మం డీసీసీబీ పరిధిలోనే లక్ష రూపాయల వరకు రుణమాఫీ అర్హత పొందని రైతులు లక్ష మంది ఉన్నారంటేనే ఎంత దారుణంగా తప్పులు జరిగాయో అర్థమవుతోంది. మరోవైపు అనేక ప్యాక్స్‌ల్లోని చైర్మన్లు రైతుల పేరు మీద పంట రుణాలు తీసుకున్నారు. దీంతో రైతులకు బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నాయి. వారిలో చాలామంది పేర్లను రుణమాఫీ జాబితాలో చేర్చకపోవడంతో రుణాలు తీర్చలేదంటూ రైతులపై బ్యాంకులు ఒత్తిడి చేస్తున్నాయి. ఇన్ని జరుగుతున్నా టెస్కాబ్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి,. ప్యాక్స్ చైర్మన్లు రైతుల పేర్లు పెట్టి రూ.కోట్ల రుణాలను అక్రమంగా పొందుతున్నా నోరు మెదపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆ అధికారులు ఏం చేస్తున్నట్టు?

అన్ని కార్పొరేషన్లపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని పలువురు అధికారులను పార్లమెంటు ఎన్నికలకు ముందు నియమించారు. కానీ ఇప్పటివరకూ ఎక్కడా ప్రక్షాళన మొదలుపెట్టకపోవడం గమనార్హం.

మార్క్‌ఫెడ్‌లో రూ.కోట్లు మాయమైనా.. లెక్క లేదు

- మార్క్‌ఫెడ్‌లో రూ.2 కోట్లకు పైగా మాయమైన విషయం ఇటీవల వెలుగు చూసింది. ఎరువులను అమ్మగా వచ్చిన సొమ్మును కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇతర అధికారులు కలిసి కాజేశారన్న ఆరోపణలున్నాయి. కరీంనగర్ జిల్లాలో రూ.60 లక్షలు మాయమైనట్లు నిర్ధారణ కాగా, ఇప్పుడు ఆ జిల్లాతోపాటు ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోనూ ఇటువంటి అక్రమాలు జరిగాయి. ఖమ్మం జిల్లాలో రూ.70 లక్షలు, నల్లగొండ జిల్లాలో రూ.50 లక్షలు, ఆదిలాబాద్ జిల్లాలో రూ.40 లక్షల వరకు మార్క్‌ఫెడ్ ఎరువుల సొమ్ము కొందరు ఉద్యోగులు కాజేశారు. అయితే కరీంనగర్‌లో విషయం బయటకు రావడంతో అక్కడి అధికారులపై చర్యలు చేపట్టారు. మిగిలిన జిల్లాల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి నోరుమెదపడంలేదు. దీనిపై విచారణ కమిటీని నియమించారు. అయితే వీటిని పర్యవేక్షించే అధికారినే విచారణ అధికారిగా నియమించడంపై విమర్శలు వస్తున్నాయి.
- మార్క్‌ఫెడ్‌లో గత సీజన్‌లో జొన్నలను రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేశారు. వాటిని గోదాముల నుంచి తిరిగి బయటి తెచ్చి మార్కెట్లో విక్రయించాల్సిన బాధ్యత మార్క్‌ఫెడ్ అధికారులపై ఉంది. కానీ 90 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి కూడా వాటిని గోదాముల్లోనే అద్దె చెల్లిస్తూ మార్క్‌ఫెడ్‌కు కొందరు అధికారులు నష్టం చేకూరుస్తున్నారు.
- వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లో పారదర్శకత ఉండదనేది ప్రధాన విమర్శ. గోదాముల్లో తరుగు పేరుతో జరిగే దందా రూ.కోట్లల్లో ఉంటుంది. ఈ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే జిల్లా మేనేజర్లుగా ఉండటం గమనార్హం. ఇలా ఉండటం వల్ల భారీగా అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. మరోవైపు ప్రైవేట్ గోదాములకు లబ్ధి జరిగే విధంగా ఇక్కడ నిర్ణయాలు జరుగుతున్నాయని, తద్వారా కమీషన్లు పుచ్చుకుంటున్నారన్న వాదనలు లేకపోలేదు.

పార్టీ నేత జిట్టాను పరామర్శించిన హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణరెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు జిట్టాకు అందుతున్న వైద్యం వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. జిట్టాను పరామర్శించిన వారిలో హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఇతర బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నస్పూర్ కౌన్సిలర్‌కు పరామర్శ

మంచిర్యాల ఎమ్మెల్యే వేధింపులు భరించలేక గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన నస్పూర్ మున్సిపల్ కౌన్సిలర్ బేర సత్యనారాయణను కూడా హరీశ్‌రావు పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

'కలుపు' మొక్కలూ కూరలే



సహజంగా పొలాల్లో లభించే ఆకుకూరల గురించి తెలుసుకుంటున్న సందర్శకులు

- ఆకు కూరలుగా ఉపయోగించుకోవచ్చు
- ప్రదర్శన ద్వారా సందర్శకులకు డీడీఎస్ అవగాహన

జహీరాబాద్: పంట పొలాల్లో వచ్చే కలుపు మొక్కలను తొలగించడం సహజమే. కానీ అవి కలుపు మొక్కలు కావని, ఆకు కూరలుగా ఉపయోగించుకోవచ్చని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) సభ్యులు సందర్శకులను పంట పొలాల్లో తిప్పి అవగాహన కల్పించారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బిడకన్నె గ్రామంలో పంట పొలాలను సందర్శించి పొలాల్లో సహజంగా లభించే ఆకు కూరలు, చిరు ధాన్యాల గురించి వివరించారు. అనంతరం జహీరాబాద్ మండలంలోని దిడిగి గ్రామంలోని కేవీకేలో వర్షాకాలంలో సహజంగా వచ్చే 40 రకాలకు పైగా ఆకుకూరలను ప్రదర్శించారు.ఆ ఆకు కూరల గురించి న్యూట్రిషన్ నిపుణులు, సైంటిస్ట్ సలోమి, అనుభవ రైతులు ఎం.చంద్రమ్మ, కె.మొగులమ్మ, ఎస్.నాగమ్మ, సంస్థ సభ్యులు మంజుల, మాణిక్యం, పెద్ద నర్సమ్మ, చిన్న నర్సమ్మ, అల్గోల్ నర్సమ్మ, రోజా, వెంకట్, సైంటిస్టులు రమేష్, శైలజ అవగాహన కల్పించారు. ఆకు కూరల గొప్పతనాన్ని పాటల రూపంలో మహిళలు పాడి ఆకట్టుకున్నారు. హైదరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చారు.

కలుపు మొక్కలుగా భావిస్తున్న వాటిలో కొన్ని

తుమ్మికూర, తల్లెలి, అడవిమెంతి, జొన్న చెంచేలి, అడవి సోయ, దొగ్గలి, బంకటి, ముల్లు దొగ్గలి, పెద్ద కాశ, ఎర్రకాశ, తెల్ల బచ్చలి, ఎర్ర పుండి, తెల్లపుండి, దుసరి, ఉత్తరేణి, చెన్నంగి, వామకూర, తగిరెంచ, తెల్లగర్జ, ఎర్రగర్జ, పాల పత్రం, చామగడ్డ, నాగ చెవిలి, సన్న వాయిలి, మునగకూర, గునుగు, ఎర్ర గునుగు, చిత్ర మలం, నాగలిచెవి, తడక దొగ్గలి, గంగ వాయిలి, చిన్న కాశ, గుర్మశి, పప్పుకూర, పిట్టకూర, చెన్నంగి, ఎన్నాద్రి, పుల్లకూర, ఎలుకచెవి అలం, అంగిబింగి, తెల్లవార్జం పువ్వు ఇలా అనేక రకాల ఆకు కూరలు వర్షాకాలంలో సహజంగా లభిస్తాయి.

రుచికరంగా వంటకాలు

పంట పొలాల్లో సహజంగా పెరిగే ఆకు కూరలతో రుచికరంగా వంటలు వండి సందర్శకులకు వడ్డించారు. పలు రకాల ఆకు కూరలను కలిపి, కొన్ని రకాల ఆకు కూరలను విడి విడిగా వండి పెట్టారు.

ఆకు కూరల్లో పోషక విలువలు..

ఆకు కూరలు ఆరోగ్య సంరక్షణలో ఎంతో ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి. దాదాపుగా అన్ని ఆకు కూరల్లో క్యాల్షియం, ఇనుము, కెరోటిన్, విటమిన్–సి, రైబో ఫ్లావిన్, పోలిక్ యాసిడ్, పీచు పదార్థాలు సమృద్ధిగా ఉంటాయి.



పంట చేలో సహజంగా వచ్చే ఆకు కూరలను, చిరుధాన్యాల పంటలను పరిశీలిస్తున్న సందర్శకులు

ఆరోగ్యాన్ని అందిస్తాయి



సహజంగా లభించే ఆకు కూరలు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయి. ఎలాంటి మందులు వాడకుండా రావడం వల్ల వాటిని భుజించడం ఎంతో ఉపయోగకరం. డీడీఎస్ సంస్థ వీటి ఉపయోగం గురించి అవగాహన కల్పించడం హర్షణీయం.– భూషణ్, ప్రొఫెసర్–మచిలీపట్నం


పండించి మార్కెట్లోకి తెస్తా



నేను 10 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తాను. సహజ ఆకు కూరల గురించి తెలుసుకునేందుకు ఈ ప్రదర్శనకు వచ్చాను. ఇక్కడ వాటి ప్రాధాన్యత గురించి తెలిసింది. ఇకపై సహజ ఆకు కూరలను మార్కెట్లో పరిచయం చేస్తా.

– అనంతలక్ష్మి, భానూర్

ఇన్ని రకాల గురించి ఇప్పుడే తెలిసింది



ఇక్కడకు వచ్చాకే ఇన్ని రకాల ఆకు కూరలుంటాయనే విషయం తెలిసింది. మూడు నాలుగు రకాల గురించే నాకు తెలిసేది. సహజ ఆకు కూరల గురించి అవగాహన పొందాను. పోషకాలు కూడా సమృద్ధిగా ఉండి, ఆరోగ్యాన్ని అందిస్తాయని తెలిసింది. వంటకాలు కూడా రుచికరంగా ఉన్నాయి.

– లహరి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, హైదరాబాద్

కోతులతో రూ. కోట్లలో పంట నష్టం

- ప్రతి ఏటా ఇదే బాధ
- నష్ట నివారణకు జగిత్యాలలో రైతుల కార్యాచరణ
- తలా కొంత డబ్బులు వేసుకుని కోతులను పట్టిస్తున్న గ్రామస్తులు
- పట్టుకున్న కోతులు అటవీ ప్రాంతానికి తరలింపు

జగిత్యాల అగ్రికల్చర్: రాష్ట్రంలో ఆ జిల్లా.. ఈ ప్రాంతం అనే తేడా లేకుండా రైతులను కోతుల బెడద తీవ్రంగా వేధిస్తోంది. రైతన్నలు రాత్రింబవళ్లు కష్టపడి పంట పండించడం ఒక ఎత్తయితే, ఆ పంటను ప్రస్తుతం కోతుల నుంచి కాపాడుకోవడం మరో ఎత్తుగా మారింది. రైతాంగం వరితో పాటు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, వేరుశనగ, అలిసెంత, మినుము, పెసర పంటలను సాగు చేయగా, ఆ పంటలు గింజ దశకు చేరుకునే స్థితిలో కోతులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు తమ పనులు విడిచిపెట్టి కట్టెలు పట్టుకుని పంటకు కాపాలా వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. లేదంటే, కోతుల బెడదతో రైతులు తమ పంట చేలను బీళ్లుగా ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే అతిశయోక్తి కాదు. ఒక్క జగిత్యాల జిల్లాలోనే కోతుల వల్ల ప్రతి ఏడాది రూ.100 కోట్ల వరకు పంట నష్టం జరుగుతోందని ఓ అంచనా అంటే వాస్తవ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కోతులకు ఆపరేషన్లు ఉత్తుత్తిదే..

కోతులకు సహజ ఆహారమైన కాయలు, పండ్లను అందించే చెట్లు భారీగా తగ్గాయి. మరోవైపు అడవులు తగ్గిపోవడం, ఉన్న అడవుల్లోనూ పరిమిత ఆహారం, నీరు దొరకని స్థితి, కఠినమైన పరిస్థితుల వల్ల వాటి సంతతి అంతగా వృద్ధి చెందడం లేదు. దీంతో అవి జనావాసాలు, రైతులు సాగు చేసే పంట పొలాల్లోకి వస్తున్నాయి. పంట పొలాల్లో కోతులకు తేలిగ్గా ఆహారం దొరుకుతుంది. దీంతో వాటి సంతతి విపరీతంగా పెరుగుతోంది. జగిత్యాల జిల్లాలోనే పదేళ్లలో కోతులు కనీసం ఐదు రెట్లు తమ సంతతిని వృద్ధి చేసుకున్నాయని ఓ లెక్క. ఇక కోతుల జనాభాను నియంత్రించేందుకు వాటిని పట్టుకుని కుటుంబ నియంత్రణ చికిత్సలు చేస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ ఆచరణలో సరైన ఫలితాలు రావడం లేదు.



రైతుల తోటల్లో బోనులో చిక్కిన కోతులు

లక్ష్మీపూర్ గ్రామస్తుల ఐక్య కార్యాచరణ

కోతుల వల్ల పంట నష్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నప్పటికీ ఇంతవరకూ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ రైతులు కోతుల బెడదపై గత కొన్నేళ్లుగా దృష్టి పెట్టారు. గతంలో రైతులు ఖర్చు పెట్టి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినప్పటికి కోతులు వాటిపై నుంచి దూకి, పంటను నాశనం చేసేవి. ఆ తర్వాత కోతులను తరిమేందుకు కుక్కలను పెంచారు. అయినప్పటికీ పెద్దగా ఫలితం కనపడలేదు. దీంతో గ్రామ రైతులంతా కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు. కోతులు పట్టేవారిని రప్పించి, ఒక్కో కోతిని పట్టుకుంటే రూ.350 ఇవ్వాలని నిర్ణయించారు. సాగు చేస్తున్న భూములవారీగా రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారు.

ఎరవేసి కోతులను పడుతూ..

కోతులను పట్టడంలో అనుభవం ఉన్న ఓ పది మందిని నెల రోజుల క్రితం గ్రామానికి రప్పించారు. వీరు గ్రామానికి నాలుగు దిక్కులా బోన్లు ఏర్పాటు చేశారు. కోతులకు ఎరగా వేరుశనగ పొట్టు, కూరగాయలు, పండ్లు వంటివి వేస్తున్నారు. బోన్లలో చిక్కిన కోతులను వాహనంలో రాత్రికి రాత్రి 200 కి.మీ దూరంలో ఉండే అడవి ప్రాంతానికి తరలించి అక్కడ వదిలేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 2 వేల కోతులను పట్టుకుని అడవిలో వదిలేసినట్టు చెబుతున్నారు.

విత్తనం వేసినప్పటి నుంచి కాపలా



రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. ఇప్పటికే నెల రోజుల నుంచి కోతులు రాకుండా ప్రతి రోజూ కాపలా ఉంటున్నాం. ఇప్పుడే పంట గింజ దశకు చేరుకుంటోంది. ఒక్క రోజు కాపలా లేకపోతే పంటను నాశనం చేస్తున్నాయి. – సంగెపు జీవన్ రెడ్డి, లక్ష్మీపూర్

అటవీ ప్రాంతానికి తరలిస్తున్నాం



కోతులతో మొక్కజొన్న, వేరుశెనగ పంట ధ్వంసం అవుతున్నాయి. దీంతో గ్రామస్తులందరం డబ్బులు పోగేసుకుని కోతులను పట్టిస్తున్నాం. ఇప్పటివరకు 2 వేల కోతులను పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించాం.

– ఏనుగు గంగారెడ్డి, లక్ష్మీపూర్

అడ్మిషన్స్

కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)-2024

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోర్సులు చదివేందుకు కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ విడుదలైంది.

» **దేశవ్యాప్తంగా ఉన్న ఐఐఎంలు:** అహ్మదాబాద్, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్‌గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్మూ, కాశీపూర్, కోజికోడ్, లక్నో, ముంబై, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అర్హులే.

» **ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్. ఈ ఏడాది దేశవ్యాప్తంగా మొత్తం 170 నగరాల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

» **పరీక్ష విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రెహెన్షన్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి.

» **ఎంపిక విధానం:** పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది:** 01.08.2024.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేది:** 13.09.2024.
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** 05.11.2024 నుంచి 24.11.2024.
» **క్యాట్ పరీక్ష తేది:** 24.11.2024.
» **ఫలితాల ప్రకటన తేది:** 2025 జనవరి రెండో వారం.
» **వెబ్‌సైట్:** https://www.iimcat.ac.in

కరెంట్ అఫైర్స్

జాతీయం

రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్ - 2024

భారత ప్రభుత్వం మొట్టమొదటి అత్యున్నత సైన్స్ పురస్కారాలను అందజేసింది. ప్రఖ్యాత బయోకెమిస్ట్, బెంగుళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్ గోవిందరాజన్ పద్మనాభన్‌ను విజ్ఞాన రత్న అవార్డుతో సత్కరించారు. రాష్ట్రపతిభవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాన్ని ఆగస్టు 22న అందజేశారు. 13 విజ్ఞాన్ శ్రీ పురస్కార్, 18 విజ్ఞాన్ యువ -శాంతి స్వరూప్ భట్నాగర్ ప్రైజ్‌లు, ఒక విజ్ఞాన్ టీమ్ అవార్డును కూడా రాష్ట్రపతి అందజేశారు. చంద్రయాన్-3 మిషన్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందానికి విజ్ఞాన్ టీమ్ అవార్డు దక్కింది. ప్రాజెక్టు డైరెక్టర్ పీ వీరముత్తువేల్ ఆ అవార్డును అందుకున్నారు. అవార్డు గ్రహీతలందరికీ ఓ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు.

పార్లమెంటరీ కమిటీల నియామకం

అత్యంత కీలకమైన ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) ఛైర్మన్ గా కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ నియమితులయ్యారు. లోక్ సభ సభ్యులు 15 మంది, రాజ్యసభ సభ్యులు ఏడు గురితో కూడిన ఈ కమిటీకి ఆయన నేతృత్వం వహిస్తారు. అంచనాల కమిటీకి డాక్టర్ సంజయ్ జైస్వాల్, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీకి బైజయంత్ పాండా కమిటీకి డాక్టర్ ఫగ్గాన్ సింగ్ కులాస్తే, ఓబీసీలపై కమిటీకి గణేష్ సింగ్ లను లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా నియమించారు.

కోల్ కతా హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించనుంది.

జన్‌పోషణ్ కేంద్రాలుగా రేషన్‌షాపులు

రేషన్ దుకాణాలను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చే పైలట్ ప్రాజెక్ట్‌ను కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆగస్టు 20న ప్రారంభించారు. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ లో పైలట్ ప్రాజెక్టు కింద 60 రేషన్ షాపులను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చనున్నట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్ట్ అమలయ్యే షాపుల్లో ఇకపై చిరు ధాన్యాలు, పప్పులు, పాల ఉత్పత్తులు, నిత్యావసరాలు అమ్మవచ్చు. అందరూ లాభపడేలా ఈ మార్పు ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు.

ప్రపంచంలో తొలి పోర్టబుల్ హాస్పిటల్

భారత ఆర్మీ, వాయుసేన సంయుక్తంగా ఒక ప్రతిష్ఠాత్మక ఆపరేషన్ చేపట్టాయి. ప్రపంచంలోనే మొదటి 'పోర్టబుల్ హాస్పిటల్'ను విజయవంతంగా ఒక మారుమూల ప్రాంతానికి డెలివరీ చేశాయి. సొంతంగా తయారు చేసిన ఈ పోర్టబుల్ హాస్పిటల్‌ను 15 వేల అడుగుల ఎత్తు నుంచి ఐఏఎఫ్‌కు చెందిన రవాణా విమానం ద్వారా అనుకొన్న లక్షిత ప్రాంతంలో ప్యారాచూట్ సాయంతో జారవిడిచినట్టు రక్షణ శాఖ వర్గాలు శనివారం వెల్లడించాయి.

156 ఫిక్స్‌డ్ డోస్ మందులపై కేంద్రం నిషేధం

156 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) మందులపై కేంద్రం నిషేధం విధించింది. జ్వరం, జలుబు, అలెర్జీలు, నొప్పుల కోసం ఉపయోగించే యాంటీబ్యాక్టీరియల్ మందులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. వీటి వల్ల హాని జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. సురక్షితమైన ప్రత్యామ్నాయ మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్రం జారీ చేసింది. రెండు లేదా మూడు క్రియాశీలక ఔషధ పదార్థాలు నిర్దిష్ట నిష్పత్తిలో ఉండే మందులను ఎఫ్‌డీసీ మందులు అంటారు. వీటిని కాక్‌టెయిల్ డ్రగ్స్ అని కూడా పిలుస్తారు. నొప్పుల నుంచి ఉపశమనం కోసం ఉపయోగించే అసెక్లోఫెనాక్ 50 ఎంజీ+పారాసిటమాల్ 125 ఎంజీ ట్యాబ్లెట్ కాంబినేషన్‌కూడా నిషేధానికి గురైన ఎఫ్‌డీసీ మందుల జాబితాలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ ఈ ఎఫ్‌డీసీలను అధ్యయనం చేసి, ఇవి అహేతుకమైనవని చెప్పిందని ఈ నోటిఫికేషన్‌పేర్కొంది.

అంతర్జాతీయం

బోట్స్‌వానా గనిలో 2,492 క్యారెట్ల భారీ వజ్రం

బోట్స్‌వానాలోని సుప్రసిద్ధ వజ్రాల గని కరోవేలో భారీ వజ్రం దొరికింది. దీని బరువు 2,492 క్యారెట్లు అని ఆ దేశ ప్రభుత్వం తెలిపింది. దీనిని ఎక్స్-రే టెక్నాలజీ సహాయంతో గుర్తించినట్లు కెనడియన్‌మైనింగ్ కంపెనీ లుకారా డైమండ్ కార్పొరేషన్ తెలిపింది. ఇది అత్యధిక నాణ్యత కలిగిన వజ్రం అని వివరించింది. దక్షిణాఫ్రికాలో 1905లో 3,106 క్యారెట్ల కలినన్ వజ్రం దొరికిందని, ఆ తర్వాత దొరికిన అతి పెద్ద వజ్రం ఇదేనని పేర్కొంది. కలినన్ వజ్రాన్ని జెమ్స్‌గా ముక్కలు చేశారని, వీటిలో కొన్ని జెమ్స్ బ్రిటిష్ క్రౌన్ ఆభరణాల్లో ఉన్నాయని తెలిపింది. వజ్రాలు అధికంగా దొరికే దేశాల్లో బోట్స్‌వానా రెండోది. ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచంలోని అతి పెద్ద వజ్రాలన్నీ ఇక్కడ దొరికినవే కావడం విశేషం. కరోవే గనిలో 2019లో దొరికిన 1,758క్యారట్ల సెవెలో వజ్రం ఇప్పటి వరకు రెండో అతి పెద్ద వజ్రంగా రికార్డుల్లో ఉండేది.

చంద్రుడి ఉపరితలం శిలాద్రవ సముద్రమేనని ధ్రువీకరించిన చంద్రయాన్-3

చంద్రుడి ఉపరితలం మొత్తం ఒకప్పుడు శిలాద్రవ సముద్రమే అనే వాదనను ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 డాటా సైతం ధ్రువీకరించింది. ఈ మేరకు అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీతో పాటు పలు సంస్థలకు చెందిన అధ్యయనం వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. గతంలో నాసాకు చెందిన అపోలో, సోవియెట్ యూనియన్ కు చెందిన లూనా చంద్రుడి నాడీమండల, మధ్య అక్షాంశ ప్రాంతాల నమూనాలను సేకరించాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత చంద్రుడిపై ఒకప్పుడు శిలాద్రవం ఉండేదనే అభిప్రాయానికి శాస్త్రవేత్తలు వచ్చారు. అయితే, చంద్రయాన్ -3లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ మాత్రం చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి డాటాను పంపించింది. ఈ డాటాను అధ్యయనం చేసిన పరిశోధకులు దక్షిణ ధ్రువంపై కూడా శిలాద్రవమే ఉండేదని గుర్తించారు. అంతేకాదు, చంద్రుడి ఉపరితలం మొత్తం ఫెర్రోన్ అనార్థోసైట్(ఎఫ్ఏఎన్) అనే ఒకే రకమైన రాయితో ఏర్పడిందని సైతం పరిశోధకులు గుర్తించారు. శాస్త్రవేత్తల ఊహిస్తున్న దాని ప్రకారం.. రెండు ప్రోటోప్లానెట్లు ఢీకొనడం వల్ల చంద్రుడు ఏర్పడ్డాడు. ఫలితంగా చంద్రుడు చాలా వేడిగా మారిపోయాడని, వేడికి ఉపరితలం కరిగి శిలాద్రవ సముద్రంగా మారిందని పరిశోధకులు తెలిపారు.

భారత్, మలేషియా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

భారత్, మలేషియా మధ్య సంబంధాలను మరింత మెరుగుపర్చుకొనే దిశగా వెళ్లనున్నాయి. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆగస్టు 20వ తేదీ ఢిల్లీలో విస్తృత స్థాయి చర్చలు నిర్వహించారు. వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ తదితర కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు చేశారు. డిజిటల్ టెక్నాలజీతో సహకారంతోపాటు స్టార్టప్ వ్యవస్థ అనుసంధానానికి డిజిటల్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. మలేషియాలోని 'యూనివర్సిటీ ఆఫ్ టుంకూ అబ్దుల్ రెహ్మన్'లో ఆయుర్వేద విభాగాన్ని, యూనివర్సిటీ ఆఫ్ మలయాలో తిరువళ్లువర్ విభాగాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.



గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం

వార్తల్లో వ్యక్తులు

ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాంకర్‌గా ఆర్‌బీఐ గవర్నర్

ప్రపంచంలోని సెంట్రల్ బ్యాంకు గవర్నర్లలో భారతీయ రిజర్వ్ బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ అత్యుత్తమ బ్యాంకర్‌గా నిలిచారు. అంతర్జాతీయ స్థాయిలో దాస్ ఈ గుర్తింపు పొందడం ఇది వరుసగా రెండోసారి. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజీన్ తాజాగా సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లకు ర్యాంకులు ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మరోసారి అగ్రస్థానంలో నిలిచారు.

ఆర్మీ మాజీ చీఫ్ పద్మనాభన్ కన్నుమూత

భారత సైన్యం మాజీ చీఫ్ జనరల్ సుందరరాజన్‌పద్మనాభన్(83) ఆగస్టు 19న వృద్ధాప్య కారణాల వల్ల తుది శ్వాస విడిచారు. ఆయన 2000 సెప్టెంబరు 30 నుంచి 2002 డిసెంబరు 31 వరకు ఆర్మీ చీఫ్‌గా పని చేశారు. 15 కోర్ కమాండర్‌గా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అతి విశిష్ట సేవా పతకాన్ని ప్రభుత్వం ప్రదానం చేసింది.

ప్రపంచంలోనే వృద్ధ మహిళ కన్నుమూత

ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళగా భావిస్తున్న స్పెయిన్‌కు చెందిన మరియా బ్రన్‌యాస్(117) కన్నుమూశారు. తన మరణంతో జపాన్‌కు చెందిన 116 ఏళ్ల టొమికో ఇటుకా ఇపుడు ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా నిలిచారు.

గుండెపోటుతో కోస్ట్ గార్డ్ డీజీ రాకేశ్ పాల్ మృతి

ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్ ఆగస్టు 18 న చెన్నైలో గుండెపోటుతో మరణించారు. ఆయన మరణం పట్ల రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్.. 'సమర్థవంతమైన, నిబద్ధత గల అధికారి' అని పేర్కొన్నారు.

క్రీడలు

మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదల

2025 మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్ ని ఐసీసీ (ICC) విడుదల చేసింది. ఈ టోర్నీకి మలేసియా ఆతిథ్యం ఇవ్వనుంది. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఈ పొట్టి కప్ జరగనుంది. మొత్తం 41 మ్యాచ్ లు నిర్వహిస్తారు. 16 జట్లను నాలుగు గ్రూప్ లుగా విభజించారు.

అరబ్ దేశంలో మహిళల వరల్డ్ కప్

మహిళల టీ20 వరల్డ్ కప్ నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అందరూ అనుకున్నట్టే ప్రపంచ కప్ వేదిక మారింది. బంగ్లాదేశ్ లో ఆందోళనకర పరిస్థితుల దృష్ట్యా మెగా టోర్నీని యూఏఈలో జరిపేందుకు ఐసీసీ సిద్ధమైంది. అక్టోబర్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు యూఏఈలో వరల్డ్ కప్ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించింది.

పతాకధారులుగా సుమిత్, భాగ్యశ్రీ

ఆగస్టు 28 నుంచి మొదలయ్యే పారాలింపిక్స్‌లో ప్రారంభ వేడుకలకు భారత్ నుంచి పతాకధారులుగా సుమిత్ అంతిల్, భాగ్యశ్రీ జాదవ్ ఎంపికయ్యారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న ఈ ఇద్దరూ ఆరంభోత్సవ వేడుకల్లో పతాకధారులుగా వ్యవహరిస్తారని పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) చీఫ్ దేవేంద్ర ఝఝారియా ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 దాకా పారిస్ వేదికగా జరుగబోయే ఈ క్రీడలకు భారత్ 84 మంది అథ్లెట్లతో బరిలోకి దిగుతోంది.

లాసానే డైమండ్ లీగ్.. రెండో స్థానంలో నీరజ్ చోప్రా

లాసానే డైమండ్ లీగ్‌లో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. ఆగస్ట్ 23న జరిగిన ఈవెంట్‌లో ఆరో ప్రయత్నంలో నీరజ్ తన జావెలిన్‌ను 89.49 మీటర్ల దూరం విసిరాడు. ఈ సీజన్‌లో నీరజ్‌కు ఇదే బెస్ట్ త్రో. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ తన జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరాడు. 2022లో స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 89.94 మీటర్ల దూరం విసిరాడు. ఇదే అతని కెరీర్‌లో బెస్ట్ త్రో. గ్రెనిడాకు చెందిన అండర్సన్ పీటర్స్ ఈ సీజన్‌లో మీట్ రికార్డు క్రియేట్ చేశాడు. అతను 90.61 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. జర్మనీకి చెందిన జులియన్ వెబర్ 87.08 మీటర్ల దూరం విరిసి మూడవ స్థానంలో నిలిచాడు.

కన్నింగ్ హోమ్ నిర్వచనంలో కళాకారుడు?



డీఎస్సీ - ప్రత్యేకం
సైన్స్ మెథడాలజీ (ఎస్ఏ & ఎస్‌జీటీ)

విజ్ఞాన శాస్త్ర పాఠ్య ప్రణాళిక

1. కరీర్ అనే లాటిన్ పదానికి అర్థం?
   1) పందెపు బాట 2) పరుగెత్తే గుర్రం
   3) నేర్చుకునే విధానం 4) ప్రణాళిక
2. ఉపాధ్యాయుడు పాఠశాలలో నిర్వహించే కృత్యాల కార్యక్రమమే పాఠ్య ప్రణాళిక అని తెలిపినవారు?
   1) స్పియర్స్ 2) కన్నింగ్ హోమ్
   3) హిరస్ట్, పీటర్స్ 4) బ్లూమ్స్
3. పాఠశాల అనే స్టూడియోలో తన అభిరుచికి అనుగుణంగా మెటీరియల్‌ను మలచడానికి కళాకారుడు ఉపయోగించే సాధనం కరిక్యులం అని తెలిపినవారు?
   1) హిరస్ట్, పీటర్స్ 2) బ్లూమ్స్
   3) స్పియర్స్ 4) కన్నింగ్ హోమ్
4. ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించే కృత్యాల సముదాయమే విద్యా ప్రణాళిక అని తెలిపినవారు?
   1) హెర్బర్ట్ 2) బ్లూమ్స్
   3) స్పియర్స్ 4) పీటర్స్
5. ప్రాచీన కాలంలో కరిక్యులం దేనికి పరిమితమైంది?
   1) విషయ విజ్ఞానం, పాఠ్యేతర కార్యక్రమాలు
   2) విషయజ్ఞానానికి
   3) సహపాఠ్య కార్యక్రమాలకు
   4) క్షేత్ర పర్యటనలకు
6. విషయజ్ఞానంతోపాటు, సహ పాఠ్య ప్రణాళికా కార్యక్రమాలు కూడా ఇమిడి ఉండేది?
   1) సిలబస్ 2) కరిక్యులం
   3) బోధన పద్ధతి 4) మూల్యాంకనం
7. పాఠ్యప్రణాళిక రూపొందించేటప్పుడు అభ్యాసకుడి స్వభావం, విషయ స్వభావం, సమాజ స్వభావం అనే మూడు అంశాలను పరిగణించాలని సూచించినవారు?
   1) డబ్ల్యూజే జాకబ్‌సన్
   2) కన్నింగ్ హోమ్
   3) రిచర్డ్‌సన్ 4) స్పియర్స్
8. పాఠ్యప్రణాళిక రచనలో కిందివాటిలో పరిగణనలోకి తీసుకోని అంశం?
   1) సమాజ అవసరాలు
   2) కోర్సు స్వభావ లక్ష్యాలు
   3) సహ సంబంధం
   4) ఏవీకావు
9. జాతీయ విద్యావిధానం(1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాల్సిన పది మౌలిక అంశాల్లో కిందివాటిలో ఏది జీవ శాస్త్రానికి సంబంధించింది?
   1) రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, బాధ్యతలు
   2) సమానత్వం,ప్రజాస్వామ్యం, సామ్యవాదం
   3) భారతీయ సంస్కృతి
   4) చిన్నకుటుంబ భావన
10. ప్రాథమిక భావాల అవగాహనకు కనీస సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు తప్పనిసరిగా అభ్యసించాల్సిన విషయాలను ఏమంటారు?
    1) పాఠ్యప్రణాళిక 2) మూల పాఠ్యప్రణాళిక
    3) లోపభూయిష్ట పాఠ్యప్రణాళిక
    4) ఉత్తమ పాఠ్యప్రణాళిక
11. ప్రజాస్వామ్య సమాజంలో సమర్థంగా జీవించడానికి కొన్ని ప్రవర్తనా సామర్థ్యాలు అత్యావశ్యకం. ఈ ప్రవర్తనా సామర్థ్యాలను వృద్ధిచేసే అనుభవాల సమూహమే?
    1) సిలబస్ 2) పాఠ్యప్రణాళిక
    3) మూల పాఠ్యప్రణాళిక
    4) సహ పాఠ్యపథకం
12. కింది వాటిలో ఏది ప్రస్తుత పాఠ్య ప్రణాళికలోని లోపం?
    1) ఎక్కువ సంఖ్యలో పాఠ్యాంశాల వల్ల లోతు తగ్గుతుంది
    2) వైయక్తిక భేదాలను అనుసరించి ఉంది
    3) పాఠ్యాంశాల చుట్టూ కేంద్రితమై లేదు
    4) నిజ జీవితానికి దగ్గరగా ఉంది
13. పాఠ్య ప్రణాళికలో సాంకేతిక, వృత్తి విద్యా సంబంధ విషయాలు లేవు అనే లోపాన్ని సూచించింది?
    1) జాతీయ విద్యా కమిషన్
    2) ప్రాథమిక విద్యా కమిషన్
    3) కొఠారి కమిషన్
    4) మాధ్యమిక విద్యా కమిషన్
14. పాఠ్యప్రణాళిక జ్ఞాన విస్ఫోటానికి అనుగుణంగా సరిదిద్దకపోవడం అనేది ఎవరు సూచించిన లోపం?
    1) మాధ్యమిక విద్యా కమిషన్
    2) కొఠారి కమిషన్
    3) మొదలియార్ కమిషన్
    4) ఏదీకాదు
15. దేశమంతా ఒకే మౌలిక ప్రణాళిక ఉండాలని.. 80% ఒకేలా, 20% స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉండాలని సూచించింది?
    1) మాధ్యమిక కమిషన్
    2) కొఠారి కమిషన్
    3) నూతన జాతీయ విద్యావిధానం
    4) రాధాకృష్ణన్ కమిషన్
16. 'భవిష్యత్తులో సమర్థమైన జీవనానికి, తగిన వృత్తిని ఎంచుకోవడానికి తగిన పునాది పాఠ్య ప్రణాళికలో ఇమిడి ఉండాలి' దీన్ని తెలిపే పాఠ్య ప్రణాళిక నిర్మాణ సూత్రం?
    1) సృజనాత్మక సూత్రం
    2) సమాజ కేంద్రీకృత సూత్రం
    3) సమైక్యతా సూత్రం
    4) దూరదృష్టి సూత్రం
17. 'పాఠ్యప్రణాళికలో విద్యార్థులను ఇమడ్చడం కాకుండా, విద్యార్థుల కోసం పాఠ్యప్రణాళిక అభివృద్ధి చెందాలి' అని తెలిపినవారు?
    1) బ్లూమ్స్ 2) బ్రూబేకర్
    3) మొదలియర్ 4) కొఠారి
18. ఒకే శీర్షికకు సంబంధించిన విషయాన్ని అంచెలంచెలుగా పాఠ్యప్రణాళికలో అభివృద్ధి చెందించే పద్ధతి?
    1) ఏక కేంద్రక పద్ధతి
    2) అంశాల పద్ధతి
    3) ప్రక్రియ పద్ధతి
    4) శాఖాంతర పద్ధతి
19. విజ్ఞాన శాస్త్ర విషయాలను శాఖలుగా విభజించకుండా, అంశాలుగా విభజించడం వల్ల అన్ని శాఖల విజ్ఞానం పొందుపర్చే పద్ధతి?
    1) ఏకకేంద్రక పద్ధతి
    2) అంశాల పద్ధతి లేదా శీర్షిక విధానం
    3) ప్రక్రియ పద్ధతి
    4) భావన పద్ధతి
20. పాఠ్యప్రణాళికలో కాంతి అధ్యయనం, వాతావరణం అనే అంశాలు ఏ కోవకు చెందినవి?
    1) పరిసర కేంద్రిత అంశాలు
    2) జీవన కేంద్రిత అంశాలు
    3) పరిసర, జీవన కేంద్రిత అంశాలు
    4) పైవేవీకావు
21. ప్రక్రియ పద్ధతిలో ఉత్పత్తి కంటే ప్రక్రియకు ప్రాధాన్యత ఉంది. దీనికి ఉదాహరణగా అమెరికాలో 1962-68లో దేన్ని అమలు చేశారు?
    1) SAPA 2) NASA
    3) COPES 4) SUPW
22. అమెరికాలో ప్రవేశపెట్టిన COPES (Conceptually Oriented Program in Science) ఆధారంగా అభివృద్ధి చెందిన పద్ధతి?
    1) ఏకకేంద్రక పద్ధతి 2) శీర్షిక విధానం
    3) ప్రక్రియ పద్ధతి 4) భావన పద్ధతి
23. వస్తువులు మండేటప్పుడు ఏం జరుగుతుంది? అనే అంశం చుట్టూ ఆక్సిడేషన్ అనే రసాయన శాస్త్ర విషయం, శ్వాసక్రియ అనే జీవశాస్త్ర విషయం, ఉష్ణం అనే భౌతిక శాస్త్ర విషయాలను చెప్పడం?
    1) శీర్షిక విధానం 2) ప్రక్రియ పద్ధతి
    3) సమైక్య, శాఖాంతర పద్ధతి
    4) భావన పద్ధతి
24. కిరణజన్య సంయోగక్రియ గురించిన విషయాల కోసం హిల్ గురించి అధ్యయనం చేయడం ఏ పద్ధతిని సూచిస్తుంది?
    1) ప్రక్రియ పద్ధతి 2) చారిత్రక పద్ధతి
    3) భావన పద్ధతి 4) సమైక్య పద్ధతి
25. పాఠ్యపుస్తకం అనేది ముద్రిత రూపంలో ఉండి తరగతి గదిలో ఉపయోగించే మౌలిక బోధనోపకరణం అని తెలిపిన వారు?
    1) జాకబ్‌సన్ 2) సింప్సన్
    3) పియర్స్ 4) బ్లూమ్స్
26. 'తరగతి స్థాయికి తగినట్లుగా అక్షరాలు ముద్రించాలి' ఇది పాఠ్యపుస్తకం ఏ లక్షణం?
    1) గ్రంథ రచయిత 2) భాషాశైలి
    3) భౌతిక లక్షణాలు
    4) అంతర్గత లక్షణం
27. వోగెల్ స్పాట్‌చెక్ ఇవాల్యుయేషన్ స్కేల్ దేని మూల్యాంకనానికి ఉపయోగపడుతుంది?
    1) బోధన పద్ధతి 2) లక్ష్యాలు
    3) బోధనోపకరణాలు
    4) పాఠ్యపుస్తకం
28. పాఠ్య ప్రణాళిక నిర్మాణ సూత్రాల్లో పరిరక్షణ సూత్రం దేనికి సంబంధించింది?
    1) సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ
    2) సిద్ధాంతాల పరిరక్షణ
    3) బోధన పద్ధతుల పరిరక్షణ
    4) బోధనాపరికరాల పరిరక్షణ
29. 'మనం తినే ఆహారం' అనే పాఠ్యాంశం ఏ విభాగానికి చెందిన అంశం?
    1) పరిసర కేంద్రిత 2) జీవన కేంద్రిత
    3) పరిసర - జీవన కేంద్రిత
    4) ఉపాధ్యాయ కేంద్రిత
30. వివిధ పాఠ్యప్రణాళికలో కృత్యాల వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని విభజించిన యూనిట్‌లను ఏమంటారు?
    1) పాఠ్యవిషయ యూనిట్
    2) బోధన యూనిట్
    3) అనుభవ యూనిట్
    4) మూలాధార యూనిట్
31. లోలకం ఊగడం భూకేంద్రక ఆకర్షణకు లోబడి ఉంటుంది. ఇది జీవశాస్త్రంలోని ఏ అంశానికి సంబంధం కలిగి ఉంది?
    1) కిరణజన్య సంయోగక్రియ
    2) జంతువుల పెరుగుదల
    3) మొక్కల పెరుగుదల దశలు
    4) అయస్కాంతత్వం
32. జాతీయ విద్యావిధానం (1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాలని ప్రతిపాదించిన 10 మౌలిక అంశాల్లో జీవశాస్త్ర సంబంధిత అంశాల సంఖ్య?
    1) 6 2) 3 3) 4 4) 8
33. 'ప్రతి ఒక్కరికి అన్ని శాస్త్రాల్లో కనీస పరిజ్ఞానం అవసరం' అనే విషయంపై ఆధారపడి నిర్మించింది?
    1) మూల పాఠ్య ప్రణాళిక
    2) సహ పాఠ్య ప్రణాళిక
    3) పాఠ్యేతర పాఠ్య ప్రణాళిక
    4) విషయ ప్రణాళిక
34. కన్నింగ్ హోమ్ నిర్వచనంలో కళాకారుడు?
    1) విద్యార్థి 2) విద్యార్థి తండ్రి
    3) ఉపాధ్యాయుడు
    4) విద్యాశాఖాధికారి
35. తరగతి గదిలో, ప్రయోగశాలలో, ఆటస్థలంలో, వర్క్‌షాప్‌లో అనేక కృత్యాల అనుభవాల సమస్తం?
    1) విషయ ప్రణాళిక 2) పాఠ్యపుస్తకం
    3) ప్రయోగాలు 4) పాఠ్యప్రణాళిక
36. గణిత పరిభాషలో చెప్పాలంటే ఏది పాఠ్య ప్రణాళికకు ఉప సమితి?
    1) టైం టేబుల్ 2) పాఠ్యపుస్తకం
    3) సిలబస్ 4) తరగతి గది
37. ఏ శాస్త్రవేత్త పాఠ్య ప్రణాళిక రూపొందించేటప్పుడు అభ్యాసకుడి స్వభావం, విషయ స్వభావం, సహజ స్వభావాన్ని పరిగణించాలి అని తెలిపారు?
    1) జాకబ్‌సన్ 2) బీఎస్ బ్లూమ్స్
    3) హిరస్ట్, పీటర్స్ 4) స్పియర్స్
38. జీవశాస్త్ర పాఠ్యప్రణాళిక రచనకు కావాల్సిన అంశాల గురించి వివరిస్తూ ఎడ్వర్డ్ విక్టర్ తెలిపిన అంశాల్లో లేనిది?
    1) మూల్యాంకనం 2) సమతూకం
    3) బోధన సామగ్రి
    4) ఉపాధ్యాయుడి సామర్థ్యం
39. పాఠ్య ప్రణాళికలోని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే కింది వాటిలో సరికాని ప్రవచనం?
    1) పాఠ్యప్రణాళిక సహజ అభివృద్ధికి తోడ్పడేదిగా ఉండాలి
    2) పాఠ్యప్రణాళిక సమస్యా పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
    3) పాఠ్యప్రణాళిక ఇతర సబ్జెక్టుల్లో సహ సంబంధాన్ని నెలకొల్పేదిగా ఉండాలి
    4) పాఠ్యప్రణాళిక విద్యార్థుల తల్లిదండ్రుల అభిరుచులకు తగినట్టుగా ఉండాలి
40. పాఠ్యప్రణాళికకు సంబంధించిన అంశాలలో 'సహ సంబంధం' అంటే వేటి మధ్య సహ సంబంధం?
    1) విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య
    2) సబ్జెక్టుల మధ్య
    3) తరగతి గది - ప్రయోగశాల మధ్య
    4) విద్యార్థి- విద్యార్థికి మధ్య
41. పాఠ్యప్రణాళికలోని కృత్యాలు ఏ విధంగా ఉండాలి?
    1) విద్యార్థులందరికీ ఒకేలా ఉండాలి
    2) విద్యార్థులకు కష్టంగా ఉండాలి
    3) ఉపాధ్యాయుడి అభిరుచులకు అనుగుణంగా ఉండాలి
    4) విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా ఉండాలి
42. విద్యా ప్రణాళికలో జాతీయ విద్యావిధానం (1986) ఎన్ని మౌలిక అంశాలను పొందుపర్చాలని సూచించింది?
    1) 12 2) 15 3) 10 4) 6
43. జాతీయ విద్యావిధానం (1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాలని సూచించిన 10 అంశాల్లో జీవశాస్త్రానికి సంబంధించింది?
    1) జాతీయ భావన వికాసం
    2) స్త్రీ, పురుష సమానత్వం
    3) చిన్న కుటుంబ భావన
    4) సాంఘిక సమానత్వం

సమాధానాలు

1) 1;	2) 3;	3) 4;	4) 3;
5) 2;	6) 2;	7) 1;	8) 4;
9) 4;	10) 2;	11) 3;	12) 1;
13) 4;	14) 2;	15) 3;	16) 4;
17) 2;	18) 1;	19) 2;	20) 1;
21) 3;	22) 3;	23) 3;	24) 2;
25) 2;	26) 3;	27) 4;	28) 1;
29) 2;	30) 3;	31) 3;	32) 2;
33) 1;	34) 3;	35) 4;	36) 3;
37) 1;	38) 4;	39) 4;	40) 2;
41) 3;	42) 3;	43) 3.	

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

రక్తపోటును నియంత్రించే హార్మోన్?



అంతస్స్రావక గ్రంథులు

1. ఎడ్రినల్ (అధివృక్క) గ్రంథులు

మానవుడిలో ఒక జత ఎడ్రినల్ గ్రంథులు మూత్ర పిండాల పైభాగంలో ఉంటాయి. అధివృక్క గ్రంథిలో రెండు భాగాలుంటాయి. 1. వల్కలం.. అధివృక్క గ్రంథి వెలుపలి భాగం. 2. దవ్వ.. లోపలి భాగం.

అధివృక్క వల్కల హార్మోన్లు: దీని నుంచి విడుదలయ్యే హార్మోన్లను కార్టికాయిడ్లు అంటారు. ఇవి మూడు రకాలు.

ఎ) కార్టిసాల్ బి) అల్డోస్టిరాన్
సి) లైంగిక కార్టికాయిడ్లు

కార్టిసాల్

ఈ హార్మోన్ పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఉపవాస(అత్యవసర) పరిస్థితుల్లో గ్లూకోజ్‌ను సంశ్లేషించి రక్తంలోకి విడుదల చేస్తుంది. కాబట్టి కార్టిసాల్‌ను ప్రాణరక్షక హార్మోన్ అంటారు. ఇది ఒక ఒత్తిడి పోరాట హార్మోన్‌గా కూడా పనిచేస్తుంది. కార్టిసాల్ అధికస్రావం వల్ల కూషింగ్స్ వ్యాధి (బఫెల్లో నెక్) వస్తుంది.

- **లక్షణాలు:** ముఖం, అవయవాలు, వీపు ప్రాంతంలో కొవ్వు పేరుకుపోతుంది.
  వీపుపై మూపురం (బఫెల్లో హంప్) వేలాడుతూ ఉంటుంది.
  కార్టిసాల్ తక్కువైతే అడిసన్స్ వ్యాధి వస్తుంది.
  లక్షణాలు: చర్మంపై కంచు వర్ణపు మచ్చలు, బరువు కోల్పోవడం, కండరాల బలహీనత.

అల్డోస్టిరాన్

ఇది దేహంలో నీరు, లవణాల తుల్యతను క్రమపరుస్తుంది. మూత్రం నుంచి సోడియం (Na^+) పునఃశోషణను పెంచుతుంది. అదే సమయంలో పొటాషియం (K^+), ఫాస్ఫేట్ అయాన్లను మూత్రంలోకి ప్రవింపజేయడంలో తోడ్పడుతుంది. శరీరంలో పొటాషియం అయాన్ల గాఢత పెరగడం ప్రమాదకరం. కాబట్టి అధివృక్క ఆల్డోస్టిరాన్ లోపిస్తే మానవుడు మరణిస్తాడు.

లైంగిక కార్టికాయిడ్లు

ఇవి ఒక రకమైన లైంగిక హార్మోన్లు(ఆండ్రోజన్స్). ఇవి స్త్రీ, పురుషుల్లో లైంగిక హార్మోన్లకు అనుబంధంగా పనిచేస్తాయి.

ఈ హార్మోన్ల అధిక స్రావం వల్ల స్త్రీ , పురుషుల్లో వ్యాధులు వస్తాయి. అవి..

- **విరిలిజం:** స్త్రీలకు అవాంఛిత రోమాలు (గడ్డాలు, మీసాలు) రావడం, పురుష గొంతు.
- **హిర్సుటిజం:** స్త్రీలకు ఛాతీపైన, శరీరంపైన రోమాలు రావడం.
- **గైనకోమాస్టియా:** ఇది పురుషులకు వచ్చే వ్యాధి. పురుషులకు రొమ్ములు ఏర్పడటం.

అధివృక్క దవ్వ

అధివృక్క దవ్వ రెండు రకాల హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది.

ఎ) ఎడ్రినలిన్ (ఎపినెఫ్రిన్)
బి) నార్ ఎడ్రినలిన్ (నార్ ఎపినెఫ్రిన్)

ఇవి ఒత్తిడి, అత్యవసర పరిస్థితులకు అనుక్రియగా ఉత్పత్తి అవుతాయి. కాబట్టి వీటిని అత్యవసర హార్మోన్లు (ఎమర్జెన్సీ హార్మోన్లు), పోరాట లేదా పలాయన హార్మోన్లు, 3F హార్మోన్ (Fight - Flight - Fright) , 4S హార్మోన్ (Sugar Metabolism, Salt retainning, Sex hormones, Source of Energy), బీపీ హార్మోన్ లేదా రక్తపోటుకు కారణమైన హార్మోన్ అని పిలుస్తారు.

ఈ హార్మోన్ల వల్ల భయం, కోపం వంటి భావోద్వేగాలకు లోనైనప్పుడు వెంట్రుకలు నిక్కబొడుచుకోవడం, చెమటపట్టడంతో పాటు హృదయస్పందన, శ్వాసక్రియ రేటు పెరుగుతాయి.

ఎడ్రినలిన్

హృదయ స్పందన రేటును పెంచి గుండెపోటుకు (బీపీ) కారణమవుతుంది.

నార్ ఎడ్రినలిన్

ఈ హార్మోన్ రక్త పీడనాన్ని తగ్గిస్తుంది (నియంత్రిస్తుంది)

గమనిక: లోనోట్రోప్స్ రక్తపోటును తగ్గించడానికి వాడే ఔషధం.

2. బీజకోశాలు

బీజకోశాలు రెండు రకాలు..
1) పురుష బీజకోశాలు (ముష్కాలు)
2) స్త్రీ బీజ కోశాలు

ముష్కాలు / పురుష బీజకోశాలు

ముష్కాలు పురుష ప్రత్యుత్పత్తి అంగాలు. ఒక జత ముష్కాలు శరీరం వెలుపల ముష్క గోణుల్లో ఉంటాయి.

- **ముష్కాల ప్రధాన విధి:** శుక్రకణోత్పత్తి, హార్మోన్ విడుదల. ముష్కాల్లోని లిడిగ్ కణాల నుంచి టెస్టోస్టిరాన్ (ఆండ్రోజెన్) అనే లైంగిక హార్మోన్ విడుదలవుతుంది.
- **టెస్టోస్టిరాన్ విధి:** కండరాల అభివృద్ధి, ముఖం, బాహుమూలాల్లో రోమాలు ఏర్పడటం, పురుష కంఠధ్వని (గొంతు మారడం). ఈ లక్షణాలను ద్వితీయ లైంగిక లక్షణాలు అంటారు.

మానవుడిలో ఒక జత ఎడ్రినల్ గ్రంథులు మూత్ర పిండాల పైభాగంలో ఉంటాయి. అధివృక్క వల్కలం నుంచి విడుదలయ్యే హార్మోన్లను కార్టికాయిడ్లు అంటారు. ఇవి మూడు రకాలు. అవి.. కార్టిసాల్, అల్డోస్టిరాన్, లైంగిక కార్టికాయిడ్లు. ఎడ్రినలిన్ హార్మోన్ హృదయ స్పందన రేటును పెంచి గుండెపోటుకు కారణమవుతుంది. ప్రొజెస్టిరాన్‌ను ప్రెగ్నెన్సీ హార్మోన్, గర్భస్రావ నిరోధక హార్మోన్ అంటారు. ఈ హార్మోన్ పిండ ప్రతిస్థాపనకు తోడ్పడుతుంది. పీనియల్ గ్రంథి మానవుడి మెదడు ద్వారగోర్థం పృష్ఠతలంలో ఉంటుంది. ఇది మెలటోనిన్ హార్మోన్‌ను స్రవిస్తుంది.



స్త్రీ బీజకోశాలు

స్త్రీలలో ఒక జత స్త్రీ బీజకోశాలు ఉదర కుహరంలో ఉంటాయి. ప్రాథమికంగా ఇవి అండాలను ఉత్పత్తి చేస్తాయి. ఇవి ప్రతి రుతుచక్రంలోనూ ఒక అండాన్ని విడుదల చేస్తాయి. ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్‌లను విడుదల చేస్తాయి.

- **ఈస్ట్రోజన్:** ఈ హార్మోన్ స్త్రీలలో ద్వితీయ లైంగిక లక్షణాలను ప్రేరేపిస్తుంది. అంటే రుతుచక్ర ప్రారంభం, స్తనాభివృద్ధి, స్త్రీ కంఠస్వరం.
- **ప్రొజెస్టిరాన్:** దీన్ని ప్రెగ్నెన్సీ హార్మోన్, గర్భస్రావ నిరోధక హార్మోన్ అంటారు. ఈ హార్మోన్ పిండ ప్రతిస్థాపనకు తోడ్పడుతుంది. ఫలదీకరణ ద్వారా ఏర్పడిన పిండాన్ని గర్భాశయ గోడలకు అంటి పెట్టడంలో దోహదపడుతుంది. ఈ హార్మోన్ రుతుచక్రం ఆగిపోవడానికి, మళ్లీ ఫలదీకరణ జరగకుండా ఉండటానికి తోడ్పడుతుంది. కాబట్టి గర్భ నిరోధక మాత్రల్లో ప్రొజెస్టిరాన్‌ను ఉపయోగిస్తారు. ఈ హార్మోన్ జరాయువు ఏర్పడటానికి తోడ్పడుతుంది.
- **రిలాక్సిన్ హార్మోన్:** ఈ హార్మోన్‌ను ప్రసవ సమయంలో జరాయువు స్రవిస్తుంది. ఇది సుఖ ప్రసవానికి దోహదపడుతుంది.

3. థైమస్ గ్రంథి (బాలగ్రంథి)

ఈ గ్రంథి రెండు ఊపిరితిత్తుల మధ్య గుండెకు దగ్గరగా ఉంటుంది. ఇది తల్లిగర్భంలో ఉన్న పిండం (ఆరో వారం)లో ఏర్పడుతుంది. ఇది చిన్న పిల్లల్లో మాత్రమే ఉంటుంది. కౌమార దశలో అదృశ్యమవుతుంది. కాబట్టి దీన్ని బాలగ్రంథి, తాత్కాలిక గ్రంథి, తిరోగమన గ్రంథి, అంతరించిపోయే గ్రంథి అని పిలుస్తారు. ఈ గ్రంథి స్రవించే హార్మోన్ థైమోసిన్.

- **థైమోసిన్ విధి:** లింఫోసైట్ కణాల పరిపక్వతకు తోడ్పడుతుంది. ఫలితంగా ప్రతిరక్షకాలు(యాంటిబాడీలు)ఉత్పత్తి అవుతాయి. ఇవి వ్యాధి నిరోధకతను పెంపొందిస్తాయి. మాంసం దుకాణాల్లో జంతువుల థైమస్ గ్రంథిని స్వీట్ బ్రెడ్‌గా అమ్ముతారు.
- **ఎక్టో హార్మోన్లు:** కొన్ని వినాళ గ్రంథుల నుంచి బాహ్య వాతావరణంలోకి విడుదలయ్యే రసాయన పదార్థాలను ఎక్టో హార్మోన్లు లేదా పిరమోన్లు అంటారు. ఈ పిరమోన్లు కీటకాల్లో మాత్రమే ఉంటాయి.
- ఒక జాతి జీవుల నుంచి విడుదలయ్యే పిరమోన్లను అదే జాతికి చెందిన కీటకాలు మాత్రమే గుర్తిస్తాయి. దీంతో వాటి మధ్య ఆకర్షణ, కమ్యూనికేషన్స్ నెలకొంటాయి.

ఉదా: కూలీ చీమ మార్గాన్ని ఇతర చీమలు పిరమోన్ల వల్లే అనుకరిస్తాయి.

4. పీనియల్ గ్రంథి

ఇది మానవుడి మెదడు ద్వారగోర్థం పృష్ఠతలంలో ఉంటుంది. మెలటోనిన్ హార్మోన్‌ను స్రవిస్తుంది. ఇది శరీరంలోని 24 గంటల దిన పరివర్తన లేదా సర్కేడియన్ లయలను క్రమపరుస్తుంది. అంటే నిద్ర, మెలకువల వలయాన్ని నియంత్రిస్తుంది.

5. జఠరాంత్రనాళ హార్మోన్లు

జీర్ణాశయం, ఆంత్రమూలాల శ్లేష్మస్తరం హార్మోన్లను స్రవిస్తుంది. ఈ హార్మోన్లు జీర్ణ గ్రంథుల చర్యలను పరిరక్షిస్తాయి. ఇది నాలుగు రకాల పెప్టైడ్ హార్మోన్లను స్రవిస్తుంది. అవి...

- **గాస్ట్రిన్:** ఈ హార్మోన్‌ను జీర్ణాశయం స్రవిస్తుంది. ఇది జఠర గ్రంథులను ప్రభావితం చేసి హైడ్రోక్లోరిక్ ఆమ్లం, పెప్సినోజన్ విడుదలను ప్రేరేపిస్తుంది.
- **సెక్రిటిన్:** ఆంత్రమూలం నుంచి విడుదలయ్యే ఈ హార్మోన్ క్లోమ, పైత్య రసాల స్రావాన్ని ప్రేరేపిస్తుంది. మొదట కనుగొన్న హార్మోన్ సెక్రిటిన్
- **కోలిసిస్టోకైనిన్:** ఇది కూడా ఆంత్రమూలం నుంచి విడుదలవుతుంది. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్యరసాన్ని ఆంత్రమూలంలోకి విడుదల చేయిస్తుంది.
- **పాంక్రియోజైమిన్:** దీన్ని ఆంత్రమూలం స్రవిస్తుంది. ఈ హార్మోన్ క్లోమాన్ని ఉత్తేజపర్చి క్లోమ రసం విడుదలకు దోహదపడుతుంది.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. రక్తపోటును నియంత్రించే హార్మోన్?
   1) థైరాక్సిన్ 2) ఇన్సులిన్
   3) ఎడ్రినలిన్ 4) పిట్యూటరీ గ్రంథి
2. ఇన్సులిన్, ఈస్ట్రోజన్ అనేవి ?
   1) బ్యాక్టీరియాలు 2) ఫంగస్‌లు
   3) క్రిములు 4) హార్మోన్లు
3. అధిక ఆవేశాన్ని కలిగించే గ్రంథి ఏది?
   1) పిట్యూటరీ గ్రంథి
   2) ఎడ్రినల్ గ్రంథి
   3) థైరాయిడ్ గ్రంథి
   4) సెల్లైవరీ గ్రంథి
4. మానవ దేహంలో అధివృక్క గ్రంథి వేటిపై ఉంటుంది?
   1) చిన్నప్రేగు 2) గుండె
   3) ఊపిరితిత్తులు 4) మూత్ర పిండాలు
5. తమ జాతి జీవులపై ప్రభావం చూపించేవి, జీవి శరీరం నుంచి బాహ్యంగా విడుదలయ్యే సమ్మేళనాన్ని ఏ విధంగా పిలుస్తారు?
   1) సబ్‌హార్మోన్లు
   2) న్యూరోహార్మోన్లు
   3) పిరమోన్లు
   4) న్యూరోట్రాన్స్ మీటర్
6. స్త్రీ జీవుల్లో ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని నియంత్రించేది?
   1) ఈస్ట్రోజన్ 2) ఆక్సిటోసిన్
   3) టెస్టోస్టిరాన్ 4) ప్రొజెస్టిరాన్
7. శిశువుల్లో మాత్రమే ఉండి కౌమార దశలో అంతరించే గ్రంథి?
   1) థైరాయిడ్ గ్రంథి
   2) థైమస్ గ్రంథి
   3) పీనియల్ గ్రంథి
   4) పీయూష గ్రంథి
8. గర్భ నిరోధక మాత్రల్లో ఉండే హార్మోన్?
   1) ఈస్ట్రోజెన్ 2) ప్రొజెస్టిరాన్
   3) ఆక్సిటోసిన్ 4) ప్రొలాక్టిన్
9. పిత్తాశయాన్ని సంకోచింపజేసి పైత్యరసాన్ని స్రవింపజేసే హార్మోన్?
   1) సెక్రిటిన్ 2) ఇన్సులిన్
   3) కోలిసిస్టోకైనిన్ 4) ఎడ్రినలిన్
10. లైంగిక కార్టికాయిడ్ల అధికస్రావం వల్ల వచ్చే వ్యాధి?
   1) విరిలిజం 2) హిర్సుటిజం
   3) గైనకోమాస్టియా
   4) పైవన్నీ

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 4;
5) 3; 6) 1; 7) 2; 8) 2;
9) 3; 10) 4.

ఉద్యోగాలు

సీఎస్ఐఆర్-ఎన్ఐఓలో వివిధ ఉద్యోగాలు

గోవాలోని సీఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ(ఎన్ఐఓ) తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ స్టెనోగ్రాఫర్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ స్టెనోగ్రాఫర్-05, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్స్ అండ్ పర్చేజ్-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 10+2 లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 19.09.2024 నాటికి జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు రూ.25,000 నుంచి రూ.81,100, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.19,900 నుంచి రూ.63,200.

ముఖ్య సమాచారం:
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 19.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.nio.res.in/

జేఎన్ఏఆర్‌డీడీసీ, వాడి నాగ్‌పూర్‌లో జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ ఖాళీలు

వాడి నాగ్‌పూర్(మహారాష్ట్ర)లోని జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ (జేఎన్ఏఆర్‌డీడీసీ).. సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్)/జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 05.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు గేట్/నెట్ స్కోరు ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్) పోస్టులకు రూ.28,000, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) పోస్టులకు రూ.25,000.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.08.2024.
» **వెబ్‌సైట్:** https://jnarddc.gov.in

Understand the Author's Tone..

Competitive exams have provided many aspiring candidates to get jobs in various public and private sectors. Candidates appearing for these exams are from various backgrounds and vernacular mediums. English remained a thing of concern for many as they find it as a stumbling block in getting through the exam. In many competitive exams it is mandatory to go through the English language paper and thus it comes out as a challenge for such candidates who lack in English language skills. Hence, it is essential for these candidates to put extra effort on their preparation to score well and be victorious. The English language part consists of questions pertaining to various sections like, grammatical skills, vocabulary knowledge and comprehension.



Banks Special
General English

COMPREHENSION

The comprehension section demands a good reading and understanding capacity of the candidate. You are expected to go through the paragraph given, understand, analyze and derive meaning out of it. Before attempting any passage, skim it as it's very important to understand the tone of the author. It may be optimistic, pessimist, sarcastic, angry or contemplative. If you are able to understand what author is trying to say then there is high probability that you will mark right answers. The passage usually contains 10 questions related to the passage which include synonyms and antonyms of particular words from the paragraph that needs to be answered. If you find that questions are beyond the understanding you found from the passage, simply skip that question, never try to mark nearest answer. Mark the answer only if you are sure about it. Here are a few tips while attempting this section:

- Skim the passage that is given.
- Read the questions first which helps to have an idea as you will be focused.
- Casual reading is not advisable, stay focused and don't miss any detail while reading.
- Make a note of what you read which might help you while you come back in search of answers.
- If doubt persists re-read the passage to make sure you understand it well before answering.
- Understand the author's tone and answer the questions based on author's opinion rather than your opinion.

A methodical and well planned preparation always gives fruitful results. It is essential to have a basic foundation of English which can be acquired by regular reading habits. Time management is crucial during the test. Use time saving techniques. In order to accomplish this you must become familiarize with the directions prior to taking the exam, and practice all the given exercises from this section.

- Keep in mind that you need not dwell too long on any one question or become concerned that you have answered a previous question incorrectly.
- Answer all questions by applying the techniques; keep track of any question that you may want to return to if you have enough time.
- The most important thing is be confident and remember that you have prepared well. Relax and do the best you can.

Model Questions

Directions (Q. 1-15): Read the following passages carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

PASSAGE 1

"Let us laugh" says, W. Mathews, "it is the cheapest luxury man enjoys. It stirs up the blood, expands the chest, clears away the cobwebs from the brain and gives the whole system a healthy treatment," So is it not nice to laugh a lot? It is said, "Laughter is the best medicine." For those who dislike medicine, sweet or bitter. A good joke that provokes laughter is prescribed. It is nice to have a good laugh but a "guffaw" may sometime lock one's jaws and so it is suggested that those who enjoy a loud guffaw go slow and subside into a gurgle but the best thing is, as done in Hon'ble courts before a Hon'ble Judges, just titter. And be able to enjoy all jokes including ones directed at myself, but never making a laughing stock of myself in the process. Let us remember the wise saying, "He is not laughed at that laughs at himself."

1. It is said that laughter is the best medicine because
   1) It is the cheapest luxury man enjoys
   2) It is available free of cost
   3) It is cheaper whereas medicines in the shops are costly
   4) It is not mentioned
   5) It provides better treatment than costly medicines.
2. The writer says he would never make a laughing stock of himself. It means he should not
   1) let others ridicule him
   2) show disrespect to Judges
   3) laugh, but simply smile at others
   4) let others laugh
   5) laugh at others
3. The writer feels laughter is to be prescribed to those who
   1) are seriously ill
   2) dislike medicines
   3) cannot buy medicines
   4) who are happy
   5) do not need medicines
4. What may sometime lock one's jaws?
   1) Laughter 2) Mirth
   3) Guffaw 4) Gurgle
   5) Titter
5. By quoting a wise saying in the last line the writer
   1) Reiterates the point that laughter is the best medicine for us
   2) Pity on those who laugh
   3) Guides us about what we should do from being laughed at
   4) Cautions us as to how we should conduct ourselves in the Hon'ble Courts
   5) Censures those who cannot laugh at themselves

PASSAGE 2

I once saw a tigress stalking a month old kid. The ground was very open and the kid saw the tigress while she was still some distance away and started bleating, where on the tigress gave up her stalk and walked straight up to it. When the tigress has approached to within a few yards, the kid went **forward** to meet her, and on reaching the tigress **stretched** out its neck and put up its head to smell her. For the duration of a few heart beats the month-old kid and the queen of the forest stood nose to nose, and then the queen turned and walked off in the direction from which she came.

6. 'Stalking' in this context means
   1) Running threateningly
   2) Moving about in circles
   3) Attacking
   4) Targeting a victim
   5) Moving quietly without being seen or heard
7. The tigress walked straight up to the kid because
   1) It makes the kid joyous
   2) Running would frighten the kid
   3) Stalking was useless now
   4) The tigress was patient
   5) She was sure of her victim
8. The kid's behavior indicates that
   1) It was familiar with the sight of tigress
   2) It was attracted by the tigress's smell
   3) It was attracted to the tiger's food
   4) It took the tigress for a playmate
   5) It was not aware of the danger involved
9. The expression 'for the duration of a few heart beats' suggests
   1) The few seconds the tigress and the kid spent smelling each other
   2) The fear of the kid
   3) The excitement of the tigress
   4) The anxiety of the watcher
   5) The anxiety of the author
10. 'Queen' in the passage refers to
   1) The queen who came to see us
   2) The lady 3) The kid
   4) The tigress 5) The author
11. The synonym of **forward** is
   1) Rearward 2) Onward
   3) Inward 4) Review
   5) Rejoice
12. The antonym of **'stretched'** is
   1) Expand 2) Prolong
   3) Lengthen 4) Elongate
   5) Contract

PASSAGE 3

India is not a backward country. It is the version of the outside world which is outdated. India is growing every day. It has a population of more than 100 million in the middle class, out of which a segment of 70 million is earning monthly wages more than that the average weekly pay of an Australian worker, which makes India an economic power as great as France.

13. What is meant by segment in the above paragraph
   1) The total population
   2) A large part of the population
   3) Some part of the population
   4) Half of the population
   5) Less than half of the population

ANSWERS

1) 1 2) 1 3) 2 4) 3 5) 3
6) 5 7) 5 8) 5 9) 4 10) 4
11) 1 12) 5 13) 3